# యోజన

జూన్ 2009 అభివృద్ధి మాసపత్రిక రూ.10



# విపత్తు యాజమాన్యం

## మనమెంత సంసిద్ధంగా ఉన్నాం?

# ప్రకృతి విపత్తుల నివారణ పునస్సమీక్ష ఆవశ్యకత



దినేష్‌కుమార్ మిశ్రా, కన్వీనర్
బర్ట్‌ముక్తి అభియాన్, పాట్నా, బీహార్

నీరు, వ్యవసాయ నీటి సరఫరా, వరదలకు సంబంధించిన వివిధ ప్రభుత్వ శాఖలకు గతంలో ఉన్న పేర్లు ఇటీవల మారిపోయాయి. ఇంతకు ముందు ఉన్న డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇరిగేషన్‌ను వాటర్ రిసోర్సెస్ డిపార్ట్‌మెంట్‌గా మార్చారు. అలాగే ఫ్లడ్స్ కంట్రోల్ శాఖను ఫ్లడ్ మేనేజ్‌మెంట్ శాఖగా, రిలీఫ్ అండ్ రీ-హేబిలిటేషన్ డిపార్ట్‌మెంట్‌ను డిజాస్టర్ మేనేజ్‌మెంట్ డిపార్ట్‌మెంట్‌గా పిలుస్తున్నారు. ఈ విధంగా వివిధ ప్రభుత్వ శాఖల పేర్లు మార్చడం ద్వారా, మరింత మెరుగైన ఫలితాల కోసం, ఈ శాఖల పనితీరులో మార్పులు చేసినట్లు పైకి కనిపిస్తున్నది. కాని మార్పులు ఏమిటని పరిశీలిస్తే, ఏమీ లేవని సమాధానం వస్తుంది. ఇప్పటికీ ఈ శాఖలన్నీ గతంలో నెరవేర్చే బాధ్యతలనే ఎటువంటి మార్పులు లేకుండా నిర్వహిస్తున్నాయి. గతంలో మాదిరిగానే వరద నివారణ శాఖ సిబ్బంది వివిధ నదులకు వరద కట్టల నిర్మాణంలో తలమునకలై ఉన్నారు. వివిధ రాష్ట్రాలకు చెందిన డిజాస్టర్ మేనేజ్‌మెంట్ డిపార్ట్‌మెంట్(డి.ఎం.డి) వారు కొత్త లేబుల్‌తో వరద బాధితుల సహాయ కార్యక్రమాలు కొనసాగిస్తూ ఉన్నారు. కేవలం పేరు మార్చడం ద్వారా ఆయా శాఖల పనితీరును మెరుగుపరచే అవకాశం ఉన్న పక్షంలో మరే ఇతర చర్యలను చేపట్టవలసిన అవసరం లేదు. కేవలం పేరు మారిస్తే చాలదు, ప్రజల సమస్యలను సమర్థవంతంగా పరిష్కరించే విధానాలు చేపట్టాలి. కాని సహజసిద్ధంగా ప్రతి సంవత్సరం ఎదురయ్యే వరదల సమస్యను, ప్రకృతి వైపరీత్యం పేరిట పెద్దదిగా చూపి దీని నివారణకు పెద్ద ఎత్తున చర్యలు చేపట్టడం సమస్యకు సరైన పరిష్కారం కాదు.

పెద్ద ఎత్తున, ఎవరూ ఊహించని సమయంలో ఎదురయ్యే వరదలను "డిజాస్టర్"గా పేర్కొంటున్నారు. దీనిని ఎదుర్కోవడానికి వివిధ ప్రభుత్వ శాఖలు, స్వచ్ఛంద సేవాసంస్థలు పెద్ద ఎత్తున చర్యలు చేపట్టి ఈ విపత్తు తీవ్రతను తగ్గించడానికి, బాధితులకు పునరావాసం ఏర్పాటు చేసి, సహాయక చర్యలు చేపడుతున్నారు. ఈ చర్యలన్నింటినీ కలిపి డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అని అంటున్నారు. అనేకమంది ఈ వరదలను ప్రకృతి సిద్ధమైన విపత్తుగా అభివర్ణిస్తున్నారు. కాని మరికొందరు వీటిని మానవ తప్పిదాల ఫలితంగా పేర్కొంటున్నారు. ఈ వైరుధ్యాల మధ్య చర్చ వాడిగా, వేడిగా నిరంతరాయంగా కొనసాగుతూనే ఉన్నది. సాధారణ వరదలు, తీవ్ర ప్రకృతి విపత్తులుగా మారడానికి మానవ తప్పిదాలే కారణమని ఈ వ్యాసరచయిత విశ్వసిస్తున్నారు. ఇటీవల నాగపూర్, నాసిక్, భోపాల్, హోషంగాబాద్, బార్మేర్, జైపూర్, బందా, బెంగుళూరు, జలంధర్‌లలో సంభవించిన వరదలను డిజాస్టర్‌లుగా పేర్కొన వచ్చును. కాని 1998, 2002, 2004 మరియు 2007లో సంభవించిన బీహార్ వరదలను గాని, 2008లో కోసి బేసిన్‌లో వరదలను గాని డిజాస్టర్‌లుగా



పిలిచే వీలులేదు. ఈ వరదలన్నీ ముందుగా ఊహించినవే తప్ప ఎదురు చూడకుండా హఠాత్తుగా సంభవించినవి కావు. కనుక వీటిని డిజాస్టర్‌లుగా పేర్కొనరాదు. ఇటీవలి కాలంలో నదీ పరీవాహక ప్రాంతాలలో వివిధ ప్రభుత్వ శాఖలు చేపట్టిన వరద నివారణ చర్యల కారణంగానే తూర్పు ఉత్తరప్రదేశ్, అస్సాం, ఒరిస్సా, పశ్చిమబెంగాల్‌లలో వరదలు సంభవించాయి. ఈ రాష్ట్రాలకు వరద నిరోధక కార్యక్రమాల నిర్వహణకుగాను పెద్ద ఎత్తున నిధులను విడుదల చేసినప్పటికీ, మానవ తప్పిదాల కారణంగా విపరీత స్థాయిలో వరదలు సంభవించాయి. వీటిని మానవ తప్పిదాల డిజాస్టర్‌లు గానే పరిగణించాలి.

## ప్రకృతి సహజ వరదలు

మానవులలో నాగరికత అభివృద్ధి అంతా నదుల సమీప ప్రాంతాలలోనే జరిగిందన్న వాస్తవం మనందరికీ తెలుసు. మానవుల ఉనికి ఈ ప్రపంచంలో కొనసాగడానికి వరదలు కూడా ఖచ్చితంగా దోహదపడ్డాయని నిరూపించ బడింది. భూసార పరిరక్షణకు పటిష్టం కావడానికి తప్పనిసరిగా వరదలు రావాలి. నదీ పరీవాహక ప్రాంతాలలోని పంటపొలాలకు తరచుగా వరదల ద్వారా వండ్రుమట్టి వచ్చి చేరకపోతే కొంత కాలానికి ఆ భూములలో సారం తగ్గిపోయి నిస్సారం అవుతాయి. పంటలు పండే అవకాశం ఉండదు. అంతే కాకుండా మట్టిలో తేమ పెరుగుతుంది. భూగర్భ జల వనరులకు సమృద్ధిగా నీరు లభిస్తుంది. వరదలు తప్పనిసరిగా రావలసిన నదీ పరీవాహక ప్రాంతాలలో వరదలు రాకపోతేనే దానిని అతి పెద్ద విపత్తుగా పేర్కొనవచ్చును. భారత దేశంలో సాధారణ వరదలు నిర్ణీత సమయాలలో క్రమబద్ధంగా వస్తుంటాయి. స్థానికంగా చిరకాలంగా నివసిస్తున్న ప్రజలకు, నదీ పరీవాహక భూములలో సాధారణంగా వరదలు ఏ తేదీలలో వస్తాయో ముందుగానే తెలుస్తుంది. తదనుగుణంగా, వరదలను ఎదుర్కోవడానికి వారు ఆ సమయంలో సిద్ధంగానే ఉంటారు. కాని ఇటీవల కాలంలో మానవ తప్పిదాల కారణంగా వరదల

తీవ్రత పెరగడంతో పాటు వరదరోజులు కూడా పెరిగి వీటిని ప్రస్తుతం "డిజాస్టర్"లుగా పేర్కొనవలసి వస్తున్నది. నదుల ప్రవాహమార్గంలో పెద్ద ఎత్తున వరద కట్టల నిర్మాణం కూడా వరద తీవ్రత పెరగడానికి దోహదం చేస్తున్నది. నదులు పొంగిపోయి జనావాసాలను ముంచెత్తకుండా ఈ వరద కట్టలు అడ్డు కుంటాయని వీటిని పెద్ద ఎత్తున నిర్మిస్తున్నారు. గత కొన్ని సంవత్సరాలుగా దీనిని ప్రకృతి విపత్తులు నివారణ చర్యగానే భావిస్తున్నారు. కాని దీని వలన మరింత నష్టం ఉందన్న వాస్తవాన్ని గుర్తించడం లేదు.

## వరదల తీవ్రతకు వరదకట్టలే కారణం

దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత ప్రభుత్వం, గంగా-బ్రహ్మపుత్రా బేసిన్‌లో నదీప్రవాహం వెంబడి కరకట్టల నిర్మాణాన్ని పెద్దఎత్తున చేపట్టింది. కాని అప్పటికే ఒండ్రుమట్టితో నిండిపోయిన నదులకు కరకట్టలు నిర్మించడం వలన కొత్తగా వచ్చి చేరే మట్టి కూడా తోడై, కరకట్టల మధ్య మట్టి పేరుకొని పోయింది. దానితో నదిలోని నీటిమట్టం మరింత పైకి లేచింది. ప్రతి సంవత్సరం నదిలోని నీటి పరిమాణం, మట్టం పెరగడంతో కరకట్టల ఎత్తు పెంచవలసి వస్తున్నది. కాని కరకట్టల ఎత్తుకు ఒక పరిమితి ఉన్నది. అంతకంటే ఎత్తుగా నిర్మించే అవకాశం లేదు. మట్టం పెరగటంతో నదిలో ప్రవహించే నీరు కరకట్టల మీదుగా నివాస ప్రాంతాలను చేరుకొని ప్రజాజీవనానికి అంతరాయం ఏర్పడుతున్నది. సహజసిద్ధంగా వచ్చే వరదనీటిలో సారవంతమైన ఒండ్రుమట్టి ఉంటుంది. కాని కరకట్టల మీదుగా ప్రవహించే నీటిలో ఇది ఉండదు. దానితో నదికి పరిసరాలలో ఉన్న వ్యవసాయ క్షేత్రాలకు సారవంతమైన వండ్రుమట్టి వచ్చి చేరడం లేదు. దీని వలన రైతులు నష్టపోతున్నారు. అంతే కాకుండా ఉపనదుల ద్వారా నదులకు వచ్చి చేరే నీరు, కరకట్టలు అడ్డు తగలడంతో వృధాగా పోతున్నది. ఆ విధంగా పోకుండా కరకట్టలకు స్లూయిస్ గేట్లను నిర్మించవలసి వస్తున్నది. కాని ఈ గేట్లను వర్షాకాలంలో తెరిచే అవకాశం లేదు. అలా తెరిస్తే నదిలోని నీటి ప్రవాహం ఉధృతి కారణంగా, ఉపనదుల నీరు నదిలోనికి రాకుండా, నదిలోని నీరే వెనుకకు మళ్ళి సూయిస్ గేట్ల ద్వారా ఉపనదులలోనికి ప్రవహిస్తుంది. దీనితో గతంలో ఎన్నడూ వరద ప్రమదానికి లోనవని కొత్త ప్రాంతాలు కూడా వరదల బారిన పడతాయి. అంతే కాకుండా ఉపనదులు ప్రధాన నదితో సమాంతరంగా ప్రవహిస్తూ మరిన్ని కొత్త ప్రాంతాలను వరదలతో ముంచెత్తుతాయి. దీనితో ఉపనదులకు కూడా వరద కట్టలను నిర్మించవలసి వస్తుంది. దీనివల్ల అటు ప్రధాన నదిలో ప్రవహించే నీరు ఉపనదులలో ప్రవహించే నీరు పెరిగిపోయి, వర్షపు నీరు మొత్తం ఈ రెండు రకాల కరకట్టల మధ్య నిలిచిపోయే ప్రమాదం ఉన్నది. ఇలా నిలిచిపోయిన వర్షపునీరు సూర్యరశ్మితో ఆవిరై గాలిలో కలిసిపోవాలి. లేదా భూమిలోనికి ఇంకిపోవాలి. లేదా ఈ వర్షపు నీటిని పంపుల ద్వారా ప్రధాన నదిలోనికి గాని, ఉపనదులలోనికి గాని తోడిపోయాలి. ఈ పరిస్థితులలో కరకట్టలకు పగుళ్లు వస్తే, రెండు నదుల కరకట్టల మధ్య ప్రదేశాలలో నివసించే ప్రజలు జలప్రళయంలో చిక్కుకుంటారు. ప్రపంచంలో ఎంతో అభివృద్ధి చెందిన అమెరికా, చైనాలతో సహా ఏ దేశంలోను కరకట్టలకు గండ్లు పడవనే హామీ నిర్మాణసంస్థల నుండి లభించదు.

వరదల నుండి దీర్ఘకాలం ప్రజలకు రక్షణ కల్పించే లక్ష్యంతో నదులకు నిర్మించే కరకట్టలు కొంతకాలం తరువాత మరిన్ని కొత్త సమస్యలను కొని తెచ్చే ప్రమాదముంది. ఈ ఉచ్చు నుండి బయటపడడానికి చాలా కష్టపడాలి. కాని కొందరు ఇంజనీర్లు కరకట్టల నిర్మాణాన్ని సమర్థిస్తూ ఒక కారణం చూపిస్తున్నారు. నీరు చాలా ఇరుకు ప్రదేశం ద్వారా ప్రవహించినపుడు, ఉదాహరణకు కరకట్టల మధ్యన దాని ప్రవాహవేగం విపరీతంగా పెరిగి పోతుంది. దీనివలన నదిలో మట్టి పేరుకొనిపోకుండా కొట్టుకొని పోతుంది. తద్వారా నది మట్టం కూడా తగ్గుతుంది. నదీప్రవాహం సహజసిద్ధ "డ్రెడ్జి"గా పనిచేయడం వలన, నదిలో మరింత వేగంగా, మరింత నీరు ప్రవహిస్తుంది. ఈ విధంగా అన్ని నదులు, ఉపనదులు, వర్షపు నీటిని పూర్తిగా ప్రవహింపచేస్తే వరదల బెడద తగ్గుతుంది. కాని ఈ వాదనకు దేశంలోని ఏ ప్రదేశం లోను రుజువులు దొరకడం లేదు.

## వరదల స్థితి, కరకట్టల నిర్మాణం

1954లో మొదటి "ఫ్లడ్ కంట్రోల్ పాలసీ"ని అమలులోనికి తెచ్చిన తరువాత దేశంలోని నదులన్నింటికీ కలిపి మొత్తం 33,928.642 కిలోమీటర్ల కరకట్టలను, వరదనీరు నదులకు చేరడానికిగాను 38,809.857 కిలోమీటర్ల పొడవైన డ్రెయినేజి కాల్వలను నిర్మించింది. కరకట్టలను నిర్మించి, డ్రెయినేజి లను తవ్వించడం ద్వారా 2,458 పట్టణాలకు వరదల నుండి రక్షణ కల్పించి, 4,716 గ్రామాలను గరిష్ట వరదల స్థాయికి పైన నిలిపారు. (వాటర్ రిసోర్సెస్ డిపార్ట్‌మెంట్, గవర్నమెంట్ ఆఫ్ ఇండియా మార్చి 2006 వరకు నిర్వహించిన వరద నివారణ చర్యల నివేదిక)

దేశంలో, ఏదైనా సమయంలో వరదలకు గురై, ఇంత వరకు పటిష్టమైన వరద నివారణ చర్యలను చేపట్టని ప్రాంతాలన్నింటినీ వరద ప్రమాదమున్న ప్రాంతాలుగా గుర్తిస్తారు. మొదటి పంచవర్ష ప్రణాళిక పత్రాలలోని అంచనాల మేరకు, ప్రణాళిక ప్రారంభ సమయానికి దేశవ్యాప్తంగా వరద ప్రమాదమున్న ప్రాంతాలు 25 మిలియన్ల హెక్టార్లు మాత్రమే. కాని 1980లో రాష్ట్రీయ బాడ్ ఆయోగ్ సర్వే మేరకు ఈ ప్రాంతాలు 33.156 మిలియన్ల హెక్టార్లుగా అంచనా వేయబడ్డాయి. (భారత ప్రభుత్వ, వాటర్ రిసోర్సెస్ డిపార్ట్‌మెంట్, వెబ్‌సైట్ అచీవ్‌మెంట్స్ ఇన్ ఫ్లడ్ కంట్రోల్-2004 వరకు చేపట్టిన వరద రక్షణ పనుల వివరాలు). పదవ పంచవర్ష ప్రణాళిక సందర్భంగా, చాలా ఆలస్యంగా ప్లానింగ్ కమిషన్ ఏర్పాటు చేసిన 'వరద నియంత్రణ కార్యక్రమాలపై వర్కింగ్ గ్రూపు' నివేదిక మేరకు దేశంలో వరదలకు గురయ్యే ప్రమాదమున్న ప్రాంతాల విస్తీర్ణం 45.64 మిలియన్ల హెక్టార్లుగా అంచనా వేశారు. దీనిలో 2004 మార్చి నెలాఖరుకు 16.457 మిలియన్ల హెక్టార్లలో రక్షణ ఏర్పాట్లు చేశారు. బీహార్‌లో రాష్ట్ర ప్రభుత్వం 2006 మార్చి నెలాఖరుకు 18.222 మిలియన్ల హెక్టార్లకు వరదలనుండి రక్షణ కల్పించినట్లు సెంట్రల్ వాటర్ కమిషన్ నివేదికలో సూచించారు. (కేంద్ర ప్రభుత్వ వాటర్ రిసోర్సెస్ డిపార్ట్‌మెంట్, ఐబిఐడి టేబుల్ 5.17 సెంట్రల్ వాటర్ కమిషన్ అధికారిక వెబ్‌సైట్- టేబుల్ 5.12 ఫ్లడ్ డామేజ్/హెవీ రైన్స్ ఇన్





ఇండియా). ఇంకా 27,418 మిలియన్ల హెక్టార్ల విస్తీర్ణంలో ఏదో రకమైన వరద రక్షణ చర్యలను చేపట్టవలసి ఉన్నది. ఈ లెక్కలను పరిశీలిస్తే చేసినది చాలా తక్కువ, చేయవలసినదే ఎక్కువని అవగతమవుతున్నది. 1950లో దేశవ్యాప్తంగా వరదల ప్రమాదం ఉన్నట్లు గుర్తించిన మొత్తం విస్తీర్ణం కంటే, రక్షణ చర్యలు చేపట్టవలసిన ఉన్న ప్రాతమే ఎక్కువ అని తెలుస్తున్నది. వాస్తవానికి వరద నియంత్రణ రంగానికిగాను దేశంలో కేటాయిస్తున్న మొత్తం నిధుల వినియోగంతో వరదల నష్టం తగ్గకపోగా మరిన్ని కొత్త ప్రాంతాలు వరదల బారిన పడుతున్నట్లు అనిపిస్తున్నది. కాని ప్రభుత్వ శాఖల వాదన మేరకు జనాభా సంఖ్య పెరగడమే వరదల వలన నష్టాలు పెరగడానికి కారణం అంటున్నారు. భూముల విలువ, స్థిర ఆస్తుల విలువలు పెరగడం వలన, వరదనష్టాలను ఖచ్చితంగా లెక్కించగల అధునాతన విధానాలు అందు బాటులోనికి రావడం వలన వరదనష్టాల మొత్తాలు పెరుగుతున్నాయి. అంతే తప్ప గతంలో కంటే మరీ ఎక్కువ స్థాయిలో వరదల వల్ల నష్టాలు సంభవించడం లేదు.

ప్రస్తుతం, సరాసరి ప్రతి సంవత్సరం దేశవ్యాప్తంగా 7.63 మిలియన్ల హెక్టార్ల భూమిలో వరదలు సంభవించి, ఈ కారణంగా 32.92 మిలియన్ల ప్రజలు నష్టపోతున్నారు. అంతే కాకుండా రు. 705.87 కోట్ల విలువైన పంటలకు, 3.56 మిలియన్ల వ్యవసయా భూములు మునిగిపోవడం వలన నష్టం వాటిల్లుతున్నది. వరదలలో 12,35,000 ఇళ్ళు నష్టపోయి, 94000 పశువులు చనిపోగా, సుమారు 1590 మంది పౌరులు చనిపోతున్నారు. సరాసరి వార్షిక నష్టాలు రు. 1782.35 కోట్లుగా అంచనా వేశారు. (కేంద్ర ప్రభుత్వ వాటర్ రిసోర్సెస్ డిపార్ట్‌మెంట్, సెంట్రల్ వాటర్ కమిషన్ ఐబిఐడి టేబుల్ 5.12) ఈ సందర్భంగా ఒక విషయం గుర్తు చేసుకోవాలి. 1954లో సంభవించిన దేశవ్యాప్త వరదలు కేవలం 7.490 మిలియన్ హెక్టార్ల భూమిలో మాత్రమే సంభవించింది. ఈ వరదల కారణంగానే దేశంలో మొట్టమొదటి వరద నివారణ పాలసీని చేపట్టారు. కాని ప్రస్తుతం ఈ విస్తీర్ణం 22 రెట్లు పెరిగింది. 9వ పంచవర్ష ప్రణాళిక (2002) చివరి వరకు వరద నివారణ చర్యలకు గాను రూ. 8,113.11 కోట్లు వ్యయం చేసినప్పటికీ 1954 నుండి 2004 మధ్యలో 51 సంవత్సరాలలో వరదలకు గురవుతున్న భూవిస్తీర్ణం 22 రెట్లు పెరిగింది. పదవ, పదకొండవ పంచవర్ష ప్రణాళికల ప్లాన్ అవుట్ లే లో వరద నివారణ చర్యలకు కొన్ని వేల కోట్ల రూపాయలు కేటాయించారు. ఇంత పెద్ద ఎత్తున నిధులను వ్యయం చేస్తున్నా గుజరాత్, మహారాష్ట్ర, రాజస్థాన్ తదితర రాష్ట్రాలు ఇప్పటికీ గత కొన్ని సంవత్సరాలుగా భారతదేశ వరద బాధిత ప్రాంతాల చిత్రపటంలో చోటు కల్పించుకొంటూనే ఉన్నాయి. ఆంధ్ర ప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాలు కూడా తరచుగా ఈ జాబితాలో చేరుతూనే ఉన్నాయి.

## వాతావరణ సంబంధిత విపత్తుల నివారణ

ప్రకృతి వైపరీత్యాలు సంభవించడానికి కారణం ఏమిటనేది తమకు సంబంధించినది కాదని "డిజాస్టర్ మేనేజర్లు" ఖచ్చితంగా నమ్ముతున్నారు. ఈ విపత్తులను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి మానవ ప్రయత్నాలతో అరికట్టగల అవకాశాలు ఉన్నదీ లేనిదీ కూడా పరిశీలించడం లేదు. విపత్తు సంభవించిన తరువాత బాధితులకు పునరావాస, సహాయ కార్యక్రమాలు నిర్వహించడమే తమకు సంబంధించిన బాధ్యత అని, విపత్తుకు కారణాలు తమకు అనవసరమని అంటున్నారు. మానవత్వంతో వారు బాధితులకు సేవలు చేయడం సమంజసంగానే కనిపిస్తున్నది. కాని మొదటగా, వరద నివారణ పేరుతో ఇంతవరకు చేపట్టిన పనుల వలన ఏదైనా ప్రయోజనం సమకూరిందా అనే అంశం పరిశీలించాలి. ఆ తరువాత వరదలను డిజాస్టర్ గా పరిగణించి, ప్రతి సంవత్సరం సహాయ, పునరావాస కార్యక్రమాల పేరిట పెద్ద ఎత్తున నిధులు వ్యయం చేసి చేపట్టిన పనులలో పొరపాట్లు ఏమైనా ఉంటే వాటిని సవరించాలి. కాని ప్రతి సంవత్సరం జరుగుతున్న నష్టంతో పోలిస్తే, ఈ వ్యయం తక్కువేనని అనిపిస్తున్నది. ఈ విషయంలో మరింత పరిశీలనలు చేసే అవకాశం స్వచ్ఛంద సేవా సంస్థలకు ఉన్నది. కాని ఆ సంస్థలన్నీ వరద బాధితుల సహాయ కార్యక్రమాల పేరిట తమకు వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడానికే అధిక ప్రాధాన్యతనిస్తున్నాయి.

ఈ సందర్భంగా మనం ఒక వాస్తవాన్ని గమనించాలి. రాజస్థాన్‌లో తరచుగా సంభవించే కరువు, కాటకాల తరహాలోనే, బీహార్‌లో వరదలు కూడా సహజసిద్ధంగా సంభవిస్తున్నాయని, ఇవి కాల నిర్ణాయకమని ప్రజల జీవితంలో ఒక భాగమని గుర్తించాలి. కాని దురదృష్టవశాత్తు ఈ సాధారణ వరదలను ప్రకృతి విపత్తులుగా పరిగణించి, "డిజాస్టర్ మేనేజ్‌మెంట్" కార్యక్రమాలు చేపడుతున్నారు. అంతే తప్ప తరచుగా ఎదురయ్యే ప్రశ్నలకు జవాబులు వెదకడం లేదు. ఫ్లడ్ కంట్రోల్ పాలసీలపైన, వాటి అమలు తీరుపైన ఎటువంటి సమీక్షలు నిర్వహించడం లేదు.

"డిజాస్టర్ మేనేజ్‌మెంట్" కార్యక్రమాలలో మొదటిగా విపత్తులను అడ్డుకునే ప్రయత్నాలు చేయాలి. కాని ప్రస్తుతం, బీహార్‌లో చేపడుతున్న డిజాస్టర్ మేనేజ్‌మెంట్ కార్యక్రమాలన్నీ సహాయ, పునరావాస కార్యక్రమాలపై తప్ప, విపత్తుల నివారణ చర్యలపై కొంచెం కూడా దృష్టి సారించడం లేదు. ప్రజలు ఎంతగానో ఎదురుచూస్తే సాధారణ వరదల స్థాయిని, ప్రకృతి విపత్తులుగా మారుస్తున్న పరిస్థితులను అధ్యయనం చేసి నివారణ చర్యలు చేపట్టకపోతే, నదీ ప్రవాహాలను వరదల ఉధృతిని అదుపు చేయడానికి ఎంత వ్యయం చేసి, ఎన్ని ప్రయత్నాలు చేసినా ఫలితం ఉండదు. నదీ ప్రవాహం పొడవునా నిర్మించే వరద కట్టలు లేదా అటువంటి ఇతర నిర్మాణాలు ఎట్టి పరిస్థితులలోను నిర్మించరాదు. ఎటువంటి ఆటంకాలు లేకుండా నదీప్రవాహం సజావుగా సాగాలి. ఒకవేళ తప్పనిసరి పరిస్థితులలో నిర్మించినట్లయితే వాటికి గండ్లు పడకుండా పటిష్టంగా నిర్వహించాలి. సాధారణంగా వరదనీరు నదినుండి పొంగి ప్రవహిస్తూ చాలా అధిక భూభాగంలో విస్తరిస్తుంది. ఈ విధంగా నదిలోని ఒండ్రుమట్టి పొలాలలోనికి చేరి భూమి సారవంతమవుతుంది కనుక ఈ వరద నీటిని సహజరీతిలో ప్రవహించనిస్తారు. కాలక్రమేణా నదిలో ఒండ్రుమట్టి తగ్గిపోయి వరదలు కూడా తగ్గిపోతాయి. కాని, ఈ విధమైన

సహజ వరద నీటి ప్రవాహానికి అడ్డుకట్టలు వేసినట్లయితే కొంత కాలానికి పరిసరాలలోని భూములు నిస్సారమై రైతులు తీవ్రంగా నష్టపోతారు. మళ్ళీ సారాన్ని నింపడానికి అష్టకష్టాలు పడవలసి వస్తుంది. వరదల ఉధృతి తగ్గాలంటే నదులలో పేరుకొనిపోయిన ఒండ్రుమట్టిని తొలగించాలే గాని, నదీప్రవాహాన్ని మళ్ళించకూడదు.

## ప్రాధ్యాన్యతల విస్మరణ

ఉత్తర బీహార్‌లో 2007లో సంభవించిన వరదలు అనేక పాత రికార్డులను బద్దలుకొట్టాయి. బీహార్‌లోని పీఠభూములు, నేపాల్‌లోని టెరాయి ప్రాంతం, దిగువ హిమాలయ ప్రాంతాలలో జూలై 1 నుండి ఆగష్టు 2 వరకు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలు, దీర్ఘకాలం పాటు ప్రజాజీవనాన్ని అస్తవ్యస్తం చేశాయి. కార్యకలాపాలన్నీ స్తంభించిపోయాయి. సాధారణ వర్షపాతం కంటే మూడు నాలుగు రెట్లు ఎక్కువగా వారాల తరబడి వర్షాలు కురిశాయి. దీనితో సమస్తిపూర్, పశ్చిమ చంపారణ్, ఖగరియా జిల్లాలకు కొన్ని వారాలపాటు బాహ్యప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. శతాధిక వృద్ధులందరూ తమ జీవితకాలంలో ఇంతటి భారీస్థాయి వర్షాలను కనీ, వినీ ఎరుగలేదని అన్నారు. వరదనీరు ఇన్ని రోజుల పాటు నిలిచిపోవడం తాము ఎన్నడూ చూడలేదని స్థానిక ప్రజలు తెలిపారు. కాని ఈ ప్రాంతంలో ఇంత భారీస్థాయిలో వర్షాలు కురిసినా, వరదలు ముంచెత్తినా, ఆశ్చర్యకరంగా ఉత్తర బీహార్‌లోని ఏ నదిలోను నీటిప్రవాహం హెచ్.ఎఫ్.ఎల్ (హయ్యస్ట్ ఫ్లడ్ లెవెల్) ను దాటలేదు. కాని, భాగ్‌మతి నది కరకట్టలలో 7 చోట్ల, కమలా-బొలన్ నది కరకట్టలలో 14 చోట్ల, బర్హి గండక్‌లో 5, మసాన్ నదికి 3 చోట్ల గండ్లు పడ్డాయి. భూటాహిబాలన్, ఖిరోయి, కోసి (బఢ్లా-నగర్‌పారా) నదులకు ఒక్కొక్కటి వంతున గండ్లు పడ్డాయి. (డిజాస్టర్ మేనేజ్‌మెంట్ డిపార్ట్‌మెంట్, గవర్నమెంట్ ఆఫ్ బీహార్, 2007లో ఎదురుచూడని, భారీ వరదలపై ప్రచురణ కాని నివేదికలు-ఇంటర్నెట్ ద్వారా). ఈ వరదల ప్రభావంతో, గతంలో నిర్మించిన వరద కట్టల వలన ప్రయోజనం కలుగకపోగా, మరింత భారీ నష్టాలు సంభవించాయని సామాన్యప్రజలు కూడా గుర్తించారు. గండ్లు పడిన కారణంగా వీటి విలువ నశించిపోయిందని స్పష్టమయింది. ఏ నదిలోను, నీటిప్రవాహం హెచ్.ఎఫ్.ఎల్. ను దాటకపోయినా, ఇంత పెద్ద ఎత్తున వరదల వల్ల నష్టం సంభవించడంతో అందరూ సంభ్రమాశ్చర్యాలకు గురయ్యారు. దీనికి కారణం స్పష్టంగానే కనిపిస్తున్నది. నదులకు నిర్మించిన వరద కట్టలకు గండ్లు పడటంతో, వరదనీరు నదిని దాటి ప్రవహించి, దీని ప్రభావంతో కాలువలకు, రోడ్లకు, రైల్వేలైన్‌లకు కూడా గండ్లు పడ్డాయి. దీనికి తోడు డ్రైనేజి లైన్లు మొత్తం మట్టితో నిండిపోవడంతో నీటి ప్రవాహానికి అడ్డంకులుగా మారి మరింత నష్టాన్ని కలుగజేసాయి. దీనితో వరదనీరు అతి ఎక్కువ కాలం నిలిచిపోయింది. సుమారు రెండు కోట్ల 50 లక్షల మంది వరద బాధిత ప్రజలు తమ పొలాలు మునిగిపోయి, ఆస్తులన్నీ వరద నీటిలో కొట్టుకొని పోతుంటే మూగగా రోదిస్తూ చూస్తూ నిలబడవలసి వచ్చింది. వరదల ఉధృతిని కొంతమేరకైనా తగ్గించాలంటే ముందు డ్రైనేజి వ్యవస్థను పటిష్ట పరచాలి. కాని దీనికి ఎటువంటి ప్రాధాన్యత ఇవ్వకుండా బాగమతి నదికి రు. 79 కోట్ల తోను, మహానంద నదికి రు. 850 కోట్లతోను వరద కట్టలను నిర్మిస్తామని ప్రకటించింది. కాని ఆశ్చర్యకరంగా, ఇదివరకే నిర్మించిన వరదకట్టలకు పడ్డ గండ్లు పూడ్చివేతకు గాని, రాష్ట్రంలోని జాతీయ, రాష్ట్ర స్థాయి రహదారులకు పడ్డ 54 గండ్లను పునర్నిర్మించడానికి గాని ఎటువంటి పటిష్టచర్యలు చేపట్టలేదు. గ్రామీణ ప్రాంతాలలోని రహదారులన్నీ మరమ్మత్తులకు కూడా పనికిరానంతగా చెడిపోయాయి. గ్రామీణ రోడ్లకు 829 గండ్లు పడగా, 1353 బ్రిడ్జిలు, కల్వర్టులు చెడిపోయాయి. కొన్నిచోట్ల మరమ్మత్తులు నిర్వహించవలసి ఉండగా, మరికొన్ని పునర్నిర్మించవలసి ఉన్నది. రోడ్లకు గండ్లు పడ్డాయంటే దాని అర్థం, వర్షపు నీరు, వరద నీరు సజావుగా ప్రవహించడానికి దారి లేక రోడ్లను కోసివేసినట్లు తెలుస్తున్నది. అంటే ఆ ప్రాంతంలో ఎటువంటి డ్రైనేజి సౌకర్యాలు లేని కారణంగా, రోడ్లు కోతకు గురయ్యాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం వెంటనే మేలుకొని, వరద నివారణ చర్యల జాబితాలో డ్రెయినేజి పటిష్టీకరణను కూడా చేర్చాలి. లేని పక్షంలో ఇటువంటి నష్టాలు మళ్ళీ మళ్ళీ సంభవిస్తూనే ఉంటాయి.

## సహాయ, పునరావాస కార్యక్రమాలలో అలసత్వం

బీహార్ ప్రభుత్వం వరద బాధితుల సహాయ కార్యక్రమాలకు భారీ ఎత్తున నిధులు కేటాయించింది. చరిత్రలో మొదటిసారిగా వరద బాధితులకు ఆహార ధాన్యాలను ఉచితంగా సరఫరా చేయడంతో పాటు ప్రతీ కుటుంబానికి రు. 2250/- ఆర్థిక సహాయం అందచేసింది. కాని, కెలామిటీ రిలీఫ్ ఫండ్ (సి.ఆర్.ఎఫ్) నిబంధనలను ఏ ప్రాంతంలోను పాటించలేదు. సహాయ పునరావాస కార్యక్రమాల కోసం తగిన నిధులు కేంద్రం కేటాయించలేదని బీహార్ ప్రభుత్వం అసంతృప్తిని ప్రకటించింది. అదే సమయంలో కేంద్ర సహాయ నిధులను సక్రమంగా వ్యయం చేయలేదని బీహార్ ప్రభుత్వాన్ని కేంద్రం దుయ్యబట్టింది.

వాస్తవ పరిస్థితులను గమనిస్తే మనకు ఒక విషయం స్పష్టమవుతున్నది. వివిధ రాష్ట్రాల వాటర్ రిసోర్సెస్ డిపార్ట్‌మెంట్‌లు సాధారణ వరదలను డిజాస్టర్లు గా మారుస్తున్నాయి. ఆ తరువాత డిజాస్టర్ మేనేజ్‌మెంట్ డిపార్ట్‌మెంట్‌లు వరద బాధితులకు సహాయ, పునరావాస కార్యక్రమాలను అమలు చేస్తున్నాయి. అంతకు మించి ఈ రెండు శాఖల మధ్య సమన్వయంగాని, సహాయ సహకారాలు కాని కనిపించడం లేదు. వరదలు సంభవించిన సమయాలలో చాలా తక్కువ సందర్భాలలో ఈ రెండు డిపార్ట్‌మెంట్‌ల అధికారులు ఒక చోట కూర్చుని సంయుక్త కార్యాచరణ ప్రణాళికలను గురించి చర్చించడం కనపిస్తున్నది. భవిష్యత్తులో ఈ రెండు ప్రభుత్వ శాఖలు కలిసి పనిచేయకపోతే, చిన్నపాటి వరదలు కూడా భారీఎత్తున నష్టం తెచ్చిపెట్టే ప్రమాదం ఉన్నది. ప్రతిసారి వరద బాధితులకు సహాయం పేరిట కొన్ని కోట్ల రూపాయలు పంపిణీ చేయవలసి వస్తుంది.



*(ఎన్. బ్రహ్మాజీరావు)*

పర్యావరణ కాలుష్యం...
*2వ పేజీ తరువాయి*

డిగ్రీలు పెరిగితే వరిపంట హెక్టార్‌కి 075 టన్నులు తగ్గిపోతుంది. చలికాలంలో ఉష్ణోగ్రత 05 డిగ్రీలు పెరిగితే గోధుమ పంటకాలం 7 రోజులు తగ్గి, ఫలసాయం హెక్టార్‌కి 0.45 టన్నులు తగ్గిపోతుంది. నిరాశాజనకమైన ఈ పరిస్థితి వల్ల భారత ప్రభుత్వం, జల సంరక్షణకీ, ప్రాంతాలవారీగా వినూత్న వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానానికీ ప్రాముఖ్యతనిచ్చి, అధిక ఉష్ణోగ్రతనీ, నీటి కొరతనీ తట్టుకోగల కొత్త పంటల తరహాలని రూపొందించాలి. వాతావరణ మార్పు సముద్రమట్టాన్ని పెంచడంతో, కోస్తా ప్రాంతం జలమయమై తీరం కోసుకు పోయి, వరదలకీ, ఉప్పునీటి ముంపుకీ దారితీస్తోంది. "2100 నాటికల్లా సముద్ర మట్టం 20 సెం.మీ. పెరగడం వల్ల భారత కోస్తా ప్రాంతంలోని 50 మిలియన్స్ ప్రజలు వరదల వల్ల నిర్వాసితులౌతారు" దానివల్ల కోస్తా ప్రాంతంలోని వ్యవసాయం, మత్స్య పరిశ్రమ, ఆక్వా కల్చర్, మంచినీటి వనరులూ, మానవ వికాసాలూ, విహారయాత్రలూ దెబ్బతింటాయి. తమిళనాడు వంటి రాష్ట్రం, తరచుగా కోస్తా తుఫానుకీ, అధిక సగటు ఉష్ణోగ్రతకీ, మరిన్ని కరువు కాటకాలకీ, అకస్మాత్తుగా వరదల ముంపుకీ గురి అవుతుంది. సముద్రమట్టం పెరుగుదల వాతపడే 27 దేశాలలో ఒకటిగా భారతదేశాన్ని కూడా చేర్చింది, ది యునైటెడ్ నేషన్స్ ఎన్విరాన్‌మెంట్ ప్రోగ్రామ్. భారత జనాభాలోని 4వంతు కోస్తా తీరానికీ 50 కిలోమీటర్ల లోపునే నివసిస్తోంది. ముంబై, చెన్నై వంటి మహానగరాలు నానాటికీ పెరిగిపోతున్న విపరీతమైన జనాభాతో, వనరులు, వసతులు (ఇన్‌ఫ్రాస్ట్రక్చర్) మీద అత్యధికమైన పెట్టుబడులతో, కోస్తాతీరంలోనే నెలకొని ఉన్నాయి. అంతేకాక, కోస్తా ప్రాంతంలోని అత్యధిక భాగం సారవంతమైన వ్యవసాయ భూములతో, సముద్ర మట్టం కంటే దిగువ ఉన్న ప్రాంతాలతో, అంటే ఒరిస్సా, వెస్ట్ బెంగాల్ వంటి రాష్ట్రాలతో ముంపుకి గురయ్యే ప్రాంతాలతో నిండి వుంది. సముద్రమట్టం పెరగడం వల్ల, మంచినీటికోసం, వ్యయసాయం నీటిపారుదల కోసం ప్రజలు ఎక్కువగా ఆధారపడే భూగర్భ జలాశయాలలోకి ఉప్పునీరు ప్రవేశిస్తుంది.

భూమిపై కనీస ఉష్ణోగ్రతలు పెరగడం వల్ల వృక్ష, పశు, పక్షాది జాతులు అంతరించే ప్రమాదం ఉంది. 1986లో నిర్వహించిన ఒక సర్వే ప్రకారం ప్రపంచవ్యాప్తంగా 406 క్షీరదాల సంబంధిత జాతులు, 503 పక్షిజాతులు, 209 సర్పజాతులు, 242 రకాల చేపలు, 867 సీతాకోకచిలుకలాంటి క్రిమి కీటకాలు అంతరించినట్లు వెల్లడైంది. 1981లో మన దేశంలో 900 టన్నుల కప్పలను చంపడం ద్వారా 12 కోట్ల రూపాయల విదేశీ మారకద్రవాన్ని సముపార్జించడం విచారించదగ్గ పరిణామం. ప్రపంచంలో 15 లక్షల జంతుజాతులలో మనదేశంలో 75000 జాతులు భూమిపై, అడవులపై జనాభా ఒత్తిడి పెరిగినందువల్ల వాటి మనుగడను కోల్పోవుచున్నవి. ఒకప్పుడు అన్ని అటవీ ప్రాంతాల్లో కన్పించే ఏనుగులు, పులులు, జింకల సంఖ్య తగ్గి అవి ఏ సర్కస్‌లోని ప్రదర్శనశాలల్లోనో, సినిమాల్లోనో మాత్రమే కన్పిస్తున్నాయి. వాతావరణంలో పెరుగుతున్న మార్పులు జీవవైవిధ్యంలో ఆహారపు గొలుసులో మార్పులకు దారితీస్తాయి. వాతావరణంలో ఉష్ణోగ్రతలో మార్పులు కొన్ని కొత్తరకం బాక్టీరియాలు వేగంగా అభివృద్ధి చెందడానికి తోడ్పడం వల్ల కొత్త కొత్త వ్యాధులు ప్రబలుతున్నాయి. గాలిలో తేమవల్ల దోమలు పెరిగి అంతా విస్తరించి వ్యాధులను విస్తరిస్తున్నాయి. ఉష్ణోగ్రత పెరుగుదల వల్ల మలేరియా, డెంగ్యూ, కాలాఅజార్ వంటి అంటురోగాలు వ్యాపిస్తాయి. దీనితోపాటు వాతావరణం మార్పు ఆహారోత్పత్తిని తగ్గించటంతోపాటు, ఆకలి, అసంపోషకత పెరిగిపోతాయి. వాతావరణ మార్పు ప్రపంచం మొత్తం మీద కోట్ల కొద్ది ప్రజల ఆరోగ్యం మీద వ్యతిరేక ప్రభావం కలిగిస్తుందని ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక వెల్లడిస్తుంది. దీనితో పాటు భూగోళంపై వేడి పెరగటానికి మరోకారణం అడవుల నరికివేత. సాలీనా ప్రపంచమంతట 45000 చ.కి.మీ విస్తీర్ణంలో అడవులను నరికి కాల్చివేస్తున్నందున తద్వారా వాతావరణంలోకి ప్రవేశించే గ్రీన్‌హౌస్ గ్యాస్ విడుదలలు ఐదో వంతుగా ఉంటున్నాయి. ప్రపంచ జనాభాలో భారతదేశ జనాభా 15% వుండగా అడవుల విస్తీర్ణంలో మాత్రం ఒక్క శాతం మాత్రమే ఉన్నాయి. మనదేశ భూవైశాల్యం 32 కోట్ల 80 లక్షల హెక్టార్లుండగా ఇందులో దట్టంగా ఉన్న అడవులు కేవలం మూడుకోట్ల 60 లక్షల హెక్టార్లే. మన దేశంలో సాలీనా దాదాపుగా 15 లక్షల హెక్టార్ల అడవులు హరించుకు పోతున్నాయి. నేషనల్ బయోడైవర్సిటీ స్ట్రాటజీ అండ్ ప్లాన్ రిపోర్టు ప్రకారం భారతదేశం 50% అడవులను, 40% మాగాణులను గత కొద్ది దశాబ్దకాలంలో పోగొట్టుకుంది. ప్రతి సంవత్సరం 1.5 మిలియన్ల హెక్టార్ల అడవులను భారతదేశం నష్టపోతున్నది. ప్రతి సంవత్సరం 1% నేల అడవుల నరికివేత వలన బీడుగా మారుతుంది. ప్రస్తుతం మనదేశంలో అడవుల విస్తీర్ణం 8%గానే ఉంది. కాని ప్రకృతి సమతుల్యత సాధించాలంటే 33% ఉండాలి. అడవులు క్షీణించడం వలన వాతావరణంలో ఆక్సిజన్, కార్బన్‌డైఆక్సైడ్‌ల నిష్పత్తి తలక్రిందులౌతూ ఉంటుంది. పచ్చనిచెట్లు గల ఒక హెక్టారు అరణ్యం గంటలో 8 కిలోల కార్బన్‌డైఆక్సైడ్‌ను పీల్చుకుంటుంది. అనగా ఇది దాదాపు 200 మంది వదిలే కార్బన్‌డైఆక్సైడ్‌కు సమానం. ఒక హెక్టారులోని పచ్చని చెట్లు ఒక సంవత్సర కాలంలో కోటి ఎనభై లక్షల ఘనపుటడుగుల పరిమాణం గల గాలిని శుభ్రపరుస్తాయి. పచ్చని వృక్షసంబంధమైన సంపద కార్బన్‌డైఆక్సైడ్ పీల్చుకోవడం వల్ల గ్రీన్‌హౌస్ ప్రభావం తగ్గి ప్రకృతి సమతుల్యత నెలకొంటుంది.

## పరిష్కార మార్గాలు

పర్యావరణ పరిరక్షణకు అభివృద్ధి చెందిన వర్తమాన దేశాల జీవన సరళి, వస్తు వినియోగ సరళి మార్పుల అత్యావశ్యంగా వివరించ వచ్చు. పర్యావరణ పరిరక్షణకు శక్తిని సంరక్షించే సాంకేతిక పరిజ్ఞానం అవలంబించాలి. పునర్వవస్థీకరణ గల గాలి, సౌరశక్తి, బయోమాస్, ఓషన్ సియోథెర్మల్ ఎనర్జీ వంటి వాటిని వినియోగించాలి. భారత్‌లో 70% పైగా ఉన్న బొగ్గు వాడకాన్ని తగ్గించేందుకు, వాతావరణ మార్పు ఒక పర్యావరణ సమస్య మాత్రమే కాదు. దీనికి భౌగోళిక భద్రతకి, వాతావరణ మార్పుకి, మానవ మనుగడకు అవినాభావ సంబంధం ఉంది. కావున "వాతావరణం-పరిరక్షణ మన బాధ్యత" అనేది అందరి నినాదం అయినప్పుడు మాత్రమే పూర్తి స్థాయిలో పర్యావరణ పరిరక్షణ జరుగుతుందనడంలో ఎటువంటి సందేహం లేదు. ■

# విపత్తు తర్వాతి పరిస్థితిని ఎదుర్కోవడానికి సన్నద్ధం కావాలి

ఇటీవలి కాలంలో 1999 పెనుతుఫాను, 2001 గుజరాతు భూకంపం, 2004 ఆసియా సునామీ, 2005 దక్షిణాసియా భూకంపం, 2008 బీహారు కోసినది వరదల వంటి పెనువిపత్తులు సంభవించటంతో ఇటువంటి పరిస్థితుల నెదుర్కొన్నేందుకు జాతీయ విధాన నిర్మాణాల ఏర్పాటు అవసరం పైకి వచ్చింది. ఈ నేపథ్యంలో జాతీయస్థాయిలో, రాష్ట్రస్థాయిలో పలు చట్టాలు చేశారు. కార్యాచరణ ప్రణాళికలు రూపొందించారు. ప్రస్తుతం జాతీయ విపత్తుల నిర్వహణ చట్టం (2005) అమలులో ఉండగా ఆరు రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేకంగా ఈ విధమైన చట్టాలను ఏర్పాటు చేసుకున్నాయి. జాతీయ చట్టం కింద జాతీయ స్థాయిలోను, రాష్ట్ర-జిల్లా స్థాయిలలోను విపత్తు నిర్వహణ ప్రణాళికలు, విపత్తు నిర్వహణ సాధికార సంస్థలను ఏర్పాటు చెయ్యాలని స్పష్టంగా పేర్కొన్నారు.

ఇప్పటికే 12 రాష్ట్రాలలో ఈ సాధికారసంస్థల ఏర్పాటు జరిగింది. అలాగే 13 రాష్ట్ర ప్రభుత్వాలు జిల్లా-రాష్ట్ర స్థాయిలో అత్యవసర పరిస్థితిలో పనిచేసే కేంద్రాలను నెలకొల్పాయి. పట్టణ ప్రణాళికలో ఇందుకు సంబంధించి ఉపచట్టాలు, నియమ నిబంధనలను చేర్చి విపత్తు నిర్వహణను ప్రధాన స్రవంతిలో కలిపే యత్నాలు చేపట్టారు. ఇందులో భాగంగా విపత్తు నిర్వహణను పాఠశాల పాఠ్యాంశంగా జోడించారు, పాఠశాల భద్రతను సంస్థాగతంగా మార్చారు.

బినయ్ ఆచార్య, అహ్మదాబాద్‌లోని 'ఉన్నతి' అనే సంస్థలో పనిచేస్తున్నారు.

కార్యాచరణ ప్రణాళిక లక్ష్యాలను ముందుకు కొనిపోయేదిశగా పలు ఉపప్రాంతీయ సమావేశాలు నిర్వహించారు. చైనాలోని బీజింగు సమావేశానంతరం 2007 నవంబరులో ఢిల్లీలో జరిగిన రెండవ ఆసియా మంత్రుల స్థాయి సమావేశం పలు అంశాలపై దృష్టి సారించింది.

గృహనిర్మాణం, నీరు-పారిశుధ్యం, ఆరోగ్యం, వ్యవసాయం, విద్య, ఇంధనం, మౌలిక సదుపాయాలు, పర్యావరణ రంగంలో విపత్తు ప్రమాద తగ్గింపును ప్రధాన స్రవంతలో జేర్చాలని, ఆర్థిక యంత్రాంగాన్ని పటిష్ఠం చెయ్యాలని, మహిళలు, పిల్లలు, వికలాంగులు, అనాథలు, అణగారిన వర్గాల వసరాలు తీర్చాలని, ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యాన్ని ప్రోత్సహించాలని, స్థానిక, జాతీయ, ప్రాంతీయ ప్రణాళికా రచనలో, నిర్ణయాలు చెయ్యటంలో పౌర సమాజానికి మరింత భాగస్వామ్యం కల్పించాలనేవి ఈ సమావేశం ప్రధానంగా తీర్మానించిన అంశాలు.

ఇంతకు ముందు మాదిరిగా విపత్తు నిర్వహణ కాక విపత్తు ప్రమాద తగ్గింపు ధ్యేయంగా కార్యాచరణ ప్రణాళికలో మార్పు జరిగింది. దీనికింద విపత్తులు సంభవించిన తరుణంలో సమర్థమైన స్పందనకు, ప్రభావం తగ్గింపుకు సన్నద్ధతపై దృష్టి సారించాలి. అయితే ఈ రకమైన విధానపర చట్టాలు చేసినప్పటికీ ఆశించిన ఫలితాలు లభించటం లేదు. విపత్తు సమయాలలో ప్రభుత్వం తక్షణం స్పదించి రక్షణ సహాయ పునరావాస చర్యలు చేపట్టినా ఇవన్నీ తాత్కాలిక ప్రాతిపదికపైననే జరుగుతున్నాయి. దీర్ఘకాలిక చర్యలు అరకొరగా అంతంతమాత్రంగా ఉంటున్నాయి. అందుచేత విపత్తు అనంతర పునర్నిర్మాణం మరింత సమర్థంగా వుండాలనే ఆశయంతో వివిధ విధాన రూపకల్పన స్థాయిలలో చర్చలు సాగుతున్నాయి.

విపత్తుల అనంతరం కోలుకోవటానికి చేపట్టే చర్యలు రెండు దశలుగా వుంటాయి. మొదటిది తక్షణమే చేపట్టే అత్యవసర తాత్కాలిక ఆశ్రయకల్పన కాగా రెండవది దీర్ఘకాలిక పునర్నిర్మాణం ద్వారా ప్రమాద తగ్గింపు చర్యలు. సాధారణంగా పునర్నిర్మాణ చర్యలలో జాప్యం జరుగుతూ వుంటుంది. నష్టం అంచనాలను వేసే యంత్రాంగంలో, ముందస్తుగా సన్నద్ధత కొరవడటం, సురక్షిత నిర్మాణాలు స్థానిక నిర్మాణ సామగ్రి వాడకంలో సాంకేతిక మార్గదర్శకాల లోపం, తదితర అంశాలు ఇందుకు కారణం. ఇందువల్లనే ఆశయాలు సదుద్దేశ్యంతో కూడినవే అయినా బడుగువర్గాల అవసరాలు మాత్రం తీరకుండా మిగిలిపోతున్నాయని రెండవ అంతర మంత్రుల స్థాయి సమావేశం వేలెత్తి చూపింది. సామాజిక భాగస్వామ్యం కల్పించి తక్కువ స్థాయిలో విపత్తు ప్రమాదం వుండేలా పునర్నిర్మాణాలు చేపట్టడం ఒక సవాలుగానే నిలుస్తోంది.

కాగా, గుజరాతులోని కచ్‌కి చెందిన కచ్ నవ నిర్మాణ్ అభియాన్ ప్రభుత్వేతర సంస్థ (ఎన్‌జిఒ)-'యజమానుల ఆధ్వర్యంలో పునర్నిర్మాణం' (ఒడిఆర్) అనే వేదికను ప్రారంభించింది. మెరుగైన నిర్మాణాలకు వీలుగా విధాన నిర్మాణ రూపకల్పన కోసం ప్రభుత్వ ప్రభుత్వేతర సంస్థలతో పాటు వివిధ వర్గాలతో చర్చలు జరిపే ఈ వేదిక గుజరాతు, బీహారు, ఢిల్లీలలో పలు దఫాలుగా సంప్రదింపులు జరిపి అంతా కలిసి ఒక రికవరీ ప్రక్రియపై ఆమోదానికి వచ్చారు.

దీనిననుసరించి యజమానుల భాగస్వామ్యంతో వారి సహాయ సహకారాలతో పునర్నిర్మాణ ప్రక్రియను చేపట్టాలని నిర్ణయించారు. ఇందువల్ల సామగ్రి, టెక్నాలజీల ఎంపికలో సైతం సొంతదారులు పాలుపంచుకోవటం చేత పునర్నిర్మాణం వేగంగా సాగటమే కాక మరింత అధికస్థాయిలో సంతృప్తి లభిస్తుంది. తరచు నిర్మాణ వ్యయం, వేగం, నాణ్యత విషయాలలో యజమానులను పక్కకు పెట్టి వెలుపలి శక్తులు నిర్ణయాలు చేస్తూంటాయి. దీంతో అసలు బాధితులు ఏమీ పట్టనట్టు కేవలం లబ్ధిదారులుగా మిగిలిపోతారు. అందుచేత ప్రభుత్వం, పౌరసమాజం, సహాయసంస్థలు అంతా కలసి ఆసియా ప్రాంతంలో విపత్తు అనంతర పునర్నిర్మాణాన్ని పరిశీలించిన తర్వాత ఈ ప్రక్రియలో బాధితులను భాగస్వాములను చెయ్యాలనే నిర్ణయానికి వచ్చారు.

ఫలితంగా దశాబ్దాల తరబడి చర్చలు జరుపుతున్నకీలక భాగస్వామ్య సిద్ధాంతం ఒక కొలిక్కి వచ్చినట్టయింది. గుజరాతు భూకంపం, 2004లో దక్షిణ భారతం, శ్రీలంక, థాయ్‌లాండ్‌లలో సంభవించిన సునామీ, కాశ్మీరు, పాకిస్థాన్‌లలో భూకంపం విపత్తుల అనంతరం చేపట్టిన పునర్నిర్మాణంలో ఈ సిద్ధాంతం అమలు జరిగిందని చెప్పాలి.

అయితే పునర్నిర్మాణంలో యజమానులు పాలుపంచుకోవటమంటే వారు స్వయంగా నిర్మించి వారే నివసించాలనే సిద్ధాంతం ఏమీలేదనీ కాంట్రాక్టర్లను నియమించుకొని తమ ఇష్టానుసారం నిర్మాణ ప్రక్రియను నియంత్రించవచ్చుననీ 2008 జూలైలో గుజరాతులో జరిగిన సదస్సు స్పష్టం చేసింది.

## యజమానుల ఆధ్వర్యంలో పునర్నిర్మాణం-ప్రధానాంశాలు

దేశీయంగా సంప్రదాయంగా వస్తున్న పద్ధతులన్నీ సురక్షితమైనవి కావని భావించరాదు. ఈ విషయంలో యజమానులకు ఎంపిక చేసుకునే వీలు కల్పిస్తే నిర్మాణం మరింత మెరుగ్గా, వేగంగా కూడా జరిగే అవకాశం వుంటుంది. ఇందుకు కావలసినదల్లా సరైన స్థానిక పరిజ్ఞానాన్ని, నైపుణ్యాలను, సామగ్రిని వాడుకోవడం మాత్రమే.

దీనివలన చౌకలో నిర్మాణం పూర్తవుతుంది. స్థానిక వనరులు వాడకానికి వస్తాయి కనుక ఇతర అంశాలపై ఒత్తిడి అంతగా వుండదు. అందుచేత ఈ దిశగా పరిశోధనలు జరిపి స్థానికంగా లభ్యమయ్యే సామగ్రి అభివృద్ధిపై పెట్టుబడులు పెంపొందించాలని రాష్ట్రస్థాయిలోను, జాతీయ స్థాయిలోను ఒడిఆర్ నిర్వహించిన వివిధ వర్కుషాపులలో సిఫార్సు చెయ్యటం జరిగింది.

ఇక తరచు నూతన గృహ నిర్మాణానికి ప్రభుత్వ ప్యాకేజీలలో ఇంజనీర్డు నిర్మాణాలకు ప్రాధాన్యం ఉంటుంది. కానీ 80% ప్రపంచ నిర్మాణ రంగంలో ఈ విధమైన నిర్మాణాలు ఉపయోగించరనే అంశాన్ని గుర్తించాలి. అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మించే కొత్తతరహా ఇళ్ళు చూడముచ్చటగా వుంటాయి. కానీ చిన్నవిగా వుండి కుటుంబాలకు నివాసానికి అనువుగా వుండవు. పోనీ కావలసిన విధంగా మార్పులు, చేర్పులు చేసుకుందామన్నా ఆ టెక్నాలజీ పట్ల అవగాహన లేమి కారణంగా గత్యంతరం లేక మిన్నకుండవలసి వస్తుంది. దీనిని బట్టి ఎన్ని నూతన పద్ధతులు వచ్చినా సంప్రదాయమైన పాత పద్ధతులకు ఆదరణ తగ్గలేదని వాటిని ప్రోత్సహించవలసిన అవసరం వుందని స్పష్టమవుతుంది.

విపత్తులలో దెబ్బతిన్న ఇళ్ళను అన్నిటినీ కూలగొట్టాలనే నియమం ఏమీ లేదు. వాటిని మరమ్మత్తులతో తిరిగి సరిచేయవచ్చు. దీనివల్ల బాధిత కుటుంబాలు సొంతగూటికి త్వరలో చేరటమే కాక గృహనిర్మాణంపై ఒత్తిడి కూడా తగ్గుతుంది.

ఇక విపత్తు సందర్భాలలో పునర్నిర్మాణ కార్యక్రమ బాధ్యతను స్వీకరించటం ఒక ఎత్తు అయితే మరోవంక నిర్మాణ సామగ్రుల లభ్యత, సాంకేతిక పద్ధతుల మార్గదర్శకాలు, పనివారికి శిక్షణ, నిర్మాణ సామగ్రి ధరల నియంత్రణ తదితర అంశాలపట్ల కూడా శ్రద్ధ వహించాలి. ఇందుకు పారదర్శకమైన పాలనా యంత్రాంగం అవసరం. ఫిర్యాదుల పరిష్కార యంత్రాంగం అవసరం. గుజరాతు భూకంపం అనంతరం ఈ చర్యలను అమలులో పెట్టారు. ఇవే సూత్రాలను కొంత మార్పులతో శ్రీలంకలో కూడా ఆచరించటం జరిగింది.

పునర్నిర్మాణంలో ఎదురయ్యే సమస్యలలో భూమిని హక్కు భుక్తం చేయటం కూడా ప్రధానమైనదే. విపత్తుల వంటి అవాంతరాల సమయంలో తప్ప భూ రికార్డులను ఎప్పటికప్పుడు తాజా వివరాలతో సిద్ధం చేయటం జరుగదు. దీనివల్ల ఎన్నో సమస్యలు ఉత్పన్నమవుతాయి. వివాదాలు తలెత్తుతాయి. పరిహారం చెల్లింపులో రాజకీయాలు చోటు చేసుకోవటంతో పాటు తుది పునర్నిర్మాణ ప్రక్రియకు అడ్డంకులు ఏర్పడతాయి. పునరావాస విధానాలు ప్రకటించాల్సిన అత్యవసర సమయాలలో మరీ ముఖ్యంగా విపత్తులు సంభవించిన పరిస్థితులలో ప్రభుత్వం తీవ్ర ఒత్తిడిలో వుండగా భూ సర్వేలు జరిపించే సమయం వుండదు.

అందుచేత ముందుగానే ప్రభుత్వం సన్నద్ధంగా భూరికార్డులను పకడ్బందీగా వుంచాలి. స్థానిక ప్రజల భాగస్వామ్యంతో భూసేకరణ జరపాలి. గ్రామీణ-పట్టణ పునర్నిర్మాణ ప్రక్రియ సజావుగా నడిచేందుకు స్థానిక సంస్థలకు ప్రాధాన్యం ఇవ్వాలి. నిర్ణయాలు చెయ్యటంలో పర్యవేక్షణలో వాటికి అధికారం కల్పించాలి. స్థానిక పరిస్థితులు, లబ్ధిదారులు, వారి స్థితిగతులపై స్థానిక అధికారులకు సమగ్రమైన అవగాహన, పట్టు ఉంటాయి గనుక వారికి తేలికగా సమస్యను పరిష్కరించే సౌలభ్యం వుంటుంది.

యజమానుల అధ్వర్యంలో పునర్నిర్మాణాన్ని చేపట్టడానికి ముందుగా జరిగిన నష్టం అంచనాల కోసం సక్రమమైన పద్ధతిని ఏర్పాటు చేయాలి. దీనివల్ల వాస్తవ నష్టం ఏ మేరకు జరిగిందీ తెలుస్తుంది. కానీ తరచుగా అధిక వనరుల సమీకరణకై నష్టాలను అధికం చేసి చూపటం జరుగుతుంది. భారీ విపత్తు సందర్భాలలో, రాష్ట్ర ప్రభుత్వాలు ప్యాకేజీలతో ముందుకు వస్తాయి. కానీ వరదలు, అగ్నిప్రమాదాల వంటి చిన్న తరహా విపత్తులలో పునర్నిర్మాణానికి సహాయం అందదు కనుక బాధితుల నుండి విమర్శలు ఎదురవుతాయి. అందుచేత నష్టాల అంచనాలకు జాతీయస్థాయిలోని రాష్ట్ర, జిల్లా స్థాయిలో కూడా ఒక క్రమపద్ధతి ఏర్పాటు అవసరం. ఇందుకు ప్రభుత్వాల మధ్య పరస్పర అవగాహన, వివిధ భాగస్వాముల భాగస్వామ్యంతో విపత్తు అనంతర అవసరాల అంచనాపై ఒక విధానం అవసరమని ఐక్యరాజ్యసమితికి చెందిన యు.ఎన్.డి.పి. చెప్తూ వస్తోంది.

వనరుల సమీకరణకు కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ వ్యూహాన్ని రూపొందించాలి. దీనివల్ల బాధితులకు సకాలంలో నాణ్యమైన సహాయం అందుతుంది.

పునరావాసంలో మాదిరిగా చాలా సందర్భాలలో తగిన వనరులు అందుబాటులో వుండవు. బీహారులో కోసినది వరదల వనరుల సమీకరణ జరగాలంటే నష్టాల అంచనా పారదర్శకంగా ఉండాలి. అంతేగాక గృహ నిర్మాణం, మౌలిక సదుపాయ కల్పనకు ప్రభుత్వం సబ్సిడీలు, మద్దతుతో భీమా కంపెనీలతో రిస్కు బదిలీ కార్యక్రమం ఏర్పాటు చేసుకోవాలి. ఈ కార్యక్రమాల పట్ల ప్రజలలో ప్రచారం కల్పించాలి. దీనివలన పరిహారం చెల్లింపు ప్యాకేజీల కారణంగా ప్రభుత్వంపై అంతగా భారం పడదు. *(మిగతా 18వ పేజీలో)*

# భూకంపాలకు కూలని భవనాల నిర్మాణం- ఆవశ్యకత, అవరోధాలు, పరిష్కారాలు

భారతదేశంలో ఇటీవల సంభవించిన వివిధ భూకంపాలలో వేల సంఖ్యలో ప్రజలు మరణించగా, కోట్లాది రూపాయల ఆర్థికనష్టం సంభవించింది. కాని ఇదే స్థాయిలో అమెరికాలో సాధారణంగా వచ్చే భూకంపాలలో మరణాల సంఖ్య వంద కంటే తక్కువగానే ఉంటుంది. ఆస్తినష్టం కూడా అతి తక్కువగా ఉంటుంది. దీనికి కారణం, అక్కడ భవన నిర్మాతలందరూ భూకంపాలను తట్టుకొని నిలబడగల పటిష్టస్థితిలో భవంతులను నిర్మించడం. భారతదేశంలో పెద్ద ఎత్తున సంభవించిన ప్రతి భూకంపం వలన సంభవించిన నష్టాలపై మీడియా అతిగా స్పందిస్తూ ఉంటుంది. భవిష్యత్తులో ఇటువంటివి మళ్ళీ జరగకుండా చేపట్టవలసిన చర్యల గురించి ప్రభుత్వ ఏజెన్సీలన్నీ పెద్ద ఎత్తున సభలు, సమావేశాలు ఏర్పాటు చేసి చర్చిస్తాయి. భూకంపాల ప్రభావాన్ని తగ్గించే ప్రణాళికలను సిద్ధం చేస్తాయి. వార్తాపత్రికలు, టివి ఛానెళ్ళు నిపుణులను తమ కార్యాలయాలకు రప్పించి ఇంటర్వ్యూలు నిర్వహించి, ఆ విశేషాలను ప్రసారం చేస్తాయి. దేశవ్యాప్తంగా సెమినార్లు, వర్క్‌షాప్‌లు నిర్వహిస్తారు. ఈ హంగామా అంతా చూసిన సామాన్యప్రజలు, భవిష్యత్తులో ఎంత భారీ ఎత్తున భూకంపాలు సంభవించినా తమ ప్రాణాలకు, ఆస్తులకు ఎలాంటి ప్రమాదం ఉండదని సంతోషిస్తారు. కాని ఈ సంతోషం కొంతకాలం మాత్రమే. మళ్ళీ మరో భారీ భూకంపం సంభవిస్తే పాత పరిస్థితులే పునరావృతమవుతాయి. గతంలో సంభవించిన భూకంపం తరువాత ఎన్నిచర్యలు చేపట్టినా పరిస్థితులలో మార్పు ఏమీ రాలేదని ప్రజలు గుర్తిస్తారు. మళ్ళీ మరోసారి అన్ని రకాల హంగామాలు మొదలవుతాయి. భారతదేశం ఈ సమస్యను ఎన్నటికీ పరిష్కరించే అవకాశం లేదనే అనుకోవాలా? దీనికి సమాధానం ఉన్నది. చిత్తశుద్ధి ఉంటే మనం ఈ సమస్యకు చక్కని పరిష్కారం సాధించే అవకాశం ఉన్నది. ఈ దిశగా కొనసాగడంలో మార్గంలో ఎదురయ్యే సమస్యలను, వాటి పరిష్కారాలను చర్చించడమే ఈ వ్యాసం లక్ష్యం.

## భూకంపాల గతచరిత్ర, ప్రస్తుత స్థితి

గుజరాత్ రాష్ట్రంలోని భుజ్ ప్రాంతంలో 2001లో సంభవించిన భారీ భూకంపంలో 13,000 మంది మరణించారు. కచ్ మరియు సౌరాష్ట్ర ప్రాంతాలలోనే ఎక్కువగా మరణాలు నమోదయ్యాయి. కాని భూకంపం కేంద్రానికి 220 కిలోమీటర్ల దూరంలో ఉన్న అహమ్మదాబాద్‌లో భూకంపం ప్రభావానికి 800కి పైగా ప్రజలు చనిపోయారు. ఆశ్చర్యకరంగా అహమ్మదాబాద్ పట్టణంలోని పురాతన కట్టడాలు, భవనాలలో ఒక్కటి కూడా కూలిపోలేదు. కాని ఇటీవలి కాలంలో నిర్మించిన భవంతులు, బహుళ అంతస్తుల అపార్ట్‌మెంట్లలో అనేక కట్టడాలు నేలమట్టమై పోయాయి. అహమ్మదాబాద్‌లో,



భవన నిర్మాణ రంగంలో ఎంతో అనుభవమున్న డెవలపర్లు, ఆర్కిటెక్ట్‌లు, ఇంజనీర్లు నిర్మించిన 130 బహుళ అంతస్తుల భవనాలు కూలిపోవడంతో, ఈ పట్టణంలో 800 మంది మరణించారు. దీనిని బట్టి భారతదేశంలో భూకంపం సంభవిస్తే ఏం జరుగుతుందనేది మనకు స్పష్టమవుతున్నది. గ్రామీణ ప్రాంతాలలో సాధారణ పౌరులు, నిరక్షరాస్యులైన పనివారు నిర్మించే ఇళ్ళతో పాటు, పట్టణాలలో ఎంతో అనుభవమున్న ఆర్కిటెక్ట్‌లు, ఇంజనీర్లు నిర్మించిన భవంతులు కూడా భూకంపం సంభవిస్తే కూలిపోతాయన్న వాస్తవం కళ్ళకు కట్టినట్లు కనిపిస్తున్నది. మన దేశం ఇతర రంగాలలో గణనీయమైన అభివృద్ధిని సాధించింది. ఇంకా సాధిస్తూనే ఉన్నది. కాని భవన నిర్మాణరంగంలో మాత్రం బాగా వెనుకబడిపోయింది. ప్రతిసారి భూకంపాల సందర్భంగా ఇది తెలుస్తున్నది.

బలూచిస్థాన్‌లో 1931 మార్చిలో సంభవించిన భారీ భూకంపం దరిమిలా, క్వెట్టా నగరంలో భూకంపాలను తట్టుకొని నిలువగల అనేక రైల్వే క్వార్టర్లను నిర్మించారు. ఆ తరువాత 1935లో క్వెట్టాలో సంభవించిన భూకంపంలో ఈ రైల్వే క్వార్టర్లు మాత్రమే కూలిపోకుండా నిలిచాయి. కాని వేలాది భవనాలు నేలమట్టమై సుమారు 25,000 మంది ప్రాణాలు కోల్పోయారు. మనకు 70 సంవత్సరాల క్రితమే భూకంపాలను తట్టుకొని నిలబడగల భవనాలను నిర్మించగల సామర్థ్యం సమకూరినా, మనం ఇప్పటికీ దేశవ్యాప్తంగా భూకంపాల నుండి భద్రతలేని భవనాలనే నిర్మిస్తున్నాము. వాటిలోనే నివసిస్తున్నాము.

2001లో సంభవించిన భయంకర భూకంపం తరువాత, దేశవ్యాప్తంగా అనేక పట్టణాలలో మునిసిపల్ అధికారులు, నూతనంగా నిర్మించే భవనాలకు భూకంపాలను తట్టుకొనే శక్తి ఉన్నట్లుగా ఇంజనీర్లు, ఆర్కిటెక్ట్‌లు, బిల్డర్ల నుండి ధృవీకరణ పత్రాలను సమర్పించాలని భవన యజమానులను డిమాండ్ చేయడం ప్రారంభించారు. కాని దురదృష్టవశాత్తు, మన దేశంలో ఇటువంటి సందర్భాలలో నకిలీ సర్టిఫికెట్లను సృష్టించడం చాలా తేలిక అయిపోయింది. అతి కొద్ది మొత్తం వ్యయం చేసి దొంగ సర్టిఫికెట్ సంపాదిస్తున్నారు. అంతే

సుధీర్ కె. జైన్, డిపార్ట్‌మెంట్ ఆఫ్.సివిల్ ఇంజనీరింగ్
ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, కాన్పూర్

తప్ప ఇంజనీర్లు గాని, బిల్డర్లుగాని, ఎక్కువ ఖర్చు పెట్టేందుకు ఇష్టపడడం లేదు. దీనితో భవనాలు నాసిగా తయారవుతున్నాయి. ఈ సర్టిఫికెట్లను అసలువా, నకిలీవా అని పరీక్షించడంతో పాటు మున్సిపల్ అధికారులు తమ స్వంత ఇంజనీర్లతో తనిఖీ చేయిస్తే తప్ప ప్రయోజనం ఉండదు.

## అవరోధాలు

ఇంజనీరింగ్ విభాగంలో, సమస్యలను పరిష్కరించడం కంటే, ఆ సమస్యలను క్షుణ్ణంగా విపులీకరించడం చాలా ముఖ్యం. పైగా ఇదే అతి పెద్ద సమస్య. అసలు సమస్యల యొక్క తీవ్రత, దాని ప్రభావంపై పూర్తి అవగాహన ఏర్పడితే ఆ సమస్యను చాలా తేలికగా పరిష్కరించవచ్చును. మన దేశంలోని నిపుణులకు సమస్యను పూర్తిగా అధ్యయనం చేయడమే అతిపెద్ద సమస్యగా పరిణమించింది. సమస్య స్వభావం పూర్తిగా అర్థం కాకపోతే దాని పరిష్కారానికి మార్గం దొరకదు. భూకంపాల సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలంటే, ముందు వాటి స్వభావాన్ని, పరిణామాలను క్షుణ్ణంగా పరిశీలించవలసి ఉంటుంది.

అసలు భూకంపం అంటే ఏమిటి? దానివలన వచ్చే సమస్యలు ఏమిటి? ఈ రంగంలో పనిచేస్తున్న ప్రతి ఒక్కరు, దీని పరిష్కారంలో తాను నిర్వహించే విధులే అతి ముఖ్యమైనవని భావిస్తూ ఉంటారు. భూకంపాలను తట్టుకొని నిలబడగల రీతిలో భవన నిర్మాణాలను చేపట్టాలని, ప్రజలలో అవగాహన కల్పించడానికిగాను భారీ ఎత్తున ప్రచారం నిర్వహించాలని ఒకరంటారు. భూకంపాలను ముందుగానే పసికట్టే అధునాతన పరికరాలను దేశమంతటా నెలకొల్పితే భూకంపాల వలన జరిగే నష్టాలను తగ్గించవచ్చునని మరొక రంటారు. మరి కొందరు "సెస్మిక్ మైక్రోజోనేషన్" అతి ముఖ్యమని నొక్కి చెబుతుంటారు. ఇవన్నీ అతి ముఖ్యమైన కార్యక్రమాలే కాని, పటిష్టమైన భవంతుల నిర్మాణం మొదలుపెట్టకపోతే, వేటివలనా అంతగా ప్రయోజన ముండదు. నష్టాలు తగ్గుముఖం పట్టవు. ఏదో విధంగా, తరచుగా భూకంపాలు సంభవించే అవకాశమున్న ప్రతి ప్రాంతంలోను, భూకంపాలను తట్టుకొని నిలువగల భవనాల నిర్మాణం ప్రారంభించి, అన్ని భవనాలకు భద్రత కల్పించగలిగితే ఈ సమస్యకు చాలా సులువైన పరిష్కారం లభిస్తుంది. ఖచ్చితంగా చెప్పాలంటే సమస్యకు మూలకారణం బలహీనమైన కట్టడాలే. అంతే తప్ప భూకంపాలు అసలు సమస్య కాదు. కనుక భూకంపాల కారణంగా సంభవిస్తున్న ప్రాణహానిని, ఆస్తి నష్టాలను తగ్గించాలంటే ఈ క్రింది చర్యలను చేపట్టాలి.

నూతనంగా నిర్మించే భవనాలన్నీ భూకంపాలను తట్టుకొని నిలువగలిగే రీతిలో పటిష్టంగా ఉన్నట్లు ధృవీకరించుకోవాలి.

ఇది వరకే నిర్మితమై ఉన్న భవంతులన్నింటినీ నిర్ణీత కాలవ్యవధిలో "సెన్సిబుల్ రిట్రో ఫిట్టింగ్" ద్వారా భూకంపాలకు కూలని విధంగా పటిష్ట పరచాలి.

సాధారణంగా ఏ కట్టడానికైనా 50 సంవత్సరాల సగటు జీవితకాలం ఉంటుంది. దేశంలోని భవనాల సంఖ్య ప్రతి సంవత్సరం రెండు శాతం మేరకు పెరుగుతున్నది. ఇకముందు నిర్మించే ప్రతి నూతనకట్టడం భూకంపాన్ని తట్టుకునే రీతిలో నిర్మించినట్లయితే, 20 సంవత్సరాలలో దేశంలోని 60% నిర్మాణాలు భూకంపాల తాకిడిని తట్టుకొని నిలబడగల పటిష్ట నిర్మాణాలవుతాయి. వీటికి ఎటువంటి "రిట్రో ఫిట్టింగ్" అవసరం ఉండదు. అటువంటి భవనాలను నిర్మించే శక్తి గల నిర్మాణ సంస్థలను దేశవ్యాప్తంగా అభివృద్ధి చేయాలి. దీనితో పాటు ఇదివరకే నిర్మించిన పాతభవనాలు, కట్టడాలన్నింటికీ "సెస్మిక్ రిట్రో ఫిట్టింగ్" నిర్వహించడానికి తగిన పాలసీలు, మార్గదర్శక సూత్రాలు తయారు చేసి, దీనికి అనుగుణంగా పటిష్టమైన సంస్థలను పద్ధతులను రూపొందించాలి.

## నూతన భవనాలలో రక్షణ ఏర్పాట్లు

నూతనంగా నిర్మించిన భవనాలన్నీ సురక్షితమైనవే నని మనకు నమ్మకం కల్గించే మార్గాలేవి? ఈ ప్రశ్నకు సమాధానం వెతకడానికి ముందు, మనం మరో ప్రశ్న వేయాల్సి ఉంటుంది. అసలు ఇంతకాలం రక్షణ లేని భవనాలను ఎందుకు నిర్మించారు? దీనికి అనేక కారణాలున్నాయి.

**1. అజాగ్రత్త :** అనేక సందర్భాలలో భవన నిర్మాణానికి ప్రణాళిక, డిజైన్ రూపొందించి, నిర్మాణం చేపట్టే వారిలో ఎక్కువమదికి, భూకంపాలపైన గాని, భవనాల పటిష్టతపై గాని, సరైన అవగాహన ఉండటం లేదు. అనేక సందర్భాలలో, భవన నిర్మాతలకు అనుభవం, అవగాహనలేవని ముందుగానే తెలిసినా, నిర్మాణ పనులను కొనసాగిస్తూనే ఉంటారు. మరికొన్ని సందర్భాలలో కొన్ని సమస్యలను పరిష్కరించే సామర్థ్యం తమకు లేదనే విషయం వారికి తెలియదు లేదా నిర్లక్ష్యం చేస్తారు.

**2. స్వయంకృతం :** భవన నిర్మాణంలో వ్యయం తగ్గించుకోవడానికి కొందరు నిర్మాణానికి కావలసిన సిమెంటు, ఇసుక తదితరాల నాణ్యత, పరిమాణం విషయాలలోను, కార్మికుల సంఖ్య విషయంలోను కక్కుర్తిపడి, ధనం ఆదా చేయాలన్న యావలో, నాణ్యతను గాలికొదిలేస్తారు. కనుక భవన కొనుగోలు దారులు నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితులలోను రాజీ పడకూడదు. తొందరపడి బలహీనమైన నిర్మాణాలను ఆమోదించరాదు.

ఈ సమస్య మన ఒక్కరిదే కాదు. ప్రపంచంలోని అభివృద్ధి చెందిన, అభివృద్ధి చెందుతున్న దేశాలన్నింటిలోను భూకంపాల ప్రమాదం ఉంటుంది. కాని ఎప్పుడు ఎక్కడ భూకంపం సంభవించినా, ప్రాణనష్టం, ఆస్తినష్టం తప్పడం లేదు. కాని అభివృద్ధి చెందిన దేశాలలో నష్టాలు కొంత తక్కువ స్థాయిలోనే ఉంటాయి. అభివృద్ధి చెందుతున్న దేశాలలో మాత్రం భారీ స్థాయిలో నష్టాలు సంభవిస్తున్నాయి. దీనికి కారణం భవన నిర్మాణంలో తేడాలే. అభివృద్ధి చెందిన దేశాలలో ప్రభుత్వ పర్యవేక్షణలో ధృఢమైన భవనాలు నిర్మిస్తుండగా, అభివృద్ధి చెందుతున్న దేశాలలో పర్యవేక్షణ లేకుండా, ప్రజలు, బిల్డర్లు తమ చిత్తమొచ్చిన రీతిలో భవనాలు నిర్మిస్తున్నారు. కనుక అన్ని దేశాలలోను, ప్రతి ప్రాంతంలోను భూకంపాలకు తట్టుకొని నిలబడగల పటిష్టమైన భవనాలను మాత్రమే నిర్మించేలా చర్యలు చేపట్టాలి. రక్షణ కలిగిన ఇళ్ళు, భవనాల నిర్మాణానికి ఈ క్రింది చర్యలను చేపట్టాలి.

**1. ప్రజలను చైతన్య పరచడం :** భూకంపాలు సంభవించినప్పుడు భారీ ఎత్తున నష్టపోకుండా, తాము నిర్మించే ఇళ్ళు, భవనాలు పటిష్టంగా ఉండాలన్న విషయాన్ని ముందు ప్రజలకు నచ్చచెప్పాలి. దీనికి గాను ప్రచార కార్యక్రమాలు

నిర్వహించాలి. అప్పుడు ప్రభుత్వ సంకల్పం చాలా తేలికగా నెరవేరుతుంది. ఇటీవలి కాలంలో 2001లో భుజ్‌లోను, 2005లో కాశ్మీర్‌లోను సంభవించిన భూకంపాలు ప్రజలలో చైతన్యాన్ని కలిగించాయి. కాని పటిష్టమైన ఇళ్ళ నిర్మాణ పద్ధతులు ఏమిటనేది సామాన్య ప్రజలకు తెలియడం లేదు.

**2. చట్టబద్ధ చర్యలు :** 2001లో సంభవించిన భయంకర భూకంపం దరిమిలా, వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు, మునిసిపల్ అధికారులు భవనాల పటిష్టతపై ధృవీకరణ పత్రాలను సమర్పించాలన్న నిబంధనలను ఖచ్చితంగా అమలు చేస్తున్నారు. ఇకముందు ఆర్కిటెక్ట్‌లు, స్ట్రక్చరల్ ఇంజనీర్లు, కంట్రాక్టర్లు, కన్‌స్ట్రక్షన్ ఇంజనీర్లు, డెవలపర్లు మరియు మునిసిపల్ అధికారులందరికీ భవనాల పటిష్టత విషయంలో మంచి అవగాహన కల్పించాలి. ఈ బాధ్యతను వారి తలపై మోపాలి. కాని కొన్ని సందేహాలకు సమాధానాలు వెతకవలసి ఉన్నది. ఈ కార్యక్రమంలో ప్రధాన బాధ్యత ఎవరిది? వీరు తమ బాధ్యతను సక్రమంగా నిర్వహిస్తున్నదీ లేనిదీ పర్యవేక్షించేది ఎవరు? వీరిలో ఏ ఒక్కరైనా తమ బాధ్యతలను విస్మరిస్తే జరగబోయే పరిణామాలకు ఎవరు జవాబుదారీ? ఈ ప్రశ్నలకు సమాధానం దొరికితే సమస్య పరిష్కరించినట్లవుతుంది.

**3. సాంకేతిక అంశాలు :** గత పది సంవత్సరాలుగా భారత స్ట్రక్చరల్ ఇంజనీర్లకు "సెస్మిక్ కోడ్" అంశంలో చక్కని శిక్షణ ఇస్తూ, భవనాలను పటిష్టంగా నిర్మించే పద్ధతులను ప్రచారం చేయడం ద్వారా మన ఇంజనీర్ల నైపుణ్యాన్ని కొంతమేరకు పెంచాయి. "ది నేషనల్ ప్రోగ్రామ్ ఆన్ ఎర్త్ క్వాక్ ఇంజనీరింగ్ ఎడ్యుకేషన్" ద్వారా అనేకమంది యువ ఇంజనీర్లు, ఆర్కిటెక్ట్ ఇంజనీర్లకు విద్యను గరిపే ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వడం జరిగింది. వీటిలో అనేక కళాశాలలు ఈ సబ్జెక్టును తమ పాఠ్యాంశాల జాబితాలో చేర్చాయి. అయినప్పటికీ చేయవలసినది ఇంకా చాలా ఉన్నది. దేశంలోని ఇంజనీర్లందరికీ ఈ అంశంపై మరింత శిక్షణనివ్వాలి. ఇంజనీర్లతో పాటు భవన నిర్మాణాలకు సంబంధించిన ఆర్కిటెక్ట్‌లు, డెవలపర్లు, కంట్రాక్టర్లు, మేస్త్రీలు మొదలైన వారందరికీ శిక్షణనివ్వాలి.

**4. వృత్తిదారులపై పర్యవేక్షణ :** మనదేశంలో ఆర్కిటెక్చర్, మెడిసిన్, అకౌంటెన్సీ, న్యాయవాదవృత్తి తదితర అన్ని రకాల వృత్తిదారులపైన ఉన్నతస్థాయి పర్యవేక్షణ ఉంటుంది. దీనికిగాను నియమించిన వివిధ కౌన్సిళ్ళు వృత్తిదారులు తమ కార్యకలాపాలను నిర్వహించడానికి లైసెన్సులు మంజూరుచేసి అనుమతి ఇస్తాయి. లైసెన్సును ఇవ్వడానికి ముందు, వారి వృత్తి నిర్వహణ సామర్థ్యాన్ని నిశితంగా పరిశీలిస్తారు. సంస్థలకు కూడా లైసెన్సులు మంజూరు చేసి, సిబ్బంది పనితీరును ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ఉంటారు. కాని భవన నిర్మాణ ఇంజనీర్లను పర్యవేక్షించే ప్రత్యేకసంస్థను ఇంతవరకు ఏర్పాటు చేయలేదు. కనుక వెంటనే దేశంలోని స్ట్రక్చరల్ ఇంజనీర్లందరికీ, పరీక్షల నిర్వహణ ద్వారా సామర్థ్యాన్ని నిర్ధారించి లైసెన్సులు జారీ చేసే విధానాన్ని ప్రవేశపెట్టాలి. ఆ తరువాత ఇతర ఇంజనీర్లకు కూడా ఈ తరహా లైసెన్సుల విధానం ప్రవేశపెట్టాలి. అంతే కాకుండా భవన నిర్మాణ రంగంలోని మేస్త్రీలు, కూలీలందరికీ శిక్షణ ఇచ్చి, ఉత్తీర్ణతా సర్టిఫికెట్లను జారీ చేయాలి. ఈ సర్టిఫికెట్లు లేని వారిని భవన నిర్మాణ పనులకు అనుమతించకూడదు.

మన దేశంలో మరో అతి పెద్ద సమస్య అవినీతి. వివిధ రాష్ట్రాలు, కేంద్రం లోని ఇంజనీరింగ్ శాఖల అధికారులు, సిబ్బంది అవినీతిపరులు కావడంతో, భవన నిర్మాతలు అనుమతులు సంపాదించడానికి అధిక మొత్తాలను లంచాల రూపంలో చెల్లించవలసి వస్తున్నది. దీనితో వారు ఖర్చు పెట్టిన మొత్తం తిరిగి సంపాదించడానికి గాను, నాసిరకం ఇళ్లు నిర్మించి వినియోగదారులకు అందిస్తున్నారు. దీనిని అరికట్టడం అంత సులభం కాదు. లంచాలు ఇవ్వడం, పుచ్చుకోవడం బాగా అలవాటై పోయిన, అవినీతి అధికారులు ఆయా ప్రభుత్వ శాఖలలో ఉన్నంత కాలం ప్రభుత్వం ఎన్ని చర్యలు చేపట్టినా ప్రయోజనం ఉండదు.

**5. చట్టాల అమలు :** కారు నడిపే డ్రైవర్లు తప్పనిసరిగా సీటు బెల్టులు పెట్టుకోవాలని నిబంధన ఉంది. దీనిని పాటించడానికి ఒక్కరూపాయి కూడా ఖర్చుపెట్టవలసిన అవసరం లేదు. కాని, పోలీసులు కనబడితే తప్ప మన డ్రైవర్లు సీటు బెల్టుటు పెట్టుకోరు. ఇటువంటి ప్రజోపయోగ చట్టాలను అమలుపరచడంలో ప్రజలు సహకరిస్తే తప్ప సక్రమంగా చట్టాలను అమలు చేయడం ప్రభుత్వాలకు సాధ్యంకాదు. ఇదే విధంగ పటిష్టమైన భవనాల నిర్మాణం విషయంలో కూడా ప్రభుత్వాలు, చట్టాలు చేసి వదలివేస్తే సరిపోదు. నిబంధనలను సక్రమంగా అందరూ పాటించేలా చర్యలు తీసుకోవాలి. దీనికి ప్రజలు కూడా సహకరించాలి. లేని పక్షంలో చట్టాల పరిధిలో ఎక్కువ ధనం వ్యయం చేసి పటిష్టమైన భవనాలను నిర్మించడానికి భవన నిర్మాణదారులు ముందుకు రారు. ప్రస్తుతం అనేక పట్టణాలలో మునిసిపల్ అధికారులు, భవనాల పటిష్టతను ధృవీకరిస్తూ సర్టిఫికెట్లు తీసుకుంటున్నారు. కాని ఇవి అసలైనవా, నకిలీవా అని పరీక్షించి నిర్ధారించే చర్యలు మాత్రం చేపట్టడం లేదు. కనుక స్థానిక అధికారులు, భవనాల నిర్మాణానికి ముందే వాటి డిజైన్లు, ప్లానులను క్షుణ్ణంగా పరిశీలించి, నిపుణులు ఆమోదించిన తరువాతనే భవన నిర్మాణానికి అనుమతి ఇవ్వాలి. నిర్మాణం పూర్తయిన తరువాత మరోసారి పరీక్షించి ధృవీకరణ పత్రం ఇవ్వాలి.

**6. పరిశోధన, అభివృద్ధి :** అభివృద్ధి చెందిన దేశాలలో అనుసరిస్తున్న భవన నిర్మాణ పద్ధతులతో పోలిస్తే, మనం బాగా వెనుకబడి ఉన్నామన్న విషయం అర్థమవుతుంది. ఈ రంగంలో ఇంజనీర్లకు ఎదురయ్యే వివిధ సాంకేతిక సమస్యల విషయంలో మరింతగా పరిశోధనలు నిర్వహించి, అభివృద్ధి చేయవలసి ఉన్నది. వీటిని మనదేశంలోని నిపుణులే నిర్వహించాలి. భూకంపాలు ఎలా వస్తాయి, వాటి ప్రభావంతో జరగే నష్టాలేమిటనే అంశంపై మాత్రమే కాకుండా, భూకంపాలను ఎదుర్కొనే ఇంజనీరింగ్ పద్ధతులపై కూడా పరిశోధనలు నిర్వహించి, వివిధ సమస్యలకు పరిష్కారాలను కనుగొనాలి. ఎన్.పి.ఇ.ఇ.ఇ కి అనుగుణంగా భూకంపం సంభవించినా కూలిపోని రీతిలో పటిష్టంగా భవనాలను నిర్మించడానికి జాతీయ స్థాయిలో రిసెర్చి నిర్వహించాలి.

ఇంతవరకు పట్టణ ప్రాంతాలలోని ఇళ్ళు, భవనాల పటిష్టత విషయం చర్చించాము. కాని గ్రామీణ ప్రాంతాలలోని మరియు ప్రజా ప్రయోజన కట్టడాల సంగతి ఏమిటి? వీటిని నియంత్రించే ప్రభుత్వ యంత్రాంగమేదీ లేదు. ఈ విషయంలో అనేక చర్యలను చేపట్టవలసి ఉన్నది.

నిర్వహించాలి. అప్పుడు ప్రభుత్వ సంకల్పం చాలా తేలికగా నెరవేరుతుంది. ఇటీవలి కాలంలో 2001లో భుజ్‌లోను, 2005లో కాశ్మీర్‌లోను సంభవించిన భూకంపాలు ప్రజలలో చైతన్యాన్ని కలిగించాయి. కాని పటిష్టమైన ఇళ్ళ నిర్మాణ పద్ధతులు ఏమిటనేది సామాన్య ప్రజలకు తెలియడం లేదు.

**2. చట్టబద్ధ చర్యలు :** 2001లో సంభవించిన భయంకర భూకంపం దరిమిలా, వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు, మునిసిపల్ అధికారులు భవనాల పటిష్టతపై ధృవీకరణ పత్రాలను సమర్పించాలన్న నిబంధనలను ఖచ్చితంగా అమలు చేస్తున్నారు. ఇకముందు ఆర్కిటెక్ట్‌లు, స్ట్రక్చరల్ ఇంజనీర్లు, కంట్రాక్టర్లు, కన్‌స్ట్రక్షన్ ఇంజనీర్లు, డెవలపర్లు మరియు మునిసిపల్ అధికారులందరికీ భవనాల పటిష్టత విషయంలో మంచి అవగాహన కల్పించాలి. ఈ బాధ్యతను వారి తలపై మోపాలి. కాని కొన్ని సందేహాలకు సమాధానాలు వెతకవలసి ఉన్నది. ఈ కార్యక్రమంలో ప్రధాన బాధ్యత ఎవరిది? వీరు తమ బాధ్యతను సక్రమంగా నిర్వహిస్తున్నదీ లేనిదీ పర్యవేక్షించేది ఎవరు? వీరిలో ఏ ఒక్కరైనా తమ బాధ్యతలను విస్మరిస్తే జరగబోయే పరిణామాలకు ఎవరు జవాబుదారీ? ఈ ప్రశ్నలకు సమాధానం దొరికితే సమస్య పరిష్కరించినట్లవుతుంది.

**3. సాంకేతిక అంశాలు :** గత పది సంవత్సరాలుగా భారత స్ట్రక్చరల్ ఇంజనీర్లకు "సెస్మిక్ కోడ్" అంశంలో చక్కని శిక్షణ ఇస్తూ, భవనాలను పటిష్టంగా నిర్మించే పద్ధతులను ప్రచారం చేయడం ద్వారా మన ఇంజనీర్ల నైపుణ్యాన్ని కొంతమేరకు పెంచాయి. "ది నేషనల్ ప్రోగ్రామ్ ఆన్ ఎర్త్ క్వాక్ ఇంజనీరింగ్ ఎడ్యుకేషన్" ద్వారా అనేకమంది యువ ఇంజనీర్లు, ఆర్కిటెక్ట్ ఇంజనీర్లకు విద్యను గరిపే ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వడం జరిగింది. వీటిలో అనేక కళాశాలలు ఈ సబ్జెక్టును తమ పాఠ్యాంశాల జాబితాలో చేర్చాయి. అయినప్పటికీ చేయవలసినది ఇంకా చాలా ఉన్నది. దేశంలోని ఇంజనీర్లందరికీ ఈ అంశంపై మరింత శిక్షణనివ్వాలి. ఇంజనీర్లతో పాటు భవన నిర్మాణాలకు సంబంధించిన ఆర్కిటెక్ట్‌లు, డెవలపర్లు, కంట్రాక్టర్లు, మేస్త్రీలు మొదలైన వారందరికీ శిక్షణనివ్వాలి.

**4. వృత్తిదారులపై పర్యవేక్షణ :** మనదేశంలో ఆర్కిటెక్చర్, మెడిసిన్, అకౌంటెన్సీ, న్యాయవాదవృత్తి తదితర అన్ని రకాల వృత్తిదారులపైన ఉన్నతస్థాయి పర్యవేక్షణ ఉంటుంది. దీనికిగాను నియమించిన వివిధ కౌన్సిళ్ళు వృత్తిదారులు తమ కార్యకలాపాలను నిర్వహించడానికి లైసెన్సులు మంజూరుచేసి అనుమతి ఇస్తాయి. లైసెన్సును ఇవ్వడానికి ముందు, వారి వృత్తి నిర్వహణ సామర్థ్యాన్ని నిశితంగా పరిశీలిస్తారు. సంస్థలకు కూడా లైసెన్సులు మంజూరు చేసి, సిబ్బంది పనితీరును ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ఉంటారు. కాని భవన నిర్మాణ ఇంజనీర్లను పర్యవేక్షించే ప్రత్యేకసంస్థను ఇంతవరకు ఏర్పాటు చేయలేదు. కనుక వెంటనే దేశంలోని స్ట్రక్చరల్ ఇంజనీర్లందరికీ, పరీక్షల నిర్వహణ ద్వారా సామర్థ్యాన్ని నిర్ధారించి లైసెన్సులు జారీ చేసే విధానాన్ని ప్రవేశపెట్టాలి. ఆ తరువాత ఇతర ఇంజనీర్లకు కూడా ఈ తరహా లైసెన్సుల విధానం ప్రవేశపెట్టాలి. అంతే కాకుండా భవన నిర్మాణ రంగంలోని మేస్త్రీలు, కూలీలందరికీ శిక్షణ ఇచ్చి, ఉత్తీర్ణతా సర్టిఫికెట్లను జారీ చేయాలి. ఈ సర్టిఫికెట్లు లేని వారిని భవన నిర్మాణ పనులకు అనుమతించకూడదు.

మన దేశంలో మరో అతి పెద్ద సమస్య అవినీతి. వివిధ రాష్ట్రాలు, కేంద్రం లోని ఇంజనీరింగ్ శాఖల అధికారులు, సిబ్బంది అవినీతిపరులు కావడంతో, భవన నిర్మాతలు అనుమతులు సంపాదించడానికి అధిక మొత్తాలను లంచాల రూపంలో చెల్లించవలసి వస్తున్నది. దీనితో వారు ఖర్చు పెట్టిన మొత్తం తిరిగి సంపాదించడానికి గాను, నాసిరకం ఇళ్లు నిర్మించి వినియోగదారులకు అందిస్తున్నారు. దీనిని అరికట్టడం అంత సులభం కాదు. లంచాలు ఇవ్వడం, పుచ్చుకోవడం బాగా అలవాటై పోయిన, అవినీతి అధికారులు ఆయా ప్రభుత్వ శాఖలలో ఉన్నంత కాలం ప్రభుత్వం ఎన్ని చర్యలు చేపట్టినా ప్రయోజనం ఉండదు.

**5. చట్టాల అమలు :** కారు నడిపే డ్రైవర్లు తప్పనిసరిగా సీటు బెల్టులు పెట్టుకోవాలని నిబంధన ఉంది. దీనిని పాటించడానికి ఒక్కరూపాయి కూడా ఖర్చుపెట్టవలసిన అవసరం లేదు. కాని, పోలీసులు కనబడితే తప్ప మన డ్రైవర్లు సీటు బెల్టులు పెట్టుకోరు. ఇటువంటి ప్రజోపయోగ చట్టాలను అమలుపరచడంలో ప్రజలు సహకరిస్తే తప్ప సక్రమంగా చట్టాలను అమలు చేయడం ప్రభుత్వాలకు సాధ్యంకాదు. ఇదే విధంగ పటిష్టమైన భవనాల నిర్మాణం విషయంలో కూడా ప్రభుత్వాలు, చట్టాలు చేసి వదలివేస్తే సరిపోదు. నిబంధనలను సక్రమంగా అందరూ పాటించేలా చర్యలు తీసుకోవాలి. దీనికి ప్రజలు కూడా సహకరించాలి. లేని పక్షంలో చట్టాల పరిధిలో ఎక్కువ ధనం వ్యయం చేసి పటిష్టమైన భవనాలను నిర్మించడానికి భవన నిర్మాణదారులు ముందుకు రారు. ప్రస్తుతం అనేక పట్టణాలలో మునిసిపల్ అధికారులు, భవనాల పటిష్టతను ధృవీకరిస్తూ సర్టిఫికెట్లు తీసుకుంటున్నారు. కాని ఇవి అసలైనవా, నకిలీవా అని పరీక్షించి నిర్ధారించే చర్యలు మాత్రం చేపట్టడం లేదు. కనుక స్థానిక అధికారులు, భవనాల నిర్మాణానికి ముందే వాటి డిజైన్లు, ప్లానులను క్షుణ్ణంగా పరిశీలించి, నిపుణులు ఆమోదించిన తరువాతనే భవన నిర్మాణానికి అనుమతి ఇవ్వాలి. నిర్మాణం పూర్తయిన తరువాత మరోసారి పరీక్షించి ధృవీకరణ పత్రం ఇవ్వాలి.

**6. పరిశోధన, అభివృద్ధి :** అభివృద్ధి చెందిన దేశాలలో అనుసరిస్తున్న భవన నిర్మాణ పద్ధతులతో పోలిస్తే, మనం బాగా వెనుకబడి ఉన్నామన్న విషయం అర్థమవుతుంది. ఈ రంగంలో ఇంజనీర్లకు ఎదురయ్యే వివిధ సాంకేతిక సమస్యల విషయంలో మరింతగా పరిశోధనలు నిర్వహించి, అభివృద్ధి చేయవలసి ఉన్నది. వీటిని మనదేశంలోని నిపుణులే నిర్వహించాలి. భూకంపాలు ఎలా వస్తాయి, వాటి ప్రభావంతో జరగే నష్టాలేమిటనే అంశంపై మాత్రమే కాకుండా, భూకంపాలను ఎదుర్కొనే ఇంజనీరింగ్ పద్ధతులపై కూడా పరిశోధనలు నిర్వహించి, వివిధ సమస్యలకు పరిష్కారాలను కనుగొనాలి. ఎన్.పి.ఇ.ఇ.ఇ కి అనుగుణంగా భూకంపం సంభవించినా కూలిపోని రీతిలో పటిష్టంగా భవనాలను నిర్మించడానికి జాతీయ స్థాయిలో రిసెర్చి నిర్వహించాలి.

ఇంతవరకు పట్టణ ప్రాంతాలలోని ఇళ్ళు, భవనాల పటిష్టత విషయం చర్చించాము. కాని గ్రామీణ ప్రాంతాలలోని మరియు ప్రజా ప్రయోజన కట్టడాల సంగతి ఏమిటి? వీటిని నియంత్రించే ప్రభుత్వ యంత్రాంగమేదీ లేదు. ఈ విషయంలో అనేక చర్యలను చేపట్టవలసి ఉన్నది.

1. స్థానికంగా లభ్యమయ్యే సాధారణ నిర్మాణ సరుకులతో, సామాన్య ప్రజలు కూడా స్వయంగా భూకంప రక్షిత ఇళ్ళ నిర్మాణం చేపట్టడానికి తగిన సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోనికి రావాలి. భూకంపాల నుండి ఖచ్చితమైన రక్షణ కలిగిన సంప్రదాయ కట్టడాలకు ఉదాహరణలుగా, ఈశాన్యరాష్ట్రాలలోని అస్సాం తరహా ఇళ్లను, కాశ్మీర్లోని ధజ్జీ-ద్వారి నిర్మాణాలను పేర్కొనవచ్చును. ఈ తరహా సంప్రదాయ కట్టడాలను ప్రస్తుత కాలానికి అనుగుణంగా నిర్మించ డానికి తగినట్లుగా పరిశోధన మరియు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాలి.

2. నమ్మకమైన ఇంజనీరింగ్ పర్యవేక్షణ లేకుండా, రీ ఇన్ఫోర్స్డ్ కాంక్రీట్ ఫ్రేమ్ బిల్డింగ్‌ల నిర్మాణాన్ని నిలిపివేయాలి. దీనికి బదులుగా అనుభవజ్ఞులైన భవన నిర్మాణ కార్మికులను నియమించి, సాధారణ ఇటుకలు లేదా రీ ఇన్ఫోర్స్డ్ కాంక్రీట్ షియర్ వాల్స్‌లతో నిర్మించాలి. పూర్తిస్థాయిలో ఇంజనీరింగ్ ముడి సరుకులు దొరకనప్పుడు ఇదే మేలైన పద్ధతి.

3. పట్టణ ప్రాంతాలలో పటిష్టమైన ఇళ్ళ నిర్మాణం ప్రారంభమయితే, గ్రామీణ ప్రాంతాలలోను ఇదే పద్ధతిని అనుసరిస్తారు.

## ప్రస్తుత భవనాలకు సెస్మిక్ రిట్రో ఫిట్టింగ్

దురదృష్టవశాత్తు సెస్మిక్ రిట్రో ఫిట్టింగ్ నిర్వహించడానికి తగిన సాంకేతిక పరిజ్ఞానం, ఆధునిక పరికరాలు పూర్తిస్థా యిలో మనదేశంలో అందుబాటు లోనికి రాలేదు. దీనితో రిట్రో ఫిట్టింగ్‌పై అందరూ కొంతమేరకు నిర్లక్ష్యం వహిస్తున్నారు. అంతేకాకుండా రిట్రో ఫిట్టింగ్ ఎంతో వ్యయ, ప్రయాసలతో కూడుకున్న కార్యక్రమం. రిట్రో ఫిట్టింగ్ పై ముందుకు కొనసాగ డానికి ఈ క్రింది విషయాలను ముందుగా పరిశీలించవలసిన అవసరముంది.

**1) రిట్రో ఫిట్టింగ్‌కు ఖర్చు ఎక్కువ :** ఒక నూతన భవనం నిర్మించడానికి ఎంత ఖర్చు అవుతుందో, దానిలో 10 నుండి 50% వరకు రిట్రో ఫిట్టింగ్‌కు ఖర్చవుతుంది.

**2) సుదీర్ఘకాలం పట్టే రిట్రో ఫిట్టింగ్ పనులు :** బలహీనగా నిర్మించిన భవనాలలో ఎక్కడెక్కడ లోపాలున్నాయో తెలుసుకోవడానికే చాలా ఎక్కువ కాలం పడుతుంది. ఆ తరువాత ఈ లోపాలను సరిచేయడానికి కావలసిన ప్రాథమిక అవసరాలను, సరుకులను వెతుక్కొని సమకూర్చుకోవాలి. ఆ తరువాత రిట్రో ఫిట్టింగ్‌ను పూర్తి చేయడానికి మరికొంతకాలం పడుతుంది. మొత్తం కార్యక్రమాలు పూర్తయ్యేసరికి దశాబ్దాలు గడిచిపోతాయి. దీనికి ఉదాహరణగా కాలిఫోర్నియా బ్రిడ్జిల విషయం పేర్కొనవచ్చును. నగరంలోని బ్రిడ్జిలకు కొన్ని బిలియన్ల డాలర్ల వ్యయంతో కాలిఫోర్నియా డిపార్ట్‌మెంట్ ఆఫ్ ట్రాన్స్‌పోర్టేషన్ చేపట్టిన రిట్రో ఫిట్టింగ్ పనులు పూర్తి కావడానికి 35 సంవత్సరాలు పట్టింది.

**3) రిట్రోఫిట్టింగ్‌కు ఉన్నతస్థాయి సాంకేతిక నైపుణ్యం, పరికరాలు, నిపుణులైన పనివారు కావాలి :** కాంప్లెక్స్ తరహా భవనాలకు రిట్రో ఫిట్టింగ్ నిర్వహించాలంటే ఉన్నతస్థాయి సాంకేతిక నైపుణ్యం కావలసి ఉంటుంది. జీవిత కాల దృఢత్వం ఆయా కట్టడాలకు సమకూర్చడానికి ఇంకా ఎక్కువ నైపుణ్యం వినియోగించాలి. ఉదాహరణకు, కేవలం రిట్రో ఫిట్టింగ్‌పై పరిశోధనలు నిర్వహించడానికి గాను కాలిఫోర్నియా డిపార్ట్‌మెంట్ ఆఫ్ ట్రాన్స్‌పోర్టేషన్ సంవత్సరానికి 220 కోట్ల రూపాయల వ్యయంతో కార్యక్రమాలు నిర్వహించి, నూతన టెక్నాలజీలను కనుగొన్నది. కాని భారతదేశంలో, సెస్మిక్ అసెస్‌మెంట్‌తో ప్రస్తుత భవనాల పటిష్టతను నిర్ధారించే అధీకృత నిబంధనా పత్రాలను ఇంతవరకు రూపొందించ లేదు. రిట్రో ఫిట్టింగ్ నిర్వహించే పద్ధతులను కూడా కనుగొనలేదు.

**4) అతిముఖ్యమైన ప్రజోపయోగ కట్టడాల పరిరక్షణకు ప్రభుత్వం తప్పనిసరిగా రిట్రో ఫిట్టింగ్ కార్యక్రమాలు చేపట్టి నిర్వహించాలి.** మనం దేశంలోని ప్రతి బాలుడు, బాలిక తప్పనిసరిగా ప్రాథమిక పాఠశాలలో చేరాలని నిర్బంధించే అవకాశం ఎంత మాత్రం లేదు. ఎందుకంటే దేశంలోని బాలబాలికలందరికీ ప్రవేశం కల్పించే సామర్థ్యం కలిగిన, పటిష్టమైన పాఠశాల భవనాలు అందుబాటులో లేవు. ముజఫరాబాద్‌లో బలహీనంగా ఉన్న భవంతిలో నిర్వహిస్తున్న పాఠశాల కూలిపోయిన సుమారు 400 మంది పసివారు బలైపోయిన సంఘటనను గమనిస్తే, దేశంలోని ఏ ప్రాంతంలోను మళ్ళీ ఇటువంటి దుర్ఘటన జరగకుండా చూడాలని ఎవరికైనా అనిపిస్తుంది. కనుక ప్రజోపయోగ కట్టడాలన్నింటికీ సెయిస్మిక్ రిట్రో ఫిట్టింగ్ నిర్వహించే అంశానికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చి, ప్రభుత్వాలు అన్నీ తగిన చర్యలు తీసుకోవాలి. ఆ తరువాత ప్రైవేటు కట్టడాలపై దృష్టి సారించాలి.

**5) ప్రాధాన్యతారంగంగా పరిగణించాలి :** ఒకేసారి దేశంలోని అన్ని రకాల కట్టడాలకు రిట్రో ఫిట్టింగ్ నిర్వహించడానికి తగిన సౌకర్యాల అందుబాటులో లేనందున, ఈ అంశానికి ప్రాధాన్యతను ఇచ్చి అంచెలవారీగా నిర్వహించాలి. ఈలోగా కట్టడాల పటిష్టతను గరిష్టస్థాయికి చేర్చాలి. చేయబోయే వ్యయాన్ని ప్రాధాన్యతల మేరకు కేటాయించాలి. ఏ ప్రాంతంలో భూకంపాల బెడద ఎక్కువగా ఉంటుందో ఆ ప్రాంతాలపై ప్రత్యేక శ్రద్ధ కనపరచాలి. కట్టడాల బలహీనతలు, కూలిపోతే జరిగే నష్టాలు తదితర అంశాలన్నింటినీ అంచనా వేసి, దేనికి ముందు ప్రాధాన్యత నివ్వాలో నిర్ణయించాలి. వీటన్నింటికీ తగిన పరిశోధనలు నిర్వహించాలి. స్థూలంగా చెప్పాలంటే, అత్యవసరంగా రిట్రో ఫిట్టింగ్ కార్యక్రమాలను చేపట్టడానికి ముందుగా తెర వెనుక కార్యక్రమాలు పరిశోధనలు పెద్దఎత్తున నిర్వహించవలసి ఉన్నది.

## ముగింపు

భూకంపాల సమస్యను పరిష్కరించాలనుకునే ముందు, అసలు సమస్యను గుర్తించవలసి ఉన్నది. ఇది భూకంపాలు వచ్చే సమస్యకాదని, రక్షణ లేని భవనాల నిర్మాణమే అసలు సమస్య అని తెలుసుకోవాలి. కనుక వెంటనే మన దృష్టిని భూకంపాలపై నుండి భవన నిర్మాణరంగం వైపునకు సారించాలి, ఈ రంగం నుండి మరింత మెరుగైన సేవలను ఎలా పొందాలో ఆలోచించాలి, చర్చించాలి. పటిష్టమైన భవనాల నిర్మాణానికి పూనుకోవాలి. భూకంపాల నుండి ప్రజలకు రక్షణ కల్పించడం ఇంజనీరింగ్ రంగానికి ఒక పెనుసవాలుగా మారిందని, ఈ రంగాన్ని అభివృద్ధి పరచడమే అతి ముఖ్యమని గుర్తించాలి. ఈ రంగంలో విజయం సాధించడానికి దశాబ్దాల తరబడి కృషి చేయవలసి

*(మిగతా 18వ పేజీలో)*

# అభివృద్ధి నుంచి ప్రమాదం లేని అభివృద్ధి వైపు

ప్రొ. సంతోష్‌కుమార్
పాలసీ ప్లానింగ్ అండ్ కమ్యూనిటీ ఇష్యూస్
నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్

విలయాలూ, ప్రళయాలూ వినాశనాల్ని మాత్రమే కలగజేయవు. అప్పటి వరకూ సాధించిన అభివృద్ధిని కుంటుపరుస్తాయి. గత రెండు దశాబ్దాల్లోనూ జరిగింది అదే. ఆసియాలో ఎక్కువగానూ, ప్రత్యేకించి భారతదేశంలో మరీనూ ఈ విలయాలు చోటు చేసుకున్నాయి. ఈ ప్రళయాలు, ఏళ్ళ తరబడి ఇటు ప్రాణనష్టం, అటు అభివృద్ధికి ఉపయోగపడే మౌలిక వనరుల్ని గూడా దెబ్బ తీస్తున్నాయి. ప్రళయాలు కలుగజేసే నష్టాల్ని ఎదుర్కోవడానికి రోడ్లు, విద్య, ఆరోగ్యం, సమాచార వ్యవస్థ, విద్యుత్, నీటిపారుదల వ్యవస్థల వంటి రంగాల్లో బండిని మళ్ళీ పట్టాలపై కెక్కించడానికి ఎంతో కష్టపడవలసి వస్తుంది. ప్రజలకు సుఖవంతమైన జీవితం ఇవ్వడానికి, అందులోనూ మరింత అభివృద్ధిని చూపించడానికీ, ఈ విలయాలు ఒక రకమైన అకాల మరణాల్లాగా అడ్డ పడ్తాంటాయి. ఉద్దేశింపబడిన అభివృద్ధికి ఆటంకాలుగా మార్తుంటాయి. ఈ విలయాల వల్ల ప్రభావితమైన దేశాలు జరిగిన నష్టాల్ని పూడ్చుకోవడానికి గత దశాబ్ద, రెండు దశాబ్దాల క్రితం అభివృద్ధి ప్రక్రియని ఎక్కణ్ణించి ప్రారంభించారో మళ్ళీ అక్కణ్ణుండే మొదలుపెట్టవలసి వస్తుంది. అది ఒక రకంగా ఒకే అభివృద్ధి ప్రక్రియని మళ్ళీ పునర్నిర్మాణం చేసే కార్యక్రమంలాంటిది. అంటే ఇందాక అనుకున్నట్టు బండిని పట్టాల మీదికి ఎక్కించే కార్యక్రమం అన్నమాట. అది ఆర్థిక రంగమైనా కావచ్చు, సామాజికాభివృద్ధి అయినా కావచ్చు. ప్రళయాల వల్ల జరిగే నష్టాలు రెండు రకాలు. ఒకటి ఒక విపత్తు సంభవించగానే మనం పేపర్లో చదివేదీ, టీవీల్లో చూసేదే. ఇది నేరుగా ప్రాణనష్టం, ఆస్థి నష్టాలకి సంబంధించి కంటికెదురుగా కనపడేది. ఇక పరోక్షంగా ఎన్నో నష్టాలు. ఉత్పత్తులు నిలిచిపోవడం. ప్రజాహిత సేవలు నిలిచిపోవడం. ఉదాహరణకి విద్యుత్ సరఫరా నిలిచిపోవడం, సమాచార వ్యవస్థ దెబ్బతినడం, జలవనరులు కట్టుతప్పి ఊళ్ళనీ, పొలాలన్నీ ముంపునకు గురికావడం, కార్మికులకు పని దొరకకపోవడం, పంపిణీ వ్యవస్థకు భంగం వాటిల్లడం. మార్కెట్లో వ్యాపారాలు దెబ్బతినడం, సామాజిక కార్యకలాపాలకు విఘాతం కలగడం, పెట్టుబడులు కుప్పకూలి పోవడం, విపత్తుల మూలాన అభివృద్ధి ఎప్పుడైతే కుంటుపడి వెనకపడ్తుందో అభివృద్ధి కార్యక్రమాల కోసం నిర్దేశింపబడిన నిధులను అత్యసవర పరిస్థితిలో పునర్మిర్మాణ కార్యక్రమాల కోసం మళ్ళించాల్సి వస్తుంది. నంక్షేమ కార్యక్రమలకూ, పునరావాస కార్యక్రమాలకూ వినియోగించాల్సి వస్తుంది. దాంతో దీర్ఘకాలిక ప్రయోజనాల నిమిత్తం ఉద్దేశింపబడిన అభివృద్ధి కార్యక్రమాలు దెబ్బతింటాయి. వాటి లక్ష్యాలను నిర్దేశించుకున్న సమయంలో సాధించుకోవడం కష్టమౌతుంది. ప్రకృతి వైపరీత్యాలు ఈ విధంగా అంతవరకూ సాధించిన అభివృద్ధిని దెబ్బకొట్టి కథని మళ్ళీ మొదటికి తీస్కొస్తాయి. అభివృద్ధి మళ్ళీ వెనకపడుతుంది. ఆర్థికాభివృద్ధి కుంటుపడుతుంది. జాతీయ, రాష్ట్ర, పురపాలక, పంచాయితీ నిధులు ఈ విధంగా దారి మళ్ళింపబడి చేసిన పనిమీదే మళ్ళీ పెట్టుబడి పెట్టే స్థితికి వస్తాయి. ఇక్కడ అభివృద్ధి కన్నా జరిగిన నష్టం నించి కోలుకోవడం ముఖ్యం. అంచేత అంతవరకూ వెచ్చించిన నిధులన్నీ తుడిచి పెట్టుకుపోతాయి. అవే విపత్తులు మాటిమాటికీ జరిగిన పక్షంలో ఈ అభివృద్ధి కోసం కేటాయించబడిన నిధులన్నీ పునర్నిరాణ కార్యక్రమాలకి వినియోగపడి ఆర్థికరంగం మీద తీవ్ర ప్రభావాన్ని చూపుతాయి. అయితే విపత్తులను నివారించ డానికి ప్రపంచవ్యాప్తంగానూ, దేశీయంగానూ, స్థానికంగానూ కూడా ప్రయత్నాలు జరుగుతూనే ఉన్నాయి. ఈ విపత్తుల నివారణ విషయంలోదాదాపు 169 దేశాలు ఒక భౌగోళిక ఒప్పందంపై సంతకాలు చేశాయి. దాన్ని హైగో ఫ్రేమ్‌వర్క్ ఆఫ్ యాక్షన్ అంటారు. ప్రమాదాలు తగ్గించడం ముఖ్య ధ్యేయంగా 2005లో ఈ ఒప్పందం చేసుకోవడం జరిగింది. చాలా దేశాలు ఇండియాతో సహా విపత్తుల నివారణ, సహాయ, పురావాస చర్యలు, ముందు జాగ్రత్త చర్యల వంటివి చేపట్టడం జరిగింది. భారత్‌లో అయితే దీనికై కొన్ని సంస్థలు స్థాపింపబడ్డాయి. విధానపరమైన నిర్ణయాలు తీసుకోబడ్డాయి. కొన్ని చట్టాలు కూడా చేయడం జరిగింది. విపత్తులు సంభవించనప్పుడు ఎక్కువ ప్రమాదమూ, నష్టమూ జరక్కుండా కొన్ని చర్యలనూ, కార్యాచరణనూ రూపొందించి ఒకే చోటు నుండి అమలు చేయగల పరిస్థితులను ఏర్పరచడం జరిగింది. ఈ డిడిఆర్ అమలుపై సాధనా సాధనాల విచారణ ఇంకా జరుగుతూనే ఉండడం విశేషం.

**అభివృద్ధిలో విపత్తుల ఆశంకలు**

విపత్తు యాజమాన్యం అనేది కేవలం ఒక రంగానికి సంబంధించినది కాదు. దానిలోకి అనేక రంగాలు, శాఖలు వస్తాయి. బహుముఖమైన క్రమశిక్షణ కావాలి దానికి. కాబట్టి డిఆర్ఆర్ పట్ల అప్రమత్తత అనేది ఎన్నో శాఖలనూ, రంగాలనూ కలగలుపుకునేదిగా భావించాలి. అన్ని శాఖలనూ రంగాలనూ కలుపుకు పోవడమనేదే ఈ విషయంలో పెద్ద సమస్య. ప్రకృతి వైపరీత్యాల వల్ల జరిగే నష్టం ప్రజా జీవన పురోగతిపైన నేరుగా ప్రభావం కలిగి ఉంటుంది. విపత్తులు అభివృద్ధిని కుంటుపరుస్తాయి. ఇంకొక పక్కన ప్రజల ఆకాంక్షలు, సమాజపు ఆకాంక్షలు వివిధ దేశాల ప్రభుత్వాల ఆకాంక్షలూ అభివృద్ధి విషయంలో భిన్నంగా ఉంటాయి. అప్పుడు ఈ విపత్తులు తెచ్చి పెట్టే ప్రమాదాలు గూడా భిన్నంగానే ఉంటాయి. ఒక్కొక్క రకమైన విలయానికి ఒక్కొక్క కొత్త నివారణ ప్రక్రియ చేపట్టాలి. ఒక్కొక్క రంగంలోని నివారణా శక్తియుక్తుల్ని జాగ్రత్తగా అంచనావేస్తూ, అమలుచేస్తూ పోవాలి. ఉదాహరణకు ప్రజా సౌకర్యాల అభివృద్ధి ప్రక్రియ ఇటు మంచీ, అటు చెడూ రెండు అభివృద్ధి పథాలనూ బేరీజు వేసుకోవాలి. మంచి అభివృద్ధి అంటే అనుకున్న లక్ష్యానికి చేర్చేది. దీనిలో వేరే అనుకోని ఆటంకాల మూలాన అభివృద్ధి అనేది అనుకున్నంతగా సాధించలేకపోవడం వంటివి లేకుండా, చెడు అభివృద్ధి అంటే ఏమిటంటే ఒక అనుకున్న ప్రజా జీవితంలోని అభివృద్ధి సాధిస్తూనే

మరోప్రక్క విపత్తుల తాలూకు అభివృద్ధి నిరోధక ఆటంకాలు చోటు చేసుకుని అంతవరకూ జరిగిన అభివృద్ధి వెనకబడేట్టు చేసేది. చాలా రకాల మౌలిక వనరులు ఇటువంటి సమయాల్లో నాశనమైపోవడం జరుగుతూంటుంది. గతంలో అలా చాలాసార్లు జరిగింది కూడా. అప్పుడు ఆ నష్టం పూడ్చుకునే ప్రయత్నంలో ఈ విపత్తు వినాశకర ఫలితాన్ని అంచనా వేసుకుని ఆ మేరకు పునరుద్ధరణ కార్యక్రమాలు కూడా జరిగాయి. అనగా ఒకే అభివృద్ధి కార్యక్రమాల నిధులు విపత్తు సృష్టించిన విపత్కర ఫలితాలపై ఖర్చు చేయడం మూలాన నిధులు చేసిన పనినే మళ్ళీ చేయడం మీద ఖర్చు చేయడం జరిగింది. అటువంటి పరిస్థితుల్లో ఇటువంటి నష్టం పూడిక చర్యలకు నిధులలో కోత విధించే అవకాశం గూడా ఉంటుంది, నిదుల కొరత మూలాన. ఇటువంటి ప్రాకృతిక, యాంత్రిక, మానవ తప్పిదాల వల్ల కలిగే విపత్తుల వల్ల కలిగే నష్టాలు ఇన్నీ అన్నీ కావు. ఉదాహరణకి ప్రజలు బ్రతుకు తెరువులు కోల్పోతారు. నిరుద్యోగం ప్రబలుతుంది. తద్వారా దారిద్ర్యం పెరుగుతుంది. పేదరికం పడగలు విప్పుతుంది. ఇటువంటి వినాశాలు ఇక్కడితో ఆగవు. ఇంకా అనేక రంగాలమీద తమ ప్రభావాన్ని చూపిస్తాయి. ఆర్థిక, రాజకీయ, ఆరోగ్య, పర్యావరణ రంగాల మీద తమ ప్రభావాల్ని అతి తీవ్రంగా చూపిస్తాయి. ఇటువంటి విపత్తులు తెచ్చిపెట్టే నష్టాలు సామాజి కాభివృద్ధికై వెచ్చించే నిధులను వెనకపడేట్టు చేస్తాయి. పేదరికము, ఆకలి వగైరాలను నిర్మూలించే కార్యక్రమాలను మందగించేట్టు చేస్తాయి. విద్య, వైద్య రంగాల మీద వెచ్చించవలసిన నిధులు తగ్గుతాయి. పక్కా గృహాల లభ్యతే పేదవారికి గగనమౌతుంది. రక్షిత మంచినీటి సరఫరా మృగ్యమౌతుంది. పారిశుధ్య కార్యక్రమాలు కొరవడతాయి. పర్యావరణ పరిరక్షణ కష్టతర మౌతుంది. ప్రజల ఆదాయాల పెంపుదలకీ, ఉద్యోగ ఉపాధి కల్పనకీ ద్వారాలు మూసుకుపోతాయి. సాముదాయిక సామాజిక పెట్టుబడులు తగ్గుతాయి. ఈ అభివృద్ధిలో ఇటు సానుకూల, అటు వ్యతిరేక దశలు గూడా ఉంటాయి.

అభివృద్ధి అనేది కొన్ని విపత్తులను అధిగమించడానికి ఉపయోగపడు తుంది. అదే సమయాన ఒక్కొక్కప్పుడు వినాశనానికి గూడా దారితీస్తుంది. ఈ క్రింది వివరణని చూడండి.




పైన ఇచ్చిన సారూప్యాలు ఇచ్చే వివరణ ఏమిటంటే విపత్తులు ఒక్కోసారి నష్టాల్ని కలుగజేస్తాయి. ఒక్కోసారి కొత్త ప్రగతికి బాటలు వేస్తాయి. కొత్త ఆలోచనలకు తావిస్తాయి. కొత్త అవకాశాలని అందిస్తాయి. సానుకూల దశలో ఇది జరిగినప్పుడు అభివృద్ధి ప్రేరకాలు చక్కగా పనిచేస్తాయి. విపత్తుల వల్ల కలిగిన నష్టాలను లాభాలుగా మార్చుకునే దిశగా ప్రయత్నాలు జరుగుతాయి. ఇక్కడ మానవ మేధ మరింత పదునెక్కుతుంది. వృద్ధి కొత్త పుంతలు తొక్కుతుంది. విపత్తు తాలూకు హాని ప్రభావం ఆ రకంగా తగ్గించబడుతుంది. ఉదాహరణకు, కాలిఫోర్నియా, జపాన్ ఇలాగే అనేక దేశాలూ, మనదేశంలో గుజరాత్‌లో సంభవించిన భూకంపం కన్నా పెద్ద ఎత్తున ఎదుర్కొన్నప్పుడు అక్కడ ప్రాణనష్టం, ఆస్తినష్టం గుజరాత్ జరిగిన నష్టం కన్నా తక్కువ జరిగింది. విదేశాల్లో పదిమంది కన్నా ఎక్కువ భూకంపంలో చనిపోలేదు. ఆయా దేశాల్లో జన జీవనస్థితగతులను నిర్దేశించే మౌలిక వనరులకు ఎట్టి నష్టమూ వాటిల్లలేదు. వాటి సేవలు అవి నిరంతరయాంగా అందిస్తూనే ఉన్నాయి.

ఇంకొక కోణం నించి చూస్తే, ఒక భయంకర విపత్తు సంభవించిం దంటే, అది అంతవరకూ సాధించిన అభివృద్ధిని తుడిచిపెట్టి పారేస్తుంది. ఉదాహరణకి ఒరిస్సాలో తుఫాను, బీహార్ వరదలు 2004, 2007, 2009, గుజరాత్ భూకంపం, మయన్మార్ తుఫాను 2008 వంటి వాటిని పేర్కొనవచ్చు. విపత్తులు సంభవించాక నష్టనివారణకు పటిష్టమైన చర్యలు తీసుకున్న పక్షంలో, ప్రమాదాన్ని తక్కువ స్థాయిలోనే ఎదుర్కోవడం సంభవిస్తుంది. పునర్నిర్మాణ కార్యక్రమాల ద్వారా ఆ మేరకు అభివృద్ధి గూడా ఎక్కువ జరుగుతుంది. దీనికి ఉదాహరణగా గుజరాత్ భూకంపాన్ని పేర్కొనవచ్చు. అత పెద్ద భూకంపం తర్వాత జరిగిన పునర్నిర్మాణ కార్యక్రమాలు అత్యున్నత ప్రమాణాలు కలిగినవిగా అందరి మన్ననలనూ పొందాయి.

విపత్తులు సాధారణంగా సంభవించే సున్నితమైన ప్రదేశాలు కొన్ని ఉంటాయి. అక్కడ సహాయ, పునరావాస, పునర్నిర్మాణ కార్యక్రమాలు నిర్వహించే సంస్థలు బహుశా ఈ విపత్తుల ఆశంక గురించి అంత పెద్దగా పట్టించుకున్నట్లు కనపడదు. భారతదేశం అతి విశాలమైనది. ఇక్కడ ఒక్కొక్క ప్రదేశంలో ఒక్కొక్క రకమైన ప్రళయం సంభవించే అవకాశముంది.

ఆయా రాష్ట్రాలు అయితే ఒకే సమయంలో అనేక విపత్తుల నెదుర్కోవడం లేదా వివిధ ప్రాంతాలు వివిధ సమయాల్లో విపత్తుల పాలవడం సంభవిస్తూం టుంది. ఒకే సమయంలో ఒకసారి రాజస్థాన్‌లో ఇటు కరవు, అటు ఆకస్మికంగా బర్మేర్ వరదలూ సంభవించాయి. మహారాష్ట్రలో ఒకే సమయాన సంభవించిన కరవు, బొంబాయి వరదలు గూడా దీనికి ఉదాహరణే. వివిధ సమయాల్లో సంభవించే విపత్తులు గురించి చెప్పుకోవాలంటే గుజరాత్‌లో సంభవించిన తుఫాను, కరవులను ఉదాహరణగా చెప్పుకోవచ్చు. భారతదేశానికున్న వైశాల్యం కొద్దీ అది ఒకే సమయాన వివిధ ప్రాంతాలలో అనేక విపత్తులను ఎదుర్కొన వలసి వస్తూంటుంది. ఉదాహరణకి 2004 సునామీ, 2005లో కాశ్మీరులో భూకంపం, 2005లో ఆంధ్రప్రదేశ్, రాజస్థాన్, కర్ణాటక వగైరా రాష్ట్రాలలో ఒకేసారి కరవు వంటివి. ప్రపంచ బ్యాంక్ ఆర్థిక సర్వే ప్రకారం భారతదేశం ఈ విపత్తుల కారణంగా 2% రేటు చొప్పున జిడిపి ని నేరుగా నష్టపోతోంది. ఈ నష్టాల లెక్కల్లో పరోక్ష లేక తదనంతర నష్టాలను చేర్చలేదు. ఇతర ఆసియా దేశాల్లో అయితే ఇది 12%.

ఇక్కడ జవాబు వెతకాల్సిన ప్రశ్న ఏమిటంటే భారతదేశం ఇన్ని విపత్తులను ఎదుర్కునే విపత్కర పరిస్థితుల్లో ఉన్నా అభివృద్ధి విషయంలో మౌలిక వనరుల కల్పన వైపు ఎందుకు పటిష్టంగా అడుగులు వెయ్యడం లేదు. విపత్తులు తరచూ సంభవించే ప్రాంతాలు తెలిసినా వాటి పటిష్టత, భద్రత, వికాసాల పట్ల శ్రద్ధ ఎందుకు చూపట్లేదు. ఆయా ప్రాంతాల్లో అభివృద్ధి అనేది ఎక్కడ వేసిన గొంగళీ సామెతలాగా ఎందుకుంటోంది? ఇది ముందుచూపు లేకపోవడమా, వాస్తవ దృష్టి లేకపోవడమా లేక ఈ సరిదిద్దుడు కార్యక్రమాలకయ్యే ఖర్చు భరించ రానంత ఉండడమా? లేక అప్పటికప్పుడు తాత్కాలిక పంపిణీ కార్యక్రమాలతో రాజకీయ పరిష్కారం వైపు వెళ్ళడమా? లేక శాశ్వత ప్రాతిపదికన రాజకీయ లబ్ధి మానుకుని పునరావాస నిర్మాణాల్లోని నిధులను తాత్కాలిక ప్రయోజనాలకు వాడకుండా పూర్తిగా ఆ నిధులను శాశ్వత ప్రాతిపదికన పునర్నిర్మాణ కార్య క్రమాలకు వినియోగించడమా? శాశ్వత ప్రాతిపదికన ఏ నివారణ కార్యక్రమాలు చేపట్టినా అది దేశానికీ, ప్రజలకీ శాశ్వత సుఖశాంతులనిస్తాయి కదా! ఇది ఆలోచించాల్సిన విషయం.

## పేదరికం

ప్రపంచ విపత్తుల నివేదిక 2001 సూచించేదేమిటంటే ఆర్థికంగా అంతగా అభివృద్ధి చెందని దేశాల్లో ఎక్కువగా అనగా దాదాపు 97% పేదరికం తాండవించే ప్రదేశాల్లోనే ఈ విలయాలూ, ప్రళయాలూ సంభవిస్తున్నాయి. పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన ప్రాంతాల్లో, దేశాల్లో సంభవించే విపత్తులు కేవలం 2%గానే నమోదు అవుతున్నాయి. భారతదేశంలో అభివృద్ధి చెందని ప్రాంతాల్లోనే విపత్తుల ఆశంక ఎక్కువగా ఉండి, వాటి నివారణావకాశాలు తక్కువగా ఉంటున్నాయి. బీహార్, అస్సాం, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్, ఒరిస్సా, ఈశాన్య రాష్ట్రాలు, ఉత్తరాంచల్, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాలు ప్రకృతి వైపరీత్యాలకు తరచూ లోనయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఈ విపత్తులు వరదల రూపంలోనో, తుఫాను, భూకంపం, కరవు రూపంలోనో ఏ రకంగానైనా ఉండవచ్చు. ఆయా రాష్ట్రాలకు ఈ వైపరీత్యాల నెదుర్కొనే ఆయుధం కేంద్ర ప్రభుత్వమిచ్చే సహాయక నిధులు మాత్రమే. కెలామిటీ రిలీఫ్ ఫండ్, నేషనల్ కెలామిటీ కంటింజెన్సీ ఫండ్, ప్రధాని సహాయక నిధి, విరాళాలూ, గ్రాంట్స్, ఋణాలు వగైరాలన్నీ ఈ కోవలోకే వస్తాయి. ఈ సహాయక నిధులతో మౌలిక వసతుల కల్పన, గృహాల పునర్నిర్మాణాలూ సాధించవచ్చు గానీ, ప్రజల ధన రూప, ఆర్థిక సమస్యలను మాత్రం సాధించడం లేక అధిగమించడం కుదరదు. ప్రకృతి వైపరీత్యాలు పేదరికాన్ని మరింత పెంచుకుంటూ పోతాయి. ప్రజాభివృద్ధి పథకాలకూ, సౌకర్యాల కల్పనకూ ఆటంకాలుగా నిలిచి ఆ కార్యక్రమాల వేగాన్నీ, పురోభివృద్ధినీ మంద గింపజేస్తాయి. పేదరికంలో ఉండి అభివృద్ధి పథంలో పయనించే రాష్ట్రాలు విపత్తులు సంభవించాక వాటి నుండి బయటపడడానికి బహుముఖాలుగా కృషి చేయాల్సి వస్తుంది. మళ్లీ మౌలిక వసతుల కల్పనలూ, ఆర్థికపరమైన నష్టాలూ, విపత్తులు సంభవించే ముందు వాటి నివారణా చర్యలు, లేక వాటి ప్రభావాన్ని తగ్గించే చర్యలు చేపట్టాలి. విపత్తులు సంభవించాక ఆ నష్టాల్ని పూడ్చుకునే లేక సరిదిద్దుకునే ప్రయత్నాలు చేపట్టాలి. దీనికొక పటిష్టమైన యంత్రాంగం చాలా అవసరం. కాబట్టి మనం డిఆర్ఆర్ ద్వారా అవసరాల్ని బట్టి రకరకాల విధివిధానాలని రూపొందించుకోవాలి. అన్ని విభాగాలనూ, యంత్రాంగాలనూ కలుపుకొంటూపోయి అభివృద్ధే లక్ష్యంగా కృషి చేయాలి.

## అభివృద్ధి ప్రణాళిక విషయమే ముఖ్య లక్ష్యంగా డిఆర్ఆర్

విపత్తుల వల్ల తక్కువ నష్టం జరిగేట్టు చూస్కోవడమన్నది జాతీయస్థాయి నుంచీ, స్థానీయ స్థాయి వరకూ అన్ని రంగాలనూ, విభాగాలనూ కలుపుకుపోయే ప్రక్రియ. కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన ప్రణాళికా రచయితల దగ్గర్నుంచీ, రాష్ట్ర, పంచాయతీ, స్థానిక యంత్రాంగాలకి చెందిన అధికారులందరూ ఒకే మాటగా ముందుకు సాగితేనే ఈ యజ్ఞం సత్ఫలితాలనిస్తుంది. ఈ ఒకేతాటి మీది నడక విషయంలో అందరినీ, అన్ని విభాగాలనీ కలుపుకుపోవడానికి హెచ్ఎఫ్ఎ 2005 ఎంతో ముఖ్య భూమికను పోషిస్తుంది. కానీ ఈ ఏకతాటి సూత్రం పెనుసవాళ్ళతో కూడుకున్నదే!

ప్రభుత్వంలోని అన్ని విభాగాలనీ ఏకీకృతపరిచే ఈ ప్రక్రియ విధాన రచన నుండీ కార్యక్రమాల అమలువరకూ అన్ని స్థాయిల్లోనూ, ముఖ్యంగా దెబ్బతినే ఆశంక ఉన్న ప్రాంతాల్లో ఒకే నిబద్ధతతో జరగాలి. ఈ ప్రక్రియని ఇలా అమలు చేయడం మూలాన ముందస్తు నష్టనివారణ చర్యలకు అవకాశమేర్పడుతుంది. దానిలో ఉన్న సమస్యలూ, లోటుపాట్లూ తెలుస్తాయి, అనుభవం పెరుగుతుంది. నివారణ చర్యలు.అమలులోని మూలతత్వం బోధపడుతుంది. తద్వారా మరింత ముందుకు సాగడానికి అవకాశమేర్పడుతుంది. అమలు తీరు, సమన్వయం, మూల్యాంకనాల పట్ల అవగాహన ఏర్పడుతుంది. అభివృద్ధి కార్యక్రమాల రచనలో, అమలులో నష్టనివారణ చర్యలను ఊహించుకుని వాటిని వీటిలో జతచేయకపోతే, పునర్నిర్మాణావకాశాలను కూడా జోడించకపోతే, పెద్ద పెద్ద జాతీయ విపత్తులు, లేక అంతర్జాతీయ విపత్తులు సంభవించినపుడు తక్కువ నష్టంతో బయటపడడం కష్టమౌతుంది. అప్పుడు ఎంత పెద్ద దేశాలైనా ప్రమాదాల బారినపడటం, తప్పించుకోవడం, ఎదుర్కొనే విపత్తునే మళ్ళీ ఎదుర్కొని మళ్ళీ మళ్ళీ దానినుండే బయటపడడానికి పెట్టిన దానిమీదే మళ్ళీ ఖర్చుపెట్టడం, తద్వారా దేశాభివృద్ధీ, ప్రజా సౌకర్యాల అభివృద్ధీ రెండూ సాధించలేకపోవడం జరుగుతుంది. ఒక నిలకడయైన సుఖవంతమైన ప్రజా సంక్షేమాభివృద్ధి జరగనప్పుడు అభివృద్ధి అన్నమాటకే అర్థం లేదు కదా!

డిఆర్ఆర్‌కి సంబంధించిన పథకాలు ఈ రకంగా ఉండవచ్చు. విపత్తుకు ముందు, విపత్తులో త్వరితగతిన కోలుకోవడం, అభివృద్ధి ఈ క్రమం పెద్దా, చిన్నా అనే భేదం లేకుండా అన్ని దేశాలకీ వర్తిస్తుంది. కాబట్టి అన్ని దేశాలూ ఈ డిఆర్ఆర్‌ని అమలు చేయాలి. డిఆర్ఆర్ చేసే క్రమబద్ధీకరణ ప్రమాణాల మెరుగుదలకి చాలా ముఖ్యం అది అటు అభివృద్ధి కార్యక్రమాలకీ మంచిదే, ఇటు విపత్తుల పట్ల స్పందించే పథకాల అమలు తీరుకూ మంచిదే.

రాష్ట్ర స్థాయినించీ, జాతీయ స్థాయి వరకూ అందరి సహకారంతో డిఆర్ఆర్‌ను అతి క్రింది స్థాయి నుంచీ ప్రారంభించి అమలుపరచవచ్చు. దాని అమలు తీరు ఎలా ఉండాలంటే క్రిందిస్థాయి నుండి మొదలుపెట్టి పై స్థాయికి వెళ్ళి, మళ్ళీ పై నుంచి క్రింది స్థాయి వరకూ సవరించుకుంటూ రావాలి. దీనికోసం జాతీయ స్థాయిలోనూ, రాష్ట్రీయ స్థాయిలోనూ ఒక నిర్దుష్టమైన ప్రణాళిక

ఉండాలి. తగు చట్టాలు చేయాలి. సంస్థలను స్థాపించాలి. వాటిని పటిష్ట పరచాలి. డిఆర్ఆర్ యొక్క ముఖ్య దృష్టి ఎప్పుడూ తీసుకున్న రంగం మీద మొక్కవోని కార్యదీక్షపై ఉండాలి.

ప్రభుత్వ శాఖలూ, లబ్ధిదారులూ కలిసి కార్యక్రమాల అమలులో పాలు పంచుకుంటేనే డిఆర్ఆర్ ఆశయాలు నెరవేరుతాయి. డిఆర్ఆర్ పథకాలను నిర్మాణాత్మకంగా అమలుపరచాలంటే ఒక దృఢమైన రాజకీయ సంకల్పం అవసరం. డిఆర్ఆర్ని ప్రకృతిలోనూ పర్యావరణంలోనూ ఒక భాగంగా చూడాలి. వాతావరణ మార్పులలోనూ, అభివృద్ధిలోనూ ఒక భాగంగా చూడాలి. జరిగిన, సంభవించిన విపత్తులను అధ్యయనం చేసి వాటిలో ఇమిడి ఉన్న హాని, నష్టాలపై ఒక అంచనాకు రావాలి. మారే వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా కలగబోయే విపత్తులను అంచనా వేయగలిగి ఉండాలి. తదనుగుణంగా వాటి తీవ్రత తగ్గించే పథకాలను రూపొందించి కార్యాచరణకై గట్టి కృషి చేయాలి. నిధుల తీవ్రత, కార్యతీవ్రత తగ్గించే పథకాలు నిర్మాణాత్మక, తదితర కార్యక్రమాల అమలుకు అనుగుణంగా ఉండాలి. తద్వారా ప్రభుత్వ నిధులను పొదుపుగా వాడడం జరుగుతుంది. ఆర్థికపరమైన ఏ ఇతర ఒత్తిడులనించీ ఆటంకాలు తొలగడం సంభవిస్తుంది. ఇది విపత్తుకు ముందూ, తర్వాతా గూడా పనికి వచ్చే జాగ్రత్తలు. ఈ ఆలోచనలనూ, అమలుతీరునూ ఏకీకృతం చేసి క్రమబద్ధీకరించుకోగలిగితే ఒక నిలకడ గల అభివృద్ధిని సాధించవచ్చు. ప్రజల దైన్యాన్ని చాలావరకూ తగ్గించవచ్చు.

## ముగింపు

జాతీయస్థాయిలో విపత్తుల ప్రభావాన్ని తగ్గిస్తూ, నిలకడ గల అభివృద్ధిని సాధించడమనేది ఒక పెను సవాల్. ఒక విపత్తు సంభవించాక దాని వల్ల నష్టం, చేసిన హాని అంచనాలోకి చొచ్చుకువెళ్ళడం చాలా ముఖ్యం. అందుకోసం ఆ విపత్తు యొక్క తీరుతెన్నులూ, రూపురేఖలూ బాగా అవగతమవాలి. అభివృద్ధి పథక రచనలోనే విపత్తుల ఆశంకనీ, అవి కలుగజేసే హానినీ, నష్టాలనీ ముందుగానే అంచనా వేసి వాటినధిగమించడానికీ, సరిదిద్దుకోవడానికీ అవసరమయ్యే నిధులను కూడా అంచనా వేసి కేటాయింపులు జరపాలి. విపత్తుల తీవ్రత తగ్గింపులే లక్ష్యంగా ఏ అభివృద్ధి పథక రచనలోనైనా ముందుకు సాగాలి. అది పథకరచనకు కేంద్రబిందువు అయి ప్రగతితో సమానంగా ముందుకు సాగాలి. భూ వినియోగం, ప్రణాళికాబద్ధమైన అభివృద్ధి, వాతావరణ, వ్యవసాయిక ప్రణాళికలూ, విద్య, ఇవే కాక ప్రజలకు సంబంధించిన ఇంకే సంక్షేమ చర్యలైనా దీని కిందకి వస్తాయి, తేవాలి. అప్పుడే విపత్తు నివారణ యాజమాన్యానికి ఒక అర్థం, పరమార్థం ఉంటుంది. దీనికోసం కేంద్ర స్థాయిలో కాక స్థానిక స్థాయిలో ప్రయత్నాలు ప్రారంభించి అమలుచేసి తత్సంబంధిత లబ్దిదారులందరినీ భాగస్వాముల్ని చేయాలి. అందుకు అనుగుణంగా చట్టాలు చేయాలి. పనితీరు పరిధులను నిర్వచించాలి. ఉదాహరణకు, గృహనిర్మాణ విధానాలూ, శిక్షణావసరాలూ, మౌలికమైన బాధ్యతలూ ఇవన్నీ విపత్తుల ఆశంక యాజ మాన్యంలో పాలు పంచుకునేవారికి మార్గదర్శకాలు కావాలి. కానీ చట్టం ఒకటే ప్రజల్ని కర్తవ్యం వైపు మరల్చదు. ఈ కార్యక్రమాలని సమన్వయపరిచే యంత్రాంగం కూడా అవసరం.

*(పిశుపాటి ఉమామహేశ్వరమ్)*

## విపత్తు తరువాతి పరిస్థితి...

*10వ పేజీ తరువాయి*

తాపీ పనివారికి సురక్షితమైన టెక్నాలజీ పైన, వివిధ రకాల గృహ నిర్మాణ సామగ్రి వాడకంలోను శిక్షణకోసం శిక్షణాకేంద్రాలు ఏర్పాటు చేయాలి. సాంకేతిక మార్గదర్శకాలు, పర్యవేక్షణ కూడా చాలాముఖ్యం. సురక్షితమైన నిర్మాణపద్ధతులకు, ఇళ్ళ యజమానులు, తాపీ పనివారి సహాయానికి ఒక శ్రేణి ఇంజనీర్లకు కూడా శిక్షణనివ్వడం అవసరం. ఈ శిక్షణలో పౌరసమాజం, కార్పొరేటు సంస్థలు పెట్టుబడులు పెట్టాలి. నిర్మాణసామగ్రి తేలికలో అందుబాటుకు నిర్మాణ సామగ్రి బ్యాంకులు నెలకొల్పాలి. స్వయంసహాయ బృందాల ద్వారా ఈ పని జరగాలి. డిమాండుతో సామగ్రి ధరలు విపరీతంగా పెరగకుండా ప్రభుత్వ జోక్యంతో ధరలను నియంత్రించాలి. కాగా ఇటువంటి విపత్తు సందర్భాలలోనే గాక, మామూలు సమయాలలో కూడా గృహనిర్మాణంలో సొంతదారుల భాగస్వామ్యం ఆవశ్యకం. నిర్ణయాలు చేయటంలో కూడా వీరిని భాగస్వాములను చేయాలి. ప్రభుత్వము, పౌర సమాజం, కార్పొరేటు సంస్థలు ఇందుకు పూనుకోవాలి. పునర్నిర్మాణంలో ఎదురుకాగల అన్ని సమస్యల పరిష్కారానికి స్థానిక సంస్థల తోడ్పాటుతో మానవతా దృక్పథంతో పనిచేసే యంత్రాంగాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేయాలి. మొత్తం మీద పెనువిపత్తులు సంభవించిన సందర్భాలలో పునర్నిర్మాణానికి అంతా కలసికట్టుగా ప్రణాళికాబద్ధంగా పనిచేసి బాధితులకు మెరుగైన సురక్షితమైన ఇళ్ళు నిర్మించి ఇవ్వాలి.

*(పి. పార్వతీప్రసాద్)*

## భూకంపాలకు కూలని...

*14వ పేజీ తరువాయి*

ఉంటుంది. అంతే తప్ప ఇది అప్పటికప్పుడు తక్షణం పరిష్కరించే సమస్య కాదు. ఎన్నో శతాబ్దాలుగా ప్రజలు అనుసరిస్తున్న పద్ధతులను ఒక్క సంవత్సరంలో మార్చడం ఎవరికీ సాధ్యం కాదు.

"కుష్టువ్యాధి సాధారణ వ్యాధి కాదు. కాని మానవులకు ఈ వ్యాధి సోకకుండా ఉండడానికి వైద్యరంగం విశేషమైన కృషి చేస్తూ ఈ వ్యాధిని నిర్మూలించడానికి ప్రయత్నిస్తున్నది. అదే విధంగా భూకంపాలు ప్రతిరోజూ రావు. అతి పెద్ద భూకంపాలు ప్రపంచంలో ఏదో ఒక ప్రాంతంలో ఏదో ఒకసారి మాత్రమే వస్తాయి. కాని ఎప్పుడు భూకంపం వచ్చినా ప్రజల ప్రాణాలు, ఆస్తులు కాపాడడానికి తగిన ముందు జాగ్రత్తలు తీసుకోవాలి. ఈ సమస్యను విశాల దృక్పథంతో గమనించకపోతే, భవిష్యత్తులో ప్రజలు క్షమించరు.

క్వెట్టా ప్రాంతంలో ఇటీవల పటిష్టమైన భవన నిర్మాణ నిబంధనలను అమలులోనికి తెచ్చారు. దీనికి అనుగుణంగా భవనాల పునర్నిర్మాణం చేపడుతున్నారు. ఈ ప్రాంతం మిలిటరీ పరిధిలో ఉండటం వలన ఇది తేలికగా సాధ్యపడింది. దీనిని ఉదాహరణగా తీసుకొని దేశవ్యాప్తంగా అమలు చేయాలి. అతి త్వరలోనే ఉత్తర భారతదేశంలోని అన్ని ప్రాంతాలు ఈ నిబంధనలను అమలు చేస్తాయని ఆశిస్తాము".

*(ఎన్. రాజరాజేశ్వరి)*

# స్వైన్ ఫ్లూ - మానవాళి ముందున్న మహమ్మారి

స్వైన్ ఫ్లూ అనేది ఇన్‌ఫ్లూయాంజా 'ఎ' వైరస్ వలన పందులలో వ్యాపించే శ్వాస సంబంధిత వ్యాధి. సాధారణంగా పందులు ఈ వ్యాధి బారిన పడుతూనే ఉంటాయి. అయితే మనుష్యులకు సోకడం అరుదనే చెప్పుకోవాలి. అది కూడా జంతువుల దగ్గర పనిచేసే, వాటితో సన్నిహితంగా మెలిగే వారికే సోకుతుంటాయి. ఒక మనిషి నుండి ఇంకొక మనిషికి సంక్రమించడం కూడా అరుదు. కాని ఈ స్వైన్‌ఫ్లూ మనుషుల నుండి మనుషులకు కూడా సంక్రమిస్తుంది. ఎలా వ్యాపిస్తుందనేది ఖచ్చితంగా తెలియనప్పటికీ సాధారణ ఫ్లూ వైరస్‌లాగానే ఇదికూడా వ్యాధిగ్రస్తులు దగ్గటం, తుమ్మటం ద్వారా, వారి ముక్కు నోటి స్రావాల ద్వారా వ్యాపిస్తుంది అని భావిస్తున్నారు. అంతేకానీ, పంది మాంసం తినటం ద్వారా ఈ వ్యాధి వ్యాప్తి చెందదు. ప్రస్తుత సార్స్, బర్డ్ ఫ్లూ, ఈ స్వైన్ ఫ్లూ వంటి వైరస్‌లు ప్రాథమికంగా పక్షుల్లో, జంతువుల్లో ఉండే వైరస్‌లు. వీటిని ఎదుర్కొనే శక్తి, అలవాటు మన శరీరానికి లేదు. జంతువుల్లో ఉండే ఈ ఫ్లూ రకం వైరస్‌లు శరీరంలో చేరుతూనే ఒక్కసారిగా విజృంభించి ప్రాణాల మీదికి తెస్తాయి. మన శరీరానికి కోలుకునేంత సమయాన్ని ఇవ్వవు. విమాన ప్రయాణాలు సర్వసాధారణమైన ప్రస్తుత రోజుల్లో ఇది శరవేగంగా ప్రపంచం అంతా వ్యాప్తి చెందే అవకాశాలు ఎక్కువ కాబట్టి, అందుకు తగినట్లుగా సరసన్నద్ధం కావటం ఎంతైనా అవసరం.


కె. రాజేశ్వరరావు
ఫ్రీలాన్స్ రచయిత


సీజన్ మారినప్పుడల్లా సాధారణ ఫ్లూ జ్వరాలు రావడం సర్వసాధారణం. ఈ జ్వరాలకు ఇన్‌ఫ్లూయంజా రకం వైరస్‌లే కారణం. వాతావరణంలో వచ్చే మార్పులకు ఇన్‌ఫ్లూయంజా వైరస్ ఒక్కసారిగా విజృంభించి వ్యాపిస్తుంది. అయితే ఇవి ఏమంత ప్రమాదకరమైనవి కావు. దీనిపై మానవ శరీరం అతి త్వరగా పైచేయి సాధిస్తుంది. ఈ జ్వరాలు ప్రపంచవ్యాప్తంగా సర్వసాధారణం, యివి చలికాలంలో మాత్రమే వ్యాప్తి చెందుతాయి. ఇవి రోజువారీ జీవితానికి కొంత ఇబ్బందిని మాత్రమే కలిగిస్తాయి. కానీ ప్రాణాంతకంగా మాత్రం మారవు. ఈ జ్వరాల వలన కొన్ని మరణాలు సంభవిస్తున్నప్పటికీ, ఆ వైరస్‌లను నిరోధించే వ్యాక్సిన్‌లు అందుబాటులో ఉండటం వలన వాటి వలన జరిగే నష్టాన్ని గణనీయంగా తగ్గించగలుగుతున్నాం. సాధారణంగా ఫ్లూ జ్వరాలు వృద్ధులకు, పసిపిల్లలకు మాత్రమే ప్రాణాంతకంగా పరిణమిస్తాయి. కానీ ఈ స్వైన్ ఫ్లూ యువతను, మధ్య వయస్కుల వారిని కూడా మృత్యువాత పడేలా చేస్తుంది, కాబట్టి దీని వలన జరిగే ప్రమాదాన్ని, నష్టాన్ని సరిగా అంచనా వేసి ప్రపంచ దేశాలన్ని సన్నద్ధం కావల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ స్వైన్ ఫ్లూ లాగానే బర్డ్‌ఫ్లూ కూడా ఒకటి, అయితే ఇది పక్షులలో వ్యాపించే వ్యాధి. ఏది ఏమైనప్పటికీ స్వైన్‌ఫ్లూ లాగానే ఇది కూడా పక్షుల నుండి మనుష్యులకు వ్యాపించే అవకాశం ఉన్నది. ఈ స్వైన్‌ఫ్లూ కానీ, బర్డ్‌ఫ్లూ కానీ మనుష్యులకు వ్యాపించినట్లయితే అది తీవ్రరూపం దాలుస్తుందని ప్రస్తుత, గత అనుభవాలను బట్టి చూస్తే తెలుస్తుంది.



ఈ స్వైన్‌ఫ్లూ కు కారణమైన వైరస్‌ను ఓ 'ఎ' రకపు హెచ్1 ఎన్1 ఇన్‌ఫ్లూయంజా వైరస్‌గా గుర్తించారు. ఈ వైరస్ ప్రపంచ వ్యాప్త మహమ్మారిని సృష్టించడం, ఇది కొత్త రకం వైరస్ కావటం, ఇంతవరకు దీనిని అరికట్టడానికి ఏ వ్యాక్సిన్ లేకపోవటం అనేది ఆందోళన కలిగించే విషయం. అందుచేత ఇటువంటి వైరస్‌లను ఎదుర్కోవటానికి నిత్యం సమాయత్తమై ఉండటం, ఇటువంటివి బయటపడినప్పుడు, అవి వ్యాప్తి చెందకుండా తగు జాగ్రత్తలు తీసుకోవడం, తత్సంబంధ సమచారాన్ని ప్రజలకు నిరంతరం అందేలా చూడటం అనేది చాలా ముఖ్యం. ఇలాంటి వైరస్ 1918లో వెలుగు చూసింది అని చరిత్ర రికార్డులు చెపుతున్నాయి. అప్పట్లో యూరప్‌లో భారీ జననష్టం జరిగిదని కూడా తెలుస్తుంది. అప్పుడు సుమారు 2 కోట్లమంది ప్రజలు ఈ రకం వ్యాధి వలన మరణించినట్లుగా రికార్డులను పరిశీలిస్తే తెలుస్తుంది.

ప్రస్తుతం మానవాళి ఎదుర్కొంటున్న స్వైన్‌ఫ్లూ మహమ్మారి, ఎల్లలు దాటి ప్రపంచాన్ని చుట్టుపెడుతుంది. 2009 మార్చి 18న మెక్సికోలో బయటపడిన ఈ వ్యాధి ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా 30కి పైగా దేశాల్లో వ్యాప్తి చెందినట్లు ఐక్యరాజ్య సమితి అనుబంధ సంస్థ ప్రపంచ ఆరోగ్య సంస్థ మే 15వ తారీకున విడుదల చేసిన ఒక ప్రకటన ద్వారా తెలుస్తుంది. ఈ తేది నాటికి మొత్తం అనేక వేల రోగ నిర్ధారణలు, 80కి పైగా మరణాలు సంభవించినట్లు తెలుస్తుంది. వీటిలో అత్యధిక రోగ నిర్ధారణలు మెక్సికో, అమెరికా సంయుక్త రాష్ట్రాలు, కెనడాలలో జరిగినట్లు ఈ ప్రకటనలో పేర్కొన్నారు. అయితే అత్యధిక మరణాలు (50కి పైగా) మాత్రం మొదట ఈ వ్యాధి బయట పడిన మెక్సికోలో సంభవించినట్లు తెలుస్తుంది. వ్యాధి బయటపడిన నాటినుండి గమనిస్తే వ్యాధికి గురిఅయ్యేవారి సంఖ్య రోజు రోజుకు పెరుగుతూ ఆందోళన కలిగిస్తుంది. అదే విధంగా వ్యాధి నిర్ధారణలు నమోదు అవుతున్న దేశాల సంఖ్య కూడా పెరుగుతుంది. కానీ ప్రస్తుతానికి మెక్సికో, అమెరికా, కెనడా మరియు కోస్టారికాలో మాత్రే మరణాలు సంభవించాయని, ఈ వ్యాధి బయటపడిన ఇతర 30కి పైగా దేశాలలో వివిధ సంఖ్యల్లో రోగ నిర్ధారణలు జరిగినప్పటికీ మరణాలు ఏవీ సంభవించలేదు అని తెలుస్తుంది. ఇప్పటికి వ్యాధి తీవ్రతను గమనించిన ప్రపంచ ఆరోగ్యసంస్థ ఐదవ ప్రమాద దశను జారీ చేసింది. ప్రమాద తీవ్రతను సూచించే ఆరుదశలలో, ఐదో దశను జారీ చేయడమనేది వ్యాధి తీవ్రతను తెలియజేస్తుంది. ఈ పరిస్థితిని బట్టి చూస్తే మార్చి నెలలో మెక్సికోలో బయటపడిన ఈ వ్యాధి నెమ్మదిగా బలపడి ప్రపంచవ్యాప్తంగా వ్యాపిస్తుందని

తెలుస్తుంది. అందుచేత ప్రపంచదేశాలన్నీ వ్యాధి తీవ్రతను అర్థం చేసుకొని అందుకు తగు జాగ్రత్తలు తీసుకొని ప్రజలను అప్రమత్తం చేయాలి.

**హెచ్1 ఎన్1 ఇన్‌ఫ్లూయంజా ఏ వైరస్ పుట్టుక, లక్షణాలు :** ఫ్లూ కారక వైరస్ లలో ఎ, బి, సి అని మూడు రకాలు ఉన్నాయి. వీటిలో కొన్ని పక్షుల్లో, కొన్ని జంతువుల్లో, కొన్ని మనుషుల్లో ఫ్లూ జ్వరాలను కలిగిస్తాయి. ఈ దశలలో ఒకదానితో ఒకటి కలవటం వలన కొత్త వైరస్‌ల పుట్టుక జరుగుతుంది. చాలా సార్లు ఈ కలయికని ఊహించటం కష్టం అవుతుంది మరియు ప్రస్తుత స్వైన్‌ఫ్లూ తరహా పరిస్థితులలో మాత్రం వీటి బలం ఎన్నో రెట్లు పెరుగుతుంది. అంతేకాక స్వైన్‌ఫ్లూ వైరస్‌లో మాత్రం పక్షుల్లో, పందుల్లో, మనుషుల్లో కనిపించే జన్యుపదార్థ ఛాయలన్నీ ఉన్నాయని గుర్తించబట్టి, దీనిని ఎదుర్కోవటం కష్టం అనేది వైద్యుల అభిప్రాయం. ఈ స్వైన్‌ఫ్లూ అనేది సాధారణంగా పందుల్లో ఫ్లూ జ్వరాన్ని తెచ్చిపెట్టే ఓ 'ఏ' రకం వైరస్ (హెచ్1 ఎన్1 ఇన్‌ఫ్లూయంజా ఏ) మాత్రమే. ఇది ఇప్పటివరకు మనుషుల్లో జ్వరాలు తెచ్చిపెట్టిన ఆధారాలు లేవు. కానీ ప్రస్తుతం ఈ వైరస్ పందుల నుండి మనుష్యులకు వ్యాపించడమే కాకుండా, మనుష్యుల నుండి ఇతర మనుష్యులకు వ్యాపించి ప్రపంచవ్యాప్త మహమ్మారికి కారణం అవుతుంది.

ఈ హెచ్1 ఎన్1 ఇన్ ఇన్‌ఫ్లుయంజా వైరస్ పందుల రకం (స్వైన్‌ఫ్లూ) వైరస్ అనేది పాక్షికంగా మాత్రమే వాస్తవం. దీనిలో పందులు, పక్షులు, మనుషులలో కనిపించే ఫ్లూ వైరస్‌లకు సంబంధించిన జన్యుఛాయలన్నీ కనపడ తాయి. సాధారణంగా ఏ జాతిలో ఉండే వైరస్ ఆ జాతి జీవులకే ఎక్కువగా సంక్రమిస్తూ ఉంటుంది. కానీ ఈ వైరస్ పందుల నుండి మనుషులకు సంక్రమించి ఆ తరువాత మనుషుల నుండి ఇతర మనుషులకు కూడా సంక్రమిస్తుంది. ఈ విషయం దగ్గరే ఈ వైరస్ స్వభావ సంక్లిష్టతను అర్థం చేసుకోవాల్సి ఉంటుంది.

ఈ ఎచ్1 ఎన్1 ఇన్‌ఫ్లూయంజా ఏ నిజానికి మూడు వైరస్‌ల మిశ్రమం. ఇందులో ఎవియన్ ఫ్లూ, హ్యూమన్ ఫ్లూ మరియు స్వైన్ ఫ్లూలు ఉంటాయి. అందువలన దీనిని నియంత్రించడం కష్టం అవుతుంది. ఇన్‌ఫ్లూయంజా (ఎచ్1 ఎన్1) వైరస్ అత్యంత సూక్ష్మంగా ఉంటుంది. అంటే సాధారణ బాక్టీరియా కంటే కొన్ని వేల రెట్లు చిన్నదిగా ఉంటుందన్న మాట. శరీరంలోకి ప్రవేశించగానే గొంతు, ముక్కు, ఊపిరితిత్తులకు సంబంధించిన కణాల్లో చేరిపోతుంది. ఆ తరువాత వాటి పనితీరుపై ప్రభావం చూపిస్తుంది. ఈ వైరస్ ఉన్న వ్యక్తి తుమ్మినా, దగ్గినా బాహ్య వాతావరణంలోకి ప్రవేశిస్తుంది. ఒక్కసారి బయటకు వచ్చిన తరువాత స్థల, కాల పరిస్థితులను బట్టి 12 గంటల దాకా ఈ వైరస్ బ్రతికే ఉంటుంది. లోపలికి వెళ్ళగానే కత్తుల్లాంటి నిర్మాణాల సహాయంతో కణాలను పట్టుకుని కుప్పలు తెప్పలుగా ఆర్ ఎన్ ఎను ఉత్పత్తి చేస్తుంది ఫలితంగా వేల వైరస్‌లు పుట్టుకొస్తాయి.

**వ్యాధి లక్షణాలు :** సాధారణ ఫ్లూ జ్వరం యొక్క లక్షణాలైన ముక్కు కారటం, దగ్గు, గొంతునొప్పి, తుమ్ములు, కళ్ళ వెంట నీళ్ళు, జ్వరం, ఒళ్ళు నొప్పులు, కండరాల మరియు కీళ్ళ నొప్పులు మరియు అలసట ఈ వ్యాధిగ్రస్తుల్లో కనబడతాయి. వీటికి తోడు కొంతమంది స్వైన్ ఫ్లూ బాధితుల్లో వాంతులు మరియు విరేచనాలు కూడా కనపడవచ్చు.

**ఇన్‌ఫ్లూయంజా వైరస్‌ల వ్యాప్తికి కారణాలు :** బర్డ్‌ఫ్లూ, సార్స్ మరియు ప్రస్తుత స్వైన్‌ఫ్లూ వంటి శ్వాస సంబంధిత వ్యాధులను కలుగుజేసే వైరస్‌లు, ఈ వ్యాధులను వ్యాప్తి చేయటానికి కల కారణాలను అన్వేషించటానికి విస్తృత పరిశోధనలు జరుగుతున్నాయి. వాతావరణ మార్పుల నుండి భూమి వేడెక్కడం వరకు కల అన్ని కారణాలను పరిశోధిస్తున్నారు. వివిధ ప్రాంతాల మరియు దేశాలకు సంబంధించిన వ్యక్తుల నిరంతర కలయికను ముఖ్యకారణంగా వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. ప్రయాణ సాధనాలు విపరీతంగా అందుబాటులోకి రావటం వలన ఒక దేశ ప్రజలు ఇంకొక దేశానికి అనేక కారణాలతో ప్రయాణం చేయటం వలన, ఆ వ్యక్తులు ఒకరితో ఒకరు సన్నిహితంగా మెలగటం వలన ఈ శ్వాస సంబంధిత వైరస్‌లు ఒకరి నుండి ఒకరికి సులభంగా వ్యాప్తి చెంది స్వైన్ ఫ్లూ వంటి మహమ్మారులకు కారణమవుతున్నాయని ఒక అభిప్రాయం. ఇవే కాక కొన్ని సాంకేతిక కారణాలను కూడా ఈ సందర్భంగా శాస్త్రజ్ఞులు ఉదహరిస్తున్నారు. ఈ విధమైన వైరస్‌లు కొన్ని దశాబ్దాలుగా ఉనికిలో ఉన్నప్పటికీ, వైద్య పరీక్షల కొరకు మరియు డి.ఎన్.ఎ. ను పరీక్షించటానికి అవసరమైన అత్యాధునిక యంత్ర పరికరాలు ప్రస్తుతం అందుబాటులో ఉండటం వలన ఈ వైరస్‌ల ఉనికి కనుక్కోగలుగుతున్నామని చెప్తున్నారు. అయితే ఈ వైరస్ భారతదేశంలో ఎప్పుడూ కనుగొనపడలేదు. దానికి కారణం మన దేశం వద్ద ఈ వైరస్‌ను గుర్తించటానికి అవసరమైన అత్యాధునిక యంత్ర సామగ్రి లేకపోవటం కూడా కారణం కావచ్చునని శాస్త్రజ్ఞులు పేర్కొంటున్నారు.

**వ్యాప్తి చెందే విధానం :** శ్వాస సంబంధిత వ్యాధులను కలుగజేసే ఈ వైరస్‌లు ఒక వ్యక్తి నుండి ఇంకొకరికి గాలి ద్వారా వ్యాప్తి చెందుతాయి. కానీ స్వైన్‌ఫ్లూ ను కలిగించే ఈ హెచ్1 ఎన్1 వైరస్‌లు కేవలం జంతువుల్లో (ఈ విషయంలో పందులు) మాత్రమే వ్యాప్తి చెందేవి. ఎప్పుడూ కూడా జంతువులతో సన్నిహితంగా మెదిలే వ్యక్తులకు కూడా ఈ వైరస్‌లు సంక్రమించిన దాఖలాలు లేవు. ఏది ఏమైనప్పటికీ ఈ వైరస్‌లలో జరిగిన కొన్ని మార్పుల కారణంగా, ప్రస్తుతం ఇవి జంతువుల నుండి మనుష్యులకు వ్యాపించే శక్తిని పొందటంతో పాటు, మానవ శరీరంలో బ్రతకగలిగే శక్తిని కూడా సంపాదించుకొని మరింత నష్టాన్ని కలుగజేస్తున్నాయి. అయితే ఈ వైరస్ మనిషి శరీరంలో 8 నుండి 10 రోజులు ఉంటేనే ఇతరులకు వ్యాప్తి చెందుతుంది. కానీ వ్యాధి లక్షణాలు కనిపించిన వెను వెంటనే వ్యక్తులు ఇతరులకు వ్యాధిని వ్యాప్తి చేయగలుగ సామర్థ్యాన్ని పొందుతారు. ఆ వ్యక్తులలో వ్యాధి లక్షణాలు కనపడిన 5 రోజుల వరకు ఈ సామర్థ్యం ఉంటుంది. అదే చిన్నపిల్లలలో ఈ సామర్థ్యం 7 రోజుల వరకు ఉంటుంది.

**వైరస్ ఒక వ్యక్తి నుండి ఇంకొక వ్యక్తికి సోకే క్రమాన్ని గమనించినట్లయితే :** వ్యాధి సోకిన వ్యక్తి తుమ్మినప్పుడు లేదా దగ్గినప్పుడు నోటి, ముక్కు తుంపర్ల ద్వారా వైరస్‌లు ఆ వ్యక్తి చేతుల మీద, ఆ ప్రదేశంలో ఉన్న వస్తువుల మీద పడటంతో పాటు గాలిలో కూడా వ్యాప్తి చెందుతాయి. వ్యాధి సోకని వ్యక్తులు ఆ గాలిని పీల్చినప్పుడు లేదా వ్యాధి సోకిన వారి చేతులను తాకినపుడు లేదా వైరస్ సోకిన వస్తువులను ముట్టుకున్నప్పుడు వైరస్ ఆ వ్యక్తులకు కూడా సోకుతుంది. అందుచేత ఈ వైరస్ వ్యాప్తిని అరికట్టడానికి, ప్రజలు దగ్గేటప్పుడు,

తుమ్మేటప్పుడు నోరు మరియు ముక్కులను మూసే విధంగా మూడు పొరల గుడ్డను (మాస్కు) ధరించాలి.

**చికిత్స :** సాధారణ ఫ్లూ జ్వరాల నివారణకు టీకాలు ఉన్నాయి కానీ ఈ స్వైన్ ఫ్లూ రాకుండా నిరోధించే టీకాలు ప్రస్తుతానికి లేవనే భావించాలి. ఈ వైరస్ సోకిన తరువాత సాధారణంగా ఆరోగ్యవంతులైతే వారం రెండు వారాల్లో కోలుకుంటారు. కానీ ఉబ్బసం, గుండె సంబంధ వ్యాధులు కలవారికి, చిన్నపిల్లలు, వృద్ధులు మరియు రోగనిరోధక శక్తి తక్కువ ఉన్నవాళ్ళకు సోకితే మాత్రం ప్రమాదంగా పరిణమించవచ్చు. వైరస్ సోకిన వ్యక్తి వైద్యుల సలహాతో వారం రోజుల పాటు సాధారణ ఫ్లూ జ్వరాలకు వాడే యాంటివైరల్ మాత్రలు రోజూ రెండు తీసుకుంటే వ్యాధి తీవ్రత తగ్గి ఉపశమనం కలుగుతుందని జాతీయ అంటువ్యాధుల సంస్థ ఒక ప్రకటనలో పేర్కొంది.

సాధారణ ఫ్లూ జ్వరాల మాదిరిగానే ఈ యాంటివైరల్ మాత్రలు వాడటం వలన వ్యాధి తీవ్రత తగ్గి, ఉపశమనం మాత్రమే కలుగుతుంది. అంతేకానీ, పూర్తిగా నయం అవటం అనేది ఉండదు. ఈ ఏ రకపు ఎచ్1 ఎన్1 ఇన్‌ఫ్లూయంజా వైరస్ కొత్త రకం కావటం వలన ఇప్పటివరకు ఈ యాంటివైరల్ చికిత్స తీసుకున్న వారి సంఖ్య చాలా తక్కువగా ఉన్నది.

**నివారణ పద్ధతులు :** ఈ స్వైన్‌ఫ్లూ జ్వరాలు రావడానికి కల కారణాలపై ఇప్పటివరకు ఎక్కడా పరిశోధనలు జరగలేదు. కానీ వ్యాధి రాకుండా నివారించడానికి అవసరమైన టీకాల తయారీపై ప్రపంచ ఆరోగ్యసంస్థ దృష్టి సారించింది. వ్యాధి కారక క్రిములను వ్యాప్తి చెందకుండా అరికట్టడమే ప్రస్తుతం మన ముందున్న ఏకైక మరియు సమర్థవంతమైన మార్గం. ఇన్‌ఫెక్షన్ బారిన పడకుండా ఉండేందుకు తరుచుగా చేతులు కడుక్కోవడంతో పాటు తుమ్మినా, దగ్గినా చేతిరుమాలు లేదా మాస్కు నోటికి అడ్డం పెట్టుకోవాలి. దగ్గు, తుమ్ముల తరువాత తప్పనిసరిగా సబ్బుతో చేతులు శుభ్రంగా కడుక్కోవాలి. ఫ్లూ జ్వరం లక్షణాలతో బాధపడుతున్న వారికి దూరంగా (కనీసం ఒక మీటరు) ఉండాలి. జ్వరం వచ్చిన వాళ్ళు తమంతతామే దూరాన్ని పాటించడంతో పాటు ఈ క్రింది జాగ్రత్తలు పాటించాలి.

- దగ్గు, తుమ్ముల తరువాత చేతులను శుభ్రంగా సబ్బుతో కడుక్కోవాలి.
- తరచూ చేతులతో కళ్ళు, ముక్కు రుద్దుకోకూడదు.
- వ్యాధి సోకిన వారితో లేదా వ్యాధి లక్షణాలు కనపడిన వారితో దగ్గరగా మెలగకూడదు.
- జనం రద్దీగా ఉండే ప్రాంతాల్లో ఎక్కువ సమయం గడపకూడదు.
- ఇల్లు తదితర నివాస ప్రాంతాల్లో గాలి వెలుతురు ఎక్కువ వచ్చేలా కిటికీలు, తలుపులు తీసి ఉంచాలి.
- తగినంతగా నిద్ర, ఆహారం, ఆహారంలో పోషక విలువలు ఉండేలా చూసుకోవాలి మరియు నిరంతరం శారీరకంగా ఉత్సాహంగా ఉండాలి.

ఇక మాస్కులు ధరించటం విషయానికి వస్తే

- వ్యాధిగ్రస్తులు కాని వ్యక్తులు మాస్క్ ధరించనక్కర్లేదు.
- అన్నివేళలా సరియైన విధంగా మాస్క్ ధరించటం అనేది తప్పనిసరి అవసరం, ఎందుకంటే మాస్క్ సరి అయిన విదంగా ధరించనట్లయితే వ్యాధి వ్యాప్తి చెందే అవకాశం పెరుగుతుంది.
- ఉపయోగించిన మాస్కులను తగు జాగ్రత్తలు తీసుకొని సరిఅయిన విధంగా పారవేయడం కూడా చాలా ముఖ్యం.
- వ్యాధిగ్రస్తులైన వ్యక్తులు ఎక్కడికైనా ప్రయాణించాల్సి వచ్చినా లేదా ఇతర వ్యక్తులను కలవాల్సి వచ్చినా సరే వారు తప్పనిసరిగా మాస్క్ ధరించాలి.

## ఈ వ్యాధి సోకిన వ్యక్తులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- ఇంటికే పరిమితం కావాలి ఆఫీస్‌కు, రద్దీ ఎక్కువ ఉన్న ప్రదేశాలకు కాని వెళ్ళకూడదు.
- పూర్తిగా విశ్రాంతి తీసుకోవాలి, ఎక్కువ ద్రవపదార్థాలు సేవించాలి.
- దగ్గేటప్పుడు, తుమ్మేటప్పుడు నోరు, ముక్కు మూసుకోవాలి. ఒకవేళ టిష్యూ కాగితాలు వాడినట్లయితే వాటిని జాగ్రత్తగా పడవేయాలి. దగ్గినా, తుమ్మినా వెంటనే చేతులను పరిశుభ్రంగా సబ్బుతో కడుక్కోవాలి.
- ఒకవేళ టిష్యూ కాగితం దగ్గరలేనట్లయితే దగ్గినప్పుడు కానీ, తుమ్మినప్పుడు కానీ నోటిని, ముక్కుని సాధ్యమైనంతగా మూయాలి. మోచేతి ముందుభాగంతో నోటిని, ముక్కుని సాధ్యమైనంతగా మూసివేయాలి.
- ఇతర వ్యక్తుల వద్ద ఉన్నప్పుడు నోటి, ముక్కు తుంపరలు వ్యాపించకుండా ఉండటానికి తప్పనిసరిగా మాస్కును ధరించండి, కానీ మాస్కును సరి అయిన పద్ధతిలోనే ధరించండి.
- మీ కుటుంబ సభ్యులకు, స్నేహితులకు మీ అనారోగ్యం గురించి తెలియ చేయండి. వీలయినంత వరకు ఇతర వ్యక్తులను కలవక్కుండా ఉండండి.

సోకిన వ్యక్తులకు సత్వర చికిత్సలు అందచేయాలి. అంతేకాక ప్రతీ దేశం వ్యాధిని సమర్థవంతంగా ఎదుర్కోవడానికి అవసరమైన పరిమాణంలో మందులు సమకూర్చుకోవాలి. ఆయా వ్యాధి సోకిన దేశాల నుండి వస్తున్న ప్రయాణికుల ద్వారా ఈ వ్యాధి వ్యాపిస్తుంది కావున, ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలు విమానాశ్రయాల్లో తగు జాగ్రత్తలు తీసుకొని తమ దేశానికి వచ్చే ప్రయాణికులకు వ్యాధి నిర్ధారిత పరీక్షలు చేయాలి, తద్వారా తమ తమ దేశాల్లోకి వ్యాధి వ్యాపించకుండా అరికట్టాలి. అదే విదంగా ఈ వ్యాధి బయటపడిన దేశాలు తమ తమ ప్రజల విదేశీ ప్రయాణాలను వాయిదా వేసుకోవాల్సిందిగా కోరాలి. అవసరం అయితే ఆ ప్రయాణాలను నియంత్రించాలి లేదా విదేశాలకు వెళ్ళే తమ ప్రయాణికులందరికి వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయాలి. ఈ సమస్య ఏ ఒక్క దేశానికి, ప్రాంతానికి సంబంధించిన సమస్య కాదని గుర్తించి, ఈ వ్యాధి వ్యాప్తి చెందుతున్న క్రమాన్ని గుర్తించి తగు జాగ్రత్తలు వహించి ఈ వ్యాధికి సంబంధించిన పూర్తి సమాచారాన్ని వివిధ సమాచార సాధనాల ద్వారా ఎప్పటికప్పుడు తెలియజేసి ప్రజలను, వైద్య నిపుణులను మరియు ప్రజారోగ్య నిపుణులను అప్రమత్తం చేయాలి, అంతేకాక ఈ వ్యాధిని అరికట్టటానికి ప్రస్తుతానికి టీకాలు లేవన్న వాస్తవాన్ని గ్రహించి వ్యాధి నిరోధక ఉత్పత్తి టీకాల తయారికి సామర్థ్యం ఉన్న ప్రతీ దేశం కృషి చేయాలి మరియు ఆయా ప్రభుత్వాలు అందుకు తగిన నిధులను, ప్రోత్సాహాన్ని అందించాలి. ■

26, జూన్ - అంతర్జాతీయ మాదకద్రవ్యాల వాడకం మరియు అక్రమరవాణా వ్యతిరేక దినం

# మాదకద్రవ్యాల దుష్ప్రభావం

ఒక రోగానికి వాడడానికి నిర్దేశించిన మందును, ఇతర కారణాలకు వాడడాన్ని "డ్రగ్ అబ్యూజ్' అంటారు. ఒక మందుకు వైద్యకారణంగా లేక అలవాటు కారణంగా బానిసగా మారినపుడు, ఆ మందు లేనిదే ఉండలేని పరిస్థితి కలుగుతుంది. ఆ మందుకోసం ఏమైనా చేసే తెగింపు ఎంతకైనా దిగజారే స్థితికి వచ్చినపుడు డ్రగ్ అబ్యూజ్‌కు దారి తీస్తుంది. ఆ మందు వాడకం, శారీరకంగా, మానసికంగా హాని చేస్తుందని, సమాజ పరిస్థితులను దెబ్బతీస్తుందని తెలిసినా, ఎడతెగకుండా తప్పనిసరిగా వాడడం, ఆ మందుకు బానిసగా మారడాన్ని సూచిస్తుంది.

శరీరానికి విపరీతమైన చైతన్యాన్ని కలిగించి, నరాలను ఉత్తేజపరిచి, విచక్షణా జ్ఞానాన్ని, ఆలోచనాశక్తిని నిర్వీర్యం చేసి, చివరికి మత్తులోకి తోసి, వ్యక్తిని శారీరకంగా, మానసికంగా కృంగదీసే మాదకద్రవ్యాల ప్రభావం సమాజ శ్రేయస్సుకు ప్రశ్నార్థకంగా మారుతోంది.

చట్ట వ్యతిరేకంగా ఉత్పత్తి చేయబడే ఈ డ్రగ్స్, ఒక దేశం నుండి మరొక దేశానికి, ఒక ప్రదేశం నుండి మరొక ప్రదేశానికి అక్రమంగా తరలించబడటం లేదా రవాణా చేయబడటాన్నే "ఇల్లిసిట్ డ్రగ్ ట్రాఫికింగ్" అంటారు. ఈ రవాణా చట్టానికి వ్యతిరేకం కనుక చట్ట వ్యతిరేక కార్యకలాపాల ద్వారానే జరుగుతుంది.

ప్రతి దేశంలోనూ మాదకద్రవ్యాలు, అక్రమ మందుల వ్యాపారం చాప క్రింద నీరులా విస్తరిస్తూనే ఉంది. మాదకద్రవ్యాలకు బానిసలుగా మారిన వ్యక్తుల దైన్యత, ఆ మందుకోసం వారు పడే యాతన, ఆ మందును దక్కించుకోవడం కోసం వారు ఎంతకైనా తెగించగలగడమే ఈ వ్యాపారానికి ఆయువు పట్టు అని చెప్పవచ్చు.

ప్రపంచదేశాలు ఈ మాదకద్రవ్యాలు, నిషేధించిన మందుల భూతానికి వ్యతిరేకంగా ఎన్ని చర్యలు తీసుకున్నప్పటికీ, నలుమూలలా విస్తరించి, అది అంతర్జాతీయ సమాజాన్ని దెబ్బ తీస్తూనే ఉంది. ఈ మందుల అక్రమ రవాణాకు దారులు అన్నీ మూసెయ్యాలనీ, వ్యాపారాన్ని నియంత్రించాలనీ ఎన్నో దేశాలు అనేక చర్యలు చేపడుతున్నాయి. మానిటరింగ్ ఏజెన్సీలు, కంట్రోల్ బోర్డులు అనేక ఆపరేషన్లు నిర్వహిస్తూనే ఉన్నాయి.

1987లో ఐక్యరాజ్యసమితి జూన్ 26ను అంతర్జాతీయ మాదకద్రవ్యాల వాడకం మరియు అక్రమరావాణా వ్యతిరేకదినంగా ప్రకటించింది. అప్పటి నుండి ఐక్యరాజ్యసమితి సభ్యదేశాలన్నీ డ్రగ్స్‌కు వ్యతిరేకంగా పటిష్టమైన చర్యలు చేపడుతున్నాయి.



2006లో యునైటెడ్ నేషన్స్ ఆఫీస్ ఆఫ్ డ్రగ్స్ అండ్ క్రైమ్, డ్రగ్స్‌కు వ్యతిరేకంగా "మీ జీవితాన్ని మాదక ద్రవ్యాలు నియంత్రిస్తున్నాయా? మీ జీవితం, మీ సమాజంలో మాదక ద్రవ్యాలకు స్థానంలేదు" అనే నినాదంతో ఒక కేంపెయిన్ చేపట్టింది. 2006 నుండి 2009 వరకు మూడేళ్ళపాటు కొనసాగే ఈ కార్యక్రమాలు వివిధ రకాల మాదకద్రవ్యాల నియంత్రణపై దృష్టిని సారిస్తున్నాయి. 2007లో మాదకద్రవ్యాల వాడకంపై అధ్యయనం చేసి, ఆ దిశగా చర్యలు చేపట్టారు. 2008లో మాదకద్రవ్యాల సాగు మరియు ఉత్పత్తి కి వ్యతిరేకంగా ఆపరేషన్లు నిర్వహించారు. సాగును నియంత్రించి, ఎన్నో చోట్ల పంటలను నాశనం చేయడంలో సఫలీకృతులయ్యారు. 2009లో చట్ట వ్యతిరేకంగా, డ్రగ్స్ అక్రమ రవాణాలపై దృష్టి సారిస్తున్నారు. ఈ కార్యక్రమాలన్నింటి లక్ష్యం ప్రజల్లో ఈ డ్రగ్స్ నియంత్రణ పట్ల పూర్తి అవగాహన కలిగించుట, ఈ డ్రగ్స్ కలిగించే హాని గూర్చి తెలియజేయుట మరియు ఈ కార్యంలో వారి పూర్తి సహాయ సహకారాలను కూడగట్టుట.

## వీటికి బానిసలుగా మారేవారు ఎవరు?

జనాభాలో ముఖ్యంగా టీనేజర్లు, యుక్తవయస్కులు ఈ మాదకద్రవ్యాల బారినపడి బానిసలుగా మారుతున్నారు. ఒత్తిడి వలన, క్రొత్త విషయాల్లో ప్రయోగాత్మకంగా వ్యవహరించే అలవాట్ల వలన, వ్యక్తిగత బలహీనతల నుండి పారిపోవడానికి, బాధలనుండి విముక్తి కలిగిస్తుందన్న భ్రమతోనూ, ఈ డ్రగ్స్ బారిన పడుతున్నారు యువత. ఈ మందుల చెడు ప్రభావం గూర్చి గానీ, శారీరక, మానసిక ఆరోగ్యానికి జరిగే హాని గురించి గానీ వీరికి అవగాహన చాలా తక్కువ. తమ శరీరంలో జరిగే మార్పులు, అనారోగ్యం, మానసిక అనిశ్చిత స్థితిని గుర్తించే నాటికే వారు డ్రగ్స్ లేకుండా ఉండలేని పరిస్థితికి వచ్చేస్తారు. అప్పుడిక తమకు జరిగే హాని గురించి కూడా పట్టించుకోరు. ఈ డ్రగ్స్ ప్రభావం గూర్చి ప్రతి ఒక్కరికీ తెలియవలసిన అవసరం ఉంది.

ఇవి మనిషి శరీరాన్ని, మెదడును పూర్తిగా తమ నియంత్రణలో ఉంచుతాయి. విచక్షణా జ్ఞానాన్ని పూర్తిగా నశింపచేస్తాయి, అందువలన అవి సేవించే వ్యక్తికే కాక కుటుంబానికీ, సమాజానికీ కూడా హాని కలిగిస్తాయి. నేర ప్రవృత్తి కూడా మనిషిలో పెంపొందుతుంది. ఈ మందుల మితిమీరిన వాడకం వలన కలిగే నష్టాల గురించి ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరం.

కె. విజయభాను, ఫ్రీలాన్స్ రచయిత్రి

### డ్రగ్స్ యొక్క నెగిటివ్ ప్రభావాలు క్రింది వాటిపై ఆధారపడి ఉంటాయి

- తీసుకున్న మందురకం
- తీసుకున్న మోతాదు (ఎక్కువ/తక్కువ)
- రోజుకు ఎన్నిసార్లు తీసుకుంటున్నారు

చట్ట వ్యతిరేకంగా తయారుచేసిన మందులన్నీ, తీసుకున్న వెంటనే శారీరకంగా ప్రభావాన్ని చూపిస్తాయి. అంతేగాక తీసుకున్న మోతాదును బట్టి మానసిక, భావపరమైన అభివృద్ధిని తీవ్రంగా దెబ్బతీస్తాయి. ముఖ్యంగా యుక్తవయస్కులపై తీవ్ర పరిణామాలుంటాయి.

### ఈ మందులను/మాదకద్రవ్యాలను ఎలా రవాణా చేస్తారు?

- అక్రమంగా తరలించడానికి క్రొత్త క్రొత్త పద్ధతులను కనిపెడ్తూనే ఉంటారు స్మగ్లర్లు. ముఖ్యంగా కొరియర్ సర్వీసులను ఎక్కువగా వాడుకుంటారు. పార్సెల్ పై "వ్యక్తిగత వినియోగానికి" అనే లేబుల్ వ్రాసి కొరియర్‌ల ద్వారా పంపిస్తారు.

  దీనికి ఉదాహరణగా 2007లో భారతదేశంలో, కెనడా, దక్షిణాఫ్రికాలకు పంపబడ్తున్న రెండు పార్సెల్‌లలో ఒక కేజీ పైన దొరికిన హెరాయిన్ గూర్చి చెప్పుకోవచ్చు.
- ఇంటర్‌నెట్‌ను కూడా విరివిగా ఉపయోగిస్తారు. చట్ట వ్యతిరేక సమాచారాన్ని ప్రకటనలను, డ్రగ్స్ వివరాలను పంపడానికి, ప్రజలు తెలుసుకునేలా వివరాలను పెట్టడానికి, ఇంటర్‌నెట్‌ను వినియోగిస్తారు.
- స్త్రీలను, పిల్లలను కూడా ఎక్కువగా డ్రగ్ ట్రాఫికింగ్‌కు వాడుకుంటున్నారు.
- ఇతర దేశాల నుండి ఆర్డర్లు రాగానే భారతదేశంలోని ఏజెంట్లు, సంస్థలు పోస్టుద్వారా ఆయా దేశాలకు సరుకును రవాణా చేస్తారు.

### ప్రపంచవ్యాప్తంగా డ్రగ్స్‌కు బానిసలుగా మారినవారు

- ప్రపంచవ్యాప్తంగా 200 మిలియన్ల మంది ఈ మాదకద్రవ్యాలకు బానిసలుగా ఉన్నారు.
- 162 మిలియన్ల మంది కన్నాబిస్ మారిజువానాలకు
- 35 మిలియన్ల మంది ఎటిఎస్, ఎక్స్‌టెసీ మరియు మెథింఫెటామైన్, ఏంఫిటామిన్ మరియు మెత్‌కెటినన్ వంటి మందులకు
- 16 మిలియన్ల మంది ఓపియేట్స్, నల్లమందు, మార్ఫిన్, హెరాయిన్‌లకు
- 13 మిలియన్ల మంది కొకెయిన్‌కు బానిసలుగా మారారు.

అందుకే తన సభ్యదేశాలకు, ఐక్యరాజ్యసమితి డ్రగ్స్ అక్రమరవాణాపై నియంత్రణను బలోపేతం చేయాలని ఎప్పటికప్పుడు నొక్కి చెప్తుంది. ఈ సమస్య ఒక దేశానికి చెందినది కాదు, ప్రపంచ సమస్య, అందుకే దీని నియంత్రణకు ప్రపంచదేశాలన్నీ సమిష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉంది.

### యు.ఎన్.జి.ఎ.ఎస్.ఎస్

యు.ఎన్.ఓ.డి.సి. కేంపెయిన్ యువతకు, ఇతరులకు నిషేధించబడిన మందుల గూర్చి, డ్రగ్స్ గూర్చి, వాటి చెడు ప్రభావాల గూర్చి అవగాహన కలిగిస్తుంది. యునైటెడ్ నేషన్స్ జనరల్ అసెంబ్లీ స్పెషల్ సెషన్ అంతర్జాతీయ డ్రగ్ నియంత్రణకు ఒక అజెండా తయారుచేసింది. డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ప్రపంచ వ్యాప్త యుద్ధభేరిని మ్రోగించాలని 1998లో 20వ యు.ఎన్.ఓ.డి.సి. న్యూయార్క్‌లో నిర్ణయించింది. అంతర్జాతీయ సహకారంతో, డ్రగ్స్ డిమాండ్‌ను, చట్ట వ్యతిరేక/అక్రమ రవాణాను తగ్గించాలని, నేషనల్ డ్రగ్స్ స్ట్రాటజీస్ ప్రకారం రిపోర్టును సి.ఎన్.డి. కు నివేదించాలని యు.ఎన్.జి.ఎ.ఎస్.ఎస్ ఐక్యరాజ్యసమితి సభ్యదేశాన్నింటినీ కోరింది.

యు.ఎన్.జి.ఎ.ఎస్.ఎస్ నిర్దేశించిన టార్గెట్‌ను చేరుకోవడానికి వారు చేపట్టిన చర్యలు, తద్వారా సఫలీకృతమైన అంశాల గూర్చి ఈ రిపోర్టుతో వివరించాల్సి ఉంటుంది. అంతర్జాతీయ సమాజం ఈ వ్యవస్థ యొక్క కార్యాచరణ ఫలితాలను గూర్చి అంతర్జాతీయ కౌంటర్ నార్కోటిక్స్ వ్యవస్థ యొక్క 52వ సి.ఎన్.డి. హై లెవల్ సెగ్మెంట్ (2009)లో చర్చించి, భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికను నిర్ణయిస్తుంది.

### ఐక్యరాజ్య సమితి సభ్యదేశాల మధ్య ఒప్పందాలు

ఐక్యరాజ్యసమితి సభ్యదేశాల మధ్య ఈ సమస్యను అధిగమించడానికి ఒప్పందాలు జరుగుతుంటాయి. భారతదేశంలో నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో నోడల్ ఏజెన్సీగా పనిచేస్తుంది. మాదకద్రవ్యాలు, మందుల అక్రమ రవాణా గూర్చి పరస్పర సమాచారం అందించుకోవడం, స్మగ్లర్లు, నేరచరితులు, వ్యాపారులు, ఆర్గనైజర్లపై దాడులు (ఆపరేషన్లు) నిర్వహించడం, ఆపరేషన్లు నిర్వహించేటప్పుడు సమగ్ర కార్యాచరణకు పథక రచనకు, మాదకద్రవ్యాల అక్రమ రవాణాలో వ్యాపారులు అవలంబించే క్రొత్త పద్ధతులు, డ్రగ్ మార్కెట్ తీరుతెన్నులు మొదలైనవి విశ్లేషించడం లోనూ, మనీ లాండరింగ్‌ను నియంత్రించడానికి, వ్యాపారులు, స్మగ్లర్లు, దళారుల కార్యక్రమాలను నిర్వీర్యం చేయడంలోనూ ఈ దేశాలు పరస్పరం సహకరించుకుంటాయి. ఇంటర్నేషనల్ నార్కోటిక్స్ కంట్రోల్ బోర్డ్ ఈ మాదకద్రవ్యాల అక్రమరవాణాను అరికట్టడానికి ఎన్నో చర్యలు చేపడుతోంది.

### ప్రభుత్వం చేయవల్సినవి

- అక్రమ డగ్స్‌ను తయారుచేసేందుకు ఉపయోగించే రసాయనాలను వాడకుండా చర్యలు తీసుకోవాలి.
- మనీ లాండరింగ్‌కు పాల్పడే వారిపై కఠినచర్యలు తీసుకోవాలి.
- సమాజానికీ, ఆరోగ్యానికి హాని కలిగించే మందుల వాడకాన్ని నిషేధించాలి.
- ప్రజలకు అవగాహనా కార్యక్రమాలను నిర్వహించాలి.
- మాదకద్రవ్యాలకు బానిసలుగా మారిన వారికి పునరావాసం మరియు చికిత్సకు కృషి చేయాలి.
- కాలేజీ విద్యలో ఈ సమస్యకు సంబంధించిన సిలబస్‌ను పొందుపర్చాలి.
- నార్కోటిక్స్ చట్టాలను ఇంకా కఠినతరం చేసి, పటిష్టంగా అమలుపర్చాలి.

సమాజంలోని అన్ని రంగాలపై చెడు ప్రభావాన్ని చూపించి, సమాజ నిర్మాణాన్ని దెబ్బతీసి, కుటుంబ వ్యక్తి శ్రేయస్సుకు హాని కలిగించి, సమాజంలో నేరాలను పెంచి, దేశానికి వెన్నెముక వంటి యువతను నిర్వీర్యం చేయగల ఈ మాదకద్రవ్యాలు వాడకాన్ని, అక్రమ రవాణాను నిలిపివేయడంలో ప్రపంచ దేశాలన్నీ సమైక్యంగా కృషి చేయాలి. ■

# విపత్తు నిర్వహణ - సైన్సు మరియు టెక్నాలజీ పాత్ర

విపత్తుల నిర్వహణలో శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాల పాత్ర చాలా కీలకమైనది. భూ శాస్త్రాలు మొదలుకొని వాతావరణం, పర్యావరణం, ఇంజనీరింగు, వ్యవసాయం, వైద్యం, సామాజిక, రిమోట్‌సెన్సింగ్, జిఐఎస్, మోడలింగు, సమాచార కమ్యూనికేషను వంటి పలురంగాలు ఇందులో కలసి పనిచేస్తాయి. ఈ రంగాలలో నిరంతరం తాజాగా జరుగుతున్న పరిణామాలతో విపత్తు నిర్వహణలో వీటిపాత్ర మరింత కీలకంగా మారింది, ఇవి మరింత దక్షతతో పనిచేస్తున్నాయి.

అయితే ప్రపంచవ్యాప్తంగా విపత్తు నిర్వహణలో ముఖ్యంగా రెండు రంగాలలో శాస్త్ర సాంకేతిక పద్ధతులు అంతర్భాగంగా మారి గట్టి ప్రభావం చూపుతున్నాయి. వివిధ భౌగోళిక పరిస్థితులతో పాటు విభిన్న సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక నేపథ్యంలో విపత్తు అవకాశం గుర్తింపు, అంచనా, పర్యవేక్షణలోను, అన్ని రకాల జల-భౌగోళిక విపత్తుల సందర్భంలో హెచ్చరిక, కమ్యూనికేషను వ్యవస్థలలోను వీటి ప్రభావం అధికంగా వుంది.

## విపత్తు అవకాశాల గుర్తింపు - అంచనా నిఘా :

ఏ మేరకు ఎంత నష్టం జరిగిందనేది విపత్తు ప్రమాదంగా పరిగణిస్తారు. ప్రకృతి శక్తుల వల్ల కలిగే ముప్పు, ప్రకృతి వైపరీత్యాల ప్రభావంతో సమాజానికి భౌతిక, సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక పైఖరుల పరంగా వివిధ రకాలుగా జరిగే కీడు, ప్రాణనష్టం, ఆర్థిక మౌలిక సదుపాయాలకు కలిగే నష్టం - ఈ మూడు అంశాలను పరిగణనలోకి తీసుకుని ముఖ్యంగా జనాభా - మౌలిక సదుపాయ నష్టం ఆధారంగా ప్రమాదం అంచనాలు వేస్తారు. తద్వారా ప్రమాద మదింపు ప్రక్రియ జరుగుతుంది.

దీనికింద నష్టాన్ని తగ్గించే చర్యల సాధ్యాసాధ్యాలతో పాటు రిస్కు గురించి ఏం చేయాలనేది నిర్ణయిస్తారు. విధాన రూపకల్పనకు, ఉపశమనానికి చేసే ప్రణాళికలు, వాటి అమలుకు ఈ మూడు అంశాలను పరిగణనలోనికి తీసుకోవటం జరుగుతుంది. విపత్తు నిర్వహణ విధానాలు లోటుపాట్లతో కూడి పటిష్టంగా లేని పక్షంలో విపత్తులను ఎదుర్కోవటానికి చేసే చట్టాలు, నియమ నిబంధనలు, సంస్థాగత ఏర్పాట్లు తదితర యావత్తు సాధనాలు విఫలం చెందినట్టే. అయితే ప్రమాదాలు గుర్తించటంలో, వాటి అంచనాలో ప్రస్తుతం ఉన్న సామర్థ్యాలు తీవ్ర పరిమితులకు లోబడి పనిచేయాల్సి వుంటోంది. పలుదేశాలలో విపత్తుల గుర్తింపు, ఏ మేరకు కీడు జరుగుతుందనే అంశాలకు మాత్రమే ఈ రిస్కు అంచనా పరిమితమై వుంది. అంతేకాక ఆ విపత్తుకు సంబంధించి అందే సమాచారం కూడా సంక్లిష్టపరిస్థితిని ఎదుర్కొనేందుకు తగిన విధంగా వుండదు. రిస్కు తగ్గింపు లక్ష్యాలకు తగినట్టుగా మదింపు జరగాలి. ఇందుకు ఆయా దేశాలలోని జాతీయ విపత్తు నిర్వహణ సంస్థల విశ్లేషణ సామర్థ్యాలు పెరగాలి.

**సంజయ్ శ్రీవాత్సవ,** సార్క్ విపత్తు నిర్వహణ కేంద్రం
జల వాతావరణ విపత్తు విభాగం అధిపతి, కొత్తఢిల్లీ

ఇటీవలి సంవత్సరాలలో రిమోట్ సెన్సింగు-జిఐఎస్ ఆధారంగా విపత్తు అంచనాల ప్రక్రియలో విశేషంగా పురోగతి జరిగినప్పటికీ ముఖ్యంగా వర్ధమాన దేశాలలో భారీస్థాయి విపత్తు సందర్భాలలో చేపట్టాల్సిన పద్ధతుల రూపకల్పనలోను అమలులోను కూడా అనేక తీరని సమస్యలు ఎదురవుతున్నాయి. ప్రమాదం స్థాయి పెరిగినకొద్దీ దానిని కనిపెట్టే పద్ధతులు మరింత సంక్లిష్టంగా మారతాయి. అభివృద్ధి చెందుతున్న దేశాలలో అందుకు తగినంత సమాచారం లేకపోవటం కూడా పెద్ద సమస్య.

ఇక వరదలు, తుఫాన్లు వంటి జలవాతావరణ ప్రమాదాలు, భూకంపాలు, కొండచరియలు విరిగిపడటం, సునామీ వంటి భూ భౌతిక ప్రమాదాల వల్ల పెనువిపత్తులు సంభవిస్తాయి. ఈ విధమైన ప్రమాదాల బెడద వున్న ప్రాంతాలలో అధిక జనాభా సాంద్రత, ఆర్థిక మౌలిక సదుపాయాలపై నష్టం అంచనాలు ఆధారపడి వుండటంచేత మనదేశంలో ఆయా ప్రాంతాల విభిన్న పరిస్థితులను బట్టి ఈ నష్టం ఒక్కో ప్రాంతంలో ఒక్కో రకంగా వుంటుంది.

విపత్తు అవకాశ గుర్తింపు, అంచనా, నిఘా వ్యవస్థలో ఇన్ని అవరోధాలు వుండడం చేత ఇందుకు సంబంధించి కొన్ని ప్రధాన సమస్యలకు ఇంకా పరిష్కారం దొరకవలసి ఉంది.

- అన్ని రకాల జలవాతావరణ, భూ భౌతిక విపత్తులకు సంబంధించి విపత్తు అంచనా, విపత్తు అవకాశ గుర్తింపు, పర్యవేక్షణలలో క్రమపద్ధతి ఏర్పాటు.
- విపత్తుకు అధిక అవకాశం వుండి, సామర్థ్య నిర్మాణం అల్పంగా గల వర్ధమాన దేశాలలో అందుబాటులో ఉన్న మౌలిక సదుపాయాలతో ఎప్పటికప్పుడు విపత్తు విశ్లేషణ వ్యవస్థ ఏర్పాటు.
- పనిసామర్థ్య నిర్మాణం, విపత్తు విశ్లేషణ నుండి విపత్తు తగ్గింపు ఏర్పాటు దిశగా వ్యూహాలు
- పాఠాలతో పాటు ఉత్తమ పద్ధతుల నుండి నేర్చుకున్న అనుభవాలు, అధునాతన సాంకేతిక పరిజ్ఞానం, వ్యూహాల మార్పిడి
మొదలైన అంశాలతో పరిష్కారాలు కనుగొనాలి.

## విపత్తు హెచ్చరిక - కమ్యూనికేషను వ్యవస్థలు :

విపత్తు నిర్వహణలో అత్యంత ప్రధానాంశం విపత్తు హెచ్చరిక. ఇటీవలి కాలంలో ముందస్తుగా విపత్తుల రాక గుర్తింపుకు, హెచ్చరికలను తెలియ జెప్పేందుకు సంబంధించి విజ్ఞానాన్ని, సాంకేతిక పరికరాలను అభివృద్ధి పరచటంలో గణనీయమైన ప్రగతి జరిగింది. యథార్థమైన, విశ్వసనీయమైన పర్యవేక్షణ సాధనాల సహాయంతో గమనించే నెట్‌వర్కుల మధ్య సమన్వయం పెంపొందడం వల్ల కమ్యూనికేషను, హెచ్చరిక సందేశాల చేరవేత మంచి పటిష్టంగా జరుగుతోంది. ప్రమాదాల శాస్త్ర విజ్ఞానం, ముందస్తు హెచ్చరికలు తదితర రంగాలలో పరిశోధనలు జోరుగా సాగటంతో పాటు, పరస్పర వివరాల మార్పిడి, శాస్త్ర సాంకేతిక సమాచారాన్ని సందేశాల రూపంలో తయారీ, ప్రమాద బెడద వున్న వారికి తేలిగ్గా అర్థమయ్యేలా హెచ్చరికల పంపిణీ వంటివి బాగా మెరుగువుతున్నాయి. ఇంత జరుగుతున్నప్పటికీ విపత్తుల పర్యవేక్షణలోను,

ముందస్తు గుర్తింపులోను సామర్థ్యాలు దేశానికి దేశానికి మధ్య ఇంకా చెప్పాలంటే ఒకే దేశంలోని వివిధ ప్రాంతాల మధ్య భిన్నంగా వుంటాయి. ప్రస్తుతం వున్న జలవాతావరణ, భూ భౌతిక నెట్‌వర్కులకు గల మౌలిక సదుపాయాలు అనుమతించిన మేరకే ఈ సమాచారం చేరవేత సాధ్యమవుతుంది.

## భూ భౌతిక ప్రమాదాల ముందస్తు హెచ్చరిక

ఉపగ్రహ ఆధారిత గమనిక వ్యవస్థలు, మోడలింగు సామర్థ్యాలు, మౌలిక శాస్త్రీయ అన్వేషణలలో పురోగతి ద్వారా భూమిపై ఉన్న మహాసముద్రాలు, వాతావరణం, మంచుకప్పు, హిమనదులు, భూగర్భ ఉపరిభాగాలకు సంబంధించి ఎదురుకాగల ప్రమాదాలను పసిగట్టి సమగ్రమైన పరిశీలనకు గణనీయమైన యత్నాలు జరిగాయి.

సముద్రగర్భంలో భూకంపాలు, అగ్నిపర్వత ద్రవాల పెల్లుబుకు తదితర అల్లకల్లోలాల వల్ల వరుసలో వచ్చే మహాసముద్ర ఉపరితల కెరటాలు సునామీ. ఈ సునామీ హెచ్చరికకు ముందుగా తగిన సమయం వుంటుంది. సముద్ర పరిశీలన వ్యవస్థల ద్వారా సునామీని గమనించిన తక్షణమే దాని పరిణామాన్ని, కదలికను, వచ్చి చేరే సమయాన్ని ఖచ్చితంగా అంచనా వేసి హెచ్చరికలు జారీ చేయవచ్చు.

## జలవాతావరణ ప్రమాదాలు – ముందస్తు హెచ్చరిక

వాతావరణ, జల మహా సముద్రాలలో చోటు చేసుకునే పరిణామాల వల్ల జలవాతావరణ విపత్తులు విస్తృతపరిధిలో వుంటాయి. వాతావరణ, మహాసముద్ర కూడికతో కలిగే శాస్త్రీయమైన అనిశ్చితిని ఆకళింపు చేసుకోవటానికి మార్గం ఏర్పడింది. బహుళ ఉపగ్రహాల ద్వారా సమాచార సేకరణతో కేవలం వాతావరణ సూచనలతో సరిపెట్టడం కాక సమాచారాన్నంతటిని క్రోడీకరించి మరింత మెరుగ్గా విపత్తుల రాకను కనిపెట్టి, ముందస్తు హెచ్చరికలు చేసే సదుపాయం ఏర్పాటైంది.

ఇక చాలావరకు వరద హెచ్చరిక వ్యవస్థలు జాతీయ స్థాయి కార్యకలాపాలకు పరిమితం కాగా అంతర్జాతీయంగా కూడా పలు హెచ్చరిక వ్యవస్థల ఏర్పాటు జరిగింది. ఐరోపాలో రైన్, డాన్యూబ్, ఎల్బ్–మోసెల్, ఆసియాలోని మెకాంగ్, సింధు, గంగ–బ్రహ్మపుత్ర, మేఘనతో పాటు దక్షిణాఫ్రికాలోని జింబేజి తదితర నదులకు ఈ ఏర్పాటు ఉంది.

## సిడార్ తుఫాను – బంగ్లాదేశ్ (2007)

2007 నవంబరు 15వ తేదీన సిడార్ తుఫాను బంగ్లాదేశ్ తీరాన్ని తాకింది. గంటకు 240 కి.మీ ఈదురుగాలులతో కూడిన ఈ తుఫాను రాకను 48 గంటలకు ముందుగానే గుర్తించారు. బంగాళాఖాతంలో ఏర్పాటు చేసిన అధునాతన ఉపగ్రహాలు, అంతర్జాతీయంగా, ప్రాంతీయ, జాతీయ స్థాయిలో పనిచేస్తున్న అన్ని వాతావరణ, సముద్ర అధ్యయన శాస్త్ర సంస్థలు ఈ తుఫాను పోకడను నిశితంగా గమనిస్తూ ఎప్పటికప్పుడు ముందస్తు హెచ్చరికలు జారీచేశాయి. బంగ్లాదేశ్‌లో కూడా వాతావరణ పరిస్థితికి చెందిన అధునాతన పరిజ్ఞానం బాగా వృద్ధిచెందటంతో వారు కూడా తుఫానుకు సంబంధించి ముందస్తుగా ఖచ్చితమైన సమాచారాన్ని ఇవ్వగలిగారు. అన్ని దిశలనుంచి అందిన వివరాలన్నింటినీ క్రోడీకరించి ఇక ఆ దేశ ప్రభుత్వం క్రియారూపంలో పెట్టింది. దీనితో 3,20,000 పైగా ప్రజలను ముందుగానే సురక్షిత ప్రాంతాలకు తరలించారు. సిడార్ తుఫాను కదలికలను పసిగట్టి అంతర్జాతీయ, ప్రాంతీయ స్థాయి సంస్థలన్నీ బంగ్లాదేశ్ జాతీయ స్థాయి సంస్థలతో సమాచారాన్ని పంచుకున్నందున స్థానికంగా అపాయాన్ని సమర్థంగా ఎదుర్కొనేందుకు వీలు కలిగింది. అందుచేత ఎల్లలను అధిగమించి ముందస్తు హెచ్చరిక వ్యవస్థ సమాచారాన్ని పంచుకోవటం వల్ల విపత్తుల సందర్భాలలో స్థానిక యంత్రాంగం సత్వరమే స్పందించి చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని ఈ అనుభవం పాఠం నేర్పుతుంది.

ప్రాణాల రక్షణలో, జీవనోపాదులను కాపాడటంలో ముందస్తు హెచ్చరిక వ్యవస్థలు కీలకపాత్ర వహిస్తాయి. విపత్తులను పసిగట్టడంలో, టెలి కమ్యూనికేషన్ల సామర్థ్యాలలో జరిగిన పురోగతిని ఈ వ్యవస్థ సమన్వయ పరుస్తుంది. 2004 డిసెంబరు నాటి హిందూ మహాసముద్ర సునామీ ఈ విధమైన వ్యవస్థలేని లోటును తెలియజెప్పటంతో ఇప్పుడు సునామీలపై ముందస్తు హెచ్చరికల వ్యవస్థ ఏర్పాటుకు వివిధ స్థాయిల్లో సంఘటిత కృషి జరుగుతోంది. కేవలం వ్యవస్థ ఏర్పాటు వల్ల ప్రయోజనం ఉండదు. ఆ సమాచారం స్థానిక స్థాయిలో సకాలంలో సరైన ప్రజలకు అంది ముప్పు తప్పాలి. అప్పుడే దానికి సార్థకత చేకూరుతుంది.

క్షేత్రస్థాయిలో పనిచేసే విపత్తు హెచ్చరిక ప్రక్రియ ప్రధానాంశాలు :

- ప్రజలకు ఏ మేరకు అపాయం జరిగేదీ అంచనా.
- ప్రమాదాలు + విపత్తులపై నిఘా, వివరణ, ముందస్తు సూచన.
- ప్రత్యేకించిన లక్షిత వర్గాలకు హెచ్చరిక సందేశాల చేరవేత.
- హెచ్చరిక గ్రహీతల ఆకళింపు – స్పందన.

విపత్తుల గురించిన సమాచారం చేరాల్సిన ప్రజలకు ముందస్తుగా చేరి వారు సురక్షితంగా బైటపడితే ఈ వ్యవస్థ విజయవంతమైనట్టు లెక్క.

## ముగింపు

శాస్త్ర సాంకేతిక రంగాలలో జరిగిన పురోగతి ఫలితంగా ప్రపంచమంతటా విపత్తులను ఎదుర్కొనే సామర్థ్యాలు బాగా పెంపొందాయి. ఇంటర్నెట్, మొబైలు ఫోన్లు, ఫ్యాక్సు, ఈ–మెయిల్, రేడియో, టివి, సైరన్ తదితర వివిధ కమ్యూనికేషన్ పద్ధతుల సమన్వయంతో ఈ దిశగా నూతన మార్గాలు ఏర్పడుతున్నాయి. కాగా విపత్తు నిర్వహణలో శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాల వాడకానికి సంబంధించి సామాజిక, సాంకేతికపరమైన రెండు కోణాలు ఉన్నాయి. సామాజిక–ఆర్థిక కోణంలో అవి అధికంగా ఉపయోగపడాలి. అప్పుడే వాటి సమర్థమైన వాడకం జరిగినట్టు భావించాలి. స్థానిక పరిస్థితులను బట్టి తదనుగుణమైన సమాచార సాంకేతిక పద్ధతిని అవలంబించాలి. దానితో అవి ప్రతి ఒక్కరికి అందుబాటుకు వచ్చి ఆదుకుంటాయి. వీటి ఉపయోగంతో విపత్తు నిర్వహణ కింద అట్టడుగు స్థాయి నుండి విపత్తులను తట్టుకుని నిలిచే సమాజ నిర్మాణం జరగాలి. నిరంతర నూతన కమ్యూనికేషను, సాంకేతిక పద్ధతులు వృద్ధిచెందుతున్నందున రానున్న సంవత్సరాలలో విపత్తు నిర్వహణ వ్యవస్థల పునర్‌నిర్వచనం జరుగుతుంది. అదుపు, నియంత్రణల పద్ధతికి స్వస్తి పలికి ప్రజలకు మరింత రక్షణచేకూర్చే విపత్తు నిర్వహణ వ్యవస్థ ఏర్పాటు కానుంది.

*(ఎమ్. సీతామహాలక్ష్మి)*

**Civils (Mains-2009)**
**APPSC-Group I & II**
**DSC-2009**
**SSC, RRB**
**Bank PO's, Clerks**




ప్రాతూరి పోతయ్యశర్మ

1. 15వ లోక్‌సభ ఎన్నికలలో యునైటెడ్ ప్రోగ్రెసివ్ ఎలయన్స్‌లో ఉన్న కాంగ్రెస్ (ఐ) పార్టీ ఎన్ని సీట్లు సంపా దించుకుంది?
(ఎ) 206 (బి) 263 (సి) 116 (డి) 61
2. యునైటెడ్ ప్రోగ్రెసివ్ ఎలయన్స్‌లో గల పార్టీలేవి?
(ఎ) కాంగ్రెస్(ఐ), తృణమూల్, డి.ఎమ్.కె. (బి) ఎన్.సి.పి., జె.కె.ఎన్.సి. (సి) జె.ఎమ్.ఎమ్., ఎ.ఐ. ఎమ్.ఐ.ఎమ్. (డి) పైవన్నీ
3. సిక్కింలో సిక్కిం డెమోక్రాటిక్ ఫ్రంట్ ఎన్ని సీట్లు సంపాదించుకుంది?
(ఎ) 32 (బి) 20 (సి) 15 (డి) 25
4. ఈ క్రింది వాటిలో ఏది కరెక్ట్?
(ఎ) **HIPC** : హెవిలీ ఇండెంటెడ్ పూర్ కంట్రీస్ (బి) **MDRI** : మల్టిలేటరల్ డెట్ రిలీఫ్ ఇనీషియేటివ్ (సి) **PRSP** : పావర్టీ రిడక్షన్ స్ట్రాటజీ పేపర్ (డి) పైవన్నీ
5. ఈ క్రింది వాటిలో ఏది కరెక్ట్?
(ఎ) **MDG** : మిలేనియం డెవలప్‌మెంట్ గోల్స్ (బి) **GMR** : గ్లోబల్ మానిటరింగ్ రిపోర్ట్ (సి) **FSAP** : ఫైనాన్షియల్ సెక్టార్ ఎసెస్ మెంట్ ప్రోగ్రాం (డి) పైవన్నీ
6. తొలికాలంలో **IMF** వారు ఇచ్చే స్పెషల్ డ్రాయింగ్ రైట్ (**SDR**) విలువ (1969లో) ఎంతగా నిర్ధారించారు?
(ఎ) 0.888671 గ్రాముల శుద్ధమైన బంగారం విలువతో సమానం అన్నారు (బి) 5 డాలర్లు (సి)2 డాలర్లు (డి) 3 డాలర్లు
7. ఏప్రిల్ 20, 2008 నాడు ఇస్రోవారు అంతరిక్షంలోకి పంపిన ఉపగ్రహాలేవి?
(ఎ) **RISAT-2 &** అనుశాట్ (బి) ఓషన్‌శాట్ (సి) ఎడ్యుశాట్ (డి) ఇవేవి కావు
8. ఎయిర్ ఇండియా, క్రొత్త ఛైర్మెన్ మరియు మేనేజింగ్ డైరెక్టర్ ఎవరు?
(ఎ) అరవింద్ జాదవ్ (బి) శక్తిసామంత్ (సి) విష్ణు ప్రభాకర్ (డి) ఫిరోజ్‌ఖాన్
9. స్వైన్‌ఫ్లూ (సూకర జ్వరం) ఏ వైరస్ వల్ల వస్తుంది?
(ఎ) **A** ($H_1N_1$) (బి) $H_5N_1$ (సి) **HPV** (డి) ఇవేవి కావు
10. ఇండియన్ సుగర్ మిల్స్ అసోసియేషన్ ప్రకారం 2008-09 లో చక్కెర ఉత్పత్తి ఎంత? (లక్షల టన్నులలో)
(ఎ) 147 (బి) 130 (సి) 120 (డి) 125
11. 2009 స్నూకర్ వరల్డ్ ఛాంపియన్ క్రీడ గెలిచింది ఎవరు?
(ఎ) జాన్ హిగ్గిన్స్ (బి) రోనీ ఓసుల్లివాన్ (సి) షాన్‌మర్ఫీ (డి) వీరెవరూ కాదు
12. "బఫెలోసిటీ" ఎక్కడుంది?
(ఎ) **USA** (కెనడా సరిహద్దు దగ్గర) (బి) **UK** (సి) జర్మనీ (డి) ఫ్రాన్స్
13. ఈ క్రింది వాటిల్లో ఏది కరెక్ట్?
(ఎ) **PFRDA** : పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ (బి) **NPS** : న్యూ పెన్షన్ స్కీమ్ (సి) **IVF** : ఇన్‌విట్రో ఫెర్టిలైజేషన్ (డి) పైవన్నీ
14. ఈ క్రింది వాటిల్లో ఏది కరెక్ట్?
(ఎ) **CVD** : కార్డియో వాస్క్యులార్ డిసీజెస్ (బి) **USIEF** : యునైటెడ్ స్టేట్స్ ఇండియా ఎడ్యుకేషన్ ఫౌండేషన్ (సి) **NATO** : నార్త్ అట్లాంటిక్ ట్రియటీ ఆర్గనైజేషన్ (డి) పైవన్నీ
15. బ్రిటన్ దేశ తొలి మహిళా పొయెట్ లారియేట్ ఎవరు?
(ఎ) కెరోల్ అన్ డఫ్ఫీ (బి) ఆండ్రూ మోషన్ (సి) విలియం వర్డ్స్‌వర్త్ (డి) వీరెవరూ కారు
16. దక్షిణాఫ్రికా క్రొత్త అధ్యక్షులు ఎవరు?
(ఎ) జాకోబ్ జూమా (బి) కగలేమా మోట్లాంటే (సి) నెల్సన్ మండేలా (డి) వీరెవరూ కారు
17. "రాబెన్ దీవి" ఎక్కడుంది?
(ఎ) దక్షిణాఫ్రికా దగ్గర (బి) క్యూబా (సి) యు.ఎస్.ఎ (డి) జిబ్రాల్టర్
18. ఈ క్రింది వాటిల్లో ఏది కరెక్ట్?
(ఎ) **PROBE** : 2006 పబ్లిక్ రిపోర్ట్ ఆన్ బేసిక్ ఎడ్యుకేషన్ (బి) **MDMS** : మిడ్ డే మీల్స్ స్కీం (సి) **BVRAAM** : బియాండ్ విజువల్ రేంజ్ ఎయిర్-టు-ఎయిర్ మిస్సైల్ (డి) పైవన్నీ
19. నేషనల్ ఆగ్రో ఫౌండేషన్ (**NAF**) గవర్నింగ్ కౌన్సిల్ ఛీఫ్ ఎవరు?
(ఎ) ఆర్.కె.పచౌరి (బి) నరేష్‌చంద్ర (సి) నైనాలాల్ కిద్వాయ్ (డి) వీరెవరూ కారు
20. యిటీవల యు.ఎస్.ఎ. దర్శించిందెవరు?
(ఎ) అసిఫ్ అలి జర్దారీ మరియు హమీద్ కర్జాయ్ (బి) అల్బర్టోఫ్యూజిమోరీ (సి) రోక్సానా సబేరీ (డి) రాటూ జోసెఫా ఇల్లోయిలో
21. వరల్డ్ బ్యాంక్‌లో గల సంస్థలేవి?
(ఎ) **IBRD & IDA** (బి) **IFC** (సి) **MIGA & ICSID** (డి) పైవన్నీ
22. ఈ క్రింది వాటిల్లో ఏది కరెక్ట్?
(ఎ) **RISAT** : రాడార్ ఇమేజింగ్ శాటిలైట్ (బి) అనుశాట్ : అన్నా యూనివర్సిటీ శాటిలైట్ (సి) **PSLV** : పోలార్ శాటిలైట్ లాంచ్ వెహికిల్ (డి) పైవన్నీ
23. యాక్సిస్ బ్యాంక్ క్రొత్త **MD & CEO** ఎవరు?
(ఎ) చందాకొచ్చర్ (బి) షిఖా శర్మ (సి) పి.జె. నాయక్ (డి) వీరెవరూ కారు
24. "ఐ షల్ నాట్ ఆస్క్ ఫర్ పార్డన్ – ఏమెమాయిర్ ఆఫ్ పాండురంగ్ 40 ఖోజీ" రచయిత్రి ఎవరు?
(ఎ) సావిత్రీ సాహ్నీ (బి) ఓ.సి.రెడ్డి (సి) ఎడ్వర్‌డో గాలియానో (డి) వీరెవరూ కారు
25. యు.ఎన్–యాంటీ రేసిజం కాన్ఫరెన్స్ యిటీవల ఎక్కడ నిర్వహించారు?
(ఎ) జెనీవా (బి) దర్బన్ (సి) జొహన్నాస్ బర్గ్ (డి) ఇవేవికావు
26. "అన్నం బ్రహ్మ" పుస్తక రచయిత్రి ఎవరు?
(ఎ) అంజలి పాఠక్ (బి) నిక్సన్ ఫెర్నాండో (సి) జైదీప్ సైకియా (డి) ఆర్.ఎస్. దేశ్‌పాండే
27. బారాజాస్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ ఎక్కడుంది?
(ఎ) మాడ్రిడ్ (స్పెయిన్) (బి) వార్సా (సి) లిస్‌బాన్ (డి) మనీలా
28. భారత రాష్ట్రపతి యిటీవల ఏ దేశాలు సందర్శిం చారు?
(ఎ) స్పెయిన్ అండ్ పోలాండ్ (బి) ఇండోనేషియా అండ్ వియత్నాం (సి) జపాన్ (డి) ఇవేవి కావు
29. **RISAT-2** వివరాలేవి?
(ఎ) ఇజ్రాయిల్ నుండి కొన్నారు (బి) దీనికి మైక్రోవేవ్ రాడార్ ఇమేజింగ్ కాన్ఫిగరేషన్ ఉంది (సి) **PSLV-C12** రాకెట్ ఆకాశంలో 18 నిమిషాలు ప్రయాణించిన తర్వాత **RISAT-2** ని 550 కి.మీ ఎత్తునున్న కక్ష్యలోకి గంటలకు 26,000 కి.మీ. వేగంతో తోసింది (డి) పైవన్నీ
30. 2009లో ఇస్రో ప్రయోగించనున్న ఉపగ్రహాలు ఏవి?
(ఎ) ఓషన్‌శాట్-2 (బి) రిసోర్స్‌శాట్-2 (సి) **RISAT-1** (డి) పైవన్నీ
31. యు.ఎస్. 31 బిలియన్ డాలర్ల ఖర్చుతో ఏ దేశం క్రొత్త నేషనల్ బ్రాడ్ బ్యాండ్‌నెట్‌వర్క్‌ని ఏర్పాటు చేయనున్నది?
(ఎ) ఆస్ట్రేలియా (బి) జపాన్ (సి) ఫిలిప్పైన్స్ (డి) ఇండోనేషియా

32. వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ డైరెక్టర్ జనరల్ ఎవరు?
(ఎ) మార్గరెట్ ఛాన్ (బి) కీజీఫుకూడా (సి) డా. సాయిద్‌జలాల్ (డి) వీరెవరూ కారు
33. ఈ క్రింది వాటిలో ఏది కరెక్ట్?
(ఎ) **BPLR :** బెంచ్‌మార్క్ ప్రైం లెండింగ్ రేట్ (బి) **PLR :** ప్రైం లెండింగ్ రేట్ (సి) **BPL :** బిలో పావర్టీ లైన్ (డి) పైవన్నీ
34. 100 రోజుల పాలనలో యు.ఎస్.ఎ. అధ్యక్షుడు బారాక్ హుస్సేన్ ఒబామా చేసిన పనులేవి?
(ఎ) 787 బిలియన్ డాలర్ల స్టిమ్యులస్ మనీ ప్యాకేజి (బి) 2,500 డాలర్ల టాక్స్ కట్ (వైద్య సంస్కరణలు, విద్యావిధానాలు (సి) క్రొత్త "హాఫ్ ప్యాక్" పాలసీ (డి) పైవన్నీ
35. "పాత్స్ ఆఫ్ గ్లోరీ" రచయిత ఎవరు?
(ఎ) జెఫ్రీ ఆర్చర్ (బి) కల్నల్ ఎ.పి. తన్వర్ (సి) పి. సాయినాథ్ (డి) వీరెవరూ కారు
36. ఈ క్రింది వాటిల్లో ఏది కరెక్ట్?
(ఎ) **FCTC :** ఫ్రేం వర్క్ కన్వెన్షన్ ఆన్ టొబాకో కంట్రోల్ (బి) **NA :** నార్కో ఎనాలసిస్ (సి) **BFA :** బ్రెయిన్ ఫింగర్ ప్రింటింగ్ (డి) పైవన్నీ
37. "టామిఫ్లూ" మందు, రసాయనిక నామం ఏమిటి?
(ఎ) ఓసెల్టా మివిర్ ఫాస్ఫేట్ (బి) పారసిటమాల్ (సి) సోడియం క్లోరైడ్ (డి) ఇవేవికావు
38. భారతదేశంలో ఎన్ని రాష్ట్రాలలో పెద్దపులులు నివశిస్తున్నాయి?
(ఎ) 17 (బి) 25 (సి) 10 (డి) 12
39. ఈస్టర్న్ పార్ట్‌నర్‌షిప్ లో గల దేశాలేవి?
(ఎ) ఆర్మేనియా, అజర్‌బైజాన్ (బి) బెలారస్, జార్జియా (సి) మోల్డోవా, ఉక్రెయిన్ (డి) పైవన్నీ (వీరంతా ప్రేగ్ సమావేశంలో కలిశారు)
40. ఈ క్రిందివాటిల్లో ఏది కరెక్ట్?
(ఎ) **IFPRI :** ఇంటర్నేషనల్ ఫుడ్ పాలసీ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (బి) **RCN :** రెడ్ కార్నర్ నోటీస్ (సి) **MVA :** మాన్యుఫాక్చరింగ్ వాల్యూ యాడెడ్ (డి) పైవన్నీ
41. సశస్త్ర సీమా సీమాబల్ **(SSB)** వివరాలేవి?
(ఎ) వీరు 1750 కి.మీ పొడవున్న ఇండియా-నేపాల్ సరిహద్దుని కాపలా కాస్తారు (బి) వీరు 660 కి.మీ. పొడవున్న ఇండియా-భూటాన్ సరిహద్దుని కాపలా కాస్తారు (సి) దీనిలో 25 బెటాలియన్లు ఉన్నాయి (డి) పైవన్నీ
42. "ఏంజెల్స్ అండ్ డైమన్స్" రచయిత ఎవరు?
(ఎ) డాన్ బ్రౌన్ (బి) కరణ్ థాపర్ (సి) నీలేష్ మిశ్ర (డి) ప్రిదు ఛండారి
43. జనరల్ రూక్‌మాంగద్ కటావల్ ఎవరు?
(ఎ) నేపాల్ ఆర్మీ స్టాఫ్ ఛీఫ్ (బి) ఇండోనేషియా ప్రధానమంత్రి (సి) ఫిలిప్పైన్స్ రాష్ట్రపతి (డి) వీరెవరూ కారు
44. ఇంఛియాన్ ఎయిర్‌పోర్ట్ ఎక్కడుంది?
(ఎ) సియోల్, దక్షిణ కొరియా (బి) ఉత్తర కొరియా (సి) వెనిజులా (డి) ఇవేవి కావు
45. జొహన్నా సిగురో ఆర్డోత్తిర్ ఎవరు?
(ఎ) ఐస్‌ల్యాండ్ క్రొత్త ప్రధానమంత్రి (బి) రష్యా ఆర్థిక మంత్రి (సి) బ్రెజిల్ రాష్ట్రపతి (డి) వీరెవరూ కారు
46. ఫిరోజ్ ఖాన్ నటించిన చేపట్టిన సినిమాలేవి?
(ఎ) ఖుర్బానీ, జాన్‌బాజ్ (బి) అపరాధ్ (సి) ది గాడ్ ఫాదర్, ధర్మాత్మ (డి) పైవన్నీ
47. అన్నిరకాల ప్రి-పెయిడ్ ఇన్‌స్ట్రుమెంట్‌ల విలువ ఎంత?
(ఎ) 50,000 డాలర్లు (బి) 100 డాలర్లు (సి) 1,000 డాలర్లు (డి) ఇవేవీ కావు
48. ఈ క్రింది వాటిల్లో ఏది కరెక్ట్?
(ఎ) **ANC :** ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్ (బి) **FATF :** ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్‌ఫోర్స్ (సి) **OECD :** ఆర్గనైజేషన్ ఫర్ ఎకనామిక్ కోపరేషన్ (డి) పైవన్నీ
49. ఈ క్రింది వాటిల్లో ఏది కరెక్ట్?
(ఎ) **UNCAC :** యునైటెడ్ నేషన్స్ కన్వెన్షన్ ఎగైనెస్ట్ కరప్షన్ (బి) **STAR :** స్టొలెన్ ఎస్సెట్స్ రికవరీ (సి) **GDP :** గ్రాస్ డొమెస్టిక్ ప్రొడక్ట్ (డి) పైవన్నీ
50. ప్రేం భాటి అవార్డ్ ఎవరికిస్తారు?
(ఎ) క్రీడాకారులకి (బి) జర్నలిస్టులకి (సి) రాజకీయ నాయకులకి (డి) సాంఘిక సేవ చేసినవారికి
51. ఐస్‌లాండ్ రాజధాని ఏది?
(ఎ) రిక్‌జవిక్ (బి) వార్సా (సి) ప్రేగ్ (డి) ఆస్తానా
52. యూరోపియన్ స్పేస్ ఏజెన్సీ త్వరలో ఏ టెలిస్కోప్‌ని అంతరిక్షంలోకి పంపనున్నది?
(ఎ) హబుల్ టెలిస్కోప్ అండ్ ప్లాంక్ టెలిస్కోప్ (బి) హెర్షల్ స్పేస్ అబ్జర్వేటరీ (సి) జేమ్స్ వెబ్ (డి) ఇవేవి కావు
53. భారతదేశం ఎంత విలువ గల ఐ.ఎమ్.ఎఫ్. బాండ్‌లు కొనదల్చుకుంది? (బిలియన్ యు.ఎస్. డాలర్లలో)
(ఎ) 10 (బి) 250 (సి) 150 (డి) 175
54. ప్రతిపాదిత "నేషనల్ సోలార్ మిషన్" లో గల అంశాలేవి?
(ఎ) 2020 నాటికి 20,000 ఎమ్.డబ్ల్యు సౌరశక్తి ఉత్పాదకశక్తి ఏర్పాటు (బి) 30 సంవత్సరాల కాలంలో దాదాపు రు. 1,05,000 కోట్లు వెచ్చిస్తారు (సి) ఒక లక్ష మంది శిక్షణ పొదిన, స్పెషలైజ్‌డ్ ఉద్యోగస్థులు కావాలి (డి) పైవన్నీ
55. శాంతా రామారావు రచించిన పుస్తకాలేవి?
(ఎ) హోం టు ఇండియా (1945) (బి) దిస్ ఈజ్ ఇండియా (1953) (సి) ది కుకింగ్ ఆఫ్ ఇండియా (1970) అండ్ గిఫ్ట్స్ ఆఫ్ పాసేజ్ (డి) పైవన్నీ
56. పోలాండ్ దేశంలో జాగిల్లోనియన్ యూనివర్సిటీ ఎక్కడుంది?
(ఎ) క్రాకౌ (బి) సెయింట్ పీటర్స్ బర్గ్ (సి) బార్సిలోనా (డి) బ్రస్సెల్స్
57. అబుసింబెల్ అండ్ ఫీలియా ఏ నది ఒడ్డున ఉన్నాయి?
(ఎ) నైలునది (బి) సింధునది (సి) కాబూల్ నది (డి) టైగ్రిస్ నది
58. **UNESCO** డైరెక్టర్ జనరల్ ఎవరు?
(ఎ) కోయిఛిరో మట్సురా (బి) పీటర్ జుంథోర్ (సి) షంషాద్ బేగం (డి) వీరెవరూ కారు
59. ఆర్.బి.ఐ. యిటీవల "రెపో అండ్ రెవర్స్ రెపో" రేట్లను ఎంత తగ్గించింది?
(ఎ) 0.25% (బి) 0.50% (సి) 0.75% (డి) 0.70%
60. ఈ క్రింది వాటిల్లో ఏది కరెక్ట్?
(ఎ) **CRAR :** కాపిటల్ టు రిస్క్ వైటెడ్ ఎస్సెట్ రేషియో (బి) **SCB :** షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంక్ (సి) **STRIPS :** సెపరేట్ ట్రేడింగ్ ఆఫ్ రిజిస్టర్డ్ ఇంటరెస్ట్ అండ్ ప్రిన్సిపల్ సెక్యూరిటీస్ (డి) పైవన్నీ
61. "నాస్‌కాం" అధ్యక్షులు ఎవరు?
(ఎ) సోంమిట్టల్ (బి) ప్రమోద్‌భాసిన్ (సి) కిరణ్ కార్నిక్ (డి) వీరెవరూ కారు
62. ఈ క్రింది వాటిల్లో ఏది కరెక్ట్?
(ఎ) స్పెయిన్ రాజధాని : మాడ్రిడ్ (బి) స్పానిష్ సెనేట్ అధ్యక్షులు : జేవియర్ రోజో (సి) హౌస్ ఆఫ్ కాంగ్రెస్ ఆఫ్ డిప్యూటీస్ (స్పెయిన్) అధ్యక్షులు : జోస్ బోనో (డి) పైవన్నీ
63. మిస్ ఇండియా యూనివర్స్ 2009గా ఎన్నికైన దెవరు?
(ఎ) ఏక్తాచౌదరి (బి) మలైకా అరోరాఖాన్ (సి) ఆకాంక్ష యాదవ్ (డి) వీరెవరూ కారు
64. ఈ క్రింది వాటిల్లో ఏది కరెక్ట్?
(ఎ) **ICOM :** ఇంటర్నేషనల్ కౌన్సిల్ ఆఫ్ మ్యూజియమ్స్ (బి) **CPCL :** చెన్నయ్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (సి) **CEC :** చీఫ్ ఎలక్షన్ కమిషనర్ (డి) పైవన్నీ
65. పొలిటికల్ మార్కెటింగ్ ఇన్ ఇండియా గ్రంథ రచయిత ఎవరు?
(ఎ) అరుణ్‌కుమార్ శర్మ (బి) కార్ల్‌ముల్లెన్ (సి) రాల్ ఆల్ఫోన్సిన్ (డి) వీరెవరూ కారు
66. సింధు నాగరికత స్క్రిప్ట్ మీద పరిశోధనలు చేసినందుకు గాను, యిటీవల ఎవరికి పద్మశ్రీ ఇచ్చారు?
(ఎ) ఐరావతం మహదేవన్ (బి) పంకజ్ అద్వానీ (సి) ఎమ్.ఎస్. ధోనీ (డి) వీరెవరూ కారు
67. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వెజిటబుల్ రీసెర్చ్ ఎక్కడుంది?
(ఎ) వారణాసి (బి) చిత్తరంజన్ (సి) శ్రీ పెరుంబుదూర్ (డి) ఇవేవి కావు
68. భారతదేశంలో, అత్యధికంగా వంకాయలు ఉత్పత్తి చేసే రాష్ట్రం ఏది?
(ఎ) పశ్చిమబెంగాల్ (1,64,000 హెక్టార్లలో పండిస్తోంది) (బి) బీహార్ (సి) ఛత్తీస్‌ఘడ్ (డి) ఇవేవి కావు
69. ఐ.పి.ఎల్ మ్యాచ్‌లలో ఆడే టీమ్ ల పేర్లేవి?
(ఎ) రాజస్థాన్ రాయల్స్, ఢిల్లీ డేర్ డెవిల్స్, చెన్నయ్

సూపర్ కింగ్స్ (బి) కింగ్స్ 11 పంజాబ్, ముంబయ్ ఇండియన్స్ (సి) కోల్‌కత్తా రైడర్స్, బెంగలూర్ ఛాలెంజర్స్, డక్కన్ ఛార్జర్స్ (డి) పైవన్నీ

70. ఐ.పి.ఎల్ మ్యాచ్‌లకు నిర్ధారించిన ప్రదేశాలేవి?
(ఎ) కేప్‌టౌన్, పోర్ట్ ఎలిజబెత్ (బి) దర్బన్, ఈస్ట్ లండన్, జొహన్నాస్‌బర్గ్ (సి) కింబర్లీ, బ్లో ఎంఫోటీన్, సెంచూ రియన్ (డి) పైవన్నీ (దక్షిణ ఆఫ్రికాలో ఉన్నాయి)

71. "డ్రీమ్స్ ఫ్రం మై ఫాదర్" అండ్ "ది అడాసిటీ ఆఫ్ హోప్" అనే పుస్తకాలు రాసిందెవరు?
(ఎ) బారాక్ హుస్సేన్ ఒబామా (బి) హిల్లరీ రోధాం క్లింటన్ (సి) బిల్ క్లింటన్ (డి) వీరెవరూ కాదు

72. "ప్రామిసెస్ టు కీప్" అనే పుస్తకం రాసిందెవరు?
(ఎ) జోబిడెన్ (యు.ఎస్.ఎ.) (బి) మిఛెల్లీ ఒబామా (సి) రాబర్ట్ జియోలిక్ (డి) వీరెవరూ కారు

73. 15వ లోక్‌సభకు ఎన్నికలు ఎన్ని దశలలో నిర్వహించారు?
(ఎ) 5 (బి) 2 (సి) 3 (డి) 4

74. నిక్కీ ఆసియా ప్రైజ్ 2009 ఎవరికిచ్చారు?
(ఎ) కిరణ్ మజుందార్ షా (బి) మన్‌మోహన్ సింగ్ (సి) మొహమ్మద్ యూనస్ (డి) ఎన్.ఆర్. నారాయణ మూర్తి

75. నేషనల్ అర్బన్ ట్రాన్స్‌పోర్ట్ పాలసీ లో గల అంశాలేవి?
(ఎ) పబ్లిక్ రవాణా కోసం కేంద్రం, రాష్ట్రాలకు ఆర్థిక వనరులు ఇస్తుంది (బి) 87 నగరాలలో రవాణా సదుపాయాల కోసం రు.4,35,380 కోట్లు కావాలి (సి) అత్యధిక క్యాపిటల్ ఖర్చు, దీర్ఘకాలిక జస్టేషన్ కాలం, ఉంటాయి (డి) పైవన్నీ

76. ఇంటర్నేషనల్ నర్సుల రోజు ఎప్పుడు?
(ఎ) మే 12 (బి) మార్చి 8 (సి) ఏప్రిల్ 7 (డి) ఇవేవి కావు

77. ఈ క్రింది వాటిల్లో ఏది కరెక్ట్?
(ఎ) "ది అసోసియేట్" : జాన్ గ్రిషామ్ (బి) "ఎ బెటర్ ఇండియా, ఎ బెటర్ వరల్డ్" : ఎన్.ఆర్. నారాయణమూర్తి (సి) "అన్ ఎకస్టమ్‌డ్ ఎర్త్" : ఝంపాలాహిరి (డి) పైవన్నీ

78. మే 13న ఎన్ని లోక్‌సభ స్థానాలకు ఎన్నికలు నిర్వహించారు?
(ఎ) 86 (బి) 107 (సి) 124 (డి) ఇవేవి కావు

79. కొత్త ఎలక్షన్ కమిషనర్ వివరాలేవి?
(ఎ) వి.ఎస్.సంపత్ (బి) 1973 బ్యాచ్ ఐ.ఎ.యస్. ఆఫీసర్ (సి) ప్రస్తుతం ఆయన వయస్సు 59 సంవత్సరాలు (డి) పైవన్నీ

80. "స్టిగ్లిట్జ్ కమిషన్" దాన్ని అధ్యయనం చేసింది?
(ఎ) యు.ఎన్. కమిషన్ ఆఫ్ ఎక్స్‌పర్ట్స్ ఆన్ రిఫార్మ్స్ ఆఫ్ ది ఇంటర్నేషనల్ మానిటరీ అండ్ ఫైనాన్షియల్ సిస్టమ్ (బి) ఐ.ఎమ్.ఎఫ్. (సి) డబ్ల్యు.బి. (డి) ఇవేవి కావు

81. డాల్టన్ గంజ్ రైల్వేస్టేషన్ ఎక్కడుంది?
(ఎ) జార్ఖండ్ (బి) పశ్చిమబెంగాల్ (సి) ఒరిస్సా (డి) సిక్కిం

82. స్పెయిన్ దేశ ప్రధానమంత్రి ఎవరు?
(ఎ) జోస్‌లూయిూ రోడ్రిగ్ జపాటెరో (బి) నికలస్ సార్కోజీ (సి) బెర్‌స్కులోనీ (డి) వీరెవరూ కాదు

83. లోక్‌సభలో అత్యధిక స్థానాలున్న రాష్ట్రాలేవి? (డిసెండింగ్ ఆర్డర్‌లో చెప్పండి)
(ఎ) ఉత్తరప్రదేశ్ (80), మహారాష్ట్ర (48) (బి) ఆంధ్ర ప్రదేశ్ (42), పశ్చిమ బెంగాల్ (42) (సి) బీహార్ (40), తమిళనాడు (39) (డి) పైవన్నీ (వీటిని **UMAWBT** అని గుర్తు పెట్టుకోవచ్చును)

84. ఏ దేశం నుండి మనదేశం ఫాల్కన్ **AWACS** విమానాలు దిగుమతి చేసుకుంటుంది?
(ఎ) ఇజ్రాయిల్ (బి) ఫ్రాన్స్ (సి) రష్యా (డి) యు.ఎస్.ఎ.

85. లోక్‌సభ రెండవదశ ఎన్నికలలో ఎన్ని సీట్లకు, పోటీ నిర్వహించారు?
(ఎ) 140 (బి) 124 (సి) 86 (డి) 85

86. నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కలరా అండ్ ఎంటరిక్ డిసీజెస్ ఎక్కడుంది?
(ఎ) కోల్‌కత (బి) పూనా (సి) డార్జిలింగ్ (డి) సిమ్లా

87. భారతదేశం ప్రతిరోజూ ఎంత సహజవాయువుని ఉత్పత్తి చేస్తుంది? **(mmcmdలలో)**
(ఎ) 25 (బి) 105 (సి) 75 (డి) 150

88. విట్‌లే అవార్డ్ యిటీవల ఎవరికి ప్రకటించారు?
(ఎ) ఎమ్.డి. మధుసూదన్ (బి) ఎల్.ఎమ్. గ్రోమోవ్ (సి) డొమినిక్‌స్ట్రాస్ (డి) వీరెవరూ కారు

89. మేఘాలయ నూతన ముఖ్యమంత్రి ఎవరు?
(ఎ) డి.డి. లపాంగ్ (బి) డొంకపూర్ రాయ్ (సి) పవన్ ఛామ్లింగ్ (డి) వీరెవరు కారు

90. ఈ క్రింది వాటిల్లో ఏది కరెక్ట్?
(ఎ) ఇన్‌ఫాంట్ మోర్టాలిటి రేట్ ప్రతి వెయ్యి జననాలకి 57 నుండి 55కి పడిపోయింది (2006-2007 మధ్య కాలంలో) (బి) ఐ.ఎమ్.ఆర్. గ్రామ ప్రాంతాలలో 27 నుండి 23కి పడిపోయింది (సి) మధ్యప్రదేశ్‌లో 72 (డి) పైవన్నీ

91. ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో కాంగ్రెస్ (ఐ) ఎన్ని సీట్లు సంపాదించుకుంది?
(ఎ) 157 (బి) 155 (సి) 294 (డి) ఇవేవి కావు

92. ఒరిస్సాలో అసెంబ్లీ బిజూ జనతాదళ్ పార్టీ ఎన్ని సీట్లు కైవసం చేసుకుంది?
(ఎ) 147 (బి) 100కి పైగా (సి) 120 (డి) ఇవేవి కావు

93. వరల్డ్ టెలికాం రోజు ఎప్పుడు?
(ఎ) మే 17 (బి) ఏప్రిల్ 7 (సి) మే 1 (డి) జులై 11

94. ఈ క్రింది వాటిల్లో ఏది కరెక్ట్?
(ఎ) ఏప్రిల్ 5 : నేషనల్ మారిటైం రోజు (బి) ఏప్రిల్ 7 : వరల్డ్ హెల్త్ డే (సి) ఏప్రిల్ 25 : వరల్డ్ మలేరియా డే (డి) పైవన్నీ

95. ఈ క్రింది వాటిల్లో ఏది కరెక్ట్?
(ఎ) మై ఆల్బం : ప్రవీణ్ మహాజన్ (బి) ఎ బెటర్ ఇండియా, ఎ బెటర్ వరల్డ్ : ఎన్.ఆర్. నారాయణమూర్తి (సి) ఇఫ్ క్రికెట్ ఈజ్ రెలిజియన్, సచిన్ ఈజ్ గాడ్ : విజయ్ సంతానం అండ్ శ్యాం బాలసుబ్రహ్మణ్యం (డి) పైవన్నీ

96. గ్లోబల్ ఫైనాన్షియల్ ఇంటిగ్రిటీ డైరెక్టర్ ఎవరు?
(ఎ) రేమండ్ డబ్ల్యు. బేకర్ (బి) గోర్డాన్ బ్రౌన్ (సి) బెంజమిన్ నెటాన్యాహూ (డి) వీరెవరూ కారు

97. యు.ఎస్.ఎ. లో ఫెడరల్ రిజర్వ్ సిస్టం ఎప్పుడు ప్రారంభించారు?
(ఎ) 1913 (బి) 1935 (సి) 1949 (డి) 1951

98. 1950-1958 కాలంలో తొలి చీఫ్ ఎలక్షన్ కమిషనర్ ఎవరు?
(ఎ) సుకుమార్ సేన్ (బి) కె.వి.కె. సుందరం (సి) ఎస్.పి. సేన్‌వర్మ (డి) టి. స్వామినాథన్

99. నేషనల్ సెక్యూరిటీ యాక్ట్ ఏ సంవత్సరం ఆమోదించారు?
(ఎ) 1980 (బి) 2001 (సి) 1976 (డి) 2004

100. "స్వాట్‌లోయ" ఎక్కడుంది?
(ఎ) పాకిస్తాన్ (బి) ఆఫ్ఘనిస్తాన్ (సి) రష్యా (డి) టిబెట్

101. ఈ క్రింది వాటిల్లో ఏది కరెక్ట్?
(ఎ) యుపిఎ : 263 (బి) ఎన్.డి.ఏ : 159 (సి) లెఫ్ట్ : 24 (డి) పైవన్నీ (ఇటీవలి లోక్‌సభ ఎన్నికలలో గెల్చుకున్న సీట్లు)

102. ఈ క్రింది వాటిల్లో ఏది కరెక్ట్?
(ఎ) ఢిల్లీ : 7 (బి) గుజరాత్ : 26 (సి) కర్ణాటక : 28 (డి) పైవన్నీ (ఆయా రాష్ట్రాలకు, లోక్‌సభలో ఉన్న ఎమ్.పి. సీట్లు)

## జవాబులు

| | | | | |
|---|---|---|---|---|
| 1-ఎ | 22-డి | 43-ఎ | 64-డి | 85-ఎ |
| 2-డి | 23-బి | 44-ఎ | 65-ఎ | 86-ఎ |
| 3-ఎ | 24-ఎ | 45-ఎ | 66-ఎ | 87-బి |
| 4-డి | 25-ఎ | 46-డి | 67-ఎ | 88-ఎ |
| 5-డి | 26-ఎ | 47-ఎ | 68-ఎ | 89-ఎ |
| 6-ఎ | 27-ఎ | 48-డి | 69-డి | 90-డి |
| 7-ఎ | 28-ఎ | 49-డి | 70-డి | 91-ఎ |
| 8-ఎ | 29-డి | 50-బి | 71-ఎ | 92-బి |
| 9-ఎ | 30-డి | 51-ఎ | 72-ఎ | 93-ఎ |
| 10-ఎ | 31-ఎ | 52-ఎ | 73-ఎ | 94-డి |
| 11-ఎ | 32-ఎ | 53-ఎ | 74-ఎ | 95-డి |
| 12-ఎ | 33-డి | 54-డి | 75-ఎ | 96-ఎ |
| 13-డి | 34-డి | 55-డి | 76-ఎ | 97-ఎ |
| 14-డి | 35-ఎ | 56-ఎ | 77-డి | 98-ఎ |
| 15-ఎ | 36-డి | 57-ఎ | 78-ఎ | 99-ఎ |
| 16-ఎ | 37-ఎ | 58-ఎ | 79-డి | 100-ఎ |
| 17-ఎ | 38-ఎ | 59-ఎ | 80-ఎ | 101-డి |
| 18-డి | 39-డి | 60-డి | 81-ఎ | 102-డి |
| 19-ఎ | 40-డి | 61-ఎ | 82-ఎ | |
| 20-ఎ | 41-డి | 62-డి | 83-డి | |
| 21-డి | 42-ఎ | 63-ఎ | 84-ఎ | |

# సామాజిక విపత్తుల నివారణ యాజమాన్యం

ఆసియా ఖండం ఇటీవల కొన్ని సంవత్సరాల్లో అన్ని రకాల విపత్తులను చవి చూసింది. ఆసియా ఖండం గత 15 సంవత్సరాల్లో అనేకసార్లు వైపరీత్యాలకు గురైనట్లు వివిధ అధ్యయనాలు, పరిశోధనలు, గణాంకాలు వివరిస్తున్నాయి. 1991-2005 మధ్యకాలంలో ఏటా సరాసరి పదిలక్షల (మిలియన్) మంది ప్రజల్లో 57,342 మంది వైపరీత్యాల వల్ల దెబ్బతిన్నట్లు తెలుస్తోంది. ఈ విపత్తులు జల వాతావరణం, భూ విజ్ఞాన సంబంధ, జీవ సంబంధమైన వాటిపై ప్రభావం చూపాయి. ఈ విపత్తుల వల్ల 577.44 అమెరికన్ బిలియన్‌ల విలువ గల ఆస్తి నష్టం వాటిల్లింది. చాలావరకు అభివృద్ధి చెందుతున్న, వర్ధమాన దేశాలపై ఈ ప్రభావం ఎక్కువగా ఉంది. వీటిలో కొన్ని దేశాలకు తిండి, గూడు, బట్ట వంటి కనీస అవసరాలకు కష్టంగా మారింది. ఈ దేశాలు భూభౌగోళిక రాజనీతి సంబంధ కారణాల వల్ల తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నాయి.

భారత్, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్తాన్, మాల్దీవులు, శ్రీలంక వంటి తదితర అనేక దేశాలు విపత్తుల యాజమాన్య విధానాన్ని రూపొందించాయి. ప్రతి వ్యక్తికి నష్టాల బారినుంచి ఎలా వెసులుబాటు కలిగించాలనే అంశం ఇప్పటికీ సవాల్‌గానే మిగిలింది. ఈ పరిస్థితిని నివారించేందుకు అనేక దేశాలు అధికార, నియంత్రణ వికేంద్రీకరణను చేపట్టి, వాటిలో సమాజ భాగస్వామ్యం కల్పించాయి. వైపరీత్యాల సమయంలో ప్రభావితమయ్యే సమాజాలను గుర్తించాలన్నది ప్రధానాంశం.

సామాజిక ఆధారిత విపత్తుల నివారణ యాజమాన్యం (సిబిడిఎం) సర్వామోదం పొంది విపత్తులకు అవకాశం గల ప్రాంతాల్లో విస్తృతంగా అమలవుతోంది. ప్రత్యేకంగా, స్థానిక విపత్తు యాజమాన్యంలో ప్రజలను అగ్ర భాగాన నిలిపింది. బయటి సంస్థలు ఈ ప్రక్రియను అమలు చేస్తాయి. సిబిడిఎం ద్వారా ప్రజలకు సమాచారాన్ని అందుబాటులోకి తేవడం, వనరులపై నియంత్రణ, మౌలిక సామాజిక సేవల కల్పనతో అత్యవసర సమయాల్లో ప్రజలు సత్వరం స్పందించేలా ఈ విధానం కృషి చేసింది. వైపరీత్యాల నుంచి నిభాయించుకు రావడానికి సామాజిక విధానం మంచి అవకాశం.

స్థానిక సమాజం తన అనుభవాల ఆధారంగా పరిస్థితిని మదింపు చేసుకునే అవకాశాన్ని సిబిడిఎం విధానం కలిగించింది. ఈ విధానం కింద ప్రణాళికల రూపకల్పన, విధాన నిర్ణయాల్లో స్థానిక సమాజం భాగం పంచుకోవడమే కాకుండా దాని అమలులో ప్రధాన భూమికను పోషిస్తోంది. అయితే విధాన నిర్ణయాలు తీసుకోవడంలోనూ, వాటి అమల్లోనూ సమాజానికి ప్రాధాన్యం ఇచ్చినప్పటికీ శాస్త్రీయత ప్రాముఖ్యతను, నష్టాల మదింపును, ప్రణాళికను సిబిడిఎం ఎన్నటికి విస్మరించదు. (పాండే, ఒక జాకీ, 2005)

స్థానికంగా నష్టాల నివారణ, సామర్థ్యం పెంపు ద్వారా భద్రతను కల్పించేందుకు ఈ సామాజిక విధానాలను చాలాకాలం క్రితమే గుర్తించారు.

మను గుప్తా, డైరెక్టర్, సీడ్స్ ఇండియా, న్యూఢిల్లీ



వివిధ సామాజిక వర్గాలు, జాతీయ, అంతర్జాతీయ సంస్థలు, కొన్ని చోట్ల ప్రభుత్వ విభాగాలు ఇప్పటికి రెండు దశాబ్దాలకు పైగా ఈ విధానాన్ని అమలు చేస్తున్నాయి. దేశంలోని వివిధ ప్రాంతాల్లో, పొరుగు దేశాల్లో 'సీడ్స్' ప్రాజెక్టులో పనిచేస్తున్న ఈ రచయిత అనుభవాల ఆధారంగా సిబిడిఎం ముఖ్య అంశాల్లో కొన్నిటిని ఈ వ్యాసం ప్రముఖంగా ప్రస్తావిస్తోంది.

## నష్టాలను తెలుసుకోవడం

సామాజిక ఆధారిత విపత్తుల నివారణ యాజమాన్యం (సిబిడిఎం) ప్రారంభానికి ముందు కష్టనష్టాలు ఎక్కడెక్కడ ఉన్నాయో గమనించాలి. అవి సామాజికంగా, భౌతికంగా, ఆర్థికంగా ఉండవచ్చు. ప్రమాదాలు అనివార్య మైనప్పుడు, వాటిని నివారించలేనప్పుడు నష్టాలను తగ్గించుకోవలసి ఉంది. మొత్తం నష్టాల నుంచి బయటపడేందుకు సామర్థ్యం పెంచుకోవాలి. ఉదాహరణకు, పాఠశాలలు లేకపోయినా, సరైన పాఠశాలలు లేనప్పుడు విద్యార్థులకు విద్యను అందించలేం. వైద్యులు, మందులు అందుబాటులో లేకపోతే సమాజంలో ఆరోగ్య పరిస్థితి అధ్వానంగా తయారవుతుంది. మామూలు సమయాల్లో సాధారణంగా ఉండే ఈ పరిస్థితి ఉపద్రవాలు సంభవించిన సమయాల్లో మరింత తీవ్రమవుతాయి. అంతే కాకుండా ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడం సామాజిక, మానసిక భావనే తప్ప అదే పరిష్కారం కాదు. నష్టాల అవకాశాలను తగ్గించుకునే ప్రయత్నం చేయడమే ఏకైక మార్గం.

కష్టాల నివారణ చర్యలు తీసుకునేందుకు, నష్టాలను తగ్గించేందుకు సాంకేతిక పరిజ్ఞానం, ఇతర పద్ధతులు ఉన్నప్పటికీ సమాజాలు సొంత ముందుచూపుతో పూచీకత్తు తీసుకోవడం అత్యంత ప్రధానం. నష్టాలను తెలుసుకునేందుకు విజ్ఞాన శాస్త్రం, నష్టనివారణకు తగిన యంత్రాంగం ఉండగా ఇంకా సమాజానికి ప్రమేయం కల్పించడం ఎందుకనే ప్రశ్న ఉదయించడం సహజం. అయితే నష్టాలకు తగిన కారణాలు తెలియకుండా తీసుకునే చర్యలు ఒక్కొక్కసారి విఫలం కావచ్చు. అందుకే వాటిని తెలుసుకుని అమలు చేయడంలో సమాజానికి భాగస్వామ్యం కల్పించాలన్నది ఆ ప్రశ్నకు సమాధానంగా చెప్పవచ్చు.

'సీడ్స్' తన సిబిడిఎం కార్యక్రమాల అమలులో స్థానిక సమాజాలకు అవకాశం కల్పించింది. బృందచర్చలు, అనేకమందితో ముఖాముఖిలు, పెట్టుబడిదారులు, కమ్యూనిటీ వర్క్‌షాప్‌ల వంటి విధానాలు కష్టనష్టాల మదింపునకు ఉపకరిస్తాయి. ప్రజలు తమ ఇబ్బందులను తెలుసుకునేందుకు ఈ ప్రక్రియలు దోహదపడతాయి. ఇబ్బందులను అంచనా వేయగలిగితే వాటికి పరిష్కార మార్గాలు తెలుసుకుని సామాజిక సేవ ద్వారా ఆ ఇబ్బందులను అధిగమించ వచ్చు. ఉదాహరణకు, హిమాచల్‌ప్రదేశ్ లోని మషోబ్రా కొండ ప్రాంతంలో విస్తరించిన ప్రజలు, వరదలు, కొండచరియలు విరిగిపడే సమయాల్లో అక్కడి నదిని దాటడానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాకపోకలకు ఏర్పడిన ఇబ్బందిని గుర్తించారు. దరిమిలా, స్థానిక గ్రామ పంచాయతీ అక్కడ వంతెన నిర్మించింది. యావత్ సమాజం అక్కడి ఇబ్బందులను గుర్తించడం వల్లే ఆ సమస్యకు చక్కని పరిష్కారం లభించింది.

## సిబిడిఎంకు పాఠశాలలు ప్రవేశమార్గం

సమాజ వికాసానికి పాఠశాలలు చిహ్నాలు. అంతేకాకుండా విపత్తుల సమయంలో కొన్నిసార్లు అవి పునరావాస కేంద్రాలుగా మారి బాధితులకు నిలువ నీడ, వైద్య సదుపాయాలు, ఆహారం సమకూరుస్తున్నాయి, అందువల్ల పాఠశాలలను 'సురక్షిత సహజ స్థావరాలు'గా వ్యవహరిస్తారు. సమాజం ఆ సురక్షిత స్థావరాలను ఆశ్రయిస్తూ ఆయా సంస్థలతో అనుబంధాన్ని పెంచుకుంటుంది. ఆ పాఠశాలలు ఇతర విషయాలతో పాటు ఇబ్బందులకు అవకాశాల గురించి తెలియచెబుతాయి. భావిపౌరులైన విద్యార్థులు సమాజంలో విజ్ఞానవ్యాప్తికి ఉత్తమ సాధనాలుగా ఉపకరిస్తారు. విజ్ఞాన బదిలీకి వారు ఉత్ప్రేరకాలుగా ఉపకరిస్తారు. అంతిమంగా విపత్తుల నివారణ గురించి తల్లిదండ్రులకు, ఆ తర్వాత మొత్తం సమాజానికి చేరుతుంది.

'సురక్షిత సమజానికి సురక్షిత పాఠశాల' అనే భావనను 'సీడ్స్' తన సిబిడిఎం ప్రాజెక్టుల్లో చురుకుగా ప్రవేశపెట్టింది. దీనిని ఇటీవల హిమాచల్ ప్రదేశ్‌లో ప్రవేశపెట్టారు. అంతర్జాతీయ సంస్థ - క్రిష్టియన్ ఎయిడ్ అండ్ యూరోపియన్ కమిషన్ దీనికి సహకరిస్తోంది. ఆ రాష్ట్ర ప్రభుత్వం కూడా అందులో భాగస్వామిగా ఉంది. విపత్తులు తగ్గించడంపై పాఠశాల విద్యార్థులకు, ఉపాధ్యాయులకు, పాఠశాలల్లో ఆశ్రయం పొందేవారికి, ఆ పరిసరాల వాసులకు అవగాహన కల్పించాలన్నది ప్రధానోద్దేశం. గ్రామాల్లోని విపత్తుల నివారణ కమిటీలో ఆయా పాఠశాలలకు చెందిన పిల్లల తల్లిదండ్రులు, స్థానిక పాఠశాల అధికారులు, గ్రామ నాయకులు, స్థానిక సంస్థల అధికారులు సభ్యులుగా ఉంటారు. విపత్తుల సమయంలో స్పందించే విధానంపై పాఠశాల విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ఈ కమిటీ శిక్షణ ఇచ్చింది. పాఠశాల వెలుపలి వారు కూడా ఉపద్రవాలు ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నారు. విద్యార్థులను పాఠశాలల నుంచి సురక్షిత ప్రాంతాలుగా గుర్తించిన ప్రదేశాలకు తరలించవలసి వస్తే టాస్క్‌ఫోర్స్‌లు ఆ కార్యక్రమాన్ని నిర్వహిస్తాయి. అలా కాకుండా, ఒకవేళ ఆ పాఠశాలలనే సురక్షిత ప్రాంతాలుగా గుర్తిస్తే అక్కడే రక్షణ, సహాయ కార్యక్రమాలు చేపడతారు. ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొనేందుకు పాఠశాలలు, స్థానిక సమాజాలు పరస్పరం సహకరించుకుంటూ తమ తమ శక్తి సామర్థ్యాలను పటిష్టపరచుకోవాలి.

## సిబిడిఎం సంస్థాగతంతో పటిష్ట అభివృద్ధి

సామాజిక ఆధారిత విపత్తుల నివారణ యాజమాన్యం సంస్థాగతమైనప్పుడే అది పటిష్టతను సాధిస్తుంది. అభివృద్ధి చర్యల కింద, విపత్తుల వల్ల దెబ్బతినే సమాజాలను గుర్తించి వాటిని వెల్లడించాలి. మామూలు అభివృద్ధి కార్యక్రమాలతో పాటే నష్ట నివారణ విధానం చేపట్టడం ద్వారా పటిష్టమైన అభివృద్ధికి గణనీయంగా కృషి చేయవచ్చు. విపత్తు నివారణ యాజమాన్యం నిర్వాహకులు, విద్యావేత్తలు, పరిశోధకులు తదితరులు ఈ సందర్భంగా వైపరీత్యాల రహిత అభివృద్ధిని నొక్కి చెప్పారు. కాగా అందుకు భిన్నంగా, ఒక్కొక్కసారి అభివృద్ధి పనులే అనర్థాలకు దారితీసే సందర్భాలు కూడా ఉంటాయి. ఉదాహరణకు, ఒరిస్సాలో అంతర్ రాష్ట్ర రవాణాను మెరుగు పరిచేందుకు భూమికి ఎత్తుగా ప్రధాన రహదారి నిర్మించారు. ఫలితంగా, దానికి మరో పక్క గల గ్రామాలు పల్లంగా మారాయి. దీంతో భారీ వర్షాలు సంభవించినప్పుడు రహదారి నుంచి నీరు గ్రామాల్లోకి ప్రవహించి వరద ముంచెత్తుతోంది. ఇలా అభివృద్ధి పనులు కాస్తా ఆపదకు దారితీశాయి. అభివృద్ధిని, విపత్తులను విడివిడిగా చూడడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడింది. సంస్థాగతంగా ఏర్పడి పనులను ఏకీకృతం చేయడం, వనరులను సద్వినియోగం చేసుకోవడం ద్వారా ఇలాంటి నష్టాలను నివారించవచ్చు.

భారతదేశంలో సామాజిక ఆధారిత విపత్తుల నివారణ యాజమాన్యం గుర్తింపు పొందింది కానీ ఇంతవరకు సంస్థాగతం కాలేదు. వైపరీత్యాల నిరోధక యాజమాన్యం చట్టం-2005, జాతీయ, రాష్ట్ర, స్థానిక స్థాయిల్లో విపత్తుల నిరోధక ప్రణాళికా కమిటీల ఆవశ్యకతను గుర్తించింది. ఆ మేరకు ప్రణాళిక రూపకల్పన ప్రారంభమైంది కానీ ఇంకా ఆచరణకు రాలేదు.

భారతదేశంలో సిబిడిఎం విస్తృతంగా అమలు కావడానికి పంచాయతీ రాజ్ సంస్థల పాత్ర, విధులు విస్తరించాలి. వాటికి తగిన వనరులు సమకూర్చి అవసరమైన శిక్షణ ఇవ్వాలి. దేశంలోని అనేక ప్రాంతాల్లో ప్రజాదరణ పొందిన 'గ్రామీణ విజ్ఞాన కేంద్రాలు' ప్రకృతి వైపరీత్యాల గురించి కలిగే కష్టనష్టాల గురించి స్థానికులకు తెలియచెబుతున్నాయి.

## సామాజిక విపత్తుల నిధి

సిబిడిఎం కు సంస్థాగతంతో పాటు నిధులు మరో ముఖ్యఅంశం, సిబిడిఎం కార్యక్రమాల నిర్వహణకు స్థానికుల నుంచి నిధుల సేకరణ యోచనను 'నేషనల్ అలయన్స్ ఫర్ డిజాస్టర్ రిస్క్ రిడక్షన్' (ఎన్ఎడిఆర్ఆర్) ప్రతిపాదించింది. ప్రజల నుంచి గృహోపకరణాలను, తమ సంపాదన నుంచి కొంత చిన్న మొత్తాన్ని సేకరించి వారి సంరక్షణకే వినియోగిస్తారు.

ఈ నిధులను విపత్తుల నివారణకు, సహాయ కార్యక్రమాలకు ఎక్కువగా వినియోగిస్తారు. ఈ నిధుల నిర్వహణ బాధ్యతను గ్రామ అభివృద్ధి కమిటీలు వహిస్తాయి.

*(మిగతా 32వ పేజీలో)*

# ఫక్రుద్దీన్ అలీ అహమ్మద్

'పద్మశ్రీ' తుర్లపాటి కుటుంబరావు
కేంద్ర సాహిత్య అకాడమీ విశిష్ట సభ్యులు



భారత స్వాతంత్ర్యోద్యమం జాతి, మత, కుల, స్త్రీ పురుష వివక్షకు అతీతంగా జరిగిన మహత్తర జాతీయోద్యమం. ఆనాడు ఇప్పటివలె నాయకులను లేదా ఎన్నికలలో అభ్యర్థులను కుల, మత దృష్టితో చూచేవారు కాదు. కులం ఏదైనా, మతం ఏదైనా ఆ నాయకుని లక్షణాలను, జాతీయ భావాలను, దేశభక్తిని, త్యాగనిరతిని మాత్రమే పరిగణించేవారు. ఇప్పుడు మనం ఆధునిక నాగరిక ప్రపంచంలో పురోగమిస్తున్నప్పటికీ, రాజకీయ, ప్రజాహిత రంగాలలో మాత్రం ఆనాటి కంటే తిరోగమిస్తున్నామనే చెప్పాలి. కుల, మత తత్వాలు వెర్రితలలు వేస్తున్నాయి. ముఖ్యంగా "కులగజ్జి" మరీను! ఇది ఎంతైనా గర్హించదగిన పరిణామం.

మన స్వాతంత్ర్యోద్యమంలో హిందూ, ముస్లింలు చెట్టాపట్టాలేసుకుని పోరాడారు. మౌలానా అజాద్, "సరిహద్దు గాంధి" ఖాన్ అబ్దుల్ గఫార్‌ఖాన్, డాక్టర్ అన్సారీ, మహమ్మదాలీ షౌకతాలీ సోదరులు, అసఫాలీ, జాకిర్ హుస్సేన్, ఫక్రుద్దీన్ అలీ అహమ్మద్‌లు ప్రముఖపాత్ర వహించారు. వీరిలో మౌలానా ఆజాద్ 1940లో రామ్‌ఘర్ కాంగ్రెస్‌కు అధ్యక్షుడై, 1945-46 సంవత్సరాలలో భారత స్వాతంత్ర్య ప్రదానంపై బ్రిటిష్ ప్రభుత్వం భారతీయ నాయకులతో జరిపిన చర్చలలో అత్యంత కీలకమైన పాత్ర నిర్వహించారు. ఖాన్ అబ్దుల్ గఫార్‌ఖాన్‌ను "సరిహద్దు గాంధి" గా యావద్భారత దేశం ఎంతో గౌరవ ప్రపత్తులతో చూచింది.

డాక్టర్ జాకిర్ హుస్సేన్ రాష్ట్రపతి పదవిని అధిష్ఠించిన తొలి జాతీయ ముస్లిం నాయకుడు. అలాగే అస్సాంకు చెందిన ప్రముఖ జాతీయ ముస్లిం నాయకుడు ఫక్రుద్దీన్ అలీ అహమ్మద్ 1974లో రాష్ట్రపతి పదవిని అధిష్ఠిం చిన మరో ముస్లిం ప్రముఖుడు. అయితే, దురదృష్టవశాత్తు, రాష్ట్రపతి పదవిని అధిష్ఠించిన ఇద్దరు ముస్లిం ప్రముఖులూ తమ పదవీ మధ్యకాలంలోనే ఆకస్మికంగా మృతి చెందారు!

ఫక్రుద్దీన్, వి.వి. గిరి తరువాత రాష్ట్రపతి పదవిని చేపట్టారు. గిరి రెండవ టెర్మ్ రాష్ట్రపతి పదవిలో కొనసాగాలని కోరినట్లు, అందుకు ప్రయత్నించినట్లు ప్రతీతి. అయితే, అందుకు అప్పటి ప్రధాని ఇందిరాగాంధి విముఖత్వం చూపారు. అప్పుడు కేంద్రంలో మంత్రిగా వున్న ఫక్రుద్దీన్‌ను ఇందిరాగాంధి రాష్ట్రపతిగా ఎన్నిక చేయించారు. అందుకు ఒక ప్రధాన కారణం కూడా కనిపిస్తుంది.

## అంతరాత్మ ప్రబోధం

అంతకు పూర్వం 1969లో రాష్ట్రపతి పదవికి పోటీ జరిగినప్పుడు ప్రధాని ఇందిరాగాంధి అప్పటి లోక్‌సభ స్పీకర్ నీలం సంజీవరెడ్డి పేరును ప్రతిపాదించారు. అయితే, అది ఆమె ఇష్టపూర్వకంగా జరిగినట్లు లేదు. ఆ సంవత్సరం మే 19వ తేదీన సంజీవరెడ్డి జన్మదినోత్సవం సందర్భంలో అభినందించడానికి ఆయన ఇంటికి వెళ్ళి ప్రధాని "ఈసారి రాష్ట్రపతి పదవికి మీరే కాంగ్రెసు అభ్యర్థి" అని స్పష్టం చేశారు.

అయితే, ఆమె ఆ తరువాత మనస్సు మార్చుకున్నారు. బెంగుళూర్‌లో జరిగిన కాంగ్రెసు పార్లమెంటరీ బోర్డు సమావేశంలో రాష్ట్రపతి పదవికి కాంగ్రెసు అభ్యర్థిగా జగ్‌జీవన్‌రామ్ పేరును ప్రతిపాదించారు. అనాటి కాంగ్రెసులోని "సిండికేట్" సభ్యులు సంజీవరెడ్డి పేరు ప్రతిపాదించగా, వై.బి.చవాన్ ఓటుతో- ఒక్క ఓటు మెజారిటీతో, సంజీవరెడ్డి కాంగ్రెసు అభ్యర్థిగా ఎన్నికైనారు. అప్పుడే అంతవరకు ఉపరాష్ట్రపతిగా వున్న గిరి రాష్ట్రపతి పదవి తనకు రావడం న్యాయమని భావించి, ఉపరాష్ట్రపతి పదవికి తాను ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ చేస్తున్నట్టు ప్రకటించారు. బెంగుళూర్ నుంచి ఢిల్లీ వెళ్ళిన ప్రధాని ఇందిరాగాంధి, సంజీవరెడ్డి తాను కోరిన అభ్యర్థి కాదు కాబట్టి, తాను కూడా గిరి అభ్యర్థిత్వాన్ని బలపరుస్తున్నట్లు ప్రకటించారు!

## రాజకీయ కుట్ర

ఇందుకు ఆమె చూపిన కారణాలు కూడా లేకపోలేదు. సాధారణంగా, రాష్ట్రపతి వంటి ఉన్నత పదవులకు పోటీలోకి దిగిన అభ్యర్థులు తమను బలపరచవలసిందిగా ప్రతిపక్షాల వారిని కూడా "లాంఛనంగా" కోరడం ఆనవాయితీ. అలాగే సంజీవరెడ్డి కూడ చిన్నపార్టీలైన జనసంఘం, స్వతంత్ర పార్టీల నాయకులతో మంతనాలు జరిపి, తన అభ్యర్థిత్వాన్ని బలపరచ వలసిందిగా కోరారు. అందులో ఒకటి మతతత్వ పార్టీ, మరొకటి అభివృద్ధి నిరోధకపార్టీ అని భావించిన ఇందిరాగాంధి ఆగ్రహించి, కాంగ్రెసు అభ్యర్థి తమ ప్రతికూల పార్టీలతో మంతనాలు జరపడమేమిటని ప్రశ్నించారు. ఇది తనకు వ్యతిరేకంగా జరుగుతున్న 'రాజకీయ కుట్ర' గా ఆమె భావించారు.

అందువల్ల, శ్రీ సంజీవరెడ్డిని ఓడించి, ఇండిపెండెంట్ అభ్యర్థి గిరిని గెలిపించడానికి ఆమె నిర్ణయించారు. కాంగ్రెసు ఓటర్లు పార్టీ దృష్టితో కాక, "అంతరాత్మ ప్రబోధానుసారం" ఓటు చేయాలని ఆమె ఒక ఉద్యమాన్ని ప్రారంభించారు. దీన్ని ఆమె స్వయంగా చేపట్టక, ఆ పనిని తన తరఫున ఫక్రుద్దీన్ అలీ అహమ్మద్, జగ్‌జీవన్‌రామ్‌లకు అప్పగించారు. వారి ప్రచారం నెగ్గింది. సంజీవరెడ్డి ఓటమి, గిరి గెలుపు! అందువల్లనే, ఫక్రుద్దీన్‌ను 1974లో రాష్ట్రపతి పదవికి గిరి తరువాత అభ్యర్థిగా ఆమె నిర్ణయించారని ప్రతీతి. ఫక్రుద్దీన్ రాష్ట్రపతి పదవి ఎన్నిక వెనుక ఇన్ని నాటకీయ పరిణామాలు జరిగాయి.

## పుట్టు పూర్వోత్తరాలు

ఫక్రుద్దీన్ 1905 మే నెల 13న ఢిల్లీలో జన్మించారు. ఆయన తండ్రి జల్‌నూర్ అలీ బ్రిటిష్ సైన్యంలో కల్నల్‌గా పనిచేశారు. అయినా, ఆయనది స్వతంత్ర వ్యక్తిత్వం.

ఫకృద్దీన్ లండన్‌లో అత్యున్నత 'లా' డిగ్రీ బారిష్టర్ పట్టా సాధించారు. భారతదేశం తిరిగి వచ్చిన తరువాత ఆయన లాహోర్‌లో లాయర్‌గా ప్రాక్టీసు పెట్టారు. బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా వచ్చిన కేసులలో ఆయన వకాల్తాలు తీసుకుని, ఆ ప్రభుత్వం అక్రమాలను తూర్పార పట్టేవారు.

1931లో ఆయన అస్సాం రాష్ట్ర కాంగ్రెసులో సభ్యుడుగా చేరారు. అది ఆయన జీవితంలో పెద్ద మలుపు. 1940లో జరిగిన వ్యక్తి సత్యాగ్రహంలోను, 1942 ఆగస్టు ఉద్యమంలోను పాల్గొని ఆయన కారాగారవాస శిక్షలు అనుభవించారు.

## రాష్ట్ర మంత్రిత్వం

1937లో ఆయన అస్సాం అసెంబ్లీకి కాంగ్రెసు టిక్కెట్టుపై ఎన్నికైనారు. 1938 లోనే ఆ రాష్ట్ర ఆర్థిక మంత్రిత్వం ఆయనను వరించింది. అస్సాం శాసనసభకు ఆయన రెండుసార్లు ఎన్నికైనారు. అప్పటికి భారతదేశం ఇంకా బ్రిటిష్ పాలనలోనే వుంది. అయినా, ఆయన తనకు అవకాశం చిక్కినప్పుడల్లా ఆ ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టేవారు, లాయర్ కదా! భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత కూడా ఆయన రెండుసార్లు రాష్ట్ర శాసనసభకు ఎన్నికైనారు. 1952లో రాజ్యసభ సభ్యత్వం. 1971నాటికి ఆయన కేంద్రస్థాయికి వెళ్ళారు. లోక్‌సభ సభ్యుడై, అనేక మంత్రిత్వశాఖలను సమర్థంగా నిర్వహించారు. చివరికి 1974 జులై 19న రాష్ట్రపతి పదవిని అధిష్టించారు.

## ఎమర్జెన్సీలో...

అయితే, రాష్ట్రపతిగా వున్న సమయంలో ఆయనపై ఒక విషయంలో తీవ్రవిమర్శ వచ్చింది. అది ఒక విధంగా మచ్చలేని ఆయన రాజకీయ జీవితంపై మచ్చ అనే చెప్పాలి. 1975లో ప్రధాని ఇందిరాగాంధి దేశంలో ఎమర్జెన్సీ విధించదలచి, జూన్ 25 అర్ధరాత్రి ఎమర్జెన్సీ ఆర్డినెన్స్‌ను న్యాయశాఖ మంత్రి సిద్ధార్థ శంకర్ రే ద్వారా రాష్ట్రపతి సంతకానికై పంపారు. అయితే, రాజ్యాంగరీత్యా అంత ముఖ్యమైన ఆర్డినెన్స్‌కు ముందుగా కేంద్ర మంత్రివర్గం ఆమోదించాలి. కాని, కేంద్ర మంత్రివర్గం ఆమోదముద్ర లేకుండానే తన వద్దకు సరాసరి ప్రధాని నుంచి వచ్చిన ఆర్డినెన్స్‌పై రాష్ట్రపతి సంతకం చేయడం రాజ్యాంగ విరుద్ధమని విమర్శలు వెలువెత్తాయి. అయినా, రాష్ట్రపతి ఫకృద్దీన్ దేశభక్తిని కాని, నిజాయితీని కాని ఎవ్వరూ శంకించలేదు.

## ఖైదీని ప్రేమించిన పెండ్లికుమార్తె

ఆయన వివాహం కూడా విచిత్రంగానే జరిగింది. ఆయన జైలులో వున్నప్పుడు పెండ్లి సంబంధం వచ్చింది. పెండ్లి కుమార్తె పేరు బేగం అబీదా. స్వాతంత్ర్యోద్యమంలో జైలులో వున్న ఖైదీకి పిల్లను ఎలా ఇవ్వడమని అబీదా తరపు పెద్దలు కొందరికి సందేహం కలిగింది. "కాదు, నేను అంత గొప్పవాడైన ఆయననే చేసుకుంటా"నని అబీదా పట్టుపట్టేసరికి ఎవ్వరూ మాట్లాడలేక పోయారు.

ఫకృద్దీన్‌కు గోల్ఫ్ ఆట అంటే ఇష్టం. 1977 ఫిబ్రవరి 10వ తేదీన లక్నో వెళ్ళినప్పుడు గోల్ఫ్ ఆట ఆడుతుండగా, ఆయనకు గుండెనొప్పి వచ్చింది. వెంటనే ఢిల్లీ తీసుకువచ్చారు. 1977 ఫిబ్రవరి 11న ఆయన మృతి చెందారు. ఫకృద్దీన్ రాష్ట్రపతిగా వున్నది రెండేళ్ళ ఆరునెలలే! ■

## విపత్తుల నిర్వహణ...

***30వ పేజీ తరువాయి***

ప్రభుత్వ ప్రాయోజిత గ్రామీణాభివృద్ధి పథకం, పనికి నగదు పథకం తదితర కార్యక్రమాలకు వీటిని వినియోగిస్తారు. సిబిడిఎం ప్రయత్నాలు మరింత ముమ్మరంగా సాగేందుకు ముందు ముందు ఈ నిధి కీలకాంశం కానుంది.

## సిబిడిఎం ముందున్న సవాళ్ళు

గ్లోబల్ వార్మింగ్ వల్ల ఏర్పడుతున్న పర్యావరణ మార్పులు సమాజాలకు ఆందోళనకరంగా పరిణమిస్తున్నాయి. వాతావరణ మార్పులు జీవితం, జీవనం పైన ప్రభావం చూపుతున్నాయి. వాతావరణ మార్పులు సంప్రదాయకంగా వస్తున్న అనావృష్టి ప్రాంతాల్లో కూడా మెరుపు వరదలకు దారితీస్తున్నాయి. ఇలాంటి సవాళ్ళ పరిష్కారానికి సిబిడిఎం లాంటి సామాజిక ఆధారిత విపత్తుల నివారణ విధానం వంటివి బాగా ఉపకరిస్తాయి.

గ్రామీణ దుర్బలత్వం నుంచి వాతావరణ మార్పుల వల్ల బాధితులుగా మారడంతో విపత్తు నిరోధక నిర్వాహకులు నష్టనివారణ వైపు విభిన్నంగా దృష్టి సారించారు. అలాగే, కోస్తా ప్రాంత ప్రజల్లోనూ మార్పులు కనిపిస్తున్నాయి. సముద్రం కోత, సముద్రం చొచ్చుకురావడం ప్రజల తరలింపునకు కారణ మవుతున్నాయి. అదే సమయంలో, సముద్రం ఆటుపోట్లు, సునామీ లాంటి ఉపద్రవాల నుంచి ప్రజలను కాపాడే సముద్రతీరంలోని మడచెట్లు అంతరిస్తు న్నాయి. ఫలితంగా, పర్యావరణం క్షీణిస్తూ, తమిళనాడు కోస్తా తీరవాసులు సునామీ సమయంలో తీవ్రంగా నష్టపోయారు. పెద్ద ఎత్తున ఎగసిపడే అలల నుంచి ప్రజలను కాపాడేందుకు మడచెట్ల పునరుద్ధరణకు వారికి శిక్షణ ఇస్తున్నారు. వాతావరణ మార్పుల కారణంగా చెడిపోయిన పర్యావరణ పరిరక్షణకు సామాజిక ఆధారిత విపత్తుల నివారణ యాజమాన్య విధానాన్ని ఏకీకృతం చేయాలి.

## సిబిడిఎం తో పేదరిక నిర్మూలన

విపత్తులను తగ్గించడాన్ని సాధారణ విషయంగా భావిస్తున్నారు. అయితే సిబిడిఎం పేదరికాన్ని సంపూర్ణంగా నిర్మూలించే శక్తి కలిగి ఉంది. విపత్తుల సమయంలో పేద కుటుంబాలు బాగా దెబ్బతింటున్నాయి. భారతదేశంలోని పేదలు నీరు, ఆహారం, దుస్తులు, విద్య, ఆరోగ్యం వంటి కనీస అవసరాలకు కూడా నోచుకోవడం లేదు. వారు కష్టపడి ఆర్జించిన కొద్దిపాటి ఆస్తులను విపత్తులు కబళించి, వారిని ఒక్కసారిగా పేదరికం విషవలయంలోకి నెడుతున్నాయి. సిబిడిఎం ప్రక్రియ స్థానికంగా శక్తి సామర్థ్యాలు పెంచి జీవితాలకు, జీవనభృతికి భద్రత కల్పిస్తోంది. ఇలాంటి శక్తి సామర్థ్యాలు విపత్తుల వల్ల దెబ్బతిన్న వారిలో మనోస్థైర్యాన్ని నింపుతాయి. దశాబ్దాల తరబడి జరిగిన అభివృద్ధిని ప్రకృతి వైపరీత్యాలు క్షణంలో ధ్వంసం చేస్తుండగా, మరోవంక, సిబిడిఎం ఆ నష్టాల ప్రభావాన్ని తగ్గించి పటిష్ఠ అభివృద్ధికి బాటలు వేస్తోంది. 'హైగో ఫ్రేం వర్క్ ఆఫ్ యాక్షన్' (2005–2015) విపత్తుల నిరోధక యాజమాన్య చట్టం, సంస్థాగత విధానాలను మరింత విస్తృతంగా అమలు చేసేందుకు అనువైన సమయం కనుక, సామాజిక ఆధారిత విపత్తుల నివారణ యాజమాన్యం ఆ దిశలో చర్యలు చేపట్టింది. *(ఎ.ఎస్.ఆర్. కౌశిక్)*

శ్రీశ్రీ శతజయంతి సందర్భంగా

# శ్రీశ్రీ రక్తం కవిత! శ్రీశ్రీ ఊపిరి నవత!!

డా. ద్వా.నా. శాస్త్రి
ప్రముఖ సాహితీవేత్త
పోటీ పరీక్షల నిపుణులు



"సాయం ప్రస్ఫుటరాగ రంజిత లత్సంపూర్ణ సౌందర్యరాశీ యుక్తామల దివ్యమూర్తి....." అంటూ శ్రీశ్రీ పదిహేడవ ఏటనే ప్రౌఢమైన పద్యకావ్యం "ప్రభవ" రాశాడు. అసలు ఎనిమిదవ ఏటనే కందపద్యం రాసిన ప్రజ్ఞాశాలి శ్రీశ్రీ.

ఆ తర్వాత శ్రీశ్రీలోని అసలు శ్రీశ్రీ విజృంభించాడు. 'కష్టజీవి'కి ఇరువైపులా నిలిచేవాడే కవి అని చాటాడు.

"కదిలేదీ కదిలించేదీ మారేదీ మార్పించేదీ
పాడేదీ పాడించేదీ పెనునిద్దుర వదిలించేదీ
మునుముందుకు సాగించేదీ పరిపూర్ణపు బ్రదుకిచ్చేదీ"

మాత్రమే కవిత్వమనే అవగాహనకు వచ్చాడు.

"కష్టజీవులకు కర్మవీరులకు
నిత్యమంగళం నిర్దేశిస్తూ"

కవిత్వం రాశాడు. తెలుగు కవిత్వానికి అంతర్జాతీయ స్థాయి కల్పించాడు. తెలుగు శబ్దాలకు పరువూ-బరువూ చేకూర్చాడు. శబ్దతీవ్రత, భావవేగం అంటే ఏమిటో తెలియజేశాడు. 'కాదేదీ కవిత కనర్హం' అంటూ ప్రబోధించాడు. అందుకే సగర్వంగా "ఈ శతాబ్దం నాది" అని ప్రకటించగలిగాడు.

శ్రీశ్రీ అనబడే శ్రీరంగం శ్రీనివాసరావు విశాఖపట్నంలో 1910లో జన్మించాడు. 1910 ఆధునిక కవిత్వానికి 'చుక్కాని' అయిన సంవత్సరం. 'బాలనటుడు' గా నటించాడు. "సావిత్రీ సత్యవంతుడు" అనే పద్య నాటకాన్ని చిన్నప్పుడే రచించాడు. విశాఖపట్నంలో 'సాహితీసమితి' అనే సంస్థలో చేరి క్రియాశీలుడయ్యాడు. "కవితాసమితి" ద్వారా రాటు తేలాడు. మొదట్లో 'పరిణయ రహస్యము' అనే నవలను రాశాడు. బి.ఏ. చదివి కొంతకాలం ఎ.వి.ఎన్. కళాశాలలో "డిమాన్‌స్ట్రేటర్" గా పనిచేశాడు. ఆ తర్వాత నిరుద్యోగిగా కష్టాలు పడ్డాడు. గుమాస్తాగా, పత్రికా విలేకరిగా, సబ్‌ఎడిటర్‌గా పనిచేశాడు. ఏదీ సంతృప్తి నివ్వలేదు, కూడూ పెట్టలేదు. సినిమా రచయితగా మారినప్పుడు ఆర్థికంగా నిలదొక్కుకొన్నాడు.

*శ్రీశ్రీ అంటే ఒక సంచలనం!*
*శ్రీశ్రీ అంటే ఒక ఝంఝ!*
*శ్రీశ్రీ అంటే నవత, సమత!*

అనిపించుకొనేలా, "మహాప్రస్థానం" కావ్యం రాశాడు. ఇది శ్రీశ్రీకి మరో పేరయింది. ఇవాళ్టికీ శ్రీశ్రీ అంటే గుర్తుకొచ్చేది ఈ కావ్యమే! అంతవరకు ఎవరూ మహాప్రస్థానంలాగా రాయలేదు. వస్తువుకో నవ్యత, భావంలో నవ్యత, శబ్దంలో నవ్యత! అదీ శ్రీశ్రీ అంటే, అందుకే అన్నాడు -

"నేనొక దుర్గం - నాదొక స్వర్గం
అనితర సాధ్యం నా మార్గం'
' అని

"మహాప్రస్థానం" ఇప్పటికి ఇరవై ఎనిమిది సార్లు పునర్ముద్రించబడిందంటే ఎంతగా ప్రాచుర్యం పొందిందో తెలుసుకోవచ్చు. దీనికి చలం "యోగ్యతా పత్రం" అనే గొప్ప పీఠిక రాశాడు. "ప్రపంచపు బాధ అంతా శ్రీశ్రీ బాధ" అని చలం సరిగ్గా అంచనా వేశాడు. అభ్యుదయ కవిత్వోద్యమానికి ప్రాణం మహాప్రస్థానం. కార్మికలోకపు కళ్యాణాన్ని శ్రామికలోకపు సౌభాగ్యాన్ని ఆకాంక్షించాడు. "శ్రమైక జీవన సౌందర్యానికి సమానమైనది లేద"ని చాటి చెప్పాడు. సామాన్యుడి చరిత్రను విస్మరించకూడదన్నాడు.

"ఏ దేశచరిత్ర చూచినా ఏమున్నది *గర్వకారణం?*
నరజాతి చరిత్ర సమస్తం పరపీడన పరాయణత్వం"

అంటూ దేశచరిత్రకు సరికొత్త వ్యాఖ్యానం చేసిన మార్క్సిస్టు శ్రీశ్రీ. మహా ప్రస్థానం అంటే గొప్ప ప్రయాణం. ఈ దోపిడీ వ్యవస్థ నుంచి, ఈ పెత్తందారీ సమాజం నుంచి వర్గరహిత సమాజం కోసం, సామ్యవాద వ్యవస్థ కోసం చేసే ప్రయాణమే మహాప్రస్థానం. "కర్షకవీరులు" అనే పదాన్ని మొదట శ్రీశ్రీయే వాడాడు. యుద్ధం చేసేవాడే వీరుడు కాదు - జనం కోసం, సమాజం కోసం పంట పండించేవాడూ వీరుడే అని చాటిన యుగకర్త శ్రీశ్రీ.

"స్వాతంత్ర్యం, సమభావం సౌభ్రాత్రం, సౌహార్దం
పునాదులై ఇళ్ళులేచి జనావళికి శుభం పూచి
శాంతి, శాంతి, శాంతి, శాంతి జగమంతా జయిస్తుంది"

అంటూ ఆశాభావాన్ని వ్యక్తం చేశాడు. సామ్యవాద స్వర్గాన్ని కలగన్నాడు.

శ్రీశ్రీ శబ్ద బ్రహ్మ. ఆరుద్ర అన్నట్లు 'శబ్ద విరించి'. శ్రీశ్రీకి శబ్దాలు వాటంతటవే తోసుకుంటూ 'నే వస్తా నే వస్తా' నంటాయి. కొందరన్నట్లు శ్రీశ్రీ శబ్దతీవ్రత ఎంతంటే అర్థం గురించి ఆలోచించనే ఆలోచించం.

"కణకణమండే గలగల తొణకే"
"భగ భగ భుగ భుగ భగభగమండే"

అంటూ ధ్వన్యనుకరణ శబ్దాలను ప్రయోగించడంలో గానీ,

"ఢంకా ధ్వానం, బలి వితర్ది, కపాలగణం, వర్షకాభ్రము" వంటి సంస్కృత పదాలను ప్రయోగించడంలో గానీ -

"కేక, కొలిమి, మూలుగు, పీనుగు, కూడు, గూడు" వంటి తెలుగు పదాలను ప్రయోగించడంలో గానీ -

విశ్వవృష్టి, విద్యుత్తేజం, మనస్సినీవాలి, ధర్మజలం వంటి కొత్త పదబంధాలను సృష్టించడంలో గానీ -

శ్రీశ్రీకి శ్రీశ్రీయే సాటి. శ్రీశ్రీ శబ్ద శక్తి భావోద్దీపనను కలిగిస్తుంది. అసలు ఆ శబ్దాలకే నూతనత్వం చేకూరుతుంది. శ్రీశ్రీకి గల సంప్రదాయ బలం ఇంతా అంతా కాదు. శ్రీశ్రీ వాడిన ప్రతీకలలో చాలావరకు పురాణ ప్రతీకలే. అయితే ఆ పురాణ పాత్రల్ని, స్థలాల్ని, పారిభాషిక పదాల్ని తన అభ్యుదయ భావాలకు, తన సామాజిక భావాలకు అనుగుణంగా చిత్రించడంలోనే శ్రీశ్రీ అసామాన్య ప్రతిభ కనబడుతుంది.

"యముని మహిషపు లోహఘంటలు
మబ్బుచాటున ఖణేల్ మన్నాయి"

అన్నప్పుడు యముడు పెత్తందారుకి, దోపిడీదారుడికి ప్రతీక. మహిషం శ్రామికుడికి ప్రతీక. ఇలా పురాణ ప్రతీకల ద్వారా తిరుగుబాటు తత్త్వాన్ని ప్రకటించడం అనితం పూర్వమైనది. శ్రీశ్రీ కవిత్వంలో జీవిత వాస్తవికత వుంది. వస్తు వైవిధ్యం వుంది.

శ్రీశ్రీ కేవలం కవి మాత్రమే కాదు. "చరమరాత్రి" ద్వారా కథకుడయ్యాడు. "ఒసే తువ్వాలందుకో" వంటి కథల్లో చైతన్య స్రవంతిని ప్రవేశపెట్టాడు.

"5, 3, 2 ఆముక్తమాల్యద ఆటవెలది ద్విపదకర్తగారు"

అనే విధంగా అధివాస్తవిక కవిత్వానికి (సర్రియలిజమ్) శ్రీకారం చుట్టాడు.

శ్రీశ్రీ ఏ ప్రక్రియ చేపట్టినా, పట్టిందల్లా బంగారం చేశాడు. 1+1=1 అనే నాటికల సంపుటిలో కూడా శ్రీశ్రీ ప్రతిభ దర్శనమిస్తుంది. శ్రీశ్రీ కంద పద్యాలతోనే కవి అయ్యాడని చెప్పాం. ఆ కంద పద్యాలతోనే "సిరిసిరిమువ్వ శతకం" రాసి 'ఔరా' అనిపించుకున్నాడు. శతక ప్రక్రియ దేనికైనా సమర్థవంతమైనది అని నిరూపించాడు శ్రీశ్రీ.

ఈ శతకంలో విసుర్లున్నాయి. చమక్కులున్నాయి. మానవ స్వభావాలున్నాయి. రాజకీయాలున్నాయి... ఎన్నో ఉన్నాయి.

"ఎప్పుడు పడితే అప్పుడు
కప్పుడు కాఫీ నొసంగి గలిగిన సుజనుల్
చొప్పడినయూర నుండుము
చొప్పడకున్నట్టి యూరుచొరకుము మువ్వా"

అని ప్యారడీలు రాశాడు.

"దెయ్యాలను చూపిస్తా
నయ్యారమ్మనుచు నొక్క ఆసామీ నా
కయ్యో, తన కూతుళ్లను
చెయ్యూపుచు పిలిచి చూపె సిరిసిరి మువ్వా"

అంటూ నవ్విస్తాడు. పానుగంటి లక్ష్మీ నరసింహారావు రాసిన సాక్షి వ్యాసాలు అద్భుతమైనవి. తెలుగు వచన రచనా వైభవానికి ఆ వ్యాసాలు నిదర్శనాలు. వాటిని శ్రీశ్రీ ఎలా పొగిడాడో చూడండి.

"లక్ష్మీ నరసింహారావు పానుగంటి
సాక్షి వ్యాసాలు చదవడం మాననం'టి
ఎంచేతంటే వాటిలో పేనులాంటి
భావానికాయన ఏనుగంటి
రూపాన్నియ్యడం నేను గంటి"!

శ్రీశ్రీ అరసం నుంచి విప్లవ రచయితల సంఘానికి అధ్యక్షుడయ్యాడు. విప్లవాన్ని సమర్థిస్తూ "మరో ప్రస్థానం" రాశాడు. అయితే పాఠకుడిన కదిలించేది, పెను నిదుర వదిలించేది మహాప్రస్థానం మాత్రమే! మరో ప్రస్థానంలో ఇలా గళమెత్తాడు శ్రీశ్రీ -

"భారత కురుక్షేత్రంలో
నవయుగ భగవద్గీతా ఝుం ఝుని ప్రసరిస్తాను
మంటలచేత మాట్లాడించి
రక్తం చేత రాగాలాపన చేయిస్తాను"

సిరిసిరిమువ్వ శతకం, ప్రాస క్రీడలు, లిమరుక్కులు అనే మూడింటిని కలిపి 'సిప్రాలి' గా ప్రచురించడం కూడా విశేషమే. శ్రీశ్రీ రాసిన 'ఖడ్గసృష్టి' కి కేంద్ర సాహిత్య అకాడమీ బహుమతి, సోవియెట్ లాండ్ నెహ్రూ అవార్డు వచ్చాయి. 'చైనాయానం' అనే దియత్రా సాహిత్య రచన. తన స్వీయచరిత్రను ఎటువంటి దాపరికాలూ లేకుండా, ఉన్నది ఉన్నట్టు 'అనంతం' పేరుతో రాశాడు. గురజాడపై విమర్శవ్యాసాలు రాసి విమర్శకుడయ్యాడు. అనువాదంలో చెయ్యి తిరిగినవాడు. 'వారం-వారం', 'వ్యూలు-రివ్యూలు' రాశాడు. శ్రీశ్రీ సినిమా రంగంలో 'వహ్వా' అనిపించుకున్నాడు. డబ్బింగ్ రచనకి అప్పట్లో శ్రీశ్రీయే దిక్కు అయ్యాడు. శ్రీశ్రీ పాటల్లో సాహిత్యంపై పరిశోధనలు వెలువడ్డాయి. "పాడవోయి భారతీయుడా!" తెలుగువీర లేవరా, శ్రీశ్రీ పాటలు - అనే పుస్తకాలు వెలువడ్డాయి.

"సత్కవుల్ హాలికులైననేమి" అని పోతన అంటే
"సత్కవుల్ ఆల్కహాలికులైననేమి" అని శ్రీశ్రీ చమత్కరించాడు.
ఆకాశవాణి వారు శ్రీశ్రీని
"ఏనాటికయినా రాసివ్వండి" అంటే శ్రీశ్రీ శ్లేషతో
"ఏ నాటికయినా రాసిస్తానులే" అన్నాడు.

దేవులపల్లి కృష్ణశాస్త్రి మరణించినప్పుడు - షెల్లీ మళ్ళీ మరణించాడు అని కితాబిచ్చాడు.

అందుకే శ్రీశ్రీ అరిస్తే పద్యమే! అతను ఆడినమాటెల్ల అమృతకావ్యమే. అత్యాధునిక కవిత్వానికి శ్రీశ్రీయే యుగకర్త.

"నా రచనలలో లోకం ప్రతిఫలించి
నా తపస్సు ఫలించి
నా గీతం గుండెలలో ఘూర్ణిల్లగ
నా జాతిజనులు పాడుకునే
మంత్రంగా మ్రోగించాలని"

చాటిన శ్రీశ్రీ తెలుగువాడైనందుకు గర్విద్దాం! శతజయంతిని జరుపుకుందాం! ■

# ఆదివాసీల ఆరోగ్యం - ఒక పరిశీలన

వలమళ్ళ కృష్ణయ్య, ఫ్రీలాన్స్ రచయిత



కొండలు, కోనలు, పచ్చనిచెట్లు, పారుతున్న వాగులు, గెడ్డలు, ప్రకృతి వారి సొంతం. ఇది ఒక కోణం మాత్రమే. అలా ప్రవహిస్తున్న నీరే వారికి విషతుల్యం కావడం శాపమే. మన్యంలో అయినా మైదాన ప్రాంతంలో అయినా కలుషిత నీరు అనారోగ్యానికి కారణమనడంలో సందేహం లేదు. దేశంలో ఏటా సుమారు 3.77 కోట్ల మంది కాలుష్య నీరు తాగడం వల్ల వ్యాధుల బారిన పడుతున్నారని, అందులో 75% వరకు పిల్లలేనని గణాంకాలు తెలియ చేస్తున్నాయి. దామాషా ప్రకారం సరాసరిన చూస్తే బాధితుల్లో మన్యం వాసులే ఎక్కువ. మన రాష్ట్రంలో సుమారు 65% నీరు కలుషితమైందని తెలుస్తోంది. ఇందులో డయేరియా, కలరా, హెపటైటిస్ వంటి వ్యాధులకు దారితీసే బాక్టీరియా ఉన్నట్లు నిపుణుల పరీక్షల్లో తేలింది. పారిశుద్ధ్య లోపం వల్ల దాదాపు కోటి 70 లక్షల మంది బాక్టీరియాతో కూడిన కలుషిత నీటితోనే బతుకీడుస్తున్నారు. రక్షిత నీరు అందిస్తున్న 122 దేశాల్లో మనదేశం 120వ స్థానంలో ఉందని ఒక సర్వేలో వెల్లడైంది.

ఏజెన్సీలో వైద్య ఆరోగ్య రంగానికి పెద్ద మొత్తంలో నిధులు కేటాయిస్తున్నట్లు ప్రభుత్వం చెబుతుండగా మరోవంక పరిస్థితిలో మార్పు లేకపోవడం విమర్శలకు తావిస్తోంది. స్వచ్ఛమైన నీరు అందించేందుకు ప్రణాళికలను తయారు చేస్తున్నామని ప్రభుత్వాలు చెబుతున్నా ఆ దిశలో పనిచేయడం లేదని విమర్శలు ఉన్నాయి. ఏటా కాలానుగుణ వ్యాధులు ప్రబలి అనేకమంది అస్వస్థులవుతున్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లోని గిరిజనులు ఏదో ఒక వ్యాధితో బాధపడుతున్నారు. పార్వతీపురంలో విషజ్వరాలు, కామెర్లు సోకితే, ఆదిలాబాద్ మన్యంలో డయేరియా, నల్లమలలో మలేరియా, విశాఖ ఏజెన్సీలో ఆంత్రాక్స్ విజృంభించగా, నల్గొండ జిల్లా తండాల్లో ఫ్లోరైడ్ సమస్య ఇలా... ప్రతి ప్రాంతంలో ఏదో ఒక సమస్య గిరిజనులతో చెలగాటమాడుతూనే ఉంది. మలేరియా కారణంగా రక్తహీనత ఏర్పడుతోంది. గిరిజనుల్లో వ్యాధులపై అవగాహన కల్పించాల్సిన వైద్య సిబ్బంది అటుగా తొంగిచూడడం లేదనే విమర్శలు ఉన్నాయి. దానికి తోడు గిరిజనులలో పారిశుద్ధ్యం పై అవగాహన లేకపోవడం కూడా ఈ పరిస్థితికి మరో కారణం.

విషజ్వరాలు మలేరియా, అతిసార, మెదడువాపు తదితర వ్యాధులు గుక్క తిప్పుకోనివ్వని పరిస్థితిలో 'ఆంత్రాక్స్' వ్యాధి మరింత బెంబేలెత్తిస్తోంది. అనారోగ్యంతో చనిపోయిన ఆవు, గేదె, గొర్రె తదితర జంతువుల మాంసభక్షణ వల్ల, మాంసాన్ని రోజులు తరబడి నిల్వ చేసుకుని తినడం వల్ల ఈ వ్యాధి సోకుతుందని వైద్య ఆరోగ్య శాఖ వర్గాలు అంటున్నాయి. పశువుల్లోని బాక్టీరియాతో వ్యాధి సోకి, శరీరమంతా పుండ్లు వచ్చి ప్రాణాంతకంగా మారుతుందని ఆ వర్గాలు అంటున్నాయి. వాంతులతో పాటు కడుపు ఉబ్బరంగా ఉండడం ఈ వ్యాధి లక్షణాలని వైద్య ఆరోగ్యశాఖ తెలిపింది. సరైన ఉపాధి లేని మన్యవాసులు జీడి, మామిడి టెంకలు, అనారోగ్యంతో చనిపోవడానికి సిద్ధంగా ఉన్న పశువుల మాంసంతో ఆకలి తీర్చుకునే ప్రయత్నంలో ఈ వ్యాధి బారినపడుతున్నారు. పశు మాంసాన్ని భుజించకుండా అవగాహన కలిగించేందుకు ప్రయత్నిస్తోంది. విశాఖ జిల్లాలోని ముంచంగిపుట్, చింతపల్లి మండలాల్లో ఈ వ్యాధి లక్షణాలు గల కొన్ని కేసులు బయటపడ్డాయి. ఈ వ్యాధి నిరోధానికి వైద్యసిబ్బంది అప్రమత్తంగా ఉన్నప్పటికీ మరణాలు తప్ప(డం) లేదు. తగినన్ని మంచినీటి పథకాలు లేకపోవడం, ఉన్నవి కూడా సరిగా ఉపయోగించకపోవడం వల్ల గిరిజనులు వాగులు, గెడ్డలపై ఆధారపడడం అనివార్యమవుతోంది. వాటినుంచి ప్రవహించే కలుషిత నీరు ఆదివాసీలకు ప్రాణాంతకంగా మారుతోంది. తాగునీటి కోసం ఏర్పాటు చేసిన బోర్లలో నీరు రాక గిరిజన మహిళలు కిలోమీటర్ల కొద్దీ వెళ్ళవలసి వస్తోంది. విశాఖ ఏజెన్సీలోని 11 మండలాల్లోని ఇలాంటి పరిస్థితే నెలకొని కలుషిత నీరే ప్రత్యామ్నాయమవుతోంది. నల్గొండ జిల్లాలోని గిరిజన తండాలు ఒకవైపు ఫ్లోరైడ్ సమస్యతో అవస్థ పడుతుంటే, మరోవంక మంచినీటి గొట్టపు మార్గాలకు రంధ్రాలు పడి నీరు కలుషితమవుతోంది. నల్గొండ జిల్లాలో ఫ్లోరైడ్ సమస్య నివారణకు నాలుగేళ్ళుగా గట్టి ప్రయత్నం చేశామని, 80% పనులు పూర్తయ్యాయని, మరో 20% పనులు పూర్తి కావలసి ఉందని రెండవసారి ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరించి డాక్టర్ వై.ఎస్. రాజశేఖరరెడ్డి మే 21న హైదరాబాద్‌లో "మీట్ ది ప్రెస్"లో చెప్పారు. ఏ గ్రామంలోనూ ఫ్లోరైడ్ అనేదే లేకుండా చేస్తామని ఆయన భరోసా కూడా ఇచ్చారు. అది ఫలించాలని ఆశిద్దాం!

ఖమ్మం జిల్లాలో రక్షిత నీటి పథకాల్లో క్లోరినేషన్ చేయకపోవడంతో నీరు కలుషితమవుతోందని ప్రధాన ఆరోపణ కాగా, చాలీచాలని నిధులతో అది సాధ్యం కావడం లేదన్నది ఆరోగ్యశాఖ సిబ్బంది వాదన. ఆదిలాబాద్ జిల్లాలోని ఏజెన్సీతో పాటు మారుమూల తండాలవాసులు చెరువులు, వాగులు, బావులపై ఆధారపడటం వల్ల, అడుగంటిన బురదనీరు అనారోగ్యానికి దారితీస్తోంది.

నల్లమల్లలోని చెంచులు అతిసారం, మలేరియా, క్షయ వ్యాధులతో మంచ మెక్కుతున్నారు. కర్నూలు జిల్లాలోని 42 చెంచుగూడేలకు గాను, 32 గూడేలు నల్లమల అటవీ ప్రాంతంలోనే ఉన్నాయి. అక్కడ ఇంచుమించు ప్రతి కుటుంబంలో ఒకరు ఏదో వ్యాధితో బాధపడుతున్నవారే. ఆదిలాబాద్ జిల్లాలోని అనేక గిరిజన తండాల్లో మలేరియా, ఆంత్రాక్స్ మరణాలు నమోదయ్యాయి.

## అవగాహన లేమి

గిరిజనంలో అవగాహన లోపించడమే వ్యాధుల వ్యాప్తికి కారణమన్నది ప్రజా ప్రతినిధుల నుంచి విద్యావేత్తల వరకు సమిష్టి అభిప్రాయంగా ఉంది. మన్యవాసుల్లో నిరక్షరాస్యత, మూఢనమ్మకాలు వంటి వాటివల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. వారిలోని అవగాహనా రాహిత్యానికి ఏం చేయలేక

*(మిగతా 37వ పేజీలో)*

# పరిపాలనా సంస్కరణలతో సుపరిపాలన

కె. రవి ఎం.ఎ.,
పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్
ఉస్మానియా యూనివర్సిటీ
హైదరాబాద్

గుడ్ గవర్నెన్స్ లేదా సుపరిపాలన అనేది నేడు ప్రపంచవ్యాప్తంగా ఒక చర్చనీయ అంశంగా మారింది. ప్రజలకు కావల్సిన అవసరాలను తీర్చడం వారి యొక్క అభివృద్ధికి కృషి చేయడమే కాకుండా, పారదర్శకమైన జవాబుదారి తనంతో కూడిన ప్రభుత్వపాలననే సుపరిపాలన అని అనవచ్చు. యు.ఎన్.ఓ. కు సంబంధించిన అభిప్రాయంలో పేదరిక నిర్మూలనలో సుపరిపాలన అనేది ముఖ్య భూమికను పోషిస్తుంది. అయితే భారతదేశం వంటి వనరులుండి వాటిని సద్వినియోగం చేసుకోలేకపోతున్న దేశాలలో సుపరిపాలన అనే స్వప్నం కావాలంటే పరిపాలనలో సమూలమైన సంస్కరణలు తప్పనిసరి అవుతాయి. పరిపాలన సంస్కరణలతో కూడిన పాలనను మనం పూర్తి స్థాయిలో అమలు పరచిన రోజు భారతదేశం అభివృద్ధి చెంది ప్రపంచ దేశాల సరసన అగ్రగామిగా అవుతుంది.

## భారతదేశంలో పాలనా సంస్కరణలు

పాలనా సంస్కరణ అనేది సమాజ అభివృద్ధికి నిరంతర అవసరం. పాలన కాలంతో పాటు మారుతున్న సమస్యలను పరిష్కరించేదిగా ఉండాలి. స్వాతంత్ర్యం అనంతరం భారతదేశం భిన్నమైన రాజకీయ వ్యవస్థ ఏర్పరచు కున్నప్పటికీ కొన్ని బ్రిటిష్ పరిపాలనా రీతులు మాత్రం మనకు వారసత్వంగా వచ్చాయి. కాని స్వాతంత్ర్యం తరువాత అనేకమైన మార్పులు అవసరమయ్యాయి.

1. ఇది వరకు ఎక్కడో ఏ మూల నుండో జరిగే ప్రభుత్వ పాలన కేంద్రీకృతంగా ఉండేది. 1950 తర్వాత పరిస్థితిలో మార్పు వచ్చింది. భారతదేశంలో పార్లమెంటరీ ప్రజాస్వామ్య దేశంగా అవతరించింది. క్రమం తప్పకుండా జరిగే ఎన్నికలలో వయోజనులు తమ ఓటు హక్కును వినియోగించుకోవడం ద్వారా పార్లమెంటరీ ప్రజాస్వామ్యం రూపొందింది.
2. భారతదేశం రాష్ట్రాల యూనియన్ కేంద్రము మరియు రాష్ట్రాలు తమ పరిధిలలో స్వయం ప్రతిపత్తిని కలిగి పాలన నిర్వహించేందుకు రాజ్యాంగం ఆమోదించింది.
3. భారత రాజ్యాంగం ప్రజల ఆర్థిక, సామాజిక అభివృద్ధి దృష్ట్యా ఆదేశ సూత్రాలను పొందుపరచింది. అభివృద్ధి దృష్ట్యా ప్రభుత్వాలు వాటిని పాటించాల్సిన అవసరం వుంది.

ఇప్పటివరకు దేశంలో రెండు పరిపాలనా సంస్కరణ సంఘటనలను కేంద్ర ప్రభుత్వం నియమించింది. ఒకటవ పరిపాలనా సంస్కరణల కమిటి పాల్ ఆపిల్ బి చైర్మన్‌గా 1954లో తన యొక్క నివేదికను సమర్పించింది. 2005లో మళ్ళీ వీరప్పమొయిలీ చైర్మన్‌గా రెండవ పరిపాలనా సంస్కరణల కమిటీ నియమించబడింది. ఈ కమిటీలు వారి యొక్క నివేదికలను సమర్పించి అనేక సంస్కరణలతో ప్రజలకు సుపరిపాలన అందించవచ్చని పేర్కొన్నాయి.

రెండవ పరిపాలనా సంస్కరణ కమిటి యొక్క సిఫార్సులు ప్రభుత్వం అమలు చేయాలనే నిర్ణయం కేంద్రం చేసింది. అయితే అభివృద్ధి చెందుతున్న దేశాలు ఎక్కువగా పాశ్చాత్య దేశాలపై దృష్టి పెట్టడం వాటి పద్ధతుల్ని అనుసరించడం జరుగుతూనే ఉంది. అభివృద్ధి క్రమంలో ఏర్పడే సమస్యలను నివారించడానికి తమదే సరియైన మార్గమని ఎవరికి వారు చెప్పుకొంటారు. అయితే పాలనా సంస్కరణలు అన్నివేళలా అన్నిదేశాల్లో అనుసరణీయం కాకపోవచ్చు. భిన్న సంస్కృతులు, భిన్న అలవాట్లు ఉన్న దేశాల్లో ఒకే విధమైన పద్ధతులను అనుసరించడం సాధ్యం కాకపోవచ్చు కానీ, సుపరిపాలన ఎజెండా కోసం కొన్ని కొన్ని పద్ధతులు దత్తత తీసుకొని మన దేశంలోను అమలు చేయచ్చు. ఉదాహరణకు సివిల్ సొసైటీ మరియు సంస్థల యొక్క ప్రాముఖ్యాన్ని భారతదేశం ఇతర అభివృద్ధి చెందిన దేశాల నుండి స్వీకరించింది.

పౌర సమాజం యొక్క ప్రాముఖ్యత పబ్లిక్ రంగం యొక్క ప్రాముఖ్యత తగ్గడం వలన పెరిగింది. ప్రభుత్వ ప్రాముఖ్యత ఎంతవరకైతే తగ్గిందో ఆ స్థాయిలో పౌర సమాజం కూడా పనిచేయాల్సిన అవసరం ఉన్నది. సుపరిపాలన లో ప్రభుత్వ పాత్రలతో పాటు మార్కెట్టు పోటీలకు తగిన స్థానం ఉంటుంది. ప్రజాస్వామ్యం బలోపేతం అవటానికి సివిల్ సొసైటీలు దృష్టి పెడతాయి. దీనివలన అవసరమైన రాజకీయ నమూనాను అందించే దిశలో ప్రజాస్వామ్యం అవతరిస్తుంది. ఈ సుపరిపాలన లో ఆర్థిక సరళీకరణ-ప్రజాస్వామ్యం పరస్పర సంబంధాన్ని కలిగి ఉంటాయి. సాంప్రదాయకమైన ప్రభుత్వంలో అన్నిచోట్ల ప్రభుత్వ ప్రమేయం ఉంటుంది. కాని సుపరిపాలనలో ప్రజాస్వామ్య ఆర్థిక సరళీకరణలు కలసి ఉంటాయి. సుపరిపాలన కోసం మరిన్ని సంస్కరణలు చేయాల్సిన అవసరం ఉంటుంది.

ఇటీవలి కాలంలో సివిల్ సర్వీసెస్ మరియు ప్రభుత్వ పాలన గురించి వాటి సంస్కరణల గురించి శ్రీకృష్ణ అధ్యక్షతన ఆరవ వేతన సంఘాన్ని కేంద్రం నియమించింది. వాటియొక్క సిఫార్సులు పూర్తిగా అమలు చేయటం భారతదేశ పరిస్థితులకు పూర్తి అనుగుణంగా లేనప్పటికి కాని వాటి సిఫార్సులు కొంత వరకైనా అమలు చేసి సుపరిపాలనను సాధించుకోవచ్చు. ఆరవ వేతన సంఘ సిఫార్సులు ప్రకారం 10 సంవత్సరాలలో 30% ప్రభుత్వ ఉద్యోగాల్లో క్రమంగా కోత విధించాలి. కాని భారతదేశంలో అధికంగా వున్న నిరుద్యోగం దృష్ట్యా ఇది సాధ్యం కాదు. ప్రభుత్వ నియామకాలన్నీ కొంత తగ్గించి నిరుద్యోగం ప్రబలకుండా చూసుకోవాలి. సమాచార హక్కును పూర్తి స్థాయిలో అమలు చేయాలి. కార్యాలయ స్వరూప స్వభావాలని మార్చాలి. ప్రతి శాఖకు కార్య నిర్వహణ సహాయకులని నియమించాలి.

సుపరిపాలన కావాలంటే పర్మనెంట్ ఉద్యోగాల స్థానంలో కాంట్రాక్టు ఉద్యోగాల్ని ప్రోత్సహించాలని 5వ వేతన కమీషన్ పేర్కొన్నది. ఉద్యోగాల యొక్క పని దినాలు ఖచ్చితంగా 6 రోజులు వారానికి ఉండాలి. సెలవులని తగ్గించాలని, స్వాతంత్ర్యదినోత్సవం, రిపబ్లిక్ రోజు మినహా అన్ని సెలవులని రద్దు చేయాలని ఈ సంఘం సిఫార్సు చేసింది. కాని ఇలాంటి సంస్కరణలు ఏకపక్షంగా ఉద్యోగులు, ప్రజలు జీర్ణించుకోరు. కనుక, ఒక క్రమ పద్ధతిలో పనిదినాలు పెంచాల్సిన అవసరం ఉన్నది. కార్యాలయాల్లో పనితీరు మెరుగు

పడడానికి ఉద్యోగుల్లో క్రమశిక్షణ పెంచవల్సిన అవసరం ఉన్నది. 30% ప్రభుత్వ ఉద్యోగాల్ని తగ్గించడం కోసం స్వచ్ఛంద పదవీ విరమణను విరివిగా ప్రోత్సహించడం చేయాల్సి ఉంటుంది. అవినీతి, అసమర్థ అధికారులకు ఉద్యోగుల పట్ల గోల్డెన్ షేక్ హ్యాండ్ అనే విధానం ద్వారా వదిలించుకోవాలి. ప్రభుత్వ కార్యాలయాల్లో రైట్ టు ఇన్ఫర్మేషన్ ని ప్రోత్సహించి ప్రజలకు కావాల్సిన సమాచారాన్ని ఇచ్చి పారదర్శకమైన సుపరిపాలనని అందించాలి.

దేశానికి పట్టిన పెద్ద చీడ పీడ అవినీతి, రాజకీయ, బ్యూరోక్రాట్ అవినీతిని ఉక్కుపాదంతో అణిచివేసినప్పుడే భారతదేశంలో గుడ్ గవర్నెన్స్ లేదా సుపరి పాలన సాధ్యపడుతుంది. ఈ దేశంలో అన్ని రంగాల్ని కుంగదీసింది అవినీతే అనడంలో సందేహం లేదు. అవినీతి నిర్మూలించమన్న ప్రత్యేక న్యాయస్థానాలు, ప్రత్యేక బృందాలని మరింత పెంచాలి. జిల్లా స్థాయి స్థానిక ప్రభుత్వాలని ప్రోత్సహించాలి. 73వ రాజ్యాంగ సవరణ ప్రకారం స్థానికమైన సంస్థల అధికారాన్ని కాపాడాలి. జిల్లా ప్రభుత్వాల్ని ప్రోత్సహించడం ద్వారా పాలన వికేంద్రికరణ జరిగి సుపరిపాలన సులభమవుతుంది. ఇలా ప్రభుత్వం అనేక పాలన సంస్కరణల ద్వారా సుపరిపాలనకు మార్గాన్ని సుగమనం చేయొచ్చు. ప్రభుత్వం పాలన సంస్కరణలు చేయాలంటే ఒక గట్టి నిబద్ధత, అంకితభావం, ఒక దూరదృష్టి (ప్రభుత్వాలకు) అవసరం అవుతాయి. అవే కాకుండా ఒక రాజకీయ వ్యవస్థ యొక్క సంస్థాగత సామర్థ్యం అవసరం. వాస్తవానికి సుపరిపాలనలో విజన్ తయారు చేయాల్సిన వారు ప్రజలే, సామాజిక బృందాలు జరిపే చర్చల ద్వారానే ప్రభుత్వ విజన్ తయారుకావాలి. కాని సామాజిక బృందాలు జరిపే చర్చల ద్వారానే ప్రభుత్వ విజన్ తయారుకావాలి. కాని సామాజిక బృందాలు మెజారిటి ప్రకారం ఇచ్చిన విజన్ లేదా ఆ యొక్క సూచనలు అనుసరణీయమైన సుపరిపాలనకు ఉపయోగపడతాయా లేదా అని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. విధానాలని సిఫార్సు చేసే సామాజిక బృందాలు ప్రజలు లేదా వ్యక్తులకు వివిధ దేశాల ఆ యొక్క సంస్కరణలు పద్ధతులు వారి అమలుతీరుపై ఖచ్చితమైన అవగాహన ఉండాలి. ఆయా దేశాల్లో సంస్కరణలు విజయవంతమవుతున్నాయా లేదా అనేది కూడా ముఖ్యమైన అంశం.

సుపరిపాలన అంటేనే ప్రజాప్రభుత్వం అనబడుతుంది. పరిపాలన సంస్కరణలో సుపరిపాలనను ప్రజలకు అందించాలంటే సంస్కరణలను సిఫార్సు చేసే బృందాలు నడుస్తున్న రాజకీయ వాతావరణాన్ని ఖచ్చితంగా అంచనా వేయగల్గాలి. ఆయా దేశాల విభిన్నతలను గుర్తించి అందుకు తగినట్లుగా వ్యవహరించాలి. ఆర్థిక సంస్కరణలు, ప్రభుత్వ పరమైన ఏ సంస్కరణలైనా ఒక దేశంలో అమలు కావాలంటే అక్కడి సామాజిక, రాజకీయ నాయకత్వం పూర్తి నిబద్ధతని కల్గియుండాలి. సుపరిపాలన రావాలంటే ఆర్థిక సంస్కరణలు ప్రభుత్వం యొక్క పనితీరు మెరుగుదలపై ఆధారపడాల్సిన అవసరం ఉన్నది. సుపరిపాలనలో రాజకీయ నాయకత్వం సమర్థంగా పనిచేయటం, వ్యవహరించడం, జవాబుదారీతనం, పారదర్శకత, రాజ్యం మరియు పౌరసమాజాల మధ్య సమన్వయం పెంపొందించడం అనే ముఖ్యమైన నియమాలుగా ఉంటే సుపరిపాలనను నేటి భారత దేశం ప్రజలకు అందించడం పూర్తిగా సాధ్యపడుతుంది. ■

## ఆదివాసీల ఆరోగ్యం...

*35వ పేజీ తరువాయి*

పోతున్నామని, ఎంత చెప్పినా వినకుండా పనికిరాని పదార్థాలను ఆహారంగా తీసుకుంటూ ప్రాణం మీదికి తెచ్చుకుంటున్నారని, ఆధునిక వైద్యాన్ని నిరాకరిస్తున్నారని 'ఉద్యోగస్వామ్యం' ఆరోపిస్తోంది. అయితే ఆదివాసీ సానుభూతి పరులు, మేధావులు, విద్యావంతులు ఆ ఆరోపణలతో ఏకీభవించడం లేదు. సదుపాయాలను స్వాగతించని వారు ఉండరని, అయితే వాటిని అందుబాటు లోకి తెచ్చే విధానంపై వాటి ఆదరణ ఆధారపడి ఉంటుందని వారు అంటున్నారు. గిరిజనులను కేవలం ఆధునిక వైద్యాన్ని నిరాకరించే మొండివారిగా చిత్రీకరించడం భావ్యం కాదని అంటున్నారు.

"ఏజెన్సీలో గిరిజనగూడేలు ఎక్కడో విసిరేసినట్లుంటాయి. అక్కడ ఉండే కుటుంబాలకు తాగునీరు సరఫరా చేయడం ఖర్చుతో కూడినది" అని ఆ మధ్య ఒక సందర్భంలో మంత్రి రోశయ్య వ్యాఖ్యానించారు. కాగా, వ్యాధులపై చైతన్యపరచవలసిన సిబ్బంది అటుగా తొంగి చూడడంలేదని నిరసన వ్యక్తమవు తోంది. అసలే అంతంత మాత్రం ఉన్న సిబ్బంది. అందులోనూ ఆదివాసీ నివాసిత ప్రాంతాలకు వెళ్ళలేకపోవడం వల్ల సకాలంలో వైద్యసహాయం అందక పెద్ద సంఖ్యలో ప్రాణాలు కోల్పోయారు. ప్రతి గిరిజనగూడెం/తండాకు వైద్య సేవలు అందుబాటులోకి తేవాలని సంచార వైద్యశాలలకు ప్రణాళిక వేసినప్పటికీ, వైద్యుల కొరత సాకుతో ఆ యోచన ముందుకు సాగడం లేదు. ఇందుకు నిధుల కొరతే కారణంగా నిలుస్తోంది. అన్ని శాఖలు ప్రణాళికా బడ్జెట్ ద్వారా తమకు కేటాయించిన నిధుల నుంచి 6.6% మొత్తాన్ని గిరిజన ఉప ప్రణాళిక కింద గిరిజనాభివృద్ధికి అందచేయవలసి ఉంది.

### ఆరోగ్య అత్యవసర స్థితి

మన్యంలో ఆరోగ్య పరిరక్షణలో భాగంగా అక్కడ ఆరోగ్య అత్యవసర పరిస్థితి (హెల్త్ ఎమర్జెన్సీ)ని ప్రకటించాలని బీజెపి, సిపిఎం తదితర రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు కోరుతున్నాయి. బీజెపి రాష్ట్ర అధ్యక్షుడు బండారు దత్తాత్రేయ నాయకత్వంలోని ప్రతినిధి బృందం ఇటీవల రాష్ట్ర గవర్నర్‌ను కలిసి ఆ మేరకు వినతిపత్రం అందచేసింది. మందులను అందుబాటులో ఉంచేందుకు కనీసం రూ. 250 కోట్లు విడుదల చేయాలని కోరింది.

### ముగింపు

గిరిజనులకు మెరుగైన వైద్యం అందడానికి :

1. వైద్యవిద్యను పూర్తి చేసిన వారు గ్రామీణ ప్రాంతాలలో, ముఖ్యంగా మారుమూల గిరిజన ప్రాంతాలలో కొంతకాలం పనిచేయాలన్న నిబంధనను నిర్బంధంగా అమలుచేయాలి.
2. ప్రాణాంతక వ్యాధులతో పాటు మలేరియా, అతిసార వంటి ఇతర కాలానుగుణ రోగాల నివారణకు వైద్య ఆరోగ్య శాఖ ముందస్తు ప్రణాళికలు రూపొందించుకుని ఆ మేరకు చర్యలు తీసుకోవాలి.
3. మూఢనమ్మకాలు, నిరక్షరాస్యత, వైద్యంపై సరైన అవగాహన లేకపోవడం వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. వీటిపై అవగాహనా కార్యక్రమాలు చేపడితే మన్యం ప్రజానీకం ఆరోగ్యంతో విలసిల్లుతుంది. ■

# జనరల్ ఎన్.సి. విజ్‌తో ఇంటర్వ్యూ



జనరల్ ఎన్.సి. విజ్-పివియస్ఎమ్, యువైయస్ఎమ్, ఎవియస్ఎమ్ (రిటైర్డ్)
వైస్ ఛైర్మెన్, జాతీయ విపత్తు యాజమాన్యం సంస్థ (ఎన్‌డిఎమ్ఎ)

*ప్ర. : ప్రస్తుతం మన భారతదేశంలో విపత్తు యాజమాన్యమనేది ఒక ఉదాహరణ స్థాయికి చేరుకుందని అందరూ అనుకుంటున్నారు. పాతపద్ధతులను మించి ఇంతమంది మన్ననలను పొందదానికి దీనిలో వచ్చిన కొత్త మార్పులేమిటి?*

జ. : జాతీయస్థాయిలో ఈ రంగంలో మన విధానం పాతపద్ధతుల కన్నా కొంచెం పేర్కొనదగిన మార్పులకు లోనైన మాట నిజమే. పూర్వం ముందు జాగ్రత్త చర్యలకన్నా సహాయ కార్యక్రమాల మీదే దృష్టి ఉండేది. నిధుల కొఱతవల్ల ఖర్చులు తగ్గించడంపై ధ్యాస ఉండేది. సహాయ కార్యక్రమాలకి తయారుగా ఉన్నంతగా నివారణోపాయాల మీద దృష్టి ఉండేది కాదు. ప్రగతి, అభివృద్ధి యొక్క ఫలాలను నిలుపుకోవడానికీ, ప్రాణనష్టం, బ్రతుకుతెరువుల హాని, పేదరికంపై దృష్టి మాత్రమే ఉండేవి.

దీన్ని దృష్టిలో పెట్టుకుని, 2005లో డిఎమ్ చట్టాన్ని భారత ప్రభుత్వం తీసుకొచ్చింది. అంటే విపత్తు యాజమాన్య చట్టం అన్నమాట. తత్ ఫలితంగా జాతీయ విపత్తు యాజమాన్య సంస్థ ఏర్పాటయింది. ఇది చాలా ఉన్నతస్థాయి సంస్థ. దీనికి ప్రధానమంత్రి ఛైర్మన్, ఒక వైస్ ఛైర్మన్, ఎనిమిది మంది సభ్యులు ఉంటారు. ఇటువంటి సంస్థలే రాష్ట్ర స్థాయి, జిల్లాస్థాయిలో ముఖ్యమంత్రి, డిప్యూటీ కమీషనర్స్ ఛైర్ పర్సన్స్‌గా ఉంటారు.

అది స్థాపించినప్పటి నుంచీ ఎన్‌డిఎమ్ఎ విపత్తుల పట్ల జాగరూకత, నివారణకై అప్రమత్తత, తయారుగా, సిద్ధంగా ఉండడం, శక్తివంతమైన, సమర్థవంతమైన అభివృద్ధి, ప్రజావగాహన వీటికై విస్తృతంగా కృషి చేయడం ప్రారంభించింది. ఈ ప్రక్రియలో ముందస్తు జాగ్రత్త చర్యల విధి విధానాలు ప్రముఖపాత్ర వహిస్తాయి.

*ప్ర. : విపత్తు యాజమాన్య విషయకంగా సర్వదా సన్నద్ధంగా ఉండడానికి మన భారత ప్రభుత్వం ఎటువంటి అంశాలను, విషయాలనూ పరిగణనలోకి తీస్కోవాలి?*

జ. : ప్రస్తుతం జరుగుతున్న కృషికి తోడుగా జరుగుతున్న అదనపు కృషి, వాటి అమలు విధానాలు ఈ క్రింది విధంగా ఉన్నాయి.

ఒక సంభాషణ....

- నివారణని, సంసిద్ధతనీ ఒక జీవన విధానంగా మలచడం
- ఆధునిక సాంకేతిక విజ్ఞానం, సాంప్రదాయ విజ్ఞానం రెంటి మేలు కలయికతో వీలైనంత ఖర్చు తగ్గించే జాగ్రత్తలను ప్రోత్సహించడం.
- జాతీయ, రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక నైపుణ్యంతో శక్తిమంతంగానూ, సమర్థవంతగానూ శ్రేణులను తయారుచెయ్యడం.
- అభివృద్ధి ప్రక్రియలో విపత్తు యాజమాన్యాన్ని అనుసంధానించి ఒకే త్రాటిమీద నడపడం.
- సంస్థాగతమైన, న్యాయ, చట్టపరమైన, సాంకేతికపరమైన అంశాలన్నీ ఒకచోట కలగలిపి ఒక సమన్వయ పూర్వక వాతావరణాన్ని సాధించేందుకు అనుగుణమైన పాలనా, కార్యాచరణ వ్యవస్థను స్థాపించడం.

*ప్ర. : విపత్తు యాజమాన్య విషయకంగా క్లిష్టమైన అంశాలేవి?*

జ. : విపత్తు యాజమాన్యమనేది మన దేశానికి కొత్త ప్రక్రియ. అమెరికా లాంటి దేశాలతో పోలిస్తే మన పాలనా వ్యవస్థకి ఈ అంశం చాలా కొత్తది. ఆ దేశంలో 1979లోనే ఇందుకోసం సంస్థలు స్థాపింప బడ్డాయి. కార్టర్ అధ్యక్షుడుగా ఉండగానే మనదేశంలో మనం దృష్టి పెట్టాల్సిన అంశాలు ఈ విషయంలో చాలానే ఉన్నాయి. మచ్చుకి కొన్ని -

ఎ) న్యాయపరమైన, చట్టబద్ధమైన పాలనా వ్యవస్థను మన పట్టణాల్లోనూ, నగరాల్లోనూ స్థాపించి ఆయా ప్రణాళికల ప్రకారం త్వరితగతిన స్పందించడం, ఖర్చులపై నియంత్రణ, తగ్గింపు, విపత్తుల ధోరణులకి అనుగుణంగా కార్యక్రమాల అమలు సాధించడం.

బి) ఖర్చు తగ్గింపు చర్యల కార్యక్రమాలు, ప్రణాళికలూ జాతీయ, రాష్ట్ర స్థాయిలలో సమర్థవంతంగా అమలుపరచడం. ముఖ్యంగా తుఫాన్లూ, భూకంపాలూ, వరదలూ, కొండచరియలు విరిగిపడడాలూ వంటి విపత్తుల్లో మౌలికావసరాలు, వనరుల ఏర్పాటులో, సమర్థవంతమైన పునర్నిర్మాణ, పునరావాస కార్యక్రమాల విషయంలో.

సి) పరిశ్రమల్లో జరిగే పెద్ద పెద్ద ప్రమాదాలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు రసాయనిక, జీవపరమైన, రేడియోధార్మిక, అణుశక్తి పరమైన రంగాలలో అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనే పరిజ్ఞానాన్ని పెంపొందించుకుని సర్వదా సన్నద్ధంగా ఉండడం.

డి) విపత్తు సంభవించినపుడు సత్వరం రంగంలోకి దూకేందుకు సిద్ధంగా జాతీయ స్థాయిలో కనీసం పది అయినా నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ బెటాలియన్లనూ, రాష్ట్ర స్థాయిలో కనీసం ఒక బెటాలియన్‌ను అయినా తయారుచేసుకుని సిద్ధంగా ఉంచుకోవాలి.

ఇ) పౌర సైనిక విభాగాలను ఈ రంగం వైపు గూడా మళ్ళించి తగు శిక్షణనిచ్చి సామాజిక స్థాయిలో విపత్తు యాజమాన్యానికే తక్షణం స్పందించేటట్లు తయారు చేసుకుని సిద్ధంగా ఉంచుకోవాలి.

ఎఫ్) సామాజిక ఆధారిత విపత్తు యాజమాన్యాన్ని రూపొందించుకోవడం మరో ముఖ్యమైన అంశం.

ప్ర. : *ప్రాకృతికమైనవి గానీ, మానవ తప్పిదాల వలన సంభవించే, హాని, విపత్తులలో భారతదేశం ఎంతవరకూ సమర్థవంతంగా స్పందించగల స్థితిలో ఉందని మీరనుకుంటున్నారు?*

జ. : భారతదేశం కొంచెం తీవ్రంగా స్పందించేస్థాయిలోనే ఉన్నది. వివిధ రంగాల్లోనూ, అంశాల్లోనూ కూడా. 58.6% భూభాగం మనదేశంలో భూకంపాలకు గురయ్యే ప్రమాదం ఉంది. ఇది తేలికపాటి స్థాయినుంచీ తీవ్రమైన స్థాయి వరకూ కావచ్చు. దాదాపు 40 మిలియన్ హెక్టార్లు (అయినా 12% భూభాగం) వరదలకు లోను కావచ్చు. లేదా కోతలకు గురికావచ్చు నదీ పరీవాహక ప్రాంతాల్లో. మనకున్న సముద్రతీరం పొడవు 7,516 కిలోమీటర్లు. దీనిలో 5,700 కిలోమీటర్లు తుఫాన్లు సునామీల బారిన పడొచ్చు. 68% భూభాగంలో, అదిగూడా సాగుబడిలో ఉండే వ్యావసాయిక భూమిలో కరువు కాటకాలు సంభ వించవచ్చు. దీనిలో కొండప్రాంతాల్లో చరియలు విరిగిపడే అవకాశం గూడా ఇమిడి ఉంది. కొండ చరియలే కాక హిమఖండాలు విరిగి, జారిపడే ప్రమాదాలను కూడా దీనిలో కలుపుకోవచ్చు. ఇక రసాయనిక, జీవపరమైన, రేడియోధార్మికపరమైన, అణుశక్తిపరమైన (సిబిఆర్ఎన్) అత్యవసర పరిస్థితుల్లోనూ, మానవ తప్పిదాల విషయంలోనూ భారత్ మీద ఒత్తిడి బాగానే వుంది ఈ మధ్యకాలంలో.

ఇంతేకాక, జనాభా పెరుగుదలతోనూ, సాంఘిక-ఆర్థిక పరిస్థితుల మార్పుతోనూ ఈ విపత్తు ప్రమాదాలు బహుళమౌతున్నాయి. ఒక పద్ధతి, ప్రణాళిక లేని నగరీకరణ, కొన్ని నాజూకైన ప్రాంతాల్లో పొంచి ఉన్న ప్రమాదకర పరిస్థితులూ, వాతావరణంలో సమతుల్యత దెబ్బతినడం, వాతావరణంలో అనుకోని మార్పులూ, తారుమారవు తున్న భౌగోళిక పరిస్థితులూ, హఠాత్తుగా విరుచుకుపడే అంటు వ్యాధులూ, ప్రాణాంతక వ్యాధులూ, దేశాన్నీ, దేశాల్నీ చుట్టవేసే వ్యాధులూ వంటి కారణాల మూలంగా గూడా అనుకోని విధంగా అనేక రకాలైన విపత్తులు తలెత్తుతున్నాయి. దేశ ఆర్థిక పరిస్థితి అనుకో కుండానో, హఠాత్తుగానో అతలాకుతలం కావడం ఈ విధంగా సంభవిస్తోంది. ఇది పెరిగేజనాభా అవసరా మీదా, అభివృద్ధిలోని నిలకడ మీదా తీవ్రమైన ప్రభావం చూపుతుంది. ఐతే ఈ దిశగా జరుగుతున్న నివారణోపాయాల మూలంగా, సమర్థవంతంగా ఎదుర్కొనే శక్తి, సమర్థతల వల్ల, ముందు జాగ్రత్త చర్యల వల్ల ఇలా వచ్చే పెనుసవాళ్ళను భారతదేశం ఎదుర్కొనే స్థితిలోనే ఉంది.

ప్ర. : *ప్రస్తుతం ఏఏ బృహత్తర పథకాల మీద ఎన్‌డిఎమ్ఎ కృషి చేస్తోంది?*

జ. : ఎన్‌డిఎమ్ఎ స్థాపింపబడినప్పటి నుంచీ ఈ విషయంలో ఒక జాతీయ దృక్పథాన్ని రూపొందించుకుని, ముందుండి అమలుచేస్తూ అనేక రంగాలకు విస్తరించింది. ఈ సంస్థ తొలిసారిగా ప్రారంభించి చేపట్టిన కార్యక్రమాలు ప్రస్తుతం ఇలా నడుస్తున్నాయి.

ఎ) **కేంద్ర, రాష్ట్ర మంత్రి వర్గాలకు మార్గదర్శకాలు సూచించడం :** ఎన్‌డిఎమ్ఎ కొన్ని ప్రాధాన్యతా రంగాలనెన్నుకొని వాటికి ప్రణాళికలు రచించడానికి మార్గదర్శక సూత్రాలను రూపొందించడంలో ముఖ్య పాత్ర వహిస్తోంది. వీటిలో కార్యక్రమాల అమలుకి గూడా మార్గదర్శక సూత్రాలు ఇమిడి ఉంటాయి. భూకంపాలు, తుఫానులు, వరదలు, జీవపరమైన హాని, ప్రమాదాలూ, నష్టాలూ, రసాయనిక (పారిశ్రామిక) ప్రమాదాలూ, అణు, ఇంధన, రేడియో ధార్మిక శక్తుల విషయంలో అత్యవసర పరిస్థితులూ, వైద్యపరమైన సంసిద్ధత, పెద్ద ఎత్తున జన, ప్రాణి, జీవనష్టం తాలూకు యాజమాన్యం వంటి విషయాల్లో రాష్ట్ర స్థాయిలో మార్గదర్శక సూత్రాలను విడుదల చేయడం జరిగింది. భూమికోత, కొండచరియలూ, హిమఖండాలూ విరిగిపడడం, రసాయనిక (ఉగ్రవాద) చర్యల వల్ల ఉత్పన్నమయ్యే ప్రమాదాలూ, మానసిక, సామాజిక మరియు మానసిక ఆరోగ్యం పట్ల జాగ్రత్తలూ, సునామీ, నగరాల్లో వరదలూ, ఇంకా ఇలాంటి ముఖ్యమైన అనేక పరిస్థితులూ, సంఘటనల విషయంలో మార్గదర్శక సూత్రాలను ఈ ఏడాది చివరికల్లా విడుదల చేయడం జరుగుతుంది.

బి) **ఖర్చు తగ్గింపు పథకాలు :** ఎన్‌డిఎమ్ఎ ఐదు ఖర్చు తగ్గింపు పథకాలను జాతీయ స్థాయిలో ముఖ్యమైనవిగా గుర్తించి వాటికి ప్రథమ తాంబూల స్థాయినిచ్చింది. సైక్లోన్ రిస్క్ మిటిగేషన్ ప్రాజెక్ట్ ప్రపంచ బ్యాంకు సహాయంతో లాంఛనంగా ముందు ఐదు రాష్ట్రాల్లో ప్రారంభించింది. క్రమేపీ దీనిని 13 రాష్ట్రాలకూ, కేంద్ర పాలిత ప్రాంతాలకూ విస్తరిం చడం జరుగుతుంది. ఎర్త్ క్వేక్ రిస్క్ మిటిగేషన్, నేషనల్ డిజాస్టర్ ఇన్‌ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ నెట్‌వర్క్, నేషనల్ మిటిగేషన్ రిజర్వ్ వంటివి ఇంకా రచనా స్థాయిలో ఉన్నాయి. వీటి విషయంలో విపులమైన ప్రణాళికా బద్ధ మార్గదర్శక సూత్రాల తయారీ దాదాపు పూర్తి కావచ్చింది. అన్నీ అంతిమ రూపుదశలో ఉన్నాయి. స్కూల్ సేఫ్టీ ప్రాజెక్ట్ అనేది ప్రభుత్వం అనుమతి కోసం చూస్తోంది. అనుమతి రాగానే ప్రారంభించబడుతుంది.

సి) **అవగాహనా శిబిరాలు :** అవగాహన, సంసిద్ధత వంటి విషయాల్లో శిబిరాలను నిర్వహించి భూకంపాలు, వరదలు, తుఫాన్లు వంటి రంగాల విషయంలో పత్రికారంగం, ఎలక్ట్రానిక్ రంగాల్లో శిక్షణ ఇవ్వడం జరుగుతోంది. దీనికి తోడు నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ ప్రజల్లో ఒక విధమైన సామాజిక సన్నద్ధతా కార్యక్రమాలను నిర్వ హిస్తోంది. ఈ. శిబిరాల శిక్షణలో వివిధ రకాలైన విపత్తులు, వాటి నెదుర్కొనే విధానాల గురించి తెలుపడం జరుగుతోంది. ముఖ్యంగా వరదల విషయంలో క్రితం సంవత్సరం 60 ఎన్‌డిఆర్ఎఫ్ టీములు రాష్ట్రాలకు వెళ్ళి ప్రజలకు వరదల నెదుర్కొనే విషయంలో శిక్షణ నివ్వడం జరిగింది.

డి) **నమూనా శిక్షణలు :** ఎన్‌డిఎమ్ఎ, రాష్ట్ర-జిల్లా యంత్రాంగాల భాగ స్వామ్యంతో ప్రాకృతిక విపత్తులు, మానవ తప్పిదాల వల్ల జరిగే ప్రమాదాలను ఎలా ఎదుర్కోవాలో నమూనా శిక్షణనిస్తోంది. ప్రజలకూ, అటు ప్రభుత్వ, స్థానిక పాలక యంత్రాంగాలకు కూడా. ఇప్పటివరకూ 27 రాష్ట్రాల్లో, కేంద్రపాలిత ప్రాంతాల్లో 55 శిక్షణా కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. ఈ వేసవిలో స్కూలు పిల్లలకు ఈ నమూనా శిక్షణా కార్యక్రమాలను ప్రారంభించబోతున్నాం. ఇది కొంచెం పనికి వచ్చే, ఫలితాలనిచ్చే కార్యక్రమంగా అనిపిస్తోంది. వచ్చే విద్యా సంవత్సరంలో ఇటువంటివే మరికొన్ని కార్యక్రమాలని చేపట్టడం జరుగుతుంది.

ఇ) **విపత్తు యాజమాన్యం విశ్వవిద్యాలయాల్లో నిర్బంధ ప్రాతిపదికన :** పూనా విశ్వవిద్యాలయంలో దీనిని ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టడం జరిగింది. ఒక వారం నిడివి కాలాన్ని ఈ విద్యకై నిర్బంధం చేయడం జరిగింది, పట్టభద్రుల స్థాయిలో. ఈ విధంగా 2.15 లక్షల విద్యార్థులు ప్రతీ సంవత్సరం శిక్షణ పొంది విశ్వవిద్యాలయం నుండి బయటికి వస్తారు. దీనిని మరింత విస్తృత ప్రాతిపదికన మరిన్ని విశ్వవిద్యాలయాల్లో ప్రవేశపెట్టే కార్యక్రమాలు రూపుదిద్దుకుంటున్నాయి.

ప్ర. : *మనకి పౌరసైన్యం ఉంది కదా, విపత్తు యాజమాన్య పద్ధతుల్లో వచ్చిన ఈ కొత్త ప్రయోగాలని అమలు చేయడంలో వారి పాత్ర ఏమిటి?*

జ. : విపత్తు యాజమాన్య విషయంలో పౌర సైన్యానికున్న ప్రాముఖ్యతను గుర్తించిన ప్రభుత్వం దానిని విపత్తు యాజమాన్యానికై ఉపయోగించాలని ఉత్తర్వు జారీ చేసింది. పౌర సైనికచట్టం దీనికి అనుగుణంగా సవరింపబడింది. పూర్వానికి మల్లే పౌర సైన్యమనేది ఏ ఒక్క పట్టణానికో పరిమితం కాక ఇప్పుడు జిల్లా మొత్తానికి చెందుతుంది. ఏవైనా ప్రమాదకర పరిస్థితులు సంభవించినపుడు పౌరసైన్యం సమాజ ప్రజలతో నేరుగా సంబంధాలు కలిగి ఉండడం మూలాన వారిని తక్షణం సహాయ కార్యక్రమాలకు సమాయత్త పరచడానికి వీలవుతుంది. పైగా ప్రజల్లో జాగరూకతనీ, అవగాహననీ, సన్నద్ధతనీ పెంచడానికి ఇది ఉపయోగపడుతుంది.

కాబట్టి, పౌర సైన్యానికి చెందిన స్వయంసేవకులు ఈ విషయంలో ఎంతో ప్రముఖపాత్ర వహిస్తారు. దీనికై ఒక శిక్షణా పాఠ్య ప్రణాళిక ఇప్పటికే తయారయి ఉంది. ఇక అమలు పరచడమే తరువాయి. మన ప్రణాళికా సంఘం కూడా ఈ నిమిత్తం 100 కోట్లు ఇప్పటికే కేటాయించింది. పెద్ద ఎత్తున పౌరశిక్షణ కోసం ప్రయత్నాలు జరుగు తున్నాయి. కొన్నిచోట్ల మొదలయ్యాయి కూడా.

ప్ర. : *అణు, ఇంధన, రసాయనిక, జీవపరమైన విపత్తుల విషయంలో నేషనల్ డిశాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్‌కి ఏ విధమైన శిక్షణనిస్తున్నారు, ఎటువంటి శక్తి సామర్థ్యాలను అందజేస్తున్నారు?*

జ. : ప్రస్తుతం నేషనల్ డిశాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ లో 8 బెటాలియన్లు దేశంలోని వివిధ ప్రాంతాల్లో పనిచేస్తున్నాయి. ఇంకో 2 బెటాలియన్ల స్థాపనకు అంగీకారం కుదిరింది. విపత్తులు సంభవించే సమయాల మధ్యన విరామం, కలిగించే హాని ఇవన్నీ దృష్టిలో ఉంచుకుని ఈ పెంపుదల నిర్ణయం జరిగింది. ఈ 8 బెటాలియన్స్‌లో 4 రసాయనిక, జీవపర నష్టాలు, అణు; ఇంధన, రేడియో ధార్మిక విపత్తులు (సిబిఆర్ఎన్) నిభాయించుకోవడానికి ఉద్దేశింపబడ్డాయి. ఈ 8 బెటాలియన్స్‌కీ పటిష్టమైన, తీవ్రమైన శిక్షణ గరపడం జరిగింది ఆయా రంగాల్లో. ఈ శిక్షణా కార్యక్రమాలు కొలాప్స్‌డ్ స్ట్రక్చర్ సెర్చ్ అండ్ రెస్క్యూ (సియస్‌యస్ఆర్) మెడికల్ ఫస్ట్ రెస్పాన్స్ (ఎమ్ఎఫ్ఆర్), హెవీ-బోర్న్ ట్రైనింగ్ అండ్ వాటర్ రెస్క్యూ సంస్థల్లో ఇవ్వడం జరుగుతోంది. సిబిఆర్ఎన్ బెటాలియన్స్‌కి శిక్షణ గరపడం కోసం దేశ, విదేశాలనుంచి నిపుణులను ఎంపిక చేయడం జరుగుతోంది. వారికి కావాల్సిన పరికరాల నిర్ధారణ జరిగింది. వీటన్నిటినీ ఈ ఏడాది సెప్టెంబర్ లోపల వారికి అందజేయడం జరుగుతుంది. క్రమేపీ సిబిఆర్‌యన్ అత్యవసరాలని దృష్టిలో ఉంచుకుని మొత్తం 10 బెటాలియన్స్‌కీ మంచి శిక్షణ ఇవ్వడం జరుగుతుంది.

ప్ర. : *విపత్తుల నెదుర్కొనే పద్ధతుల్లో చేయవలసినవీ, చేయకూడనివీ ప్రజలలో అవగాహన కల్పించడమనేది విపత్తు యాజమాన్య ప్రణాళిక యొక్క ముఖ్యోద్దేశం కావాలి కదా! భారతదేశంలో ఇదెంత వరకూ సాధించడం జరిగింది?*

జ. : ముందు జాగ్రత్త చర్యగా విపత్తు యాజమాన్యానికి సంబంధించి ప్రజల్లో అవగాహన కల్పించడమనేది చాలా ముఖ్యమే. ఎన్‌డిఎమ్ఎ దీనికి సముచిత స్థానం కలిపించింది తన కార్యక్రమాల్లో. అవి ఈ విధంగా ఉన్నాయి.

ఎ) భూకంపాలూ, తుఫాన్లూ, వరదల వంటి విషయాల్లో పత్రికల్లోనూ, ఎలక్ట్రానిక్ మాధ్యమాల ద్వారా ప్రజల్లో అవగాహన కోసం విస్తృత ప్రచారం నిర్వహించడం జరుగుతోంది.

బి) జాతీయ, స్థానిక పత్రికల్లో మార్గదర్శక సూత్రాలని ప్రకటించడం జరుగుతోంది.

సి) 58 టేబుల్ టాప్ మరియు నమూనా శిక్షణలను, అన్ని రకాల విపత్తుల విషయంలోనూ రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో నిర్వహించడం జరిగింది. మరొక 100 కార్యక్రమాలను 2009-10 సంవత్సరంలో నిర్వహించడం త్వరలో జరుగుతుంది.

డి) ఎన్‌డిఆర్ఎఫ్ టీములు సామాజిక స్థాయిలో ప్రజలకు అవగాహన కలిగించడం కోసం వివిధ జిల్లాలకు వెళ్ళి శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నాయి.

ప్ర. : *విపత్తుల నెదుర్కొనే విషయంలో భారతదేశం ఎదుర్కొంటున్న ముఖ్యమైన సమస్యలేమిటి?*

జ. : విపత్తు యాజమాన్యం అనేది మనదేశానికి ఒక కొత్త అంశం. బోలెడు దేశాలు మనకన్నా ఈ విషయంలో 30, 40 ఏళ్ళ ముందున్నాయి. ఇప్పుడు మనం వెళ్ళాల్సిన దిశ మనకి స్పష్టమైంది కాబట్టి, ఎదుర్కునే తీరు, శైలి నిర్వచించుకున్నాం కాబట్టి ఇప్పుడు మనకి జాతీయ, రాష్ట్ర స్థాయిల్లో ఈ విపత్తు యాజమాన్య సంస్థలు బాగానే పనిచేస్తున్నాయి. ఐతే దీని కార్యకలాపాలని వేగవంతం చేయడానికి వివిధ స్థాయిల్లో వివిధ ప్రణాళికలూ, ఆలోచనలకి ప్రోత్సాహం కల్పించడానికి బాగా కృషి చెయ్యాలి. ఇంతవరకూ మనం ఈ దిశగా కోల్పోయిన సమయాన్ని కార్యక్రమాల్ని వేగవంతం చేస్కోవడం ద్వారా భర్తీ చేస్కోవచ్చు.

ప్ర. : *భవిష్యత్తులో మన ఆశల విషయం ఏమిటి?*

జ. : ఒక ప్రారంభం అంటూ జరిగింది. ఎన్‌డిఎమ్ఎ సరైన దిశగానే పనిచేస్తోంది. ప్రణాళికా సంఘం కూడా ఈ విపత్తు యాజమాన్యం యొక్క అవసరాలని గుర్తించింది. దీని ముఖ్యలక్ష్యం దేశ ప్రజలను విపత్తులనుంచి కాపాడడం. వారి సర్వతోముఖాభివృద్ధికి పాటుపడడం. మౌలిక వసతులతో కూడిన ఆర్థికాభివృద్ధిని అందజేయడం. ఏ విపత్తునైనా ధైర్యంగా ఎదుర్కోవడం, అంతకు ముందే నివారించడంలో దేశాన్ని ముందుకు నడిపించడం. ఇది చాలా సుదీర్ఘ ప్రయాణం. అన్ని రాష్ట్రాల సహకారంతో జరగాల్సిన పని ఇది. అలా అన్నీ అనుకున్నట్టు జరిగిన పక్షంలో మన దేశం గూడా ఈ విషయంలో ప్రపంచ దేశాల సరసన నిలుస్తుంది.

*(జె. ఉదయభాస్కర్)*

# నిరుద్యోగ సమస్య - ఉపాధి అవకాశాలు

విశ్వవ్యాప్తంగా నిరుద్యోగ భూతం జడలు విరబోసుకుంటుంది. దేశ విదేశాల్లో ఉపాధి కల్పన ఎంత నిరాశావహంగా ఉందో అంతర్జాతీయ కార్మిక సంస్థ తాజా నివేదిక ఎలుగెత్తి చాటుతుంది. 15-24 సంవత్సరాల ప్రాయంలోని యువకుల్లో రమారమి సగం మంది ఉపాధికి నోచుకోక కుములుతున్నారని ప్రపంచ దేశాల్లో విలువ నిరుద్యోగుల సంఖ్య దాదాపుగా ఎనిమిది కోట్ల ఎనభై లక్షల మేరకు విస్తరించిందని గణాంకాలు భీతావహ దృశ్యం ఆవిష్కరిస్తున్నాయి.

దేశదేశాల్లో ఉపాధి, ఉద్యోగ అవకాశాల పెంపుదలను కాంక్షిస్తూ అటు ప్రైవేటు రంగాన్ని, ఇటు ప్రగతి పథకాల్ని ఒకచోట చేర్చి విస్తృత చర్యలకు అవకాశం కల్పించాలన్న యోచనతో అంతర్జాతీయ యువజన ఉపాధి సదస్సు కొన్నాళ్ళ క్రితం బీజావాపనం జరిగి మొట్టమొదటి యువజన సాధికారత సదస్సు డిసెంబర్ 2003న హైదరాబాద్‌లో జరిగిందంటే ఉపాధి, ఉద్యోగ అవకాశాల ప్రాముఖ్యత ఎంతో తెలుస్తుంది.

నేడు సమాజం ఎదుర్కొంటున్న అనేక సమస్యలలో - నిరుద్యోగ సమస్య అత్యంత ప్రధానమైనది. భారతదేశ జనాభాపై ఐక్యరాజ్యసమితి రూపొందించిన నివేదిక ప్రకారం, మనదేశంలో కష్టించి పనిచేయగల వయస్సులో ఉన్న 21-59 సంవత్సరాల మధ్య వయస్సు వారు మొత్తం జనాభాలో 49% వరకు ఉన్నారు. వీరిలో 21-35 సంవత్సరాల వయస్సు గలవారు వీరిలో 35% మంది అనగా 9.20 కోట్లమంది పట్టణాలలో, నగరాలలో ఉండగా మిగిలిన 65% మంది గ్రామీణ ప్రాంతాలలో నివసిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాలలో ఉండే యువకులలో 60% మంది సరైన జీవనోపాధి అవకాశం లేక వ్యవసాయ రంగంపై ఆధారపడి ప్రచ్ఛన్న నిరుద్యోగులుగా ఉన్నారు.

భారతదేశంలో సాంకేతిక నైపుణ్యం ఉన్న శ్రామిక సంపద గత 20 సంవత్సరాలుగా సాలీనా 9% పెరుగుతున్నారు. నేడు ప్రపంచంలో గుర్తింపు పొందిన శాస్త్ర సాంకేతిక నైపుణ్యం కలిగిన శ్రామికులు మానవ సంపద/మానవ వనరులు ఉన్న దేశాలలో భారతదేశం అగ్రస్థానం ఆక్రమిస్తుంది. సమాచార, సాంకేతిక పరిజ్ఞాన ఆధారిత సేవలు, బిజినెస్ ప్రాసెస్ ఔట్‌సోర్సింగ్‌లో భారత్ తనకంటూ ఒక ఉన్నతస్థానం సాధించుకుంది. ఇటీవల కాలంలో ఔట్‌సోర్సింగ్ పరిశ్రమ భారత్‌లో అతిపెద్ద ఉపాధి కల్పతరువుగా అభివృద్ధి చెందింది.

నూరుకోట్లకు పైబడిన జనాభాతో భారతావని అక్షరావని అక్షరాలా అపార మానవ వనరుల గని. పకడ్బందీ వ్యూమం కొరవడ్డ పర్యవసానంగా ఈ స్వాభావిక బలియే పెను బలహీనతగా పరిణమించింది. విధాన నిర్ణేతల చేతకాని మూలాన నిరుద్యోగ రక్కసికి కోరలు మొలుచుకున్నాయి. 'అందరికీ ఉపాధి' వట్టి ఎన్నికల నినాదంగా మారిపోయింది. రోజుకు 50 రూపాయల సంపాదన

జరుప్లావత్ రాజు, ఫ్రీలాన్స్ రచయిత




కూడా లేక 44% మంది భారంగా బతుకు బండి లాగిస్తున్నారు. ప్రపంచంలో ఎక్కడా లేనంత మంది నిరక్షరాస్యులు, నిరుపేదలు, నిరుద్యోగులు మన దేశంలోనే పోగుపడి ఉన్నారు.

నిరుద్యోగ అంచనాల నిపుణుల సంఘం అధ్యక్షులైన శ్రీ పి.బి. భగవతి రూపొందించిన అంచనాల ప్రకారం 1973లో 18.7 మిలియన్ల నిరుద్యోగులున్నట్లు అంచనా వేశారు. సెప్టెంబర్ 2004 నాటికి దేశంలో 939 ఉపాధి నమోదు సంఘాల సమాచారం ప్రకారం దేశంలో 4.16 కోట్ల నిరుద్యోగులు ఉన్నారు. 2003లో దేశం మొత్తంలో 3.04 లక్షల ఉపాధి ఖాళీలకు 1.06 లక్షల మందికి ఉపాధి కల్పించడమైనది. 59వ రౌండ్ ఎన్.ఎస్.ఎస్. (2003-2004) ఉద్యోగిత అంచనాల ప్రకారం రోజువారి ఉపాధి పెరుగుదల రేటు 1988-98 సంవత్సరాల మధ్యకాలంలో 2.07 శాతం నుంచి 1997-2004 నాటికి 1.07% తగ్గిందని అంచనా వేయడమైనది. కీలకమైన వ్యవసాయ రంగంలో ఉపాధి కోరుతున్న వారి సంఖ్య 60 నుండి 57% పడిపోయింది.

10వ పంచవర్ష ప్రణాళికా కాలంలో సాలీనా 10 మిలియన్ల ఉపాధి అవకాశాలు కల్పించాలనే ముఖ్య ఉద్దేశ్యంతో ఈ లక్ష్యాన్ని పరిశీలించాల్సిందిగా ప్రణాళికా సంఘం సభ్యులు శ్రీ ఎస్.పి. గుప్తా అధ్యక్షులుగా ఒక ప్రత్యేక సంఘాన్ని ప్రణాళికా సంఘం నియమించింది. ఈ సంఘం 1998-99 సంవత్సరాల మధ్య కాలంలో జనాభా పెరుగుదల రేటు, శ్రామికుల పెరుగుదల రేటు క్షీణించినట్లుగా వ్యక్తపరచింది. కాని ఇదే కాలంలో మొత్తం ఆర్థిక వ్యవస్థ పనితీరు గడిచిన దశాబ్దం కంటే ఈ దశాబ్దంలో మెరుగైన తీరును ప్రదర్శించినట్లు వ్యక్తపరిచినారు. అయితే దీనికి వ్యవసాయ, అసంఘటిత రంగాల్ని పునరుత్తేజం చేయడమే మార్గాంతరమని ఎస్.పి. గుప్తా కమిటీ సూచించింది.

ముఖ్యంగా వ్యవసాయం దాని అనుబంధ రంగాలు, చిన్నతరహా, మధ్య తరహా పరిశ్రమలు, నిర్మాణరంగం, టూరిజం, ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటి) వైద్య, విద్యారంగాలలో ఖాదీ, గ్రామీణ యూనిట్లు ఫుడ్ ప్రాసెసింగ్ రంగాలలో

10వ ప్రణాళికా కాలంలో 20 మిలియన్ల అదనపు శ్రామిక శక్తితో కూడిన ఉద్యోగ అవకాశాలను పెంపొందించాలని ఎస్.పి. గుప్తా కమిటీ అభిప్రాయ పడింది. అలాగే దీని ప్రకారం వ్యవసాయరంగంలో ప్రచ్ఛన్న నిరుద్యోగులకు పారిశ్రామిక రంగమే ఉపాధి కల్పించగలదు. పారిశ్రామిక రంగాన్ని కూడా అభివృద్ధి పరిస్తే ఉద్యోగిత పెరుగుతుంది.

ప్రముఖ అర్థశాస్త్రవేత్త, నోబుల్ బహుమతి గ్రహీత గున్నార్ మిర్డాల్, భారతీయ విద్యావిధానం, మానవ సంపదను పెంపొందించే విధంగా రూపొందించలేరని, సాంకేతిక పరిజ్ఞానం కొరవడిన లక్షల మంది యువకులను ఏర్పరచిందనే అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు.

నాలుగుకోట్లు దాటిన నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలంటే దేశ ఆర్థిక వ్యవస్థ ఏటా 10% చొప్పున వృద్ధి చెందితే వ్యవసాయ రంగంలో 3.9 కోట్ల మందికి, పరిశ్రమల్లో 2.58 కోట్ల మందికి, సేవారంగంలో 3 కోట్ల మందికి ఉపాధి లభిస్తుంది.

కేంద్రంలో కొలువుతీరిన ఐక్య ప్రగతిశీల కూటమి సర్కారు "కనీస ఉమ్మడి కార్యక్రమం" లోనూ ఉపాధి అవకాశాల పరికల్పనను ముఖ్యాంశంగా చేర్చారు. దేశంలో ప్రతి కుటుంబంలోనూ ఒక్కరికి 100 రోజుల పాటు ఉపాధి కల్పిస్తా మనేది సంకీర్ణ సర్కారు విధానం. 100 రోజుల పాటు జీవిక కల్పించటానికి అయ్యే వార్షిక వ్యయం 1,90,000 కోట్ల రూపాయలు. వీటిని సమకూర్చి ఈ పథకాన్ని అమలు జరిపినట్లయితే మొత్తంలో కొద్ది శాతం నిరుద్యోగం తగ్గుముఖం పడుతుంది.

మనదేశంలో ప్రతి సంవత్సరం వృధా అవుతున్న వేలాది కోట్ల రూపాయలు విలువగల ఆహార ఉత్పత్తులను, వ్యవసాయమే జీవన ఆధారంగా కల రైతుల కడగండ్లను ప్రాసెస్ చేసిన ఆహార పదార్థాలను, పెరుగుతున్న స్వదేశీ మార్కెట్ డిమాండ్‌ను, పుష్కలంగా ఉన్న ఎగుమతి అవకాశాలను మరియు ప్రభుత్వాలు ఇస్తున్న అనేక ప్రోత్సాహకాలను దృష్టిలో ఉంచుకొని యువత వ్యక్తిగతంగా లేక సంఘటితంగా వ్యవసాయాధార పరిశ్రమలను స్థాపించి తాము ఉపాధి పొందుతూ, మరి కొందరికి ఉపాధి అవకాశాలను కల్పిస్తూ దేశాభివృద్ధిలో పాలుపంచుకొనుటకు యువత నడుం బిగించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

చదువుకున్న యువతీ యువకులందరూ ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తూ ఉండటం వలన, ప్రభుత్వ శాఖలలో నియామకాలు గణనీయంగా తగ్గిపోవటం మూలంగా, చదువులు పూర్తి చేసి ఉద్యోగార్థుల జాబితాలో ప్రతి సంవత్సరం చేరే వారి సంఖ్య గణనీయంగా ఉండటం వలన యువతలో నిరుద్యోగుల శాతం క్రమేణా అధికమవుతూ ఉంది. కంప్యూటర్ ఆవిర్భావంతో, నూతన యంత్రాల రాకతో గతంలో పదిమంది పనిచేసే పని ఒక కంప్యూటర్, ఒక యంత్రం, ఒక సహాయకునితో చేయటం సాధ్యమైనది. అందువల్ల ప్రభుత్వ శాఖలలో, ప్రభుత్వ మరియు ప్రైవేట్ రంగ సంస్థలలో నూతన ఉద్యోగ అవకాశాలు గణనీయంగా తగ్గిపోయి ప్రపంచవ్యాప్తంగా వచ్చిన ఆర్థిక విధానాలపరమైన మార్పుల వలన కేవలం ఉద్యోగాల కల్పన కొరకు యువతకు క్రమేణా నిరుద్యోగులుగా ఉండే వారి సంఖ్య ఎక్కువ అవుతున్నది. ఈ పరిస్థితులలో యువత ఉద్యోగాలకై ఎదురుచూపులు మాని, స్వయం ఉపాధి ద్వారా తమకు అనుకూలమైన జీవన మార్గాన్ని ఏర్పరచుకొని తాము ఉపాధి పొందుతూ, మరికొందరికి ఉపాధి అవకాశాలను కల్పించటం ఒక్కటే మార్గం. దీనికి ప్రభుత్వం కూడా సానుకూలంగా స్పందించి స్వయం ఉపాధిని వెతుక్కొనే వారికి సామాజికంగా, ఆర్థికంగా చేయూత ఇచ్చి నిరుద్యోగులను తగ్గించవలసిన బాధ్యత కల్గి ఉన్నది.

ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుత ప్రభుత్వం ద్వారా ఖాదీ మరియు గ్రామీణ పరిశ్రమల సమాఖ్య 18-35 సంవత్సరాల మధ్య గలవారికి చిన్న, మధ్య తరహా పరిశ్రమలలో ఉద్యోగాలు కల్పించుటకు 500 యువ ఖాదీ గ్రామోద్యయ మహా విద్యాలయ క్రింద స్వర్ణజయంతి సేవా రోజ్‌గార్ యోజన పథకం పేరుతో శిక్షణ ఇస్తున్నారు. అదే విధంగా 80 మండలాలలో ప్రతి గ్రామంలో కనీసం 2000 కుటుంబాలకు ప్రభుత్వం ఉపాధి కల్పించవలసిందిగా నిర్ణయించింది. కరువు పరిస్థితులను అంచనావేసి ఆహార రక్షణకై ఉపాధి కొరకు పనికి ఆహారం పథకం చేస్తున్నారు.

ఆంధ్రప్రదేశ్‌లో సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నాలుగువేల డ్వాక్రా గ్రూపులకు 12 కోట్ల రూపాయలను ఫైనాన్స్ చేసింది. మరియు స్వయం ఉపాధి గ్రూపులకు, ఇతర మహిళా గ్రూపులకు సహాయం అందిస్తూ మహిళా నిరుద్యోగులను ఉద్యోగులుగా మార్చి రాష్ట్ర అభివృద్ధిలో తోడ్పడుతుంది. ప్రభుత్వం చేపట్టిన ఉదార విధాన నిర్ణయాల వలన ఉపాధి, ఉద్యోగ అవకాశాలు మెరుగవుతాయనడంలో సందేహం లేదు. అలాగే జనాభా పెరుగుదల అరికట్ట గలిగితే నిరుద్యోగం తగ్గుముఖం పడుతుంది. ఆదాయం తక్కువగా ఉండి ఉపాధి అవకాశాలు విస్తృతంగా ఉన్న గ్రామీణ ప్రాంతాలు, వ్యవసాయరంగం, చిన్నతరహా పరిశ్రమల అభివృద్ధిలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

కీలక సమస్యలపై మేలిమి సిఫార్సుల్ని సంకుచిత రాజకీయాలకు అతీతంగా అమలుపరిచే పరిణతి ప్రభుత్వాల్లో ప్రదర్శితం కావాల్సి ఉంది. మహా సంక్షోభమై ఉరుముతున్న నిరుద్యోగ సమస్యను స్వయంఉపాధి పథకాలతో సమర్థంగా ఎదుర్కొన్నప్పుడు మాత్రమే ప్రభుత్వాలు నిరుద్యోగాన్ని నిర్మూలించి అభివృద్ధి దిశగా అడుగులు వేయడానికి అవకాశం ఉంది. లేదా విధాన నిర్ణయాలను విస్మరిస్తే నిరుద్యోగభూతం జడలు విప్పి అభివృద్ధిని కాటువేసి పేదరికం పెరిగిపోతుంది.

కేంద్రంలోని ఐక్య ప్రగతిశీల కూటమి (యు.పి.ఏ) కనీస ఉమ్మడి కార్యక్రమం 2005-06 బడ్జెట్‌లో తెలిపిందిలా మరో నాలుగేళ్ళలో అంటే యు.పి.ఏ. ప్రభుత్వ ఏలుబడి పూర్తి అయ్యే వరకు జౌళి రంగంలో 1.20 కోట్ల మందికి, వ్యవసాయరంగంలో ఒక కోటిమందికి, ఐటి రంగంలో లక్షల మందికి అవకాశం చూపెడుతుందని చిదంబరం బడ్జెట్‌లో ప్రకటించారు. దీని ప్రకారం అమలు జరిగితే నిరుద్యోగిత శాతం తగ్గి ఉపాధి, ఉద్యోగాలు పెరిగి భారతదేశంలో పేదరికం తగ్గి అభివృద్ధి వైపు పయనించవచ్చు. ■

# విపత్తు బాధితుల గృహ నిర్మాణ సహాయం

భారతదేశంలో ఇళ్ళ నిర్మాణానికి సంబంధించి అందుబాటులో ఉన్న వివరాల్లోని రెండు అంశాలు చాలా ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నాయి. దేశంలో ఇళ్ళ కొరత తీవ్రంగా ఉండడం మొదటిది కాగా, ఇళ్ళ నిర్మాణం నాణ్యత లోపించడం రెండవది. 2001వ సంవత్సరం జనాభా లెక్కల ప్రకారం, గ్రామీణ ప్రాంతాలలో సుమారు 65% ఇళ్ళ కొరత వేధిస్తోంది. దేశంలోని 71% గ్రామీణ జనాభాలో 41% మంది మాత్రమే పక్కా (సెమి పర్మినెంట్) ఇళ్ళల్లో ఉంటున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో 3/5 వంతుల ఇళ్లు మట్టి, తాటాకు, ఇతర తక్కువ నాణ్యత కలిగిన సామగ్రితో కట్టినవేనని నేషనల్ శాంపిల్ సర్వే ఆర్గనైజేషన్ (ఎన్ఎస్ఎస్ఓ) నిర్వహించిన పరిశీలనలో వెల్లడైంది. పట్టణ ప్రాంతాల్లోనే సుమారు 57% ఇళ్ళు మాత్రమే ప్రకృతి వైపరీత్యాలను తట్టుకో గలిగేలా నాణ్యమైన సామగ్రితో నిర్మించారు. గ్రామీణ ప్రాంతంలోని ప్రతి వెయ్యి కట్టడాలకు 19, పట్టణ ప్రాంతాల్లో 11 కట్టడాలు దీనస్థితిలో ఉన్నాయి. వాటికి పెద్ద ఎత్తున మరమ్మతులు అవసరమవుతున్నాయి.

భూమిని వినియోగించుకోవడంలో, ఇళ్ళ నిర్మాణ అనుమతుల విషయంలో నిబంధనలు సరిగా పాటించకపోవడం వల్ల ఇళ్ల నిర్మాణం నాసిరకంగా మారుతోంది. ఫలితంగా ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ఇళ్ళు దెబ్బతిని పెద్దసంఖ్యలో ప్రజలు నిరాశ్రయులవుతున్నారు. భారతదేశంలో ఇటీవల భూకంపాలు, బీహార్-నేపాల్ భూకంపం (1988), ఉత్తరకాశీ (1991), లాతూరు (1993), జబల్‌పూర్ (1997), చమోలీ (1999), భుజ్ (2002), దక్షిణ భారతదేశంలో సునామీ (2204), జమ్మూ కాశ్మీర్ (2205) భూకంపాలు తీవ్ర నష్టం కలిగించాయి. తుఫానులు, ప్రధానంగా ఒరిస్సాలో (1999), ఆంధ్రప్రదేశ్‌లో (1977, 1990, 1996) ఉపద్రవాన్ని సృష్టించాయి. అలాగే సింధు, గంగ, బ్రహ్మపుత్ర మైదానంలో వరదల కారణంగా ఏటా పది లక్షలకు పైగా కచ్చా ఇళ్ళు ధ్వంసమయ్యాయి.

## తుఫాను అనంతరం సహాయంలో భిన్న యంత్రాంగాలు

దేశంలో విపత్తుల తరువాత గృహ నిర్మాణాలకు అందించే సహాయంలో రాష్ట్రాల మధ్య, వైపరీత్యాల మధ్య వ్యత్యాసాలు ఉన్నాయి. 1993లో మహా రాష్ట్రలోని లాతూరు భూకంపంలో నష్టపోయిన వారికి విపత్తుల అనంతరం సహాయం పథకం కింద ప్రపంచ బ్యాంకు మొదటిసారిగా ఈ తరహా చేయూత నిచ్చింది. ఆ తర్వాత భుజ్ భూకంపం (2002)లో గుజరాత్‌కు, 2004లో సునామీలో దెబ్బతిన్న దక్షిణ భారత్ రాష్ట్రాలకు సహాయం అందించింది. భారత ప్రభుత్వం కూడా సునామీ బాధిత రాష్ట్రాల్లో పునరావాస కార్యక్రమాలకు ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించింది. అందులో ఇళ్ళ పునర్నిర్మాణానికి రూ. 40వేలు వంతున ప్రత్యేకించింది. జమ్మూ కాశ్మీర్‌లో యజమానే ఇల్లు నిర్మించుకునే ప్రాతిపదికన ఇంటికి లక్ష రూపాయలు ఇస్తూ భారత ప్రభుత్వం ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించింది. కేంద్ర ప్రభుత్వం నిరంతరం కొనసాగిస్తున్న ఇందిరా ఆవాస్ యోజన (ఐఎవై) తరహాలో ఒరిస్సాలో విపత్తుల సహాయాన్ని అందజేసింది.

కృష్ణ ఎస్. వత్స, రీజనల్ డిజాస్టర్ రిడక్షన్ అడ్వైజర్
యుఎన్‌డిపి, న్యూఢిల్లీ

మహారాష్ట్రలోని లాతూరు, గుజరాత్‌లోని కచ్, తమిళనాడులోని సునామీ ప్రాంతాల్లో ఇళ్ళ పునర్నిర్మాణానికి స్వచ్ఛంద సంస్థలు (ఎన్‌జీవో) పెద్ద ఎత్తున సహకరించినా, సాధారణంగా గ్రామాలను దత్తత తీసుకోవడం, కొత్త ఆవాసాలకు సహాయం వంటి పద్ధతులు పాటిస్తాయి. చాలావరకు ఎన్.జి.వో. లు పలు ప్రాంతాల్లో కొత్త ఆర్.సి.సి. ఇళ్ళ నిర్మాణాలకే ప్రాధాన్యం ఇస్తాయి. భారీ వైపరీత్యాలు సంభవించినప్పుడు మాత్రమే ఈ స్వచ్ఛంద సంస్థలు కల్పించుకుని అంతర్జాతీయ సంస్థల నుంచి నిధులు సేకరించి బాధితులకు చేయూతనిస్తాయి. తరచూ సంభవించే చిన్నపాటి విపత్తుల్లో ప్రజలు ఆవాసాలు నష్టపోతున్నప్పటికీ ఈ విధానం అమలు చేయడం కష్టతరం.

## ఇందిరా ఆవాస్ యోజన, సిఆర్ఎఫ్, ఎన్‌సిసిఎఫ్ సాయం

ప్రస్తుతం అమలులో ఉన్న ఇందిరా ఆవాస్ యోజన (ఐఎవై) మార్గదర్శకాలు విపత్తుల అనంతరం పునర్నిర్మాణ కార్యక్రమంపై పరిమిత ప్రభావం ఉంది. మొదటిది, ప్రకృతి వైపరీత్యాలు కాకుండా దాడులు, గృహ ఆస్తి దహనాలు, అగ్ని ప్రమాదం, పునరావాసం వంటి అత్యవసర సందర్భాలకు ఐఎవై కింద మొత్తం నిధులు కేటాయింపులో 5% మాత్రమే కేటాయిస్తారు. ఆయా అవసరాల కోసం ప్రతి జిల్లాకు అయిదు మిలియన్ల రూపాయలకు మించకుండా విడుదల చేయవలసి ఉంది. రాష్ట్ర స్థాయిలో ఇది సమానంగా ఉండకపోవచ్చు. రాష్ట్రంలోని ఒకటి, రెండు రాష్ట్రాలు విపత్తుల వల్ల నష్టపోతే ఈ జిల్లాలు అయిదు మిలియన్ రూపాయల మేరకే సహాయం పొందగలుగు తాయి. వాటితో కనీస మౌలిక సదుపాయాలు కూడా సమకూరవు. రెండవది, దారిద్ర్యరేఖకు దిగువున (బి.పి.ఎల్.) ఉన్న కుటుంబాలకే ఐఎవై కింద సహాయం అందుతుంది. మూడవది, ఆ జిల్లాలోని షెడ్యూల్డు తరగతులు, తెగల వారికి ఐఎవై నిధుల నుంచి కొంత మొత్తాన్ని కేటాయిస్తారు. ఈ విషయంలో మార్పు ఉండదు. వైపరీత్యాల్లో నష్టపోయిన వారు పరిమితంగానే ప్రయోజనం పొందుతారు. వైపరీత్యాల వల్ల జరిగిన నష్టాన్ని భర్తీ చేసుకునేందుకు కాక చిన్నపాటి మరమ్మతుల కోసమే విపత్తు సహాయనిధి (సి.ఆర్.ఎఫ్.) జాతీయ విపత్తుల సంఘటిత నిధి (ఎన్.సి.సి.ఎఫ్.) నుంచి సహాయం అందుతోంది. ఇళ్ళ పునర్నిర్మాణానికి ఇది ఎంత మాత్రం సరిపోదు.

## దీర్ఘకాలిక ప్రణాళిక ఆవశ్యకత

దేశంలో విపత్తుల తరువాత గృహ నిర్మాణానికి సంబంధించి దీర్ఘకాలిక ప్రణాళిక ఆవశ్యకతను గతంలోనే గుర్తించారు. ఏకరూపత, సంభవనీయత, యజమానులకే వ్యక్తిగత బాధ్యత, నష్ట నివారణ అనే అంశాల ఆధారంగా ప్రణాళిక అవసరమని భావించారు. 1. దేశవ్యాప్తంగా పెద్ద, చిన్న తారతమ్యం లేకుండా అన్ని రకాల ఉపద్రవాలకు ఆ విధానం వర్తించేలా ఉండాలి 2. ఈ విధానం అమలు చేయడానికి అనువుగా ఉంటూ, జాతీయ వనరులు సమకూరేలా ఉండాలి. అసాధారణమైన భారీ వైపరీత్యాలు అయితే తప్ప విదేశీ రుణాలు కానీ, విరాళాలపై ఆధారపడకూడదు. చివరగా, యజమానులు సొంత వనరులు సమీకరించుకుని ఆమోదయోగ్యమైన రీతిలో నష్టాలు నివారించి దిశానిర్దేశం చేసేలా ఉండాలి.

దేశంలో అతి పెద్ద గృహ నిర్మాణ కార్యక్రమం సవరించిన ఐఎవై కు అనుగుణంగా ఈ ప్రణాళిక ఉండాలి. ఐ.ఎ.వై. కింద ప్రతి కుటుంబం సొంత ఇల్లు కట్టుకునేందుకు సహాయంగా రూ. 30 వేలు అందచేస్తారు. అయితే లబ్ధిదారులంతా దారిద్ర్యరేఖకు దిగువ (బిపిఎల్) తరగతికి చెందినవారై ఉండాలి. అలాంటి వారిని గ్రామసభ ఎంపిక చేసి ఆమోదిస్తుంది. ఆ తర్వాత పనిసాగుతున్న తీరును బట్టి సహాయాన్ని రెండు లేక మూడు విడతలుగా విడుదల చేస్తారు. దేశంలో ఐఎవై కింద ప్రతి సంవత్సరం సుమారు 2 మిలియన్‌ల ఇళ్ళు నిర్మిస్తున్నారు.

విపత్తుల అనంతర గృహ నిర్మాణ సహాయ కార్యక్రమాన్ని ఐఎవై తో అనుసంధానించడం వల్ల ప్రధాన ప్రయోజనం ఏమిటంటే, దేశవ్యాప్తంగా సహాయం ఏకరీతిగా ఉంటుంది. ఐ.ఎ.వై. కి చెందిన ఆర్థిక, పరిపాలన యంత్రాంగాలు ఈ నూతన పథకానికి ఎల్లప్పుడు అందుబాటులో ఉంటాయి. విపత్తుల అనంతర గృహ నిర్మాణ కార్యక్రమం అమలుకు కొత్త ప్యాకేజీ కానీ విదేశ రుణాలు కానీ అవసరం లేదు.

ఐఎవై కింద ఇళ్ళ నిర్మాణాన్ని కాంట్రాక్టర్లే చేపట్టినప్పటికీ ప్రస్తుతం అన్ని రాష్ట్రాల్లో యజమానులే ఆ నిర్మాణాలు కొనసాగిస్తున్నారు. ఈ పద్ధతి వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయి. 1. ఒకేచోట నిర్మించడం వల్ల కొత్తగా భూములు సేకరించవలసిన అవసరం లేదు. 2. ఇళ్ళ నిర్మాణానికి ఇచ్చే ఆర్థిక సహాయాన్ని విడతల వారీగా బ్యాంకుల ద్వారా లబ్ధిదారులకు అందుతుంది. పథకం అమలులో లోపాలను తగ్గించవచ్చు. 3. ప్రధానంగా, ఇంటిని నాణ్యంగా కట్టుకునేందుకు ఆ బాధ్యతను యజమానులకే బదలాయిస్తారు. 4. యజమానులు పొదుపు, కుటుంబం కష్టించి పనిచేయడం ద్వారా వనరులు సమకూర్చుకుని, వాటిని సద్వినియోగం చేసుకునేందుకు ఐఎవై ఎప్పుడు ప్రోత్సాహకరంగా ఉంటుంది.

విపత్తుల వల్ల నష్టపోయిన ఇళ్ళను పునర్నిర్మించేటప్పుడు ఇళ్ళ నమూనాల్లో అడుగుమట్టం (ప్లింత్ ఏరియా) అంశం మినహా ఎలాంటి నిబంధన విధించక పోవడం ఐఎవైలోని అత్యంత ముఖ్యవిషయం. ఇళ్ళ అడుగుమట్టం 20 చదరపు మీటర్ల కంటే తక్కువగా ఉండరాదు. ఇళ్ళ లేఅవుట్, ఆకృతి (డిజైన్), పరిమాణం స్థానిక వాతావరణ పరిస్థితులు, లబ్ధిదారుల ప్రాధాన్యతలను బట్టి ఉంటాయి. అయితే వంటగది, వెలుతురు, పారిశుద్ధ్యం, పొగరాని చిమ్నీ వంటి సదుపాయాలతో రకరకాల పరిమాణాలు, లేఅవుట్‌లు రూపొందించవచ్చు.

## ఐఎవై మెరుగుదల

వైపరీత్యాల అనంతర గృహ నిర్మాణ కార్యక్రమం లక్ష్యం నెరవేరేందుకు ఐఎవైలో గణనీయమైన మార్పులు అవసరం. ఈ పథకంలో ఒక ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసి లక్ష్యాన్ని సాధించవచ్చు. ఇల్లు కట్టుకోవడానికి సహాయం పొందేందుకు దారిద్ర్యరేఖకు దిగువన (బిపిఎల్) ఉన్నవారే అర్హులు అనే నిబంధనను అమలు చేయకూడదు. కేంద్ర ప్రాయోజిత కార్యక్రమం తరహాలో రాష్ట్రాలు 25% వాటాతో ఈ విభాగం ద్వారా గ్రామీణాభివృద్ధి శాఖ నుంచి వనరులు అర్థించవచ్చు.

ప్రతి ఇంటికి ఐఎవై కింద వచ్చే మొత్తం కాని, అంతకు మించి కాస్త ఎక్కువగా సహాయం కానీ అందుతుంది. దెబ్బతిన్న ఇళ్ళను సరిగా సర్వే చేయవలసి ఉంది. కట్టడాలకు తీవ్రనష్టం వాటిల్లిన వారికి ఈ పథకం కింద సహాయం అందుతుంది. నష్టాల మదింపు గుణాత్మకంగా ఉండాలి, అందువల్ల ఇంజనీరింగ్ సిబ్బందికి విస్తృతంగా తగినంత శిక్షణ ఇప్పించాలి. చిన్న మరమ్మత్తు లను ఎదుర్కొంటున్న ఇళ్ళకు సిఆర్ఎఫ్, ఎన్‌సిసిఎఫ్ ద్వారా సహాయం అందుతుంది.

ఐఎవై కేవలం ఇళ్ళ నిర్మాణానికి మాత్రమే సహాయం అందచేస్తుంది. ఎలాంటి పౌర మౌలిక అవసరాలను తన జాబితాలో చేర్చలేదు. విపత్తుల అనంతరం గృహ నిర్మాణానికి కొంత మొత్తాన్ని కేటాయించాలి. గృహ నిర్మాణ సహాయంలో సుమారు 30–39% నిధులను మరమ్మత్తులు, పునర్నిర్మాణం, పౌర మౌలిక సదుపాయాల మెరుగుకు కేటాయించాలి. దీనివల్ల ఆవాసాల నాణ్యత పెరిగి, సామాజికంగా, ఆర్థికంగా కుటుంబ పరిస్థితి మెరుగుపడుతుంది. ఐఎవై కింద సమకూర్చిన వాటికంటే మెరుగైన సదుపాయాలు కల్పించేందుకు సాంకేతిక, వృత్తిపరమైన సేవలు అందుబాటులోకి రావాలి. విపత్తుల బాధితుల కోసం ఏర్పాటైన గృహనిర్మాణం, సాంకేతిక–ఆర్థిక సేవల విభాగం జాతీయ ప్రధాన స్రవంతిలో ప్రధానాంశంగా నిలుస్తుంది.

*(ఎ.ఎన్.ఆర్. కల్యాణ్)*

**యోజన**

యోజన (తెలుగు) జూలై, 2009 సంచిక 'మౌలిక సదుపాయాలు' ప్రత్యేక అంశంగా వెలువడుతుంది.

దీనిలో దేశం ఆర్థికంగా ముందుకు పోవడానికి దాని ఫలాలు సామాన్య మానవునికి అందించడానికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనపై విశేషమైన చర్చ జరుగుతుంది. పలువురు విశేషజ్ఞుల వ్యాసాలు దీనిలో పొందుపరుస్తున్నాము.

*– సీనియర్ ఎడిటర్*



# జనరల్ స్టడీస్ క్యాప్సుల్

జీడిగుంట నాగేశ్వరరావు

**ప్ర: బెంగాల్ సాంస్కృతిక పునరుజ్జీవనం గురించి వివరించండి?**

జ. 19వ శతాబ్దంలోనూ, 20వ శతాబ్దం ప్రారంభంలోను బ్రిటిష్ ఇండియాలోని బెంగాల్ (ప్రస్తుత పశ్చిమబెంగాల్) ప్రాంతంలో జరిగిన సామాజిక విప్లవాలన్నింటిని కలిపి బెంగాల్ సాంస్కృతిక పునరుజ్జీవనం అంటారు. బ్రిటిష్ ఇండియాలో 1911 వరకు కలకత్తా (ఇప్పుడు కోల్‌కతా) భారత రాజధాని కావడంచేత బెంగాల్ సాంస్కృతిక పునరుజ్జీవనం ప్రభావం దేశం మొత్తంపై చూపింది. బెంగాల్ సాంస్కృతిక పునరుజ్జీవనం రాజా రామ్మోహన్ రాయ్ (1775-1833)తో మొదలై రవీంద్రనాథ్ ఠాగూర్ (1861-1941) తో ముగిసింది. ఠాగూర్ తరువాత పుట్టిన ఎందరో మహనీయులు కళలను, సృజనాత్మకతను ప్రోత్సహించారు. 19వ శతాబ్దపు బెంగాల్ మత, సామాజిక ఉద్ధారకులు, పండితులు, సాహితీవేత్తలు, పాత్రికేయులు, దేశభక్తులు, శాస్త్రవేత్తలతో విరాజిల్లింది.

బెంగాలీ ప్రజల సాంస్కృతిక లక్షణాల సమ్మేళన పునరుజ్జీవనమే బెంగాల్ సాంస్కృతిక పునరుజ్జీవం అయితే కొందరు దీనిని హిందూ పునరుజ్జీవనం అని, మరి కొందరు బెంగాలీ పునరుజ్జీవనం అని అంటారు. దీనిని చాలావరకు ఐరోపా పునరుజ్జీవనంతో పోల్చవచ్చు. 19వ శతాబ్దంలో బెంగాల్ అనేక సమాజ సంస్కరణలు ప్రారంభించింది. వీటిలో హిందువులతో పాటు ముస్లింలకు సంబంధించినవి కూడా ఉన్నాయి. ముస్లిం సంస్కరణ ఉద్యమాలైన ఫరియాజీ, తిరిజ్-2-మహ్మదీయా ప్రముఖ పాత్ర వహించాయి. వీటికి కారణమైన పరిస్థితులు హిందువులలో ఆర్య సమాజ్, బ్రహ్మ సమాజ్ పుట్టుకకు దారితీసి చివరికి ఈ ఉద్యమాలన్నీ ఒకే బాట పట్టాయి. రాజా రామ్మోహన్ రాయ్ ఉద్యమాన్ని సాధారణ పునరుజ్జీవన ఉద్యమంగా వ్యవహరిస్తారు. ఈ ఉద్యమం పవిత్రమైన ఆర్యుల 'దేవుడు ఒక్కడే' అనే భావనను నూతన పాశ్చాత్య హేతువాద దృక్పథంతో జాగృతం చేసింది.

బెంగాల్ సాంస్కృతిక పునరుజ్జీవనంలో ప్రముఖపాత్ర పోషించిన ముఖ్యులు రాజా రామ్మోహన్ రాయ్ (1774-1833), అలెగ్జాండర్ డఫ్ (1806|1878), హెన్రీ కెరోజియో (1809-31), కృష్ణమోహన్ బెనర్జీ (1813-1885), జాన్ ఎలియట్ డ్రింక్ వాటర్ బెథూన్ (1801-1851), దేవేంద్రనాథ్ ఠాగూర్ (1817|1905), అన్‌గమ్ కుమార్ దత్తా (1820-91), మైఖేల్ మధుసూదన్ దత్ 91824-73), లాల్ బెహారీకే (1824-1892) కేశవ్‌చంద్రసేన్ (1838-1884), బంకిం చంద్ర చటోపాధ్యాయ (1838-1894), ప్రతాప్ చంద్ర మజుందార్ 91840-1905), జగదానంద రావ్ (1857-1879), జగదీష్ చంద్రబోస్ (1858-1937), రవీంద్రనాథ్ ఠాగూర్ (1861-1941), కాదంబిని గంగూలీ (1861-1923), బ్రిజేంద్రనాథ్ సేన్ (1864-1938), శ్రీరామ్‌చంద్ర చటోపాధ్యాయ (1876-1938), సత్యేంద్రనాథ్ బోస్ (1894-1974), నిరాథ్ చౌదరి (1897-1999), ప్రేమేంద్ర మిత్రా (1904-1988). రామకృష్ణ పరమహంస కూడా ఈ ఉద్యమంలో ప్రముఖపాత్ర పోషించారు.

బెంగాల్ సాంస్కృతిక పునరుజ్జీవనానికి తోడ్పడిన సంస్థలు : ఆసియాటిక్ సొసైటీ (1784), ఫోర్ట్ విలియం కళాశాల (1800), శ్రీరాంపూర్ కళాశాల (1817), హిందూ కళాశాల (1817), సంస్కృత కళాశాల (1824) , జనరల్ అసెంబ్లీస్ ఇన్‌స్టిట్యూట్ (ప్రస్తుత స్కాటిష్ చర్చి కళాశాల-1830), కలకత్తా వైద్యకళాశాల (1835), కలకత్తా విశ్వవిద్యాలయం (1857), విద్యాసాగర్ కళాశాల (1872), బెతువే కళాశాల (1879), విశ్వభారతి విశ్వవిద్యాలయం (1921), ఢాకా విశ్వవిద్యాలయం (1921), హిందూ కళాశాలకు ఆ తరువాత ప్రెసిడెన్సీ కళాశాలగా పేరు మార్చారు.

బెంగాల్ సాంస్కృతిక పునరుజ్జీవనంతో బుద్ధి జాగరణ జరిగిందని చెప్పాలి. ఐరోపా వాసులకు బెంగాల్ ప్రజల మాదిరిగా బ్రిటిష్ వారి వంటి ఆక్రమణదాడులను ఎదిరించవలసిన పరిస్థితి రాలేదు. ఈ బుద్ధి జాగరణ మహిళలు, పెళ్ళి, కట్నం, కులం, మతం వంటి సాంప్రదాయాలతో చాదస్తాలను ప్రశ్నించే చైతన్యాన్ని తెచ్చింది మొదట ప్రారంభమైన యువ బెంగాల్ ఉద్యమం విద్యావంతమైన హిందువులలో చైతన్యాన్ని మేల్కొలిపింది.

**ప్ర: భారతదేశ ఉక్కుమనిషిగా పేరు గాంచింది ఎవరు? ఆయన జీవిత విశేషాలు తెలపండి?**



జ. భారతదేశపు ఉక్కుమనిషిగా పేరుగాంచిన సర్దార్ వల్లభాయి పటేల్ ప్రముఖ స్వాతంత్ర్య యోధుడు. స్వాతంత్ర్యా నంతరం భారతదేశంలో సంస్థానాల విలీనానికి గట్టి కృషి చేశారు. హైదరాబాద్, జునాగడ్ లాంటి సంస్థానాలకు భారతదేశం

లో విలీనం చేసిన ఘనత పటేల్‌కే దక్కుతుది. భారత రాజ్యాంగం రచనలో కూడా ప్రముఖపాత్ర పోషించిన వల్లభాయి పటేల్ నెహ్రూ మంత్రివర్గంలో హోమ్ మంత్రిగా, ఉప ప్రధానిగా బాధ్యతలు నిర్వహించారు.

1875 అక్టోబర్ 31వ తేదీన గుజరాత్‌లో జన్మించిన పటేల్ ఇంగ్లండ్‌లో బారిస్టర్ చదివి అహ్మదాబాద్‌లో న్యాయవాద వృత్తిని చేపట్టారు. 1909లో కోర్టులో కేసు వాదిస్తున్న సమయంలో భార్య మరణించినట్టు వచ్చిన సమాచారాన్ని తెలుసుకుని కూడా ఏ మాత్రం చలించకుండా కేసు వాదన పూర్తి చేసి అందులో గెలిచారు. క్యాన్సర్‌తో చిన్నవయసులోనే భార్య మరణించినప్పటికీ అధైర్య పడకుండా, మరో పెళ్ళి గురించి ఆలోచించకుండా కుటుంబసభ్యుల సహకారంతో పిల్లలిద్దర్ని పెంచి పెద్ద చేశారు. 36 ఏళ్ళ వయసులో లండన్ వెళ్ళి అక్కడి లా కళాశాలలో 36 నెలల కోర్సును 30 నెలలలో పూర్తి చేశారు. అహ్మదాబాద్ తిరిగి వచ్చి న్యాయవాదిగా విశేష కీర్తిప్రతిష్టలు ఆర్జించారు. ఎప్పుడూ సూటు, బూటుతో తెల్లదొరలా దర్జాగా వుండేవారు పటేల్.

అప్పట్లో దేశంలో జరుగుతున్న జాతీయోద్యమం ఆయనలో దేశభక్తి స్ఫూర్తిని రగిలించింది. తన న్యాయవాదవృత్తిని నిర్వహిస్తూనే, గాంధీజీ చేపట్టిన సహాయ నిరాకరణ ఉద్యమం పట్ల ఆకర్షితుల య్యారు. 1928లో బార్డోలీలో బ్రిటిష్ ప్రభుత్వం విధించిన పన్నులకు వ్యతిరేకంగా కిసాన్ ఉద్యమం చేపట్టి విజయవంతంగా నడిపించారు. అలా దేశ ప్రజల దృష్టిలో నాయకుడుగా నిలిచారు. ఆ సమయంలోనే ఆయనకు 'సర్దార్' బిరుదు వచ్చింది. సహాయ నిరాకరణోద్యమంలో పాల్గొని 3 లక్షల మంది సభ్యులతో కలసి దాదాపు 15 లక్షల రూపాయల విరాళాలు సేకరించారు. విదేశీ వస్తు దహనంలో భాగంగా తన వద్దనున్న తెల్లదొరల దుస్తులను అగ్నికి ఆహుతి చేశారు. తన ఇద్దరు పిల్లలతో పాటు జీవితాంతం ఖద్దరు దుస్తులనే ధరించారు. గుజరాత్‌లో మద్యపానం, అస్పృశ్యత, కుల వివక్షలకు వ్యతిరేకంగా ఉద్యమాలు నిర్వహించారు. 1931లో కరాచీ భారత జాతీయ కాంగ్రెస్ సదస్సుకు పటేల్ అధ్యక్షుడిగా ఎన్నిక అయ్యారు. ఉప్పు సత్యాగ్రహం, 1942 నాటి క్విట్ ఇండియా ఉద్యమాలలో కూడా ప్రముఖ పాత్ర వహించారు.

భారత రాజ్యాంగ రచనకై ఏర్పడిన రాజ్యాంగ సభలో సీనియర్ సభ్యుడిగా వల్లభాయి పటేల్ చక్కటి సహకారాన్ని అందించారు. అంబేద్కర్‌ను డ్రాఫ్టింగ్ కమిటీ అధ్యక్షునిగా నియమించడంలో ముఖ్యపాత్ర సాగించారు. రాజ్యాంగసభలో ప్రాథమిక హక్కుల కమిటీ ఛైర్మన్‌గా పనిచేశారు. పార్లమెంట్‌లో ఇద్దరు ఆంగ్లో ఇండియన్‌లను నామినేట్ చేసే అధికారాన్ని రాష్ట్రపతికి కల్పించే ప్రాతినిధ్యం చేసింది కూడా ఆయనే. దేశస్వాతంత్ర్యం కోసం విశేషకృషి చేసిన సర్దార్ వల్లభాయి పటేల్‌కు స్వాతంత్ర్యం తరువాత సహజంగానే ఉన్నత పదవులు లభించాయి. జవహర్‌లాల్ నెహ్రూ మంత్రివర్గంలో హోం మంత్రిగాను, ఉపప్రధానిగాను 1947 నుంచి 1950 డిసెంబర్ 15వ తేదీన మరణించే వరకు పదవులు నిర్వహించారు.

తన సిద్ధాంతాల విషయంలో చాలాసార్లు నెహ్రూతో సైతం ఆయన విభేదించారు. 1936 భారత జాతీయ కాంగ్రెస్ సదస్సులో నెహ్రూ ప్రవచించిన సోషలిజంను పటేల్ వ్యతిరేకించారు. స్వాతంత్ర్యానంతరం కూడా స్వదేశీ సంస్థానాల విలీనంలో నెహ్రూ అభీష్టానికి విరుద్ధంగా బలవంత బలప్రయోగం, సైనిక చర్యలు చేపట్టి విజయం సాధించారు. కాశ్మీర్ అంశాన్ని ఐక్యరాజ్యసమితికి నివేదించడంలో కూడా ఆయన నెహ్రూతో విభేదించారు. పాకిస్తాన్‌కు ఇవ్వవలసిన రు.55కోట్లు ఇవ్వరాదని కూడా పటేల్ నెహ్రూతో వాదించారు. కాని రాష్ట్రపతి ఎన్నికలలో నెహ్రూ చక్రవర్తుల రాజగోపాలాచారి వైపు మొగ్గుచూపగా పటేల్ ఆ పదవికి రాజేంద్రప్రసాద్ అభ్యర్థిత్వాన్ని ప్రతిపాదించి సఫలీకృతులయ్యారు. అలాగే, 1950 కాంగ్రెస్ సమావేశంలో నెహ్రూ అభ్యర్థి కృపలానీని కాదని పురుషోత్తమదాస్ టాండన్‌ను పటేల్ గెలిపించారు.

1950 డిసెంబర్ 15వ తేదీన కన్నుమూసిన పటేల్‌కు భారత ప్రభుత్వం ఆలస్యంగానైనా 1991లో భారతరత్న బిరుదును ప్రకటించింది.

## ప్ర: ప్రపంచంలోనే ఎత్తయిన పర్వతాలు ఏవి? వివరించండి?



జ. హిమాలయ పర్వతాలు ప్రపంచం లోనే ఎత్తయినవి. హిమాలయాలు అంటే సంస్కృతంలో మంచుకు నెలవు అని అర్థం. హిమాలయాలలో దాదాపు 100 శిఖరాలు, 200 మీటర్ల ఎత్తుకు మించి ఉన్నాయి. ఆసియాలోని ఐదు దేశాలలో వ్యాపించి ఉన్న హిమాలయ పర్వతాలు భారత ఉప ఖండాన్ని, టిబెట్ పీఠభూమిని వేరు చేస్తున్నాయి. ఎవరెస్టు, కాంచనగంగ మొదలైన శిఖరాలు హిమాలయాలలోనే ఉన్నాయి. భూటాన్, చైనా, భారత్, నేపాల్, పాకిస్తాన్ దేశాలలో విస్తరించి ఉన్న హిమాలయ పర్వతాలు ప్రపంచంలోని మూడు అతిపెద్ద నదులైన సింధు, గంగ, బ్రహ్మపుత్ర యంగ్‌ట్‌జీ లకు వనరులుగా వున్నాయి. వీటి పరీవాహక ప్రాంతాలలో 1.3 బిలియన్‌ల జనాభా వుంది. హిమాలయ పర్వతాలు చంద్రవంక ఆకారంలో 2,400 కి.మీ. పొడవు, 400 కి.మీ. వెడల్పు కలిగి ఉన్నాయి.

హిమాలయాలలో హిందూ, బౌద్ధ ధర్మాలకు చెందిన అనేక ధార్మిక ప్రదేశాలు ఉన్నాయి. హిందూ ధర్మం ప్రకారం పార్వతి తండ్రిపేరు హిమవత్. గంగానది మైదానంలో ప్రవేశించే ప్రాంతమైన హరిద్వార్, వైష్ణవాలయం బద్రీనాథ్, 12 జ్యోతిర్లింగాలు కలిగిన కేదార్‌నాథ్, భగీరథి జన్మస్థానం గేమూగ్ హిమాలయాలలోనే ఉన్నాయి. అలకనంద భగీరథీ నదులు కలసి గంగానదిగా ఏర్పడే దేవ్‌ప్రయాగ్, లక్ష్మణ దేవాలయం కలిగిన రిషికేష్, శివపార్వతుల నివాసస్థలమైన 6వేల 638 మీటర్ల ఎత్తయిన కైలాసపర్వతం కూడా ఇక్కడే ఉన్నాయి. ఈ పర్వతం అడుగుభాగానే మానస సరోవరం

*(మిగతా 48వ పేజీలో)*

### చదువుకోనడానికి ఒక అనువైన వాతావరణం

# నాగాలాండ్ తెగల మార్గదర్శకం

సచిన్ జైన్

ఈశాన్య భారతంలో ఉపస్థితమైన నాగాలాండ్‌లోని 80% జనాభా ఉన్న గ్రామీణ ప్రాంతాలు అనూహ్యమైన మార్పులను చవిచూస్తున్నాయి. కొహిమాకు 40 కి.మీ. దూరంలో ఉన్న ఖోనో అనే ఒక చిన్న గ్రామము దీన్ని ప్రతిబింబిస్తుంది. ఇక్కడ 6 పాఠశాలలు ఉన్నా 32% పిల్లలు పాఠశాలా విధానానికి ఆవలె ఉన్నారు. ఉపాధ్యాయులు గైర్హాజరవుతూనే ఉన్నారు. గ్రామ కమ్యూనిటీ, విద్యావిధానం పట్ల నిరాసక్తత కనబరుస్తున్నారు. ఇది 2002కి పూర్వం.

ఈ రోజు, కోనోమా, పాఠశాలలలో నమోదు కాని పిల్లవాడు లేదు. విద్యా సంవత్సర కాలమంతా పిల్లల పూర్తిహాజరు ఉండునట్లు ఒక నిర్వహణ మరియు పర్యవేక్షణ వ్యవస్థ రూపొందించబడినది. ఈ మార్పు గాలులు 90% క్రైస్తవ మెజారిటీ, ప్రత్యేక సంస్కృతి, భాషా, జాతి మరియు జీవన విధానము కలిగి 16 తెగలు కలిగిన నాగాలాండ్ అంతయూ ఇటువంటి మార్పులనే తెలియ జేస్తున్నాయి. ఈ మార్పు మూలాలు, అధికార రాజకీయ విజ్ఞుల ప్రేరణతో, ప్రభుత్వ సంస్థల యాజమాన్యము, నిర్వహణ మరియు విధానాల అమలుని కమ్యూనిటీలకు బదలాయించడంలో ఉన్నవి.

2002-03లో చేయబడిన ఒక చట్టం, విద్య, ఆరోగ్యం, నీరు, విద్యుత్తు, పర్యాటక రంగం మరియు బయో డైవర్సిటీ పరిరక్షణ మొదలగు ముఖ్య అంశాల సమాహారమైన కమ్యూనిటైజేషన్ అనే ప్రక్రియను విశదీకరిస్తుంది. ఈ కమ్యూనిటైజేషన్ అనే ప్రక్రియ ప్రభుత్వ బాధ్యతను కమ్యూనిటీకి బదలాయించడాన్ని తెలియజేయదు. ఇది ఎవ్వరినైతే ఎక్కువగా ప్రభావితం చేస్తుందో, వారిని భాగస్వామ్యులుగా చేస్తూ దీని పరిధిని విస్తరింపచేసే ఒక విశాల దృక్పథం పై ఆధారపడినది ఈ విధానము. "కోస్ సేచే" అను ఒక విద్యా కమిటీ సభ్యుడైన స్థానికుడు "కమ్యూనిటీని విద్య విధానంలో ఎక్కువ భాగస్వామిగా చేయడం ద్వారా దానిని విద్యావిధానానికి మరింత చేరువ చేయడం అవుతున్నది" అని అంటున్నారు. కమ్యూనిటీలలో ఈ విధానం యొక్క ప్రాముఖ్యత పై అవగాహన మరియు జవాబుదారీతనంపై స్పృహ వృద్ధి చెందుతున్నాయి. గతంలో "ప్రభుత్వ బాధ్యత" గా దేశంలోని ఇతర ప్రాంతాలలో వదలివేయబడిన అంశాలలో, ఈ ఒరవడి ఎక్కువ స్థానిక చొరవ, నిబద్ధత, మరియు యాజమాన్య భావనను ఆ అంశాలలో కలిగించగలిగినది. ప్రస్తుతం స్థానిక విద్యాసంస్థల మరియు పిల్లల అవసరాల ఆధారంగా చర్యలు తీసుకొనబడుతున్నాయి. పాఠశాలలలో పడిపోతున్న విద్యార్థుల సంఖ్యపై ఆందోళన చెందినదై కోహిమాలోని "ది మెయిన్‌ల్యాండ్ వార్డ్ ఎడ్యుకేషన్ కమిటీ" విద్యార్థులు విద్యావ్యవస్థ వెలుపల ఉండుటకు గల కారణాలను పరిశోధించుటకై విరాళాలను సేకరించినది. వారు స్థానికులైన 'రేనాలి బెల్హో'



ఇచ్చిన స్థలంలో రెండు గదుల చిన్న పాఠశాలను ప్రారంభించారు. ఉపాధ్యాయుల సంఖ్యను పెంచాల్సిన ఆవశ్యకతను గుర్తించిన "చంగ్ లేన్ విద్యా కమిటి" ఇద్దరు ఉపాధ్యాయులను నియమించినది. వీరి జీతము కమ్యూనిటీ విరాళాల ద్వారా చెల్లించబడేది. వారు తరువాత విద్యార్థుల ఆవశ్యకతను గుర్తించి వసతి గృహాన్ని నిర్మించ ప్రయత్నించినారు.

2002లో ప్రారంభించి 90 గ్రామాలలో 205 ప్రాథమిక పాఠశాలలను గిరిజన కమ్యూనిటీలకు అప్పగించినారు. ప్రస్తుతము మొత్తం 1286 గ్రామాలలోని 145 పాఠశాలలు కూడా దీనిని అనుసరించాయి. వీటిలో, 890 గ్రామాలు అసూయ పడు విధముగా ఒక్క విద్యార్థి కూడా విద్యావ్యవస్థకు వెలుపల లేకుండా ఉండే రికార్డ్ కలిగిఉన్నాయి. శ్రీ సోచే అభిప్రాయం ప్రకారం మొదటి సంవత్సరం ఎక్కువగా ప్రస్తుత విధానాన్ని పరిశీలించటానికి మరియు ఆకళింపు చేసుకోవడనికి వినియోగించి నారు. గ్రామీణ విద్య కమిటీల స్థాపన, విద్యావిధానాల సంస్కరణ మరియు ప్రమాణాల నిర్ణయాలలో ప్రముఖ పాత్ర పోషిస్తున్నాయి. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, ప్రభుత్వేతర సంస్థలు, చర్చిలు మరియు గ్రామీణ కమ్యూనిటీల భరితమైన ఈ పద్ధతి, విద్యావిధాన పనితీరుని పర్యవేక్షించి లోటుపాట్లను సరిదిద్దడంలో ప్రధానపాత్ర పోషిసున్నది. ఉపాధ్యాయులు తరచుగా గైర్ హాజరవడం, గురించి తెలుసుకొని ఈ విఇసి, ఒక నిఘా కమిటీని నియమించింది. ఉపాధ్యాయుల హాజరును నమోదు చేయటానికి ఒక రిజిష్టర్ ను అన్ని పాఠశాలలో ఉంచి, దీని ఆధారంగా, తప్పు చేసిన టీచర్లను నియంత్రించడం కాని ఏరివేయడం కాని చేయడమైనది.

ఆడవారు నాల్గవ వంతు సభ్యులుగా ఉన్న ఈ విఇసి 'పనిలేక-భ్రుతిలేదు' అనే ధైర్యమైన నిర్ణయాన్ని తీసుకున్నాయి. జీతాల పంపిణీకి ముందే వారి హాజరు మరియు పనిసామర్థ్యమును పరిగణనలోకి తీసికొందురు. ఈ విఇసి కి విద్యా సంబంధ ఫండ్ పై నియంత్రణని బదలాయించడ2మైనది. ఈ ఒక్క

**యోజన**

అనేకమంది పాఠకులు యోజన పాత సంచికలు కావాలని అడుగుతున్నారు. అటువంటి సంచికలు మా ఏజెంట్ వద్ద లభిస్తాయని తెలియజేస్తున్నాము. హైదరాబాద్‌లోని యోజన ఏజెంట్ మెస్సర్స్ ఆనంద్ ఏజెన్సీని ఈ క్రింది నంబర్లలో సంప్రదించగలరు.

98484 28516, 98482 49695

– సీనియర్ ఎడిటర్

ప్రయత్నమే వారిలో యాజమాన్య భావనను కలిగించడంలో సఫలమైనది. విద్యా సంబంధమైన ప్రత్యేక ఖాతాలో ఉన్న ప్రభుత్వ నగదును విఐసి వద్ద ఉంచడమైనది. విఐసి తరువాత స్వతంత్రంగా ఇతర వివిధ ఖాతాలకు ఈ నగదును బదలాయించడం మరియు అజమాయిషీ కలిగి ఉంటుంది.

అనుభవజ్ఞుడైన విద్యావేత్త శ్రీ స్లేహూ తెక్ హూజా 'ఈ కమ్యూనిటీ భాగస్వామ్యము వలన అంతా మారిపోయింది అనటం లేదు. కానీ, ఇప్పుడు విద్యావిధానంలో కమ్యూనిటీ ఒక హక్కును కలిగి ఉండటం అనేది వాస్తవం' అని అంటున్నారు.

విద్యా కమిటీ కార్యదర్శి "దేజు ఖానే, ఈ చట్టము విద్యారంగం లో సరిదిద్దు చర్యలను తీసుకునే విధంగా వాటిని బలోపేతం చేసినది" అని అంటున్నారు. సాంప్రదాయ పాఠ్యాంశాలతో పాటు గిరిజన సంస్కృతి, స్థానిక అభివృద్ధి గూర్చిన అంశాలను కూడా ప్రవేశపెట్టినారు. విద్యార్థి–ఉపాధ్యాయ నిష్పత్తి, నాగాలాండులో, దేశీయ నిష్పత్తి అయిన 1 టీచర్‌కి 42 విద్యార్థుల తో పోల్చిన, ఆశాజనకంగా, 1 టీచర్‌కి 21 విద్యార్థులుగా ఉన్నది. విద్యార్థి ఎగవేత శాతం, ఉపాధ్యాయ గైర్హాజరు తగ్గింపు, ఇన్‌ఫ్రాస్ట్రక్చరు అభివృద్ధికి సరి అయిన విధముగా ఫండ్ వినియోగము, మధ్యాహ్న భోజన పథకం యొక్క పర్యవేక్షణలలో ప్రస్ఫుటముగా అభివృద్ధి కనిపించినది. జనజీవన మరియు సేవలకు సంబంధించిన అనేక అంశాలపై, ప్రభుత్వ అజమాయిషీ లేక ప్రభుత్వేతర బదలాయింపు పై అనేక చర్చలతో సతమత మౌతున్న ఈ రోజుల్లో నాగాలాండ్, ఒక మధ్యంతరాన్ని ఎంచుకున్నది. అనేక భాగస్వాముల మధ్య కలయికే కాని విభేదించని మరియు కొత్త ఆలోచనల సాహసోపేత భరితమైన ఒక మార్గము. ప్రభుత్వ జోక్యమును అనుమతిస్తూనే కమ్యూనిటీల సృజనాత్మక అంశాలను ప్రాసెస్‌లోకి తీసుకువచ్చాయి. ఇది వారికి ఐక్యరాజ్య కమ్యూనిటైజేషన్ సేవా పురస్కారమును జూలై 2008న ప్రసాదించినది. అసామాన్యమైన సాంఘిక మూలధనాన్ని, సృజనాత్మకంగా ఉపయోగించుటను ఇతర అనేక దేశాలూ, సంఘాలూ ఒక ఆదర్శంగా తీసుకోవాల్సిన నమూనాగా గుర్తించి కొనియాడబడినది. ఈ మార్పు గాలులు నాగాలాండ్ గ్రామాలలో విస్తరిస్తుండగా, అందరూ పసివారి పోషణా వారి ప్రతిభా పాటవాలను ఒక తేజోవంతమైన భవిష్యత్తు తయారుజేయుటకు వినియోగించుటలో బద్ధులగుట ఒక హృద్యమైన అంశము. ■

---

## జనరల్ స్టడీస్...

*46వ పేజీ తరువాయి*

వుంది. ఇది బ్రహ్మపుత్ర నది జన్మస్థానం. శివ లింగం కలిగిన అమర్‌నాథ్, దుర్గాదేవి భక్తులకు కేంద్ర బిందువైన వైష్ణోదేవి ఆలయం ఇక్కడే ఉన్నాయి.

హిమాలయాలలో టిబెట్‌కు చెందిన ఎన్నో ధార్మిక ప్రదేశాలు ఉన్నాయి. దలైలామా నివాస స్థలం కూడా హిమాలయాలలోనే వుంది. హిమాలయాలలో యతి అనే ప్రసిద్ధ జీవి జీవించినట్టు ప్రజల విశ్వాసం. బౌద్ధధర్మంలో ప్రముఖ నగరమైన ఇంథాలా, గురుగోవింద్ సింగ్ తపస్సుచేసిన హేరు కుండ్‌నాహెట్ కూడా ఇక్కడే విలసిల్లాయి. హిమాలయాలోని ముఖ్యమైన శిఖరాలలో ఎవరెస్ట్, కంచన్‌గంగ, ధవళగిరి, సంగా, అన్నపూర్ణ, విశాల, నందాదేవి ప్రముఖమైనవి. ఇందులో ఎవరెస్ట్ శిఖరం ప్రపంచంలోనే ఎత్తయిన శిఖరం.

1953లో తొలిసారిగా ఈ శిఖరాన్ని అధిరోహించారు. నేపాల్/టిబెట్ సరిహద్దులో ఇది వుంది. గంగా పర్వతం ప్రపంచంలోనే 9వ ఎత్తయిన శిఖరం. ఇది భారత్/పాకిస్తాన్‌లో ఉంది. అన్నపూర్ణ శిఖరాన్ని 'పంటల దేవత' అని కూడా అంటారు. ప్రపంచంలోనే ఇది 10వ ఎత్తయిన శిఖరం. మృత్యుకర పర్వతంగా భావించే ఈ శిఖరం నేపాల్ లో ఉంది. విశాలశిఖరం ప్రపంచంలో 12వ ఎత్తయిన శిఖరం. పాకిస్తాన్/చైనాలో ఉంది. 'ఆశీర్వదించు దేవత' గా భావించే నందాదేవి శిఖరం ప్రపంచంలో 23వ ఎత్తయిన పర్వతం.

భారత్‌లోని ఉత్తరాఖండ్‌లో ఉంది. ఇక ప్రపంచంలో ఇంతవరకు అధిరోహించని ఎత్తయిన శిఖరం 'గాంగ్‌ఖర్‌పు మెన్సుమ్' భూటాన్‌లో ఉంది. హిమాలయాలలో ఉన్న నేపాల్ రాజ్యం 2006 ప్రజాస్వామ్య ఉద్యమానికి ముందు ప్రపంచంలోనే ఏకైక హిందూరాజ్యంగా ఉండేది.

ఇది దక్షిణాసియా లో చైనా, టిబెట్, భారతదేశాల సరిహద్దులతో ఉంది. దీనిని భూపరివేష్టిత దేశం అంటారు. నేపాల్‌కు వెయ్యి సంవత్సరాల చరిత్ర ఉంది. గౌతమ బుద్ధుడు క్రీ.పూ. 563లో నేపాల్‌లోనే జన్మించాడు. క్రీ.పూ. ఒకటవ శతాబ్దంలో అశోకుడు కూడా ఉత్తర భారతదేశంతో పాటు ఇప్పటి నేపాల్‌లోని దక్షిణ ప్రాంతాలను కూడా సంపా దించాడు. క్రీ.శ. 200 కల్లా బౌద్ధ సామ్రాజ్యాన్ని హిందువులు అంతమొందించి లిక్కావి వంశ పరి పాలన ప్రారంభించారు. 900వ సంవత్సరంలో లిక్కావి వంశాన్ని పారద్రోలి ఠాకూర్లు, వారిని తప్పించి మల్లులు పరిపాలనకు వచ్చారు. 1768లో పృథ్వి నారాయణ్ షా అనే గూర్ఖారాజు ఖాట్మండును ఆక్రమించు కున్నాడు. 1814లో జరిగిన ఆంగ్లో నేపాలీస్ యుద్ధం, 1816లో సుగేవీ ఒప్పందంతో ముగిసింది. 1846లో షా వంశాన్ని జంగ్ బహద్దూర్ రాణా అంతమొందించాడు. 1948 వరకు రాణాలు వారసత్వ ప్రధానులుగా నేపాల్‌ను సంపాదించారు. భారత్‌కు స్వాతంత్ర్యం వచ్చిన తరువాత త్రిభువన్ అనే కొత్త రాజు నేపాల్ పాలనకు రావడానికి భారత్ సహాయపడింది. నేపాలీ కాంగ్రెస్ ఏర్పడడానికి కూడా భారత్ సహకరించింది. ఇక అప్పటి నుండి 2006లో ప్రజాస్వామ్య ఉద్యమం ప్రారంభమయ్యే వరకు నేపాల్‌లో రాజవంశ పాలన నిరాఘాటంగా సాగింది. ■

# మీకు తెలుసా?

## విపత్తులకు ప్రతిస్పందన :-

కొన్ని చేయదగినవి మరియు చేయదగనివి.

ఎప్పుడైనా విపత్తు కలిగిన, ప్రశాంతత కలిగియుండుట, ధైర్యాన్ని కూడగట్టుకొనుట, నిశ్చలంగా, ఆచరణాత్మకంగా ఉండుట ఉపయోగంగా ఉండును. ఆపత్కాలములో చేయదగిన, చేయదగని విషయాలపై కొన్ని చిట్కాలు ఇక్కడ ఇవ్వబడినవి.

### సాధారణముగా చేయదగినవి, చేయదగనివి

- గాభరా పడవద్దు, ప్రశాంతంగా ఉండి, అధికారుల/నియమిత వ్యవస్థల నుండి వచ్చు ఆదేశాలను పాటించండి. పుకారులను నమ్మవద్దు. ఎప్పుడూ ఒక అత్యవసర ప్రణాళికను కుటుంబము కొరకు తయారుచేసుకొని దాని వివరములను కుటుంబ సభ్యులందరికి తెలియపరచండి. ఇంటి నుండి రెండు బయటకు పోవు దారులను ఏర్పాటు చేసుకోండి. కుటుంబ సభ్యుల వేరుపడు పరిస్థితులలో ఎక్కడ కలుసుకోవాలో నిర్ణయించుకోండి. ఒక పరిచయస్థుడైన వ్యక్తి/కుటుంబమును నిర్ణయించుకోండి. ప్రతి ఒక్క కుటుంబసభ్యునికి అత్యవసర నెంబర్లు అనగా పోలీసు, హాస్పిటల్, అంబులెన్స్, ఫైర్ సర్వీసు, ఉగ్రవాద నిరోధక బృందము తెలిసేటట్లు మరియు వారిని సహాయానికి పిలువగలిగేటట్లు చూచుకోండి.
- ఎప్పుడు ఒక అత్యవసర వస్తువుల పెట్టె తయారుగ ఉంచుకోండి. ఇందులో ప్రాథమిక చికిత్సా సామాగ్రి త్వరగా పాడవని ఎండు ఆహార పదార్థములు, నీరు, నీటిని పరిశుభ్రపరచెడి మాత్రలు, దుప్పట్లు, పిల్లల మరియు వృద్ధుల అవసరార్థమైన సామాగ్రి, కత్తి, స్క్రూడ్రైవరు, బ్యాటరీలు, టార్చ్, తాడు మరియు ఎడ్‌హెసివ్ టేపు, బ్యాటరీలతో నడిచే రేడియో, ఒక చేతి పనిముట్ల పెట్టె ఇవి అన్నియు ఉండునట్లు చూచుకోండి.
- ముఖ్యమైన పత్రాలు, వ్యక్తి నిరూపణ పత్రాలు, ఆర్థిక సంబంధిత పత్రాలు, జనన ధృవీకరణ పత్రాలు, పాస్‌పోర్టులు మొదలగునవి ఎపుడు అందుబాటులో ఉండునట్లు ఒకచోట ఉంచండి. ఒక నమ్మకమైన మిత్రుడు/బంధువు వద్ద అన్ని ముఖ్యమైన పత్రాల ఆధీకృత నకళ్లను ఉంచుట శ్రేయస్కరము.
- కుటుంబములోని వయోజన సభ్యులకు ప్రాథమిక చికిత్స మరియు హృదయ మరియు శ్వాస పునరుద్ధరణ పద్ధతులలో శిక్షణ ఇప్పించడము ఉపయోగకరము.
- జాగరూకులుగ వుండి మీ చుట్టూ వున్న బాధితులకు అన్ని విధములుగా సహాయపడండి. సహాయ సహకార పనులకు ఆటంకపరచే విధంగా ప్రవర్తించకండి.

### భూకంపాలు

- మీ భవనమును కట్టడపు ఇంజనీరుచే పరిశీలింప చేయండి మరియు వీలైతే బలహీనమైన ప్రదేశాలను బలోపేతము చేయండి.
- బరువైన వస్తువులైన గీజర్లు, బరువైన ఫోటోఫ్రేములు, అద్దాలు మొదలగు వానిని పైన పడి గాయపరచునంత ఎత్తులో వుంచకండి.
- భూకంపముల సమయంలో ఉత్తమమైన ప్రతి చర్య అంటే వంగుట, దాగుట మరియు పట్టుకొనియుండుట నేలమీదకు వచ్చి ఏదైనా బలమైన బల్ల లేక మంచము క్రింద దాగి, మోకాళ్ళ మీద తలవంచి రెండు చేతులు, మెడ వెనుకగా పెట్టి మోచేతులతో తలను కాపాడుతూ నేలమీద వంగి యుండ వలయును. మీరు మీ తలను దొరికితే తలగడ లాంటి వాటితో కూడా కప్పుకొన వచ్చును. ఒకవేళ బల్ల లేక మంచము దాగియుండుటకు లేకపోతే ద్వారబంధాల క్రింద ప్రకంపములు ఆగేంతవరకు ఉండండి. కిటికీలు, బలమైన వ్రేలాడు వస్తువులు మరియు ఇతర మీద పడగలిగిన వస్తువుల నుండి దూరముగా ఉండండి. ప్రకంపనలు తగ్గిన తరువాతే భవనము నుండి బయటకు రండి.
- ఒకవేళ బయట వుండిన, విద్యుత్ వైరులు, భవనాల బయటి గోడలు, వీధి దీపస్తంభాలు, చెట్లు, మొదలగు వాని నుండి దూరముగా ఉండండి. ఏ భవనమునకు తిన్నగా వెలుపల నిలువవద్దు. అది పడిపోయే ప్రమాదము కలదు. ఒకవేళ కదులుచున్న వాహనములో ఉన్న భవనాలు, వైరులు, చెట్లు మొదలగు వాటినుండి దూరంగా వాహనములను ఆపండి.
- దెబ్బతిన్న భవనములలోకి పోకుండా వుండండి. భూకంపము తరువాత వచ్చు ప్రకంపనలకు సిద్ధంగా ఉండండి.

### వరదలు

- వరద సమయములో రక్షణ కొరకు అనువైన ఎత్తైన ప్రదేశాన్ని గుర్తించండి. అత్యవసరము అయితే తప్ప వరద నీటిలో నడవవద్దు. నీటిలోతు, నేల గట్టిదనమును ఒక కర్రతో పరిశీలించండి. తెగిపడిన విద్యుత్ తీగలున్న ప్రాంతాలకి దూరంగా ఉండండి.
- గ్యాస్ మరియు విద్యుత్ కనెక్షన్లను ఆపివేయండి. విద్యుత్ పరికరములను కనెక్షన్ల నుండి వేరు చేయండి. వరదలు, నీటి ద్వారా వ్యాపించు రోగాలను తీసుకువస్తాయి. వాటినుండి కాపాడుకొనుటకు తగు చర్యలు తీసుకోండి.

### ఫైర్ (అగ్నిసంబంధమైన)

- సాధ్యమైనంతగా మీ గృహము ఇరుగు/పొరుగుని అగ్ని రక్షితముగా చేసుకోండి. అగ్నిమాపక పరికరమును పనిచేయు స్థితిలో వుంచుకోండి.

గ్యాస్ లీకేజిలు లేకుండా, లేక పాడైపోయిన విద్యుత్ తీగలు లేకుండా చూసుకోండి. కరెంటు లోడ్‌ను మితిమీరి వాడవద్దు. మండే స్వభావమున్న పదార్థములను, వేడి కరిగించగలిగిన పరికరములకు సాధ్యమైనంత దూరంగా వుంచండి. వీలైతే పొగను కనిపెట్టే పరికరములను అమర్చుకోండి. మండే పదార్థములను పిల్లలకి దూరముగా వుంచండి.

- భవనము/గృహము నుండి మంటలను తప్పించుకొను మార్గమును ఏర్పాటు చేసుకోండి.
- మీ ప్రాంతంలో అగ్నిమాపక కవాతులు నిర్వహించండి.
- అగ్ని ప్రమాద సమయంలో మీ ముక్కుని, నోటిని తడి తువ్వాలు కాని మందపాటి నూలుగుడ్డతో కాని మూసుకోండి. దీనివల్ల పీల్చే గాలి శుభ్రపడుతుంది. ప్రమాదం నుండి తప్పించుకొనునప్పుడు, నేలమీద ప్రాకుతూ వెళ్ళండి, ఎందుకంటే పొగ మరియు విషవాయువులు పై ఎత్తునే కేంద్రీకృత మవుతాయి.
- మీ గుడ్డలు అంటుకొని ఉంటే పరుగెత్తవద్దు, నిప్పుని ఆర్పుటకు నేలపై దొర్లండి.
- అధికారులు అపాయము లేదు అని ధృవీకరిస్తే గాని భవనంలోకి తిరిగి వెళ్ళవద్దు.
- గాయాలను చల్లబరుస్తూ, అత్యవసర వైద్య సహాయము తీసుకోండి.

## తీవ్రవాదము

- ఏదైనా అనుమానాస్పద కదలికలు లేక వస్తువుల యెడల అప్రమత్తులై ఉండండి మరియు తీవ్రవాద నిరోధక బృందానికి తెలియజేయండి.
- ఒక అపార్టుమెంటు అద్దెకిచ్చేటప్పుడు నిర్దేశకములను తీసుకోండి, వారి గతము గురించి వాకబు చేయండి
- మీ ఇరుగు పొరుగు గురించి తెలుసుకుంటూ ఉండండి.
- ప్రేలుడు సందర్భాలలో మీద పడు విచ్ఛిన్నావశేషాల నుండి మిమ్ములను కాపాడుకొనుటకు మరుగు తీసుకోండి.
- ప్రేలుడు జరిగిన ప్రాంతము నుండి వెంటనే దూరంగా వెళ్ళిపోండి. వీధులలో గుంపులు గుంపులుగా కూడి అత్యవసరం సేవా కార్యకర్తల కదలికలకు అడ్డుపడవద్దు.

## సైక్లోన్లు (గాలివానలు)

- సైక్లోన్లు వచ్చు కాలానికి ముందే, అన్ని తలుపులు, కిటికీలు, పైకప్పులు బాగు చేయించుకోండి. ఎండిపోయిన చెట్లను కొట్టివేయండి, పాతబడిన మరియు సురక్షితం కాని కట్టడాలను కూల్చివేయండి.
- నీరు, ఆహారము, టార్చ్, రేడియో, బ్యాటరీలు, అత్యవసర మందులు మరియు పనిముట్లు పెట్టె కలిగిన అత్యవసర పెట్టెను దగ్గరగా ఉంచుకొనండి.
- సైక్లోను తాకినప్పుడు ఇండ్లలోనే ఉండండి. అది మీ ఇల్లుకాని ప్రత్యేక రక్షణ ఆవాసాలతో కాని.
- అన్ని తులుపులు, కిటీలూ మూసి ఉంచండి. పదునైన ఇనుప వస్తువులైన ఉపకరణాలు చుట్టూ పడవేసుకోకండి. అధికారులు ఆదేశిస్తే తప్ప బయటకు రావద్దు.

## రసాయనిక విపత్తులు

- మీ ప్రాంతంలోని హెచ్చరిక వ్యవస్థ గూర్చి తెలుసుకోండి. సైరన్లు లాంటివి. రేడియో/టివిలను సమాచారము మరియు ఆదేశాల కొరకు వినండి.
- ఒకవేళ ఆదేశిస్తే మీ ఇంటిని వెంటనే ఖాళీ చేయండి. ఒకవేళ బయట ఉన్నప్పుడు ప్రమాదం సంభవిస్తే ఎంత వీలైతే అంద దూరం, ప్రమాదస్థలం నుండి వెళ్ళిపోండి. ఎత్తైన ప్రదేశానికి వెళ్ళుటకు ప్రయత్నించండి.
- లోపల ఉండినట్లైతే, తలుపులు, కిటికీలు మూసివేయండి. అన్ని పగుళ్ళు/ సందులను టేప్‌తో కాని ప్లాస్టిక్ షీట్‌తో కాని మూసివేయండి. చాలా తక్కువ ప్రవేశ మార్గాలున్న గదులలో రక్షణ పొందండి. ఎయిర్ కండిషనర్లు మరియు ఇతర వాయు ప్రవేశ మార్గాలను మూసివేయండి. మీ శరీరాలను పూర్తిగా కప్పుకొని ఉండండి.
- ఉపద్రవం తరువాత ఒకవేళ ప్రభావితం అయితే, కాలుష్య నివారణా ఆదేశాలను పాటించండి. రసాయన ప్రభావితమైన అన్ని వస్తువులను, తిరిగి వాడుటకు పూర్వము, రసాయన రహితముగా శుభ్రపరవలసి ఉంటుంది.

## అణు విపత్తులు

- అణువిపత్తు సంభవించినప్పుడు రక్షణ పొందడం అత్యావశ్యకము. అణు ధార్మికతను ఇముడ్చుకోగలిగిన మందమైన మరియు సాంద్రమైన ఏ రక్షణ ప్రదేశమైననూ ఆశ్రయము కాగలదు.
- రక్షణకు సంబంధించి మూడు ఆవశ్యకమైన అంశాలు ఏమిటంటే – రక్షణ, దూరము, సమయము. ఎంత మందమైన గోడలు కలిగిన, ప్రభావిత ప్రాంతము నుండి ఎంత దూరముగా ఉన్న అంత రక్షణను కలిగించగలవు. కనుక పై అంతస్థు కంటే భూగృహము మంచిది. ఆఖరి అంతస్తును వినియో గించకున్న మంచిది. ఏమైననూ, ఏ రక్షణ అయినా, అసలు రక్షణ లేకుండా ఉండుట కన్నా మేలే కదా!
- అణుధార్మికత చాలా ఎక్కువ దూరాలు ప్రయాణించగలదు. కనుక మీరు ప్రభావిత ప్రాంతానికి చాలా దూరంగా ఉన్ననూ, రక్షణను పొందండి.
- అధికారులు ప్రమాదరహితమని చెప్పేవరకూ మీ రక్షణ ప్రాంతాన్ని వదలి రావద్దు.

*(జి. అప్పారావు)*

పుస్తక సమీక్ష

నాగసూరి వేణుగోపాల్ గారి

# పర్యావరణంపై తొలి తెలుగు సంతకం




అనుభవించదల్చుకుంటే జీవితమంత పెద్దది, స్నేహం చేయదల్చుకుంటే ప్రకృతి అంత గొప్పది సృష్టిలో వుండదు. ప్రకృతిలోకి తరలిపొమ్మన్న మేధావుల మాటల్ని పునాదిగా తీసుకుని జీవావరణం, పర్యావరణంల మధ్య యుగ యుగాలుగా వున్న సాన్నిహిత్యాన్ని, మనిషి మనుగడతో ఎంతగా దానికి విఘాతం కల్గుతుందో తెలియచేస్తూ విషయ సేకరణతో, కవితాత్మక శైలిలో సామాన్య పాఠకుడికి సైతం తేలికగా అర్థమయ్యే రీతిలో పర్యావరణంపై తెలుగులో తొలి పుస్తకాల్ని రాశారు నాగసూరి వేణుగోపాల్.

నిజానికి నాగసూరిది ఎప్పుడూ వినూత్న దృష్టే. సైన్స్ వైతాళికులు రాసినా, ప్రింట్ మీడియాలో పాత్రికేయ పాళి, గుట్టు విప్పినా, ఎలక్ట్రానిక్ మీడియాలోని ఛానళ్ళ విస్తృతి, సీరియళ్ళ వికృతి ప్రస్ఫుటంగా చూపించినా సాహితీ మంజీరాలంటూ శతవసంతాల్ని అక్షర సత్యాలుగా చిలికినా దేనిలోనూ రాజీపడరు. అదే విశ్వసనీయత, మొక్కవోని దీక్షతో విషయజ్ఞతతో తాననుకున్నదే రాస్తారు, రాశారు.

ఈ పుస్తకాల విషయానికి వస్తే 1999-2000 లలో 'వార్త' దినపత్రికలో ప్రచురింపబడ్డ వ్యాసాలను 2000, 2002లలో "ప్రకృతి-వికృతి" పుస్తకంగా ముద్రించి స్వల్పమార్పులతో ఇప్పుడు "పర్యావరణం సమాజం"గా, "ప్రకృతి పర్యావరణం"గా పునర్ముద్రణ చేశారు. యస్.కె. పబ్లికేషన్స్ ప్రచురించిన ఈ రెండు పుస్తకాలలో 81 వ్యాసాలు కొలువుతీరాయి. (50+31)

ప్రకృతిలో సహజసిద్ధంగా ఉన్న సమతూకాన్ని చెదరనివ్వొద్దంటూ నాగరికతను ద్వేషించిన రూసోని చూపిస్తారు నాగసూరి. అలాగని-ఈ రచయిత పురోగమించే నాగరికతను వద్దనరు. దానివల్ల అపకారం జరక్కుండా చూసుకోమంటారు. వ్యంగ్యంగా, నిక్కచ్చిగా, కవితాభివ్యక్తితో, చిన్న చిన్న వాక్యాలతో ఆసక్తిగా చెప్పటం నాగసూరి ప్రత్యేకశైలి. డ్రై సబ్జెక్టని తన శైలితో సత్యసంధతతో డ్రైవ్ చేసే విధానం అలరిస్తుంది. సాధికారంగా చెప్పటం - సత్యాన్ని తాకట్టు పెట్టకుండా చెప్పటం నాగసూరికి పెన్నుతో పెట్టిన విద్య రామచంద్రమూర్తి గారన్నట్లు - ఆకాశవాణిలో పనిచేస్తున్నందువల్ల జనరంజక శైలి అలవడి ఉంటుంది.

రాళ్ళబండి కవితాప్రసాద్ ప్రస్తావించినట్లుగా - అమిత శ్రద్ధతో చెప్తూ ఆద్యంతము చదివేలా రాస్తారు, నవ్వులతో అలరిస్తారు, వెక్కిరిస్తారు, ఆశ్చర్య పరుస్తారు. కవితాత్మకం, కళాత్మకమై కలవరపెడ్తారు. చివరకు కార్యోన్ముఖుల్ని చేస్తారు. నీటిలోని మొసలి మన దెబ్బకు నిజంగా కన్నీరు పెడ్తుంది. మొసలి కన్నీరు అంటూ మనం నిజమైన మొసలి కన్నీరు కారుస్తాం.

ప్లాస్టిక్ సంచి పర్యావరణానికి విషాద విపంచిగా మారిన వైనాన్ని, కాలుష్య రక్కసి కోరల్లో విలపిస్తున్న అందాల సుందరి తాజ్‌మహల్‌ని అక్షర అద్దంలో చూపించి ఆర్ద్రత రగిలించడంలో కానీ, 'రాబందులకు రాబందులం' మనం అంటూ మనిషి మృగత్వాన్ని ఎత్తి చూపటంలో గానీ, 'మనిషే మొదటి ముద్దాయి' అంటూ నిలదియ్యటంలో కానీ, 'ప్రపంచం పొట్ట పగిలిపోతుంది' అంటూ జన విస్ఫోటనాన్ని ప్రస్తావించటంలో కానీ అద్దం ముదు సుందరుడంటూ అర్థ నారీశ్వర తత్వాన్ని చూపించటంలో కానీ, 'వెలగనీకుమా నియాన్ దీపమంటూ' సైన్స్‌ని బోధించటం కానీ, 'ఊతక్రకే చెద పడితే' 'వేప వెయ్యండాల లాభ'మన్న తీరుని తెలియపరుస్తూ కంటనీరు కార్పిస్తుంది. సైన్స్‌ను విప్పి చెప్తూ పర్యావరణానికి మతం ఇస్తున్న చేయూతను వివరిస్తుంది. వస్తు విలువల నుంచి సంబంధాల అనుబంధంలోకి వేలుపట్టి తీసుకువెళ్ళింది 'ప్రకృతి-పర్యావరణం' పుస్తకం.

వేప, తులసి, సీతాఫలాల గురించిన విశేషాలు ఆశ్చర్యాల్ని కల్గిస్తాయి. పగాకు అయిన పొగాకు కల్గించే అనర్థాలు కంటతడి పెట్టిస్తాయి. లివింగ్ ప్లానెట్ రిపోర్ట్‌లు, మినరల్ వాటర్ మేనియాలు, ఇండోర్, గ్రీన్ హౌస్ ఎఫెక్ట్‌లు, చెప్పటంతో పాటు నగ్నముని విలోమకథ, పులికంటి బంగారు సంకెళ్ళు, ముళ్ళపూడి, బాపుల హాస్యోక్తులతో జిగిబిగిని కల్గించారు.

పర్యావరణం చరిత్ర విశ్లేషణల ఊసులు చెప్పాలా? వెదురు 60 సంవత్సరాలకు ఒకసారి పూత పూస్తుందని ఎప్పుడైనా విన్నారా?! 14 నదులు రోగగ్రస్తమయ్యాయని తెల్సా!! చెట్లు సంభాషణ ఎలా చేస్తాయో చూశారా...!!

సైకిల్ రిక్షాలే భవిష్యత్ వాహనాలు అవుతాయన్నది నమ్ముతారా?! ఎద్దుకు మోపురం వుంటేనే వ్యవసాయానికి పనికొస్తుందని తెలుసా? సాఫ్ట్‌డ్రింకులు కల్గించే సైడ్ ఎఫెక్ట్‌లు తెలుసా? కోలా డ్రింకులు రగిలించే నిద్రలేమి బారిన పడ్డారా? కుందకుళంలో విహంగ మానవ సంబంధాల్ని చూశారా? కాశ్మీర్‌లో బీడవుతున్న భూముల స్థితిగతులు ప్రస్తావించడం ఏ ప్రభుత్వమైనా చేసిందా?

మేకలు ముళ్ళపొదల్ని తిని పర్యావరణాన్ని రక్షిస్తాయని విన్నారా? ఏవీ మీకు తెలియదా? అయితే మీరీ పుస్తకం తప్పక చదవాల్సిందే. చదివించాల్సిందే. ప్రపంచం మన అవసరం తీర్చటానికి మాత్రమే ఉంది. కానీ మన ఆశ తీర్చటానికి కాదు. అత్యాశలకు పోవటానికి కాదంటూ సునిశితంగా చెప్పారు రచయిత.

పర్యావరణ అంశాలకు సంబంధించి మీడియా అందిస్తున్న తీరును ఎండగట్టిన విధానపు విశ్లేషణతోనైనా మీడియా మరింత బాధ్యతాయుతంగా వ్యవహరిస్తుందని భావిద్దాం.

ప్రగతి కోసం సాగే అన్వేషణకు ప్రకృతి సంబంధమైన పార్శ్వాన్ని చూపించిన ఈ పుస్తకం భూగోళం మీద ప్రకృతిని మించిన సాంకేతిక అద్భుత ఆవిష్కరణ. ఇలాంటి ఉపయుక్తమైన పుస్తకాలను ఆదరించడం సామాజిక స్పృహ కలిగిన ప్రతి ఒక్కరి బాధ్యత.

ప్రతులకు : యస్.కె. పబ్లికేషన్స్, సమీర రెసిడెన్సీ, విజయనగరం-535001

వెల : ప్రకృతి-పర్యావరణం రూ. 50/- ;

పర్యావరణం-సమాజం రూ. 100/-

- అయినంపూడి శ్రీలక్ష్మి

Yojana (Telugu) June, 2009 RNI Regd. No. 37729/80 Regd. No. H/HD-663/2009-11


# Employment News
WEEKLY

## Looking for a good job in Govt./PSU/SSC/UPSC RRB/Armed Forces/Banks




**Employment News is your best guide. We have remained the largest selling weekly on jobs for over 30 years. Be a part of the leader.**

***Visit our website :***
**employmentnews.gov.in**

- Developed on latest technology
- Having an advanced search engine
- Specialists replying to readers' queries

**Contact nearest distributor for your copy of Employment News/Rozgar Samachar**

**For business enquiries please contact :**
**Employment News, East Block 4, Level 5, R.K. Puram, New Delhi.**
**Ph. : 26182079, 26107405 E-mail : enabmsa@yahoo.com**

**PUBLICATIONS DIVISION**
Ministry of Information & Broadcasting
Government of India

Cir./EN-SP-3/08


Printed and Published by Smt. Veena Jain, Additional Director General (Incharge), Publications Division, Ministry of I & B, Government of India and Printed at Rudra Graphics Pvt. Ltd., #170-B, Near B.K. Guda Park, S.R. Nagar, Hyderabad - 500 038. Tel. : 23811987, 23811997 and Published at Yojana (Telugu) 10-2-1, F.D.C. Complex, A.C. Guards, Hyderabad - 500 028. Senior Editor : **V. Balakrishna,** Tel : 23315288